శనివారం 24-6-2023


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 93


'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'



పుజారా ఔట్.. యశస్వి ఇన్.
వెస్టిండీస్‌తో క్రికెట్ సిరీస్‌కు భారత టెస్టు, వన్డే జట్ల ప్రకటన.
- 15లో



చెల్లింపు సేవలపై యాపిల్ కన్ను
యాపిల్ కార్డ్, యాపిల్ పేను తీసుకువచ్చే యోచనలో యాపిల్ సంస్థ!
- 15లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ప్రయాణం.. విషాదాంతం
టైటానిక్ వైపుగా నీటి అడుగుకు ప్రయాణం ప్రారంభించిన కొద్దిసేపటికే 'టైటాన్' బద్దలైపోయిందని అమెరికా కోస్ట్‌గార్డ్ ప్రకటించింది.
- వివరాలు 6లో



2050 నాటికి 130 కోట్ల మంది..
ప్రస్తుతం 50 కోట్లుగా ఉన్న మధుమేహ బాధితుల సంఖ్య 2050 నాటికి 130 కోట్లకు చేరనుందని లాన్‌సెట్ పత్రిక వెల్లడించింది.
- వివరాలు 6లో



మేడిన్ ఇండియా ఈ-చిప్
భారత్ ఈ-చిప్‌లు 2024 చివరికి మార్కెట్లోకి వస్తాయని శుక్రవారం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు.
- వివరాలు 15లో



వ్యసనంపై పోరాటం
దురలవాట్లకు బానిసలై చీకటి నింపుకుంటున్న కుటుంబాలు ఎన్నో. వీటి నుంచి బయట పడాలంటే ఏం చేయాలి?..
- వివరాలు 13లో

భారత్ అభివృద్ధే ప్రపంచాభివృద్ధి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ

- ఉగ్రవాదాన్ని కఠినంగా అణచివేయాల్సిందే
- భారత్‌కు అమెరికా అత్యంత కీలకమైన రక్షణ భాగస్వామి
- వైవిధ్యం.. భారత్‌లో ఒక సహజ జీవన విధానం
- దేశంలో సాంకేతిక విప్లవం కొనసాగుతోంది
- డిజిటల్ చెల్లింపుల్లో శరవేగంగా అభివృద్ధి
- అమెరికా కాంగ్రెస్‌లో ప్రధాని మోదీ ప్రసంగం


వైట్‌హౌస్‌లో ఇచ్చిన విందులో బైడెన్, మోదీ

ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. భారతదేశ అభివృద్ధిని తెలుసుకోవాలని, అక్కడి ప్రజాస్వామ్యాన్ని, వైవిధ్యాన్ని అర్థంచేసుకోవాలని అందరూ కోరుకుంటున్నారని చెప్పారు. దేశం ఇప్పుడు ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతోందని స్పష్టం చేశారు. భారత్ అభివృద్ధి చెందితే మొత్తం ప్రపంచం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. భూగోళంపై ఆరింట ఒక వంతు జనాభా భారత్‌లోనే ఉందన్న సంగతి మర్చిపోవద్దని వ్యాఖ్యానించారు. అమెరికా పార్లమెంట్‌లో గురువారం ప్రధాని మోదీ ప్రసంగించారు.

అమెరికా కాంగ్రెస్‌లో ప్రతిధ్వనించిన 'మోదీ'

- నరేంద్ర మోదీ ప్రసంగం సందర్భంగా అమెరికా కాంగ్రెస్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో కోలాహలం నెలకొంది. పార్లమెంట్ సభ్యులు ఆయనకు తొలుత చప్పట్లతో స్వాగతం పలికారు. 'మోదీ మోదీ' నినాదాలతో సభ పలుమార్లు ప్రతిధ్వనించింది. మోదీ ప్రసంగానికి అపూర్వ స్పందన లభించింది. పార్లమెంట్ సభ్యులతోపాటు గ్యాలరీల్లో ఉన్న భారతీయ-అమెరికన్లు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. మోదీ మాట్లాడుతుండగా 15 సార్లు స్టాండింగ్ ఓవేషన్లు, 79 సార్లు చప్పట్లతో హర్షామోదాలు లభించడం గమనార్హం. ప్రసంగం అనంతరం మోదీతో సెల్ఫీలు దిగడానికి ఉభయ చట్టసభల సభ్యులు పోటీపడ్డారు. ఆయన నుంచి ఆటోగ్రాఫ్‌లు సైతం తీసుకున్నారు. భారతీయ అమెరికన్లు 'భారత్ మాతాకీ జై' అంటూ నినదించారు.

6లో

'నాటు నాటు'కి అమెరికన్ యువత స్టెప్పులు 6లో

అన్ని అలవెన్సులు పెంపు

- వివిధ రకాల అడ్వాన్సులు కూడా పెంచిన ప్రభుత్వం
- పెన్షనర్లు మరణిస్తే ఇచ్చే తక్షణ సాయం రూ. 20 వేల నుంచి రూ. 30 వేలకు పెంపు
- 14 జీవోలు జారీచేసిన ఆర్థికశాఖ
- మొదటి వేతన సవరణ కమిషన్ సిఫారసుల మేరకేనని వెల్లడి
- దశాబ్ది ఉత్సవాల కానుకగా అభివర్ణించిన మంత్రి హరీశ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై సర్కారు వరాల జల్లు కురిపించింది. వారికి ఇచ్చే అన్ని రకాల అలవెన్సులు, అడ్వాన్సులు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ మొత్తం 14 జీవోలను శుక్రవారం విడుదల చేసింది. 2020 పేస్కేల్ ఆధారంగా మొదటి వేతన సవరణ కమిషన్ ఇచ్చిన సిఫారసుల మేరకు ఈ పెంపుదల చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా 2008, 2011లో అలవెన్సుల సవరణ జరగలేదని అంతర్గతంగా పలుమార్లు చేసిన విజ్ఞప్తుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. ఇక ఈ అలవెన్సుల పెంపుపై ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ట్విట్టర్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన కానుకగా ఆయన దీనిని అభివర్ణించారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవోల ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

రూ. 4 లక్షల వరకు పెళ్లి అడ్వాన్సు

దివ్యాంగ ఉద్యోగులకు ఇచ్చే భత్యాన్ని నెలకు రూ.2 వేల నుంచి, రూ.3 వేలకు, ఇళ్ల నిర్మాణ అడ్వాన్సును రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలకు, కారు కొనుగోలు అడ్వాన్సు పరిమితిని రూ.6 లక్షల నుంచి రూ.9 లక్షలకు, ఉద్యోగుల కుమార్తెలు, కుమారుల పెళ్లిళ్ల అడ్వాన్సులను రూ.4 లక్షల వరకు పెంచింది. ఉద్యోగుల ప్రయాణ భత్యాన్ని, బదిలీపై వెళ్లినప్పుడు ఇచ్చే రవాణా భత్యాన్ని 30 శాతం చొప్పున పెంచగా, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు ఇచ్చే స్పెషల్ కాంపెన్సేటరీ అలవెన్సును రూ.650 నుంచి మిగతా 8వ పేజీలో ▶

1,827 స్టాఫ్ నర్సు పోస్టులు భర్తీ

- వైద్య విద్యా సంచాలకుడి (డీఎంఈ) పరిధిలోని బోధనాస్పత్రుల్లో 1,827 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆర్థిక శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ మెడికల్ హెల్త్ అండ్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రత్యక్ష నియామకం పద్ధతిలో వీటిని భర్తీ చేయనుంది.

3లో



న్యూస్‌రీల్

తెలుగు రాష్ట్రాల్లో కేన్సర్ ఉచిత స్క్రీనింగ్




తెలుగు రాష్ట్రాల్లో కేన్సర్ ఉచిత స్క్రీనింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు సినీనటుడు చిరంజీవి ప్రకటించారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని స్టార్ ఆస్పత్రి కేన్సర్ సెంటర్ సహకారంతో చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ఈ పరీక్షలు నిర్వహించనుంది.
- వివరాలు 16లో

త్వరలో 'వైద్య' ఫీజుల పెంపు!



వైద్య కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఫీజుల పెంపునకు రంగం సిద్ధమైంది. దీనిపై ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఫీజులను సవరించనున్నారు.
- వివరాలు 12లో

పగటిపూట 20% తక్కువ రాత్రిపూట 20% ఎక్కువ



దేశంలో త్వరలో కొత్త విద్యుత్ టారిఫ్ అమల్లోకి రానుంది. పగటిపూట వినియోగం తక్కువగా ఉండే సమయంలో విద్యుత్ వాడుకుంటే చార్జీలు 20 శాతం వరకు తగ్గుతాయి. రాత్రిపూట వినియోగం అధికంగా ఉండే సమయంలో విద్యుత్ ఉపయోగించుకుంటే చార్జీలను 20 శాతం మేర పెంచుతారు.
- వివరాలు 6లో

ఎంత కష్టం వచ్చిందమ్మా!



భర్తల వేధింపులు.. ఆర్థిక ఇబ్బందులు.. కారణం ఏదైతేనేం.. క్షణికావేశంలో వేర్వేరు చోట్ల నలుగురు మహిళలు ఆత్మహత్యకు యత్నించారు. వారిలో ఇద్దరు తల్లులు, ఓ కుమార్తె కన్నుమూయగా పిల్లలతో కలిసి చెరువులో దూకిన మరో ఇద్దరు తల్లులను స్థానికులు కాపాడారు.
- వివరాలు 3లో

కాంగ్రెస్, బీజేపీలకు సమదూరం

హస్తినలో మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు

- ఆ రెండు పార్టీలకు వ్యతిరేకంగా ప్రజల్లో ఐకమత్యం రావాలి
- తెలంగాణ విషయంలో కేంద్రం దగా పరంపరను కొనసాగిస్తోంది
- స్వతంత్ర భారతంలో అత్యంత బలహీన ప్రధాని మోదీయే
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ
- స్కైవేల కోసం రక్షణశాఖ భూ బదలాయింపు అంశంపై చర్చ

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్, బీజేపీలకు తమ పార్టీ సమదూరాన్ని పాటిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మంత్రి కేటీఆర్ చెప్పారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో దేశాన్ని అభివృద్ధి చేయడంలో ఆ రెండు పార్టీలూ ఘోరంగా విఫలం అయ్యాయని, ఇప్పటికీ దేశంలో విద్యుత్, నీటి సరఫరాలేని గ్రామాలు కూడా ఉండటానికి ఈ జాతీయ పార్టీలే కారణమని విమర్శించారు. అందుకే మిగతా 2వ పేజీలో ▶


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎంపీలు రంజిత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

బీఆర్ఎస్, బీజేపీలు కలిసిపోయాయి: ఠాక్రే

- అందుకే కేంద్రమంత్రులతో కేటీఆర్ భేటీలు
- ఈసారి ముందుగానే అభ్యర్థుల ప్రకటన



- వివరాలు 2లో

రాజకీయ కోణంలో చూడొద్దు

- కేటీఆర్‌కు కేంద్ర మంత్రుల అపాయింట్‌మెంట్లపై బండి సంజయ్
- రాజకీయాలు వేరు, ప్రభుత్వం వేరని వ్యాఖ్య



- వివరాలు 2లో

కలసికట్టుగా పోరుబాట

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 17 పార్టీలు ఉమ్మడిగా పోటీ

- వచ్చే నెల సిమ్లాలో జరిగే సమావేశంలో ఉమ్మడి కార్యాచరణ
- బీజేపీని గద్దె దించడమే లక్ష్యం: నితీశ్ కుమార్
- కాంగ్రెస్, ఆప్ మధ్య ఆర్డినెన్స్ చిచ్చు

6లో


పట్నాలో జరిగిన సమావేశంలో పాల్గొన్న రాహుల్‌గాంధీ, మల్లికార్జున్‌ఖర్గే, నితీశ్‌కుమార్, లాలూప్రసాద్ యాదవ్, మమతా బెనర్జీ

కేపీ చౌదరి డ్రగ్స్ కేసులో సెలబ్రిటీలు

రిమాండ్ రిపోర్టులో అషురెడ్డితో పాటు పలువురు ప్రముఖుల పేర్లు

- డ్రగ్స్ సరఫరా చేసినట్టు అంగీకరించిన చౌదరి
- 11 అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలు గుర్తించిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: కబాలీ తెలుగు సినిమా నిర్మాత కృష్ణ ప్రసాద్ చౌదరి అలియాస్ కేపీ చౌదరి డ్రగ్స్ కేసులో సంచలన విషయాలు బయటకొస్తున్నాయి. సెలబ్రిటీల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. బిగ్ బాస్ తెలుగు రియాల్టీ షో కంటెస్టెంట్ అషురెడ్డితో పాటు పలువురు సినీ సెలబ్రిటీలు, పలువురు ప్రముఖులు, వ్యాపార సంస్థల యజమానులకు కేపీ చౌదరి డ్రగ్స్‌ను సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. వారం రోజుల క్రితం గోవా నుంచి హైదరాబాద్‌కు కొకైన్‌ను సరఫరా చేసి విక్రయించే క్రమంలో మాదాపూర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ), రాజేంద్రనగర్ పోలీసులు కిస్మత్‌పూర్ క్రాస్ రోడ్ వద్ద అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. చౌదరి సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు వాట్సాప్ చాటింగ్స్, ఫొటోలు, బ్యాంకు లావాదేవీలను విశ్లేషించారు. ఆయా అంశాలపై స్పష్టత కోసం చౌదరిని రెండురోజులు కస్టడీలోకి తీసుకొని విచారించారు. అనంతరం ఉప్పరపల్లి కోర్టులో మిగతా 8వ పేజీలో ▶


కేపీ చౌదరి (ఫైల్)





సిమ్లా తర్వాత ఓసారి ఊటీలో మరోసారి గోవాలో పెట్టుకుందాం ఆహ్లాదంగా ఉంటుంది!

వడివడిగా నైరుతి..!

రాష్ట్రంలో మూడోవంతు విస్తరించిన రుతుపవనాలు

- నేడు, రేపు రాష్ట్రంలోని పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు
- ఉత్తరాది జిల్లాల్లోని ఒకట్రెండు చోట్ల అతిభారీ వర్షాలు


పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్‌లో జల్లులు పడటంతో దుక్కి పనుల్లో రైతులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో నైరుతి రుతుపవనాల వ్యాప్తి వేగం అందుకుంది. దాదాపు మూడు వారాలు ఆలస్యంగా రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ... రెండ్రోజుల్లోనే దాదాపు మూడోవంతు ప్రాంతానికి విస్తరించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. రానున్న రెండ్రోజుల్లో రాష్ట్రమంతటా రుతుపవనాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని అంచనావేసింది. రాష్ట్రంలో జూన్‌లో ఇప్పటి వరకు 9.55 సెంటీమీటర్ల సాధారణవర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 3.04 సెంటీమీటర్ల వర్షమే కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 68 శాతం లోటు ఉంది. ప్రస్తుతం రుతుపవనాల కదలిక ఆశాజనకంగా ఉండడంతో ఈ నెలాఖరు నాటికి సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనావేస్తున్నారు.

నేడు, రేపు భారీ వర్షాలు...

వాయవ్య బంగాళాఖాతం ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున మిగతా 8వ పేజీలో ▶

సగానికిపైగా తగ్గిన దరఖాస్తులు

ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు తగ్గిన పోటీ

ఈ ఏడాది 13,538 దరఖాస్తులు
గతేడాది 32,800 దరఖాస్తులు

- జూలై 3న మెరిట్ జాబితా విడుదల
- జూలై 7న విద్యార్థులకు కౌన్సెలింగ్
- దరఖాస్తులు తగ్గిపోవడానికి వరుస ఆత్మహత్యలే కారణమా?


బాసర ట్రిపుల్ ఐటీ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాల నోటిఫికేషన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు ముగిసింది. దరఖాస్తు గడువు పెంచినా ఈ ఏడాది ఆన్‌లైన్‌లో ఎక్కువగా దరఖాస్తు చేసుకోలేదు. ఈ ఏడాది 1,404 జనరల్ సీట్లు, 96 ప్రత్యేక సీట్లు, 105 గ్లోబల్ సీట్లకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. మొత్తం 1,605 సీట్లకుగాను కేవలం 13,538 దరఖాస్తులు వచ్చినట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ తెలిపారు. జూలై 3న మెరిట్‌జాబితాను విడుదలచేసి ఎంపికైన విద్యార్థులకు జూలై 7 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

తగ్గిన దరఖాస్తులు....

నాలుగేళ్లుగా 20 వేలకుపైగానే ట్రిపుల్‌ఐటీలో దరఖాస్తులు రాగా, ఈ ఏడాది సగానికి తగ్గిపోయాయి. బాసర ట్రిపుల్‌ఐటీలో సీటు కోసం వేలాదిమంది పోటీపడేవారు. ప్రారంభం నుంచే ఇక్కడ తీవ్రమైన పోటీ ఉండేది. ఈ ఏడాది అనుకోని విధంగా మిగతా 7వ పేజీలో ▶

క్లుప్తంగా...

26న రాహుల్‌గాంధీతో పొంగులేటి, జూపల్లి భేటీ!



సాక్షి, హైదరాబాద్‌: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీమంత్రి జూపల్లి కృష్ణారావులు ఏఐసీసీ నేతలను కలిసేందుకు ముహూర్తం ఖరారైంది. ఈనెల 26న ఉదయం 11 గంటలకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్, ఇతర కాంగ్రెస్‌ ముఖ్య నేతలతో కలిసి ఆయన ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో భేటీ కానున్నట్లు తెలిసింది. ఈనెల 25న కలవాలని అనుకున్నా రాహుల్‌ అపాయింట్‌మెంట్‌ 26న లభించడంతో ఆ రోజున ఢిల్లీ వెళుతున్నట్టు పొంగులేటి శిబిరం చెబుతోంది. పొంగులేటి, జూపల్లిలు తమ ముఖ్య అనుచరులతో కలిసి ఆ రోజున రాహుల్‌గాంధీని కలిసినప్పుడే వారు పార్టీలో ఎప్పుడు చేరాలన్న దానిపై ఓ స్పష్టత రానుంది. వచ్చే నెల మొదటి వారంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పాద యాత్ర ముగిసే అవకాశమున్నందున అదే నెల 2న లేదా మరో రోజున ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. అదే సభలో పొంగులేటి అండ్‌ టీం కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు శుక్రవారం ఆయన ఖమ్మంలో తన అనుచరులతో కలిసి సభ ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. ఇక, ఖమ్మంలో జరిగే సభలో మాజీమంత్రి జూపల్లి కూడా కాంగ్రెస్‌లో చేరతారా లేక మహబూబ్‌నగర్‌లో సభ నిర్వహిస్తారా అన్నది కూడా రాహుల్‌గాంధీని కలిసిన రోజునే స్పష్టత వస్తుందని తెలుస్తోంది.

బీఆర్‌ఎస్‌లో చేరిక అవాస్తవం: ఉత్తమ్‌



సాక్షి, హైదరాబాద్‌: తాను బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్టు వస్తున్న వార్తలను కాంగ్రెస్‌ పార్టీ నేత, నల్లగొండ ఎంపీ ఎన్‌.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఖండించారు. ఇవన్నీ తప్పుడు వార్తలని స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడుతూ జ్వరం కారణంగా విశ్రాంతి తీసుకుంటున్నానని చెప్పారు. ఇందుకు సంబంధించిన అన్ని విషయాలను త్వరలోనే వెల్లడిస్తానని చెప్పారు.

కుట్రలో భాగంగానే ఉత్తమ్‌పై దుష్ప్రచారం

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

కేతేపల్లి: నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌ పార్టీని వీడుతున్నారంటూ వచ్చిన వార్తలు అవాస్తవమని, అసత్య ప్రచారాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్‌లో శుక్రవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష పార్టీలను నిర్వీర్యం చేస్తున్న క్రమంలో పీసీసీ అధ్యక్షునిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏడు సంవత్సరాలు పార్టీ ఉనికిని నిలబెట్టారని భట్టి అన్నారు. కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణలో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తుందని బలమైన సంకేతాలు కనిపించడంతో కాంగ్రెస్‌ను బలహీన పరచాలనే కుట్రలో భాగంగానే బీఆర్‌ఎస్, బీజేపీ కుమ్మక్కై ఇలాంటి అసత్య ప్రచారం చేస్తున్నాయని అన్నారు.

నా భవిష్యత్తు తెలంగాణతోనే: షర్మిల



సాక్షి, హైదరాబాద్‌: తన భవిష్యత్తు తెలంగాణతోనేనని వైఎస్సార్‌ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్‌ షర్మిల స్పష్టం చేశారు. చివరి శ్వాస వరకు తెలంగాణ బిడ్డగా.. తెలంగాణ కోసం పోరాడుతుంటానని పేర్కొన్నారు. తన ఆరాటం, పోరాటం తెలంగాణ కోసమేనని శుక్రవారం ట్విట్టర్లో తెలిపారు. ఊహాజనిత తనకు, తెలంగాణ ప్రజల మధ్య అగాధాన్ని సృష్టించేందుకు విఫల యత్నాలు జరుగుతు న్నాయన్నారు. పనిలేని, పసలేని దార్శనికు లకు చెప్పేది ఒకటేనని.. తన రాజకీ య భవిత మీద పెట్టే దృష్టిని, సమయాన్ని కేసీఆర్‌ పాలనపై పెట్టాలని హితవు పలికారు.

స్తూపం వద్ద అమరవీరుల పేర్లు పెడతాం

ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌

సాక్షి, హైదరాబాద్‌: కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తే అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ అమరుల పేర్లు పెడతామని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌.సంపత్‌కుమార్‌ తెలిపారు. ఎన్నికల కోసం హడావుడి తప్ప అమరవీరుల సంస్మరణార్థం కేసీఆర్‌ నిజాయితీతో వ్యవహరించడం లేదని విమర్శించారు. ఈ తొమ్మిదేళ్లలో ఆ కుటుంబాలకు ఆయన చేసిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ నేతలు చరణ్‌కౌశిక్‌ యాదవ్, దర్పల్లి రాజశేఖర్, ఆచారి, నిజాముద్దీన్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ అమరవీరుల స్మారక స్తూపం ప్రారంభం సందర్భంగా రాష్ట్రాన్ని ప్రకటించిన సోనియాగాంధీ పేరు చెప్పకపోవడం దుర్మార్గమన్నారు. వచ్చే డిసెంబర్‌ 9న కాంగ్రెస్‌ అగ్రనేత సోనియాగాంధీ అమరవీరుల కుటుంబాలతో సహపంక్తి భోజనం చేస్తారని, వారి కుటుంబాలకు గుర్తింపు పత్రాలు అందజేస్తారని చెప్పారు.

కాంగ్రెస్, బీజేపీలకు సమదూరం



శుక్రవారం ఢిల్లీలో రాజ్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కేటీఆర్. చిత్రంలో అర్వింద్‌ కుమార్, వినోద్‌ కుమార్, కొత్త ప్రభాకర్‌ రెడ్డి, రంజిత్‌ రెడ్డి

కేసీఆర్‌ హ్యాట్రిక్‌ ఖాయం

తెలంగాణలో కేసీఆర్‌ హ్యాట్రిక్‌ కొట్టడం ఖాయం అని కేటీఆర్‌ ధీమా వ్యక్తం చేశారు. దక్షిణాదిన ఎన్టీఆర్, జయలలిత, ఎంజీఆర్‌ తదితర హేమాహేమీలే హ్యాట్రిక్‌ కొట్టలేదని, సీఎం కేసీఆర్‌ ఆ ఘనత సాధిస్తారని చెప్పారు. ఏపీలో ముందస్తు ఎన్నికల విషయంలో సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు కదా.. అని కొందరు మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. చంద్రబాబు ఇటీవల అమిత్‌షాతో భేటీ కావడంపై స్పందిస్తూ.. 'ఏమౌతుంది.. మొన్నటివరకు తిట్టి, నేడు పొత్తులు అంటే ప్రజలు ఊరుకుంటారా..? ప్రజలు అంతా గమనిస్తూనే ఉన్నారు..' అని వ్యాఖ్యానించారు.

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా ప్రజల్లో ఐకమత్యం రావాల్సిన అవసరం ఉందని కేటీఆర్‌ పిలుపునిచ్చారు. ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసే ప్రయత్నాన్ని కొనసాగిస్తామని, తెలంగాణ సాధించిన ప్రగతి, అభివృద్ధి నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేయాలనుకుంటున్నామని తెలిపారు. ప్రధానమంత్రి మోదీకి మరోసారి అవకాశం ఇస్తే ఢిల్లీని కూడా తీసుకెళ్లి గుజరాత్‌లో పెడతారని విమర్శించారు. దేశంలో ఇప్పటిదాకా పనిచేసిన ప్రధాన మంత్రుల్లోకెల్లా అత్యంత బలహీనమైన ప్రధాని నరేంద్ర మోదీ అని పేర్కొన్నారు. పట్నాలో జరిగిన విపక్షాల సమావేశంపై మాట్లాడుతూ.. ప్రజలను ఏకం చేయడాన్ని నమ్ముతాం కానీ, రాజకీయ పార్టీలను ఏకం చేసే అంశాన్ని కాదని అన్నారు. రెండురోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ వచ్చిన మంత్రి కేటీఆర్, హైదరాబాద్‌లో స్కైవేల కోసం రక్షణశాఖ భూ బదలాయింపు అంశంపై శుక్రవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌తో చర్చించారు. బీఆర్‌ఎస్‌ ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌ కుమార్‌లు ఆయనతో ఉన్నారు. కాగా రాజ్‌నాథ్‌తో భేటీ అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.

కేంద్ర సాయం గుండు సున్నా..

కేంద్ర ప్రభుత్వం అనేక విషయాల్లో తెలంగాణకు చేయూతనివ్వకుండా.. కామన్‌సెన్స్‌ లేని కారణాలు చెబుతోందని కేటీఆర్‌ మండిపడ్డారు. గత తొమ్మిదేళ్లలో హైదరాబాద్‌ నగరానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా అందిన సాయం గుండు సున్నా అని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో స్కైవేల నిర్మాణం కోసం రక్షణశాఖ భూములను ఇవ్వాలని ప్రధాని మోదీని సీఎం కేసీఆర్‌ స్వయంగా కలిసి విజ్ఞప్తి చేసినా ఎలాంటి స్పందన లేదని విమర్శించారు. జూబ్లీ బస్టాండ్‌ నుంచి రాజీవ్‌ రహదారి వరకు స్కై వే నిర్మాణం కోసం 96 ఎకరాలు, ప్యారడైజ్‌ చౌరస్తా నుంచి మేడ్చల్‌ ఓఆర్‌ఆర్‌ వరకు మరో స్కైవే నిర్మాణం కోసం 56 ఎకరాల రక్షణ శాఖ భూములు ఇవ్వాలని అనేకసార్లు విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. రక్షణ శాఖ ఇచ్చే భూములకు అంతే విలువ కలిగిన భూమిని ఇస్తామని చెప్పినా కేంద్రం నుంచి స్పందన కరువైందని, తెలంగాణ విషయంలో దగా పరంపర కొనసాగిస్తోందని ధ్వజమెత్తారు. తమ ప్రయత్న లోపం లేదన్న విషయాన్ని తెలంగాణ ప్రజలకు తెలియచేయాలన్న ఉద్దేశంతో, 'అయిననూ పోయి రావలె హస్తినకు' అన్నట్టుగా ఢిల్లీకి వచ్చి కేంద్ర మంత్రులను కలిశామని వివరించారు. కంటోన్మెంట్లో నిరుపయోగంగా ఉన్న భూములను జీహెచ్‌ఎంసీకి ఇస్తే అక్కడ ప్రజలకు అవసరమైన ఆస్పత్రులు, కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తామని రాజ్‌నాథ్‌కు చెప్పామని కేటీఆర్‌ తెలిపారు. హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతానికి తమ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్రం కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. పటాన్‌చెరు నుంచి హయత్‌నగర్‌ దాకా మెట్రో విస్తరణ సహా పలు ప్రాజెక్టుల విషయంలో సహకరించాలని కోరారు. గోల్కొండ, ఇబ్రహీం భాగ్‌ లింకు రోడ్ల కోసం అవసరమైన రక్షణ శాఖ భూమిని ఇవ్వాలన్నారు. తెలంగాణ విషయంలో ఒకవేళ కేంద్రం తన వైఖరి మార్చుకోకుంటే క్షేత్రస్థాయిలో ప్రజల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని చెప్పారు. ఉప్పల్‌ స్కై వాక్‌ను సోమవారం ప్రారంభిస్తున్నామని, అయితే రక్షణ శాఖ ఆంక్షల వలన మెహదీపట్నంలో స్కైవాక్‌ ప్రాజెక్టు ఆగిపోయిందని చెప్పారు. ఇలావుండగా లక్డీకాపూల్‌ నుంచి బీహెచ్‌ఈఎల్‌ వరకు మెట్రో రైల్‌ విస్తరణ, నాగోల్‌ నుంచి ఎల్బీనగర్‌ వరకు మెట్రో కోసం శనివారం కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్‌ సింగ్‌ పురీని కలిసి విజ్ఞప్తి చేస్తామని కేటీఆర్‌ తెలిపారు.

అమిత్‌షా తో భేటీకి యత్నం

రసూల్‌పురా వద్ద నాలుగు ఎకరాల కేంద్ర హోం శాఖ భూమి అందిస్తే అక్కడ ఎస్‌ఆర్‌డీపీ ప్రాజెక్టు పూర్తి అవుతుందని కేటీఆర్‌ తెలిపారు. ఈ విషయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదని, దీంతో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌ షాను కలిసేందుకు ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో సుమారు 10 చిన్న పట్టణాలకు మెట్రోలు ఇచ్చిన కేంద్రం, హైదరాబాద్‌లో ఎందుకు మెట్రోకు సహకరించడం లేదో చెప్పాలని మంత్రి డిమాండ్‌ చేశారు.

రాజకీయ కోణంలో చూడవద్దు

- కేటీఆర్‌కు కేంద్ర మంత్రుల అపాయింట్‌మెంట్లపై బండి సంజయ్‌
- రాజకీయాలు, ప్రభుత్వం వేర్వేరని వెల్లడి



సాక్షి, హైదరాబాద్‌: ఢిల్లీలో కేటీఆర్‌కు కేంద్ర మంత్రులు అపాయింట్‌మెంట్‌ ఇవ్వడాన్ని రాజకీయ కోణంలో చూడొద్దని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ అన్నారు. రాజకీయాలు వేరు, ప్రభుత్వం వేరు అని పేర్కొన్నారు. మంచి ఆలోచనలతో వెళ్తే ఏ రాజకీయ పార్టీ నేతలకైనా కేంద్ర మంత్రులు, బీజేపీ అగ్రనేతలు అపాయింట్‌మెంట్‌ ఇస్తారన్నారు. పశ్చిమబెంగాల్‌లో అనేక మంది బీజేపీ కార్యకర్తలను బలితీసుకున్న మమతా బెనర్జీకి కూడా కేంద్ర మంత్రులు అపాయింట్‌మెంట్‌ ఇచ్చారని చెప్పారు. ఎన్నికల వరకే రాజకీయాలు, ఆ తర్వాత కాదని పలుమార్లు ప్రధాని మోదీ స్పష్టంచేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ ఎవరికీ అపాయింట్‌మెంట్‌ ఇవ్వకపోయినా ఢిల్లీలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌ అపాయింట్‌మెంట్లు ఇస్తున్నారన్నారు. అందువల్ల కేటీఆర్‌కు కేంద్ర మంత్రులు అపాయింట్‌మెంట్‌ ఇవ్వడాన్ని వేరే కోణంలో చూడొద్దని స్పష్టంచేశారు. బీజేపీ సిద్ధాంతకర్త డాక్టర్‌ శ్యామా ప్రసాద్‌ ముఖర్జీ బలిదాన్‌ దివస్‌ను స్మరించుకుంటూ శుక్రవారం ఆయన చిత్రపటానికి బండి సంజయ్, ఇతర నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో సంజయ్‌ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రులతో భేటీ తర్వాత కేటీఆర్‌ బయటకొచ్చి ఇంకా ఏదో చెబితే దానికి ప్రాముఖ్యత ఇవ్వవద్దని కోరారు.

పదేళ్లు కాకుండానే..: తెలంగాణ ఏర్పడి పదేళ్లు కాకుండానే దశాబ్ది ఉత్సవాలు అంటున్నారని, వాటిలో ప్రజలు ఎక్కడైనా పాల్గొన్నారా? అని బండి సంజయ్‌ నిలదీశారు. కాగా, రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై స్పందిస్తూ ఎవరి మానసిక స్థితి ఏమిటో ప్రజలకు తెలుసునని, అందుకే దుబ్బాక, హుజూరాబాద్‌లలో కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రాలేదని అన్నారు.

ఏ కులాన్ని దూషించినట్లు నిరూపించినా

ముక్కు నేలకు రాస్తా

- డిపాజిట్లు దక్కవని తెలిసే అసత్యాలు ప్రచారం
- ఈటలపై పాడి కౌశిక్‌రెడ్డి విమర్శ



సాక్షి, హైదరాబాద్‌: తాను ఏ ఒక్క కులాన్ని దూషించినట్లు నిరూపించినా ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్తానని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌ చైర్మన్‌ బండా శ్రీనివాస్‌తో కలిసి కౌశిక్‌రెడ్డి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు రావని తెలుసుకుని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ తనపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సామాజిక మాధ్యమాలను అడ్డుపెట్టుకుని తనపై బురద జల్లుతున్నారని, మిమిక్రీ గొంతుతో అసత్యా లు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రొటో కాల్‌ విషయంలో ఈటల రాజేందర్‌ కంటే తన స్థాయి తక్కువేమీ కాదని, ఇప్పటికైనా రాజకీయా లు మానుకుని ప్రజా సమస్యలపై తనతో చర్చకు రావాలని కౌశిక్‌రెడ్డి సవాల్‌ చేశారు.

డీకేతో ఎంపీ కోమటిరెడ్డి భేటీ

తెలంగాణపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్‌: కర్ణాటక పీసీసీ అధ్య క్షుడు, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌తో తెలంగాణ కాంగ్రెస్‌ స్టార్‌ క్యాంపెయినర్, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ అయ్యారు. బెంగళూరులో శుక్రవారం టీపీసీసీ నేతలు డాక్టర్‌ శ్రావణ్‌కుమార్, అనిరుధ్‌ రెడ్డిలతో కలిసి శివకుమార్‌ను కోమటిరెడ్డి కలిశారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ విజయం సాధించిన సందర్భంగా శివకుమార్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. తెలంగాణ రాజకీయాలపై కూడా చర్చించారని టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి. కర్ణాటక కాంగ్రెస్‌ నేతలను, కేడర్‌ను ఒక్కతాటిపైకి తీసుకు రావడంలో శివకుమార్‌ పాత్రను అభినందించిన కోమటిరెడ్డి.. తెలంగాణకు కూడా సమయం కేటాయించాలని కోరినట్టు తెలుస్తోంది. తన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌ పార్టీలో చేరిక అంశంపై కూడా చర్చించారనే ప్రచారం జరిగినా, ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని కార్యాలయ వర్గాలు చెప్పాయి.



డీకే శివకుమార్‌తో భేటీ అయిన కోమటిరెడ్డి

ముదిరాజ్‌లకు కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

సాక్షి, హైదరాబాద్‌: ముదిరాజ్‌లకు ఎమ్మెల్సీ పి.కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ముదిరాజ్‌ ఎంప్లాయిస్‌ అండ్‌ ప్రొఫెషనల్స్‌ అసోసియేషన్‌(ఎంఈపీఏ) ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్‌ ముదిరాజ్‌ డిమాండ్‌ చేశారు. ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న ముదిరాజ్‌ కులస్తుడిని ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి నిర్బంధించి పరుష పదజాలంతో దూషించారని ఆరోపించారు. ఆ సామాజిక వర్గాన్ని తీవ్రంగా కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన కౌశిక్‌రెడ్డిపై ఉద్యమిస్తామని చెప్పారు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పకుంటే రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజ్‌ సామాజిక వర్గం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

భట్టి యాత్రకు మాజీ మావోయిస్టుల మద్దతు

12 అంశాలతో వినతి పత్రం అందజేత

- కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక అమలు చేస్తామన్న భట్టి
- ట్విట్టర్‌ ట్రెండింగ్‌లో రెండోస్థానంలో పీపుల్స్‌ మార్చ్‌ పాదయాత్ర

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌ మార్చ్‌ పాదయాత్ర శుక్రవారం నాటికి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్తర తెలంగాణకు చెందిన మాజీ మావోయిస్టులు ఆయనను కలిశారు. హరిభూషణ్, సునీత, సాయిరెడ్డి, రేణుక, మంజుల తదితరుల ఆధ్వర్యంలో 90 మంది మాజీ మావోయిస్టులు.. నల్లగొండ జిల్లా ఉప్పలపాడు గ్రామం వద్ద ఉన్న పాదయాత్ర శిబిరానికి వచ్చి భట్టికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు 12 అంశాలతో వినతి పత్రాన్ని భట్టికి అందజేశారు. తెలంగాణ సమాజం బాగు కోసం, సమ సమాజ స్థాపన కోసం తాము చేసిన సూచనలను కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిస్తే కాంగ్రెస్‌ గెలుపు కోసం భట్టి విక్రమార్క నాయకత్వంలో తాము పనిచేస్తామని హరిభూషణ్‌ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మాజీ మావోయిస్టులు చేసిన సూచనలను కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రాగానే కచ్చితంగా అమలు చేస్తామన్నారు. వారు పేర్కొన్న అంశాలన్నీ తాను ఆదిలాబాద్‌ నుంచి చేపట్టిన పీపుల్స్‌ మార్చ్‌ పాదయాత్రలో ప్రజల నుంచి వచ్చిన వినతుల్లోనూ ఉన్నాయన్నారు. ధరణి సాఫ్ట్‌వేర్‌ను సరి చేస్తామని చెప్పారు. గతంలో పేదలకు తాము పంపిణీ చేసిన భూములను బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం లాక్కుందని, వాటిపై బాధితులకు చట్టబద్ధంగా తిరిగి హక్కులు కల్పిస్తామని ఆయన వెల్లడించారు. ఇల్లు, అడవిపై ఆదివాసులకు పూర్తి హక్కులు కల్పించడమే కాకుండా ఫారెస్ట్‌ రైట్స్‌ యాక్ట్‌ను తూచ తప్పకుండా అమలు చేస్తామన్నారు. అలాగే కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే గ్రామాల్లో విచ్చలవిడిగా ఉన్న బెల్ట్‌ షాపులన్నింటిని పూర్తిగా ఎత్తివేస్తామని, రాష్ట్రంలో పబ్స్, డ్రగ్స్‌ లేకుండా సమూలంగా నిర్మూలన చేస్తామని స్పష్టంచేశారు. కేజీ నుంచి పీజీ వరకు అందరికీ ఉచిత విద్యను అందించాలని మాజీ మావోయిస్టులు చేసిన సూచనలను కచ్చితంగా కాంగ్రెస్‌ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరుస్తామని భట్టి చెప్పారు. కాంగ్రెస్‌ తిరిగి అధికారంలోకి రాగానే కోనేరు రంగారావు కమిటీ ఇచ్చిన నివేదికను కచ్చితంగా అమలు చేస్తామని అన్నారు. జనజీవన స్రవంతిలోకి వచ్చిన ఉద్యమకారులపై ఉన్న కేసులను పూర్తిగా ఎత్తివేస్తామన్నారు.



నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఉప్పలపాడు వద్ద మాజీ మావోయిస్టులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ట్విట్టర్‌లో ట్రెండింగ్‌..

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌ మార్చ్‌ పాదయాత్ర 100వ రోజు ట్విట్టర్‌లో జాతీయ స్థాయిలో ట్రెండింగ్‌ అయింది. శుక్రవారం ఉదయం 1,864 ట్వీట్స్‌తో ట్విట్టర్‌ ట్రెండింగ్‌లో రెండో స్థానంలో ఉంది. అయితే సాయంత్రానికి 3వేలకు పైగా ట్వీట్స్‌తో నాలుగో స్థానంలో నిలిచింది. ఇదే అంశం కాంగ్రెస్‌లో భట్టిని నయా ట్రెండ్‌ సెట్టర్‌గా నిలిపిందని ఆయన కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

బీఆర్‌ఎస్, బీజేపీలు కలసిపోయాయి

- ఆ బంధం బలోపేతానికే కేంద్ర మంత్రులతో కేటీఆర్‌ భేటీలు: ఠాక్రే
- షర్మిల అంశం అధిష్టానం పరిధిలోనిదని వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న మాణిక్‌రావ్‌ ఠాక్రే

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీజేపీ, బీఆర్‌ఎస్‌ నేతలు పైకి పరస్పర విమర్శలు చేసుకుంటున్నప్పటికీ వారిమధ్య ఇదివరకే లోపాయికారీ ఒప్పందం కుదిరిందని రాష్ట్ర కాంగ్రెస్‌ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్‌ ఠాక్రే ఆరోపించారు. బీఆర్‌ఎస్, బీజేపీలు ఎన్నడో కలసిపోయాయని, ఆ బంధాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకే రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ ఢిల్లీ వచ్చి కేంద్ర మంత్రులను కలుస్తున్నారని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, బీజేపీతో కలసి సాగేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌ నిర్ణయం తీసుకున్నారని, కూటమి కట్టేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని అన్నారు. పట్నాలో ప్రతిపక్ష నేతల భేటీ జరుగుతున్నప్పటికీ, బీజేపీతో కలసి ఉన్నందుకే ఆ సమావేశానికి బీఆర్‌ఎస్‌ దూరంగా ఉందని ఆరోపించారు. ఈ రెండు పార్టీలు కలసిపోయినందునే ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులిచ్చినా అరెస్ట్‌ చేయడం లేదన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీల నిజ స్వరూపాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని, అందుకే వారంతా కాంగ్రెస్‌పై విశ్వాసం ప్రకటిస్తున్నారని చెప్పారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ పార్టీల నుంచి భారీగా చేరికలు కొనసాగుతాయని, చాలా మంది నేతలు ఇప్పటికే తమకు టచ్‌లోకి వచ్చారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల ప్రకటన ముందుగానే ఉంటుందని, రెండు విడతలుగా అభ్యర్థుల జాబితా విడుదల చేస్తామని చెప్పారు. ఇక వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల కాంగ్రెస్‌లో చేరబోతున్నారా?, ఆమె పార్టీని విలీనం చేస్తున్నారా? అని ప్రశ్నించగా ఈ విషయం తన పరిధిలోనిది కాదని, దానిపై అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

మీకు డిపాజిట్‌ వస్తే.. మేం గుండు కొట్టించుకుంటాం

- కేసీఆర్, మల్లారెడ్డికి టీపీసీసీ చీఫ్‌ రేవంత్‌రెడ్డి సవాల్‌
- భూ కబ్జాల బీఆర్‌ఎస్‌కు పేదల బాధలు పట్టవని మండిపాటు



సాక్షి, మేడ్చల్‌ జిల్లా/శామీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ ప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. 'కేసీఆర్, మంత్రి మల్లారెడ్డికి చాలెంజ్‌ చేస్తున్నా.. కాంగ్రెస్‌ ఎక్కడెక్కడ ఇందిరమ్మ ఇళ్లు కట్టించిందో అక్కడే మేం ఓట్లు అడుగుతాం. మీరు ఎక్కడెక్కడ డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లు కట్టించారో.. అక్కడే మీరు ఓట్లు అడగండి. ఏ నియోజకవర్గంలోనూ మీకు డిపాజిట్లు రావు. ఒకవేళ మీకు డిపాజిట్లు వస్తే మేం గుండు కొట్టించుకుంటాం' అని రేవంత్‌రెడ్డి సవాల్‌ విసిరారు. మేడ్చల్‌ జిల్లా శామీర్‌పేట మండలం లక్ష్మాపూర్‌లోని కుమ్మరి ఎల్లవ్వ నూతన గృహాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. గుమ్మడి కాయకొట్టి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... గతంలో కుమ్మరి ఎల్లవ్వ ఇల్లు చూస్తే.. మురికి నీరు అంతా ఇంట్లోకే వెళ్లేదన్నారు. ఆ తర్వాత రచ్చబండ కార్యక్రమంలో భాగంగా వచ్చి చూస్తే... ఆరు ఫీట్ల ఎత్తు రోడ్డు అసలు ఆమె ఇంటినే ముంచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌ ఫామ్‌ హౌస్‌కు వెళ్లడానికి మంచి దారి వేసుకుంటూ అందరినీ ముంచేశాడని మండిపడ్డారు. రోడ్డు బాధితులకు న్యాయం చేయాలని ఎంపీగా చెప్పినా.. కలెక్టర్‌ పట్టించుకోలేదన్నారు. ఇక్కడి బీఆర్‌ఎస్‌ నాయకులకు భూ కబ్జాలు తప్ప.. పేదల బాధలు పట్టవని, అందుకే ఎల్లవ్వకు కాంగ్రెస్‌ పార్టీ ఇందిరమ్మ ఇల్లు కట్టించిందని తెలిపారు.

చర్లపల్లి జైల్లో కేసీఆర్‌కు 'డబుల్‌'

కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే పేదలకు ఇళ్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు అందిస్తామని రేవంత్‌ అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందిస్తామని, రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పారు. అలాగే ఏడాదిలోగా 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని, రూ.500 లకే గ్యాస్‌ సిలిండర్‌ అందిస్తామన్నారు. అలాగే కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే కేసీఆర్‌ కుటుంబానికి చర్లపల్లి జైల్లో డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇల్లు కట్టిస్తామని ఎద్దేవా చేశారు. కార్యక్రమానికి ముందు లక్ష్మాపూర్‌లోని డాక్టర్‌ బాబాసాహెబ్‌ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌ రామ్‌ విగ్రహాలకు రేవంత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో టీపీసీసీ సీనియర్‌ ఉపాధ్యక్షుడు మల్లు రవి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ నివాళిలో కృత్రిమ భావన: రేవంత్‌

సాక్షి, హైదరాబాద్‌: దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా తెలంగాణ అమర వీరులకు సీఎం కేసీఆర్‌ అర్పించిన నివాళి కార్యక్రమంలో అడుగడుగునా కృత్రిమ భావన కనిపించిందని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆ కుటుంబాలకు సత్కారం నుంచి ఎలక్ట్రానిక్‌ కొవ్వొత్తుల ప్రదర్శన వరకు నిజాయితీ కొరవడిందని ట్విట్టర్‌ వేదికగా విమర్శించారు. 'ఎందరో ద్రోహులను అందలం ఎక్కించిన కేసీఆర్‌ అమర వీరుల కుటుంబాల కోసం ఒక్క ఎమ్మెల్సీ పదవినైనా ప్రకటిస్తారేమో నని తెలంగాణ ఆశించింది' అని పేర్కొన్నారు.

రేవంత్‌వి మరుగుజ్జు మాటలు: వేముల



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ అమర వీరుల త్యాగాల గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌ పార్టీకి లేదని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరజ్యోతి నిర్మాణంలో అవినీతి జరిగిందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మరుగుజ్జు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఓట్ల రాజకీయంతో కాకుండా కేసీఆర్‌ ప్రభుత్వం అమరుల త్యాగాలకు విలువనిచ్చి తెలంగాణ సమాజం గర్వించే రీతిలో ఎంతో పారదర్శకంగా అమరజ్యోతిని నిర్మించిందని చెప్పారు. తెలంగాణ ప్రకటనలో కాంగ్రెస్‌ చేసిన జాప్యం వల్లే ఆత్మ బలిదానాలు జరిగాయన్నారు. నాడు సోనియా గాంధీని తెలంగాణ బలిదేవత అంటూ మాట్లాడిన రేవంత్‌ ఇప్పుడు అమరుల కుటుంబాలతో సోనియా సహ పంక్తి భోజనాలు చేస్తుందనడం విడ్డూరంగా ఉందన్నారు.

మహారాష్ట్రలోనూ తెలంగాణ మోడల్‌: హరీశ్‌

బీఆర్‌ఎస్‌లో మహారాష్ట్ర నేతల చేరిక



సాక్షి, హైదరాబాద్‌: మహారాష్ట్రలోనూ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఏర్పాటైతే తెలంగాణ మోడల్‌ అమలవుతుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. మహారాష్ట్రకు చెందిన వివిధ పార్టీల నేతలు శుక్రవారం హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో రైతులు, పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్‌ చేపట్టిన కార్యాచరణ దేశానికే ఆదర్శంగా మారిందన్నారు. దేశంలో కిసాన్‌ సర్కార్‌ స్థాపన కోసం కేసీఆర్‌ నాయకత్వంలో అందరం కలిసికట్టుగా పనిచేద్దామని హరీశ్‌ పిలుపునిచ్చారు. జనతాపార్టీ లాతూర్‌ జిల్లా అధ్యక్షుడు జయసింగ్‌ యాదవ్, లాతూర్‌ జిల్లా సంఘటనకు చెందిన హోన్రాజ్‌ రాథోడ్, కాంగ్రెస్‌ పార్టీ నుంచి అర్జున్‌ రాథోడ్, భగవంత్‌ కులకర్ణి తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. చేరికల కార్యక్రమంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌ రెడ్డి, ఎమ్మెల్యే బాల్క సుమన్, మహారాష్ట్ర నేత జయంత్‌ దేశ్‌ముఖ్‌ తదితరులున్నారు.

కాంగ్రెస్‌ నుంచి బీఆర్‌ఎస్‌లోకి | చేరికలు ఉంటాయి

మండలి చైర్మన్‌ గుత్తా

- వచ్చే ఎన్నికల్లో అవకాశమొస్తే నా కుమారుడు అమిత్‌ పోటీ చేస్తాడు
- ఎమ్మెల్సీగా పదవీకాలం ఇంకా ఉంది.. అసెంబ్లీకి పోటీ చేయను



సాక్షి, హైదరాబాద్‌: నల్లగొండ జిల్లాకు చెందిన కొందరు కాంగ్రెస్‌ నేతలు భారత రాష్ట్ర సమితిలో చేరే అవకాశముందని, రాష్ట్రంలో కేసీఆర్‌ నాయకత్వంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పాటవుతుందని శాసన మండలి చైర్మన్‌ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని అన్ని సీట్లలో బీఆర్‌ఎస్‌ పార్టీ గెలుస్తుందని, పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌ మార్పులు.. చేర్పులు చేస్తే కొత్తవారికి పోటీ చేసే అవకాశం దక్కుతుందని తెలిపారు. శుక్రవారం శాసన మండలి ఆవరణలో గుత్తా సుఖేందర్‌రెడ్డి మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. శాసన మండలి సభ్యుడిగా తనకు మరో నాలుగున్నర సంవత్సరాల పదవీ కాలం ఉన్నందున వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదన్నారు. తన కుమారుడు అమిత్‌రెడ్డికి అవకాశం ఇస్తే ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగుతాడన్నారు. ఒక వేళ తన కుమారుడికి టికెట్‌ దక్కని పక్షంలో పార్టీ ప్రకటించిన అభ్యర్థికి మద్దతు ఇస్తామన్నారు. వారసత్వ రాజకీయాలు కేవలం గుర్తింపు కోసమే ఉపయోగపడ తాయని, కానీ గెలుపు కోసం పనికిరావని ఆయన పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం సహా పార్టీ నేతలెవరూ బీఆర్‌ఎస్‌ను వీడటం లేదన్నారు.

మణిపూర్‌పై అఖిలపక్ష సమావేశానికి బీఆర్‌ఎస్‌

సాక్షి, హైదరాబాద్‌: మణిపూర్‌ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై చర్చించేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్‌ షా నేతృత్వంలో నిర్వ హించనున్న అఖిలపక్ష సమావేశానికి బీఆర్‌ ఎస్‌ హాజరుకానుంది. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలోని పార్లమెంట్‌ లైబ్రరీ భవనంలో జరిగే సమావేశానికి బీఆర్‌ఎస్‌ తరఫున రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ చైర్మన్‌ బోయినపల్లి వినోద్‌ కుమార్‌ హాజరవుతారు. ఈ మేరకు సమావేశానికి హాజరు కావాలని వినోద్‌కుమార్‌ను సీఎం కేసీఆర్‌ ఆదేశించారు.

ఎంత కష్టం వచ్చిందమ్మా!

రాష్ట్రంలోని వేర్వేరు చోట్ల మహిళల ఆత్మహత్యాయత్నాలు.. ముగ్గురి మృతి
- మరో ఘటనలో భార్య, భర్త, కుమార్తె ఆత్మహత్య
- ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం, భర్త వేధింపులే కారణం

పెనుబల్లి/గచ్చిబౌలి/మల్లాపూర్/ఎడపల్లి (బోధన్)/ఖలీల్‌వాడి (నిజామాబాద్ అర్బన్): భర్తల వేధింపులు.. ఆర్థిక ఇబ్బందులు.. కారణం ఏదైతే నేం .. క్షణికావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నలుగురు మహిళలు ఆత్మహత్యకు యత్నించారు. వారిలో ఇద్దరు తల్లులు, ఓ కుమార్తె కన్నుమూయగా పిల్లలతో కలసి చెరువులో దూకిన మరో ఇద్దరు తల్లులను స్థానికులు కాపాడటంతో ప్రాణాలతో బయటపడ్డారు. అయితే ఈ ఘటనలో ఓ బాలుడి ఆచూకీ గల్లంతైంది. మరో ఘటనలో అనారోగ్యం కారణంగా కుమార్తెతో కలసి భార్య, భర్త ఆత్మహత్య చేసుకున్నారు.

ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలతో...

ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో తల్లీకూతురు ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్న ఘటన హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మణికొండలోని ఆంధ్రా బ్యాంకు సమీపంలో నివసించే బుడ్డోలు సదానందానికి భువనగిరి జిల్లా కాటేపల్లికి చెందిన అలివేలుతో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి కూతురు లాస్య (14), కుమారుడు మణికంఠ (11) ఉన్నారు. సదానందం ఖాళీగా ఉంటుండగా కోవిడ్ లాక్‌డౌన్‌కు ముందు వచ్చే ఇంటి అద్దెలు కాస్తా బంధువులతో ఏర్పడిన వివాదాలతో నిలిచిపోయాయి. దీంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. డబ్బులేక పిల్లలను చదువు కూడా మాన్పించారు. ఈ పరిణామాలతో తీవ్ర మనస్తాపానికి గురైన అలివేలు ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. సమస్యల నుంచి బయటపడేయాల్సిందిగా దేవుడిని ప్రార్థించి రావాలంటూ భర్తను యాదగిరిగుట్టకు పంపింది. అనంతరం అర్ధరాత్రి వేళ ఓ బెడ్రూంలో తొలుత కుమార్తెకు ఉరేసి, ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్నాక వంటింట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తెల్లవారుజామున లేచిన కుమారుడు తల్లి, అక్కను విగతజీవులుగా చూసి వెంటనే చుట్టుపక్కల వారికి విషయం తెలిపాడు.

చేతిపై గోరింటాకు..!

ఆత్మహత్యకు ముందు అలివేలు, లాస్య గోరింటాకు పెట్టుకున్నారు. లాస్య చేతిపై గోరింటాకు కోన్‌తో 'డూ సమ్‌థింగ్ దట్ మేక్ యూ హ్యాపీ'అని రాసుకుంది. అదేవిధంగా తల్లీ, కూతురు ఇద్దరూ 'ది గేమ్ ఈజ్ స్టార్టెడ్'అని గోరింటాకుతో రాసిన వ్యాఖ్యలు ఉండటంతో పోలీసులు ఇవి ఎందుకు రాసుకున్నారో...? అనే అంశంపై కూడా విచారణ చేస్తున్నారు. కాగా, అలివేలు, లాస్య ఆత్మహత్య చేసుకున్న ఇంట్లో మరో ఉరితాడు వేలాడుతూ కనిపించడం కలకలం రేపుతోంది. కుమారుడికి కూడా ఉరివేయాలని తల్లి భావించి ఉంటుందని పోలీసులు బావిస్తున్నారు.కానీ కుమారుడు బెడ్‌రూమ్‌లో నిద్ర పోతుండడంతో ఈ ప్రయత్నాన్ని విరమించుకొని ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు అలివేలు ఆత్మహత్యకు ముందు తన సెల్‌ఫోన్, బట్టలను ఇంట్లోనే తగలబెట్టింది. తల్లీకుమార్తెల మానసిక స్థితి సరిగ్గా లేదని.. కరోనా కాలం నుంచి అందరికీ దూరంగా ఉంటున్నారని రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపారు.

లైవ్‌లో ఆత్మహత్య... : భర్త వేధింపులు తట్టుకోలేక.. ఫేస్‌బుక్ లైవ్ వీడియో పెట్టి భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాచారానికి చెందిన సనా (29) రాజస్తాన్‌కు చెందిన హేమంత్ పటియాల (డిజె మ్యూజిక్ ఆపరేటర్) 5 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లయిన రెండేళ్ల వరకు వారి వైవాహిక జీవితం బాగానే కొనసాగింది. బాబు పుట్టాక వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. సనాను భర్త హేమంత్‌తోపాటు వారి అత్తమామలు వేధించసాగారు. దీంతో గతంలో పలుమార్లు పోలీసులకు హేమంత్‌పై సనా ఫిర్యాదు చేశారు. సైప్రస్ దేశానికి వెళ్లిన హేమంత్ గత 5 నెలలుగా సనాను ఫోన్‌లో వేధిస్తూనే ఉన్నాడు. దీంతో మంగళవారం నాచారంలోని ఇంట్లో సనా ఫేస్‌బుక్ లైవ్ పెట్టి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సనాకు 3 ఏళ్ల బాబు ఉన్నాడు.

పిల్లలతో సహా చెరువులో దూకిన అక్కాచెల్లెళ్లు

ముగ్గురు పిల్లలతో సహా అక్కాచెల్లెళ్లు చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించగా అందులో బాలుడు గల్లంతయ్యాడు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని అశోక్ సాగర్ (జానకంపేట చెరువు) వద్ద శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతానికి చెందిన లక్ష్మి, మోహన్ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. మోహన్‌కు కొత్త కలెక్టరేట్ సమీపంలో 2 వేల గజాల స్థలం ఉంది. ఆ స్థలంలో కొంత భాగాన్ని పెద్ద కూతురుకు అమ్మి రెండో కూతురు అక్షయ, మూడో కూతురు నిఖితలకు వివాహం చేశాడు. అక్షయ వివాహం హైదరాబాద్‌కు చెందిన హేమంత్‌తో, నిఖిత వివాహం మెదక్‌కు చెందిన మహేశ్‌తో జరిగింది. వివాహ సమయంలో చెరో 200 గజాల స్థలాన్ని వారికి కానుకగా ఇచ్చారు. కొంతకాలంగా హేమంత్, మహేష్‌లు ఇంటి స్థలం అమ్మి డబ్బులు తీసుకురావాలని భార్యలను వేధిస్తున్నారు. అయితే ఈ ప్లాట్లకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో దానిని కొనేందుకు ఎవరూ ముందుకు రావట్లేదని తెలిసింది. అక్షయ, నిఖితలపై వేధింపులు ఎక్కువ కావడంతో వారిద్దరూ మూడు రోజుల క్రితం పిల్లలతో కలసి పుట్టింటికి వచ్చారు. ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని గురువారం ఉదయం నిఖిత తన పిల్లలైన భవశ్రీ, శ్రీమాన్, అక్షయ తన కుమారుడైన చిన్నా (3) అలియాస్ భువనేశ్వర్‌ను తీసుకొని ఎడపల్లి మండలంలోని అశోక్‌సాగర్ వద్దకు చేరుకున్నారు. ముందుగా పిల్లలను నీటిలోకి తోసి తర్వాత నిఖిత, అక్షయ కూడా దూకారు. ఆ సమయంలో రోడ్డుపై అటుగా వెళ్తున్న షేక్ హైదర్ అనే వ్యక్తి చెరువులోకి దూకి నిఖిత, అక్షయలతోపాటు భవశ్రీ, శ్రీమాన్‌లను రక్షించాడు. మూడేళ్ల చిన్నా ఆచూకీ లభించలేదు.


కాపాడిన హైదర్


సన (ఫైల్)


లాస్య, అలివేలు


చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన అక్కాచెల్లెళ్లు

కేన్సర్ నుంచి భార్య కోలుకోదేమోనని..

భార్యకు కేన్సర్ ఉందని నిర్ధారణ కావడంతో భర్త తల్లడిల్లాడు. భార్యకు ఏమైనా అయితే తాను తట్టుకోలేనని.. తామిద్దరం లేకపోతే కూతురు భవిష్యత్తు ఏమిటనే భయంతో కుమార్తె సహా ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కొత్తకారాయిగూడెంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పోట్రు వెంకట కృష్ణారావు (40)కు భార్య సుహాసిని (35), కుమార్తె అమృత (16)తోపాటు కుమారుడు కార్తీక్ ఉన్నారు. కార్తీక్‌కు బీటెక్ సెకండియర్ పూర్తికాగానే బెంగళూరులోని హెచ్‌సీఎల్‌లో ట్రెయినీగా ఉద్యోగం రాగా అమృత ఇంటర్ పూర్తిచేసి ఇంజనీరింగ్ చదివేందుకు సిద్ధమవుతోంది. నెలన్నర క్రితం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సుహాసినికి శస్త్రచికిత్స చేసిన వైద్యులు గర్భసంచిలోని కణతిని తొలగించారు. ఈ క్రమంలో శాంపిల్స్ హైదరాబాద్‌కు పంపగా అది కేన్సర్‌గా తేలింది. దీంతో ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లో మెరుగైన చికిత్స కోసం వెళ్తామని కుమారుడు, బంధువులకు చెప్పారు. దీంతో కుమారుడు బెంగళూరు నుంచి గురువారం ఉదయం ఇంటికి రాగా, గుంటూరులో ఉంటున్న వెంకటకృష్ణారావు తమ్ముడు కూడా కొత్తకారాయిగూడెం వచ్చాడు. అనంతరం గురువారం సాయంత్రం వెంకటకృష్ణారావు, సుహాసిని దంపతులు కుమార్తె అమృతతో కలసి ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి వెళ్తున్నట్లు చెబుతూ తిరువూరు బయలుదేరారు. కానీ మధ్యలోనే మూడు ప్లాస్టిక్ స్టూళ్లు, నైలాన్ తాడు, కూల్ డ్రింక్, వాటర్ బాటిల్ కొనుక్కొని స్వగ్రామంలో పొలం పక్కనే ఉన్న మామిడి తోటకు రాత్రి చేరుకున్నారు. ఆ సమయంలో వారిని గమనించిన గ్రామస్తులు ఆరా తీయగా గేదెలను వెతకడానికి వెళ్తున్నట్లు చెప్పారు. అనంతరం బంధువులకు ఫోన్ చేసి మాట్లాడి ఆత్మహత్య చేసుకున్నారు.

అన్ని రంగాల్లో తెలంగాణ బ్రాండ్

- దేశానికి ధాన్యాగారంగా తెలంగాణ
- జపాన్‌కి చెందిన సటాకే కార్పొరేషన్ ప్రతినిధులతో మంత్రి గంగుల

సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్ల కాలంలోనే తెలంగాణ దేశానికి ధాన్యాగారంగా నిలిచిందని, సీఎం కేసీఆర్ కృషితోనే రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి పదిరెట్లు పెరిగిందని మంత్రి గంగుల కమలాకర్ వ్యాఖ్యానించారు. పెరిగిన ధాన్యం ఉత్పత్తిని సద్వినియోగపరుచుకోవడంతో పాటు అన్ని రంగాల్లో తెలంగాణ బ్రాండ్ సృష్టించేందుకు తాము ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో శుక్రవారం ఆయన జపాన్‌కు చెందిన సటాకే కార్పొరేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో మిల్లింగ్ పరిశ్రమల స్థాపన, ఆహార శుద్ధి రంగంలో గల అవకాశాలపై కంపెనీ ప్రతినిధులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కమలాకర్ మాట్లాడుతూ...రాష్ట్ర ఆవిర్భావ సమయంలో 24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, ఈ సీజన్‌లో ప్రభుత్వం 1.30 కోట్ల టన్నుల ధాన్యాన్ని సేకరించిందని చెప్పారు. ధాన్యం ఉత్పత్తికి మరింత చేయూతనిచ్చేలా వాటిని మిల్లింగ్ చేసి మార్కెటింగ్ చేసే విధంగా రైతుల ఉత్పత్తులను ప్రపంచ స్థాయికి చేర్చడమే సీఎం కేసీఆర్ సంకల్పమని చెప్పారు.

సమావేశంలో భాగంగా సటాకే కార్పొరేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ అమెరికా, బ్రిటన్, థాయ్‌లాండ్, చైనా, వియత్నాం తదితర దేశాల్లో తమ మిల్లింగ్ యూనిట్లు విజయవంతంగా నడుస్తున్నాయని, రోజుకు లక్ష టన్నుల వరకు మిల్లింగ్ సామర్థ్యంతో పనిచేయగలవని చెప్పారు. మిల్లింగ్‌తో పాటు నిల్వ అవకాశాలు, బాయిలర్ల పనితీరు, ఉప ఉత్పత్తుల తయారీ తదితర అంశాలపై మంత్రి కమలాకర్‌తో చర్చించారు.

27న మహారాష్ట్రకు సీఎం కేసీఆర్

- పండరీపూర్‌లో పార్టీ నేతలతో కలిసి ప్రత్యేక పూజలు



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఈ నెల 27న మహారాష్ట్రలో పర్యటించనున్నారు. సోలాపూర్ జిల్లాలోని ఆధ్యాత్మిక పట్టణం పండరీపూర్‌లో శ్రీ విఠల రుక్మిణి మందిర్‌లో ప్రత్యేక పూజలు చేస్తారు. కేసీఆర్‌తోపాటు పలువురు రాష్ట్ర మంత్రులు, మహారాష్ట్ర నేతలు ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. పూజల్లో భాగంగా సంత్ జ్ఞానేశ్వర్, సంత్ తుకారాం పల్లకీలకు కేసీఆర్ పూలు సమర్పిస్తారు. ఇదిలాఉంటే తెలంగాణ నుంచి పలువురు భక్తులు ఏటా పండరీపూర్‌కు పాదయాత్రగా వెళ్తుంటారు. ఈ నెల 29న ఆషాఢ ఏకాదశి సందర్భంగా భక్తులు పెద్దఎత్తున పండరీపూర్‌లో దైవదర్శనం చేసుకుంటారు. ఆషాఢ ఏకాదశికి రెండు రోజుల ముందే 27న కేసీఆర్ దైవదర్శనానికి వెళ్తుండటం గమనార్హం. సీఎం పర్యటన ఏర్పాట్లను మహారాష్ట్ర మాజీ ఎమ్మెల్యే శంకరన్న దోండ్గే, బీఆర్‌ఎస్ కిసాన్ సెల్ మహారాష్ట్ర కన్వీనర్ మాణిక్ కదం పర్యవేక్షిస్తున్నారు.

1,827 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- జిల్లాకో వైద్యకళాశాల సీఎం లక్ష్యాన్ని త్వరలో చేరుకుంటాం
- మంత్రి హరీశ్‌రావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) పరిధిలోని బోధనాస్పత్రుల్లో 1,827 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు అనుమతులు మంజూరు చేస్తూ ఆర్థికశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ మెడికల్ హెల్త్ అండ్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రత్యక్ష నియామకం పద్ధతిలో వీటిని భర్తీ చేయనుంది. కాగా, జిల్లాకో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలనే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు లక్ష్యాన్ని వేగంగా చేరుకుంటున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఐదు వైద్య కళాశాలలు మాత్రమే ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 26కు చేరిందన్నారు. వచ్చే ఏడాదిలో మరో 8 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీంతో పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు చేరువవుతుండటంతో పాటు, తెలంగాణ బిడ్డలకు వైద్య విద్య అందుబాటులోకి వస్తుందన్నారు. వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన వైద్యులను, నర్సులను, ఇతర సిబ్బందిని భర్తీ చేస్తుందన్నారు. ఇప్పటికే 1,061 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ ప్రక్రియ పూర్తి చేసి, వారిని బోధనాస్పత్రుల్లో నియమించుకున్నామని, 5,204 స్టాఫ్ నర్సుల నియామక ప్రక్రియ కొనసాగుతోందని ఇందుకు సంబంధించి ఆగస్టులో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణకు చర్యలు

- విద్యాశాఖ మంత్రి సబిత హామీ

బంజారాహిల్స్: యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసేందుకు మూడు రోజుల్లో సబ్ కమిటీ సమా వేశం ఏర్పాటు చేసి ప్రక్రియ ప్రారంభిస్తామని మంత్రి సబితాఇంద్రారెడ్డి హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 13 వర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు శుక్రవారం శ్రీనగర్ కాలనీలోని మంత్రి ఇంటి ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. కాంట్రాక్ట్ పద్ధతిలో బోధిస్తున్న జేఎల్, డీఎల్, పీఎల్‌లను రెగ్యులరైజ్ చేసి తమను చేయకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు వెంటనే క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. వర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉన్నప్పటికీ కొద్ది మంది అధికారులు ఇచ్చిన తప్పుడు సమాచారంతో ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదని ఆరోపించారు.

వీసీ కొనసాగింపుపై వివరణ ఇవ్వండి

- కాళోజీ వర్సిటీ, రాష్ట్ర సర్కార్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయ వీసీ కొనసాగింపుపై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 4కు వాయిదా వేసింది. చాన్స్‌లర్(గవర్నర్)కు నోటీసులు జారీ చేయాలా? వద్దా? అనేది తర్వాత విచారణలో నిర్ణయిస్తామని స్పష్టం చేసింది. కాళోజీ యూనివర్సిటీ వీసీగా బి.కరుణాకర్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2020లో జీవో 29 జారీ చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఆయన ఆ పదవిలో కొనసాగుతారని ప్రభుత్వం అందులో పేర్కొందని, ఇది చట్టప్రకారం విరుద్ధమని హెల్త్ కేర్ రీఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్ హైకోర్టు రిట్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ ఇటీవల విచారణ చేపట్టారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో కాళోజీ వర్సిటీ చట్టానికి విరుద్ధమని పిటిషనర్ తరఫున న్యాయవాది సామ సందీప్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. ఆ జీవోను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. రాష్ట్ర ప్రభుత్వానికి, కాళోజీ వర్సిటీకి, కరుణాకర్‌రెడ్డికి నోటీసులు జారీ చేసింది.

ప్రతీ నెల 27న 'నిధి ఆప్కే నికత్'

- పీఎఫ్‌కు సంబంధించి అవగాహన కార్యక్రమాల నిర్వహణపై ఈపీఎఫ్‌ఓ

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయ్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పీఎఫ్‌కు సంబంధించిన అంశాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రతీ నెల 27న 'నిధి ఆప్కే నికత్'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ ఆర్.వివేక్ రామన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకవేళ 27వ తేదీ సెలవుదినమైతే తదుపరి పనిరోజున ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈనెల 27న నిర్వహించే నిధి ఆప్కే నికత్(ఎన్ఏఎన్) కార్యక్రమం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు వికారాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, హైదరాబాద్ ప్రాదేశిక అధికార పరిధిలోనికి వచ్చే ప్రాంతాల్లో 9 చోట్ల నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సాక్షి

శనివారం, 24 జూన్ 2023

'ద్వైపాక్షికం'లో కొత్త అధ్యాయం

భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఉద్దేశించిన ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా యాత్ర విజయవంతమైంది. భారత్–అమెరికా సంబంధాలకు ఆకాశమే హద్దని మోదీ... ఇంత పటిష్ఠంగా, ఇంత సన్నిహితంగా, ఇంత క్రియాశీలంగా సంబంధాలు ఏర్పడటం ద్వైపాక్షిక సంబంధాల చరిత్రలో ఇదే తొలిసారని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యానించటంలో అతిశయోక్తులు లేవు. లక్ష్యాన్ని నిర్దేశించుకోవటమే కాదు... అందుకనుసరించాల్సిన మార్గాన్ని కూడా ఆ లక్ష్యంతో సరిగా అనుసంధానించుకోవటం సమర్థ దౌత్య నైపుణ్యానికి చిహ్నం అంటారు. అమెరికాతో మన దేశానికి కుదిరిన భిన్న ఒప్పందాలను పరికిస్తే మన దౌత్య నైపుణ్యం ఆశించిన రీతిలోనే సాగిందని చెప్పవచ్చు. అయితే ఇందుకు అంతర్జాతీయ స్థితిగతులు కూడా దోహదపడ్డాయి. ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాల్లో అత్యాధునిక సాంకేతిక సహకారం మొదలుకొని వాతావరణ మార్పులకు సంబంధించిన సహకారం వరకు ఎన్నో ఉన్నాయి. చంద్రుడి పైకి వెళ్లే మూన్ మిషన్‌లో మనకూ భాగస్వామ్యం ఇవ్వటానికి అంగీకరించటంతో మొదలెట్టి ఫైటర్ జెట్ ఇంజన్ల ఉత్పత్తి, సెమీకండక్టర్ల రంగంలో పెట్టుబడులు, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనటానికి అవసరమైన సాయం అందివ్వటం వరకూ అనేకం ఈ ఒప్పందాల్లో ఉన్నాయి. అక్కడుండే భారతీయులకు తమ హెచ్ 1బి వీసాలను అమెరికాలోనే నవీకరించుకునే వెసులుబాటు కల్పించటం వేలాదిమందికి తోడ్పడుతుంది. భారత్–అమెరికా సంబంధాలు తాజా ద్వైపాక్షిక ఒప్పందాలతో సరికొత్త దశకు చేరుకున్నాయి. దేశాల మధ్య సాన్నిహిత్యం కేవలం అమ్మకందారు–కొనుగోలుదారు సంబంధాల వల్ల ఏర్పడదు. భిన్న రంగాల్లో పరస్పరం ఎదిగేందుకు చిత్తశుద్ధితో ఆ దేశాలు ప్రయత్నించినప్పుడే ఆ సాన్నిహిత్యం సాధ్యపడుతుంది. అమెరికాకు చెందిన ప్రముఖ మెమొరీ చిప్ తయారీ సంస్థ మైక్రాన్ గుజరాత్‌లో అక్కడి ప్రభుత్వ భాగస్వామ్యంలో 270 కోట్ల డాలర్ల వ్యయంతో సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమ స్థాపించడానికి అంగీకరించటం, తేలికపాటి యుద్ధ విమానం తేజస్‌కు అమర్చే ఫైటర్ జెట్ ఇంజన్లను భారత్‌లోనే తయారుచేయటానికి అంగీకరించటం, ఇరు దేశాల రక్షణ విభాగాలూ సైనిక సాంకేతికతలో సహకరించుకునే ఇండస్‌ఎక్స్ ఒప్పందం ఎన్నదగ్గ నిర్ణయాలు. ఇక క్వాంటమ్ టెక్నాలజీ, కృత్రిమ మేధ, అత్యాధునిక సైనిక డ్రోన్‌లు తదితరాలపై ఒప్పందాలు సరేసరి.

ఆసియా ఖండంపై అమెరికా నూతన దృక్పథానికి ఈ ఒప్పందాలు నిదర్శనం. కేవలం చైనాను దృష్టిలో పెట్టుకోవటం వల్లే చాలా అంశాల్లో అమెరికా దిగొచ్చిందన్న విశ్లేషణల్లో కొంతమేర వాస్తవం ఉండొచ్చు. ఈ ఒప్పందాలు సాకారమైతే ఆసియాలో చైనా పలుకుబడికి గండికొడతాయని చెప్పటం అతిశయోక్తి అవుతుందిగానీ, దాని ఏకచ్ఛత్రాధిపత్యాన్ని ఏదోమేరకు నిలువరించటం సాధ్యపడొచ్చు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతిసుస్థిరతలే తన ధ్యేయమని అమెరికా చెబుతోంది. సమతౌల్య ఆసియా తన లక్ష్యమంటున్నది. అయితే ఆ దేశానికి భవిష్యత్తులో తైవాన్ విషయంలోనో, మరే ఇతర అంశంలోనో చైనాతో ఘర్షణ వాతావరణం ఏర్పడితే అది మనకు కూడా సమస్యలు సృష్టిస్తుంది. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండటం అవసరం. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో మనం ఆనాటి సోవియెట్ యూనియన్ వైపు మొగ్గటం అమెరికాకు కంటగింపుగా ఉండేది. అందువల్లే ఏ విషయంలోనూ సహకరించేది కాదు. భారత్‌లో 90వ దశకంలో సంస్కరణల అమలు ప్రారంభించాక ఇంత పెద్ద మార్కెట్ వున్న దేశాన్ని వదులుకోవటం అసాధ్యమని అమెరికా గుర్తించింది. మన దేశం సైతం మారిన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఆ దేశంతో క్రమేపీ చెలిమిని పెంచుకుంటూ వస్తోంది. అటు చైనాతో సైతం ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణకు అమెరికా ప్రయత్నిస్తోంది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ను బైడెన్ నియంతతో పోల్చినా ఆ దేశానికి విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్‌ను పంపటం గమనించదగ్గ పరిణామం. మోదీ అమెరికా పర్యటనకు ముందే బ్లింకెన్ బీజింగ్ సందర్శించారు. ఇటు మన దేశం కూడా సరిహద్దుల్లో తగాదాలకు దిగుతున్న చైనాతో మూడేళ్లుగా ఓపిగ్గా చర్చిస్తోంది. చైనా కూడా జరుగుతున్నదేమిటో గమనిస్తూనే ఉంటుంది. పరిణతితో ఆలోచించటం మొదలుపెడితే ఎంత జటిల సమస్య అయినా పరిష్కారమవుతుంది.

ఈ పర్యటనలో భారత్‌లో పౌర హక్కుల ఉల్లంఘన తదితర అంశాలను ప్రముఖంగా ప్రస్తావించాలనీ, మోదీని ఇరకాటంలో పెట్టాలనీ కొన్ని వర్గాలు ప్రయత్నించాయి. అధికార డెమొక్రటిక్ పార్టీ సెనెటర్లు కూడా ఈ విషయంలో బైడెన్‌కు లేఖ రాశారు. ఇరు దేశాల అధినేతలూ ఉమ్మడిగా పాల్గొన్న మీడియా సమావేశంలో సైతం ఈ దిశగా ప్రశ్న సంధించారు. దానికి మోదీ 'భారత్‌ను ప్రజాస్వామిక దేశమని మీరు అంగీకరిస్తే వివక్ష చూపుతున్నారన్న ప్రశ్నకు అర్థమే లేద'ని బదులిచ్చారు. బైడెన్ సైతం ప్రజాస్వామిక విలువలపై తాము చర్చించామంటూ జవాబిచ్చారు. ఈ విషయంలో ఇరు దేశాలూ ఇంకా పరిపూర్ణత సాధించాల్సివుందని తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాలపై దృష్టి పెట్టాల్సిన వర్తమానంలో బైడెన్ ఇలాంటి అంశాల విషయంలో బహిరంగంగా ప్రస్తావించాలనుకోవటం అత్యాశే అవుతుంది. 2015 మొదట్లో అప్పటి అధ్యక్షుడు ఒబామా మన దేశంలో పర్యటించినప్పుడు సైతం ఆయనకు ఇలాంటి ప్రశ్న ఎదురైంది. అది మోదీ సమక్షంలో కాదు కాబట్టి, 'మతవిశ్వాసాల పరంగా చీలనంతకాలమూ మీరు విజయం సాధిస్తార'ని లౌక్యంగా జవాబిచ్చారు. మొత్తానికి మోదీ మూడురోజుల అమెరికా పర్యటన అంచనాలకు మించిన రీతిలో విజయవంతమైంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.షష్ఠి సా.6.40 వరకు తదుపరి సప్తమి, **నక్షత్రం:** పుబ్బ (పూర్తి), **వర్జ్యం:** ప.1.45 నుండి 3.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.31 నుండి 7.15 వరకు, **అమృతఘడియలు:** రా.12.29 నుండి 2.04 వరకు.

సూర్యోదయం: 5.30
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు

తక్కువ కాలంలో ఎక్కువ మేలు

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

మీరు ఎంతకాలం పాలించారు అనేది ప్రజలకు ముఖ్యం కాదు, అధికారంలో ఉన్నప్పుడు మీరు ఎలా పాలించారన్నది ముఖ్యం. ఆ పదవీ కాలంలో చేసిన కృషి వల్ల తర్వాతి తరాల జీవితాల్లో ఎలాంటి మార్పు వచ్చిందన్నదాన్ని బట్టి వారి స్థానాన్ని చరిత్ర నిర్ధారిస్తుంది. అతి తక్కువ కాలం ప్రధాని పదవిలో ఉన్నప్పటికీ, అనితరసాధ్యమైన మండల్ రిజర్వేషన్ల అమలుకు పూనుకొని దేశంలోని శూద్ర వర్గాలకు ఎనలేని సేవ చేశారు క్షత్రియుడైన వీపీ సింగ్. ఆయన అలా చేసి ఉండకపోతే, భారతదేశ చరిత్రలో ఒక నిశ్శబ్ద విప్లవం జరిగేది కాదు. అందుకే స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రలో ప్రధానమంత్రిగా ఆయన పాత్రను తిరిగి అంచనా వేయవలసి ఉంది.

జూన్ 25న న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో దివంగత ప్రధాని వీపీ సింగ్ (విశ్వనాథ్ ప్రతాప్ సింగ్: 25 జూన్ 1931 – 27 నవంబర్ 2008) 92వ జయంతి వేడుకల సమావేశాన్ని నిర్వహించేందుకు అనేక సామాజిక న్యాయ అనుకూల సంస్థలు ప్లాన్ చేశాయి. దాదాపుగా మర్చిపోయిన మండల్ మహాపురుషుడు అయిన వీపీ సింగ్ గురించి ఇటువంటి వేడుకలు జరుపుకోవడం ఇదే మొదటిసారి. ఉత్తరప్రదేశ్‌లోని క్షత్రియ రాజ కుటుంబంలో పుట్టి పెరిగిన ఆయన, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాన్ని గుర్తుచేసుకోవడానికి పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, రచయితలు ఈ సమావేశంలో పాల్గొంటారని భావిస్తున్నారు.

తనను తాను ఓబీసీ అని చెప్పుకొన్న నరేంద్ర మోదీ నుంచి అనేక ఇతర ప్రధానమంత్రులను దేశం చూసి ఉన్నందున, స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రలో ప్రధానమంత్రిగా వీపీ సింగ్ పాత్రను తిరిగి అంచనా వేయవలసి ఉంది. అదే రాష్ట్రంలోని భూస్వామ్య పాలక నేపథ్యం ఉన్న యోగి ఆదిత్యనాథ్, రాజ్‌నాథ్ సింగ్ వంటి క్షత్రియ పాలకులతో పోలిస్తే ప్రధానమంత్రిగా వీపీ సింగ్ పాత్రను కూడా మనం పునరావలోకనం చేయాల్సి ఉంది.

మండల్ సిఫారసుల అమలు

ఓబీసీలకు జాతీయ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లను సిఫార్సు చేసిన మండల్ కమిషన్ అమలును సమర్థించడం కోసం ఆనాడు వీపీ సింగ్ చేసిన పోరాటాన్ని చూసిన వ్యక్తిగా... ఆ సమయంలో మోదీ ప్రధానిగా ఉండి ఉంటే వీపీ సింగ్‌లాగా మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి ఉంటారా అని అడగాలనుకుంటున్నాను. అలాగే మండల్ రిజర్వేషన్లతో లబ్ధిదారుడై ప్రధాని అయిన శూద్రుడు దేవేగౌడ అయినా అలా చేసి ఉంటారా అని నేను అడుగుతున్నాను.

నల్లజాతీయుల హక్కుల కోసం నిలబడి, హత్యకు గురవడానికి కూడా అబ్రహం లింకన్ సిద్ధపడిన విధంగా... సామాజిక న్యాయ పరిరక్షణం కోసం ఆనాడు వీపీ సింగ్ తీసుకున్న సైద్ధాంతిక, నైతిక వైఖరిని మరెవరూ తీసుకుని ఉండరు. అబ్రహం లింకన్ అమెరికాలో తన జీవితాన్ని త్యాగం చేయగా, వీపీ సింగ్ మండల్ వ్యతిరేక పాలక శక్తులలో తన స్థానంతోపాటు, ప్రతిష్ఠను కూడా త్యాగం చేశారు. ఆ సమయంలో ఆయనకు బద్ధశత్రువుగా ఉన్న కాంగ్రెస్, అన్ని విధాలా ఆయన పని ముగించడానికి సిద్ధపడింది. వీపీ సింగ్ అధికారాన్ని బీజేపీ కూలదోసిన వెంటనే కాంగ్రెస్ అదే ఉత్తరప్రదేశ్ నుంచి మరో క్షత్రియుడైన చంద్రశేఖర్‌ను ప్రధానిగా తీసుకొచ్చింది. ఆయన తన జీవితమంతా సోషలిస్టుగా నటించారు కానీ బలమైన సామాజిక న్యాయ వ్యతిరేక శక్తిగా మిగిలిపోయారు. 1991లో మరొక కాంగ్రెస్ వ్యక్తి పీవీ నరసింహారావు ప్రధానమంత్రి అయ్యారు. వీపీ సింగ్ తన పదవిని పణంగా పెట్టి ఆ రిస్క్ తీసుకోకపోయి ఉంటే, మండల్ రిజర్వేషన్లను పీవీ అమలు చేసి ఉండేవారని ఎవరూ అనుకోలేరు.



ఆ సమయంలో అనేక ఇతర రాజకీయ శక్తులు మండల్ రిజర్వేషన్ల అమలు కోసం డిమాండ్ చేసిన మాట నిజం. అయితే వీపీ సింగ్ అలా చేసి ఉండకపోతే, భారతదేశ చరిత్రలో ఒక నిశ్శబ్ద విప్లవం జరిగేది కాదు. ఎందుకంటే ఆనాటి శూద్ర ఓబీసీలు ఆ సమయంలో సామాజిక న్యాయానికి సంబంధించిన సైద్ధాంతిక, తాత్విక సమస్యను నిర్వహించడంలో పూర్తిగా అసమర్థులుగా ఉండేవారు. మండల్ రిజర్వేషన్ అమలు కోసం డిమాండ్ చేసి దాన్ని అమలు చేయడానికి ఉత్తర భారతదేశంలో కొంతమంది రాజకీయ నాయకులు ఉండి ఉన్నప్పటికీ, శత్రుత్వంతో కూడిన అధికార నిర్మాణాలు, మీడియా నుంచి పూర్తిగా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న మండల్ రిజర్వేషన్‌ని రక్షించడానికి తగిన మేధో శక్తులు ఆనాటి శూద్ర ఓబీసీలలో లేవు. మీడియాలోని అరుణ్ శౌరీ తరహా సామాజిక న్యాయ వ్యతిరేక శక్తులు, అన్ని పేపర్లు, ఎలక్ట్రానిక్ మీడియా (దూరదర్శన్‌తో సహా) మండల్ రిజర్వేషన్ల అమలుకు వ్యతిరేకంగా ఉన్నప్పుడు వీరంతా ఓబీసీ నాయకులను చాలా తేలికగా కట్టిపడేసేవారు. వారు ద్విజ యువకులను ఆత్మాహుతి చేసుకునేలా పురికొల్పడమే కాకుండా, మండల్ అనుకూల శక్తులను దూషించడం, దాడి చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారు. కమ్యూనిస్టు ద్విజులు కూడా మండల్ రిజర్వేషన్ల అమలుకు వ్యతిరేకంగా ఉండేవారు.

దొరకని జాగా

నేను, నాతోపాటు గెయిల్ ఓంవెద్ వంటి చాలా కొద్దిమంది మండల్ అనుకూల రచయితలు వీపీ సింగ్ విధానానికి మద్దతుగా ఆంగ్లంలో ఒక చిన్న కథనాన్ని కూడా ప్రచురించడానికి స్థలం కోసం కష్టపడాల్సి వచ్చేది. 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' వంటి పత్రికలు మాత్రమే కనీసంగా చోటిచ్చాయి. అప్పట్లో సోషల్ మీడియా అంటూ ఏమీ లేదు. మేము నిస్సహాయంగా ఒంటరిగా ఏడవడం తప్ప ఏమీ చేయలేకపోయాం. కానీ ఏకైక బలం ఏమిటంటే, ఆగస్టు 15న ఎర్రకోట నుండి చేసిన అత్యంత ధైర్యంతో కూడుకున్న ప్రసంగంతో సహా సాధ్యమైన ప్రతి ప్రజా వేదిక నుండి మండల్ రిజర్వేషన్ అమలును వీపీ సింగ్ పట్టువిడవకుండా సమర్థించడమే. ఆయన రాజీనామా లేఖ, తాను రాజీనామా చేయడానికి ముందు దేశాన్ని ఉద్దేశిస్తూ చేసిన ప్రసంగం... ఆయనకు ముందు, ఆ తర్వాత ఉండిన ఇతర ప్రధాన మంత్రులందరినీ అవమానం, అపరాధంతో కూడిన చీకటి మేఘాలలో ఉంచింది. స్వయం ప్రకటిత ఓబీసీగా చెప్పుకొని, ఆ విధంగా మరిన్ని ఓట్లు తెచ్చుకున్న ప్రధాని మోదీ, క్షత్రియ నేపథ్యం ఉన్న వీపీ సింగ్ ఆనాడు సామాజిక న్యాయంపై చేసిన ఆ తాత్విక పరిరక్షణ ఉపన్యాసాలను చదివితే, నిజంగానే తల వంచుకోవాల్సి వస్తుంది. ధైర్యంగా, దృఢనిశ్చయంతో మండల్ రిజర్వేషన్ ని అమలు చేసిన భారతదేశ అసాధారణమైన ప్రధాన మంత్రిగా ఆ వ్యక్తి పేరును మోదీ ఎన్నడూ తలవరు. ఆయన పుట్టిన రోజున ఎప్పుడూ ప్రకటన ఇవ్వరు.

నిశ్శబ్ద విప్లవం

వీపీ సింగ్ ప్రధానమంత్రి పదవిలో ఉన్న ఆ కొంతకాలం (2 డిసెంబర్ 1989 – 10 నవంబర్ 1990), గ్రామాల్లో చెప్పుకొనే ఒక సామెతను గుర్తు చేస్తుంది. 'మీరు ఎంతకాలం పాలించారు అనేది ప్రజలకు ముఖ్యం కాదు, అధికారంలో ఉన్నప్పుడు మీరు ఎలా పాలించారన్నది ముఖ్యం'. వీపీ సింగ్ ఏడాది కంటే తక్కువ పాలనతో పోలిస్తే... నెహ్రూ పదిహేడేళ్ల పాలన, ఇందిరాగాంధీ పద్నాలుగేళ్ల కష్టతరమైన పాలన, ఇప్పుడు మోదీ పదేళ్ల పాలన మసకబారిపోతుంది. ఒక సంవత్సరం కంటే తక్కువ వ్యవధిలోనే, ఐదు వేల సంవత్సరాల దేశ చరిత్రను ఆయన మార్చేశారు.

తీన్ మూర్తి హౌస్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రైమ్ మినిస్టర్ల సంగ్రహాలయంలో వీపీ సింగ్‌కు ఎంత స్థలం కేటాయించారో నాకు తెలియదు. కానీ నెహ్రూ, ఇందిరా గాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్, నరేంద్ర మోదీతో సహా మిగతా ప్రధానులందరికీ లభించినంత స్థలానికి ఆయన పూర్తిగా అర్హులు.

ప్రస్తుత, గత పాలక పార్టీలు ఆయనను మరచిపోవాలని కోరుకున్నప్పుడు ప్రజలు ఆయనను వారి జ్ఞాపకాలలోకి తప్పక తీసుకురావాలి. అంతేకాకుండా ఆయన పుట్టిన రోజును సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకోవడం చాలా ముఖ్యం. సామాజిక న్యాయ రాష్ట్రంగా ఉంటున్న తమిళనాడు దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ వీపీ సింగ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో అలాంటి ప్రయత్నాలు తప్పక జరగాలి.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా


మారిన కథనం



ఇరవై ఏళ్ల క్రితం భారత ప్రధాన మంత్రులు యూఎస్ పర్యటించినప్పుడు కశ్మీర్, పాకిస్తాన్ పతాక శీర్షికల్లో ఉండేవి. ఇప్పుడంతా వ్యాపారం, టెక్నాలజీ, అవును, చైనా కూడా. ఎజెండా మారిపోయింది.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

కొడితే కొట్టాలిరా...



మన మూలాల్లోకి వెళ్లి, ముడివర్కవుట్లు ప్రయత్నించాను. కట్టెలు కొట్టడం అనేది మంచి వ్యాయామ రూపం. శరీర పైభాగం మొత్తం ప్రభావితమవుతుంది. ఎప్పుడైనా ప్రయత్నించి చూడండి, మీకు నచ్చుతుంది.

– సంజయ్ దత్, నటుడు

బేరీజు వేయాలి



లాక్‌డౌన్ల వల్ల కలిగిన నష్టాలను చర్చించడానికి తిరస్కరించడమంటే, మనం అవే తప్పుల్ని మళ్లీ చేసే ప్రమాదం ఉంది. ఈ సంవత్సరమో, వచ్చే సంవత్సరమో కాకపోవచ్చు– కానీ తర్వాతి భయోత్పాతం సంభవించినప్పుడు లాక్‌డౌన్లు విధించాలన్న పిలుపులు మళ్లీ ఊపందుకుంటాయి. అందుకే ఆ చర్చ ఇప్పుడే జరగాలి.

– కరోల్ సైకోరా, డబ్ల్యూహెచ్‌ఓ క్యాన్సర్ ప్రోగ్రామ్ మాజీ డైరెక్టర్

ఆ కత్తులు వేరే!



అదేపనిగా 'మాస్టర్‌షెఫ్ ఆస్ట్రేలియా' చూసిన తర్వాత, నేను కూడా కూరగాయల్ని వాళ్లలా స్టైలుగా చకచకా కోయడానికి ప్రయత్నించాను. కానీ నా చాకు బుధవారం మార్కెట్లో ఇరవై రూపాయలకు కొన్నది అన్న విషయం మరిచిపోయాను.

– రీతూపర్ణా ఛటర్జీ, జర్నలిస్ట్

నవ్వాల్సినవి వేరే!



ప్రధాన మంత్రి మోదీ ఆంగ్ల ఇబ్బంది మీద జోకులు వేయడం మంచి అభిరుచి కాదు. ఇంకెవరి విషయంలోనైనా అదే వర్తిస్తుంది. జవాబుదారీగా నిలబెట్టాల్సిన ఆయన నిశ్శబ్దాలు, ప్రసంగాలు ఎన్నో ఉన్నాయి – ఆయన మాటల్లో, చేతల్లో విషయం లేకపోవడంతో సహా!

– నితిన్ సేఠీ, జర్నలిస్ట్

విభజన తీరు



హిందుస్థాన్‌ను మౌంట్ బాటన్ విభజించారు. 1947 జూన్ 2 నాటి తన 'ఫర్మానా'లో హిందూ ఇండియా (భారత్), ముస్లిం పాకిస్తాన్ ఉంటాయన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ స్వచ్ఛందంగా ముస్లింలు భారత్‌లో ఉండొచ్చని ప్రకటించింది. అందువల్ల భారత్‌లోని ముస్లింలు హిందూ సంస్కృతిని అంగీకరిస్తారనేది అంచనా!

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

ఇలాగైతే బాధ ఉండదా?



మెడిసిన్ వైపు రాని, సప్లిమెంటరీలతో గట్టెక్కిన నా మొద్దుసుద్దలైన బ్యాచ్‌మేట్లు కూడా చక్కగా ఉద్యోగాలు చేస్తూ, హిల్ స్టేషన్లలో సెలవులు ఎంజాయ్ చేస్తున్నారు. స్కూల్ టాపర్లలో ఒకడినైన నేనేమో ఇంకా తరగతులకు హాజరవుతూ, అమ్మానాన్న డబ్బుల మీద ఆధారపడుతున్నాను. మళ్లీ జనమేమో మెడికల్ విద్యార్థులకు డిప్రెషన్ ఎందుకు అని అడుగుతుంటారు.

– హార్దిక్ దశోరా, ఎంబీబీఎస్ విద్యార్థి

ఎటు దిక్కు సూడాల్నో ఎర్కలేక...

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల దీపాలు ఎల్గినయి. గా దినం ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ.

''పదేండ్ల పండ్గ జేస్కుంట గీ నడ్మ నీల్ల పండ్గను జేసింద్రు'' అని యాద్గిరి అన్నడు.

''నీల్ల పండ్గ అంటె ఏంది?'' అని సత్నారి అడిగిండు.

''అందరికి మంచి నీల్లు ఇచ్చుడు.''

''సెక్రెటేరియట్ల నీల్లు రాకపోవుడు నీల్ల పండ్గ గాదా?''

''ఎందుగ్గాదు. గది మంచినీల్ల పెద్ద పండ్గ.''

''జగిత్యాల జిల్లల మంచినీల్లు వొస్తలేవను కుంట కాలి బిందెలతోని ఆడోల్లు దర్న జేసుడు నీల్ల పండ్గ గాదా?''

''ఎందుగ్గాదు. గది గుడ్క నీల్ల పండ్గనే.''

''పట్నంల నీల్ల పైపులు బల్గి గలీజునీల్ల తోని మంచినీల్లు దోస్తి జేసుడు నీల్ల పండ్గ గాదా?''

''నీల్ల పండ్గనే.''

''సర్కారి కొల్వులు తక్వైతున్నయని రాహుల్ గాంధి అన్నడు.''

''పార్లమెంటుల కాంగ్రెస్ కొల్వులు తక్వైనయి అనబోయి గాయిన సర్కారి కొల్వులు అని అన్నట్లు గొడ్తున్నది.''

''ఎల్‌బి స్టేడియంల ఆటలే ఆడాలె. ఎసు వంటి మీటింగ్‌లు జెయ్యొద్దు. ఒగాల్ల మీటింగ్‌లు గిన బెడ్తిరా అంటే తోక హర్తాల్ జేస్త అని హన్మంత రావు అన్నడు గదా.''

''అవ్ అన్నడు.''

''ఒగాల్ల రాహుల్ గాంధి, ప్రియాంక గాంధి ఎల్‌బి స్టేడియంల మీటింగ్లు బెడ్తె ఏమంటడు?''

''తోక ముడ్సుకుంటడు.''



''నాసిక్‌ల ఉల్లిగడ్డలు ఎక్వ పండుతయి. గా ఉల్లి గడ్డలను ఎక్వ దరకు కొనుమని తెలంగాన యాపారులకు బీఆర్ఎస్ జెప్పున్నది.''

''ఎక్వ దరెందుకు?''

''యాపారులు ఎక్వ దరకు ఉల్లిగడ్డలు గొంటె గవ్విటి దరలు బెర్గుతయి. దరలు బెర్గితె ఉల్లిగడ్డలు కొయ్యకుంటనే జెనం కండ్ల కెల్లి నీల్లొస్తయి. ఇగ దాంతోని జెనం సంటర్ల ఉన్న బీజేపీ సర్కార్‌ను దించుతరని బీఆర్ఎస్ అనుకుంటున్నది.''

''సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికి టికిట్లు ఇస్తనని ముందుగాల కేసీఆర్ అన్నడు. గని అటెంకల సర్వే జేపిచ్చినంక సిట్టింగ్ లందర్కి టికిట్లు ఇచ్చేటి సవాల్ లేదని జెప్పిండు.''

''ముక్యమంత్రి మాట బద్లాయిస్తె బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఏంజేసింద్రు?''

''కొంతమంది రేవంత్ రెడ్డిని గల్సింద్రు.''

''గాయినను గల్సుడు ఎందుకు?''

''గాల్లు గాయినను గల్సినంకనే దమ్ముంటి సిట్టింగ్ ఎమ్మెల్యేలందర్కి కేసీఆర్ టికిట్లు ఇయ్యాలని రేవంత్ రెడ్డి అన్నడు.''

''ఎప్పుడు నిజమే జెప్త. అబద్దం అసల్ జెప్ప అని ఎంపి సోయం బాపూరావు అన్నడు గని గాయిన జెప్పిన దాంట్ల ఏది నిజమో ఏది అబద్దమో ఎర్కైత లేదు.''

''బాపూరావు ఏమన్నడు?''

''నాకు ఇల్లు లేదు. ఎంపీకి సొంత ఇల్లు లేకుంటె బాగుండదని ఎంపీ నిదుల తోని ఇల్లు గొన్న. నా కొడ్కు పెండ్లి ధూమ్ దామ్గ జేసిన. నా లెక్క నిజం జెప్పేటి దమ్ము ఏ లీడర్ కన్న ఉన్నాదా? అని అడిగిండు. కొన్ని దినాలైనంక ఎంపీ నిదులు వాడుకున్న అని నేను అనలేదు. బీఆర్ఎస్ లీడర్లే నా మీద బుర్ధ సల్లింద్రు అని అన్నడు.''

''కోట్ల రూపాయలు కర్సు జేసి కోట్ల మొక్కలను ఎందుకు బెడుతున్నరు?''

''కూరగాయల దరలను తక్వ జేసె తందుకు.''

''యోగా దినం నాడు జెనం ఏ ఆసనం ఏస్తున్నరు?''

''తల్కాయ కిందికి కాల్లు మీదికి జేసి ఉల్టపల్ట ఆసనం ఏస్తున్నరు.''

''దునియ దేశాలన్ని మన దేశం దిక్కు సూస్తున్నయని ప్రదాని మోదీ అంటున్నడు. రాస్ట్రాలన్ని తెలంగాన దిక్కు సూస్తున్నయని ముక్యమంత్రి కెసిఆర్ అంటున్నడు. ఎటు దిక్కు సూడాల్నో ఎర్కలేక జెనమే దిక్కులేనోల్లు అయ్యింద్రు.''

గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టింద్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

వైద్యం కాదు... వ్యాధి నివారణ ముఖ్యం

జబ్బు చేశాక వైద్యం చేసుకోవడం మంచిదా, అసలు జబ్బే చేయకుండా నివారించుకోవడం మంచిదా అనే ప్రశ్న తలెత్తినప్పుడు అందరూ నివారణ వైపే మొగ్గు చూపుతారు. చికిత్స కంటే నివారణ మెరుగనే నానుడి ఎప్పటినుంచో ప్రాచుర్యంలో ఉన్నదే కదా. ఒక వ్యక్తికి ఎలాంటి జబ్బు చేసిందనే దానికంటే ఆ జబ్బు ఎలాంటి వ్యక్తికి వచ్చిందనే అంశం కూడా ఈ ప్రశ్నని మరో కోణం నుంచి చూస్తుందని విలియం ఓస్లేర్ ఎంతో చక్కగా వివరించారు.

వ్యాధులను పరిశోధించడం, వాటి కారణాలను అన్వేషించడం, వాటికి తగిన చికిత్సని కనుగొనడం అనే ప్రక్రియలో తేలిన నిజం ఏమిటంటే... త్వరిత గతిన వ్యాధిని నిర్ధారించి, మంచి చికిత్సను అందించినంత మాత్రాన జబ్బులను నిర్మూలించలేం. కానీ, నివారణ చర్యలవల్ల వ్యాధులను రూపుమాపవచ్చు. ఈ విషయాన్ని మనం మశూచిని నిర్మూలించడం ద్వారా నిరూపించాము. ఇటీవల పోలియో వ్యాధి విషయంలో కూడా ఇది రుజువయింది. చైనా విముక్తి చెందిన కొత్తలో, కాలవల వెంట నత్తలు పట్టుకుంటూ, వీధుల్లో ఈగల్ని చంపుతూ అక్కడ ప్రజలు విడ్డూరంగా ప్రవర్తిస్తున్నారనే వార్తలు వచ్చాయి. షిస్టోసోమియాసిస్, కలరా, టైఫాయిడ్, అతిసారం వంటి వ్యాధుల నివారణకు అలా చెయ్యమని చైనా ప్రభుత్వమే ప్రజలను ప్రోత్సహించింది. దీంతో చైనాలో శాశ్వతంగా షిస్టోసోమియాసిస్‌ను నిర్మూలించగలిగారు. ఒక్క నివారణ చర్య యాభై రకాల చికిత్సా విధానాలకు సమానం.

మన దేశంలో మన తల్లిదండ్రుల కాలం వరకు శారీరక శ్రమకి ప్రాధాన్యత ఉండేది. కానీ పట్టణీకరణ పెరిగే కొద్దీ, కూర్చొని చేసే ఉద్యోగాల శాతం పెరుగుతోంది. దాని వల్ల అనేక జీవనశైలి అనారోగ్యాలు ముప్పిరిగొంటున్నాయి. మన శరీర కణాలు తరతరాల శ్రమకి అలవాటు పడి, ఆహారాన్ని నిల్వ ఉంచుకుని, శక్తిని అందించే విధంగా రూపుదిద్దుకున్నాయి. ఇప్పుడు, ఆ కణాలు అలాగే ఉండిపోయాయి. అయితే మనం ఆకలి వేస్తే తినడం కాక, ఆహారం కనిపించగానే తినేయడం వల్ల, ఆ అధిక కేలరీలన్నీ ఈ కణాల్లో పేరుకుపోయి, బరువు పెరగడం, బీపీ, షుగర్లు పెరగడం, గుండె జబ్బులు సంభవించడం జరుగుతోంది.



దీన్నే 'మెటబాలిక్ సింద్రోమ్' అంటారు. దీన్ని నివారించాలంటే, మన జీవన శైలిని మార్చుకోవాలి. ఆహారాన్ని మితంగా టైమ్ ప్రకారం తీసుకోవాలి. కొవ్వు, మాంసం, పొగాకు, మద్యం వంటివాటి వినియోగం తగ్గించాలి. వారానికి కనీసం ఐదు రోజులు నడవాలి, వ్యాయామం చేయాలి. అలా జీవనశైలి వ్యాధులను నివారించవచ్చు. 'మనలో ఉండే ప్రకృతి సిద్ధమైన అంశాలే మనల్ని నియంత్రిస్తాయి, నయం చేస్తాయి' అనే హిపోక్రటిస్ మాటలూ; 'ప్రతి వ్యక్తీ తన ఆరోగ్యానికీ, అనారోగ్యానికి కూడా తానే కారకుడు' అనే గౌతమ బుద్ధుని మాటలు ఈ సందర్భంగా గమనార్హం.

అంటువ్యాధులను పరిశుభ్రత ద్వారా, టీకాల ద్వారా, శుభ్రమైన తాగునీటి ద్వారా, తాజా ఆహారం ద్వారా, గృహ వసతి ద్వారా, పరిసరాల శుభ్రత ద్వారా నివారించవచ్చు. మెరుగైన మానవ సంబంధాలు, ఆనందమయమైన కుటుంబ సంబంధాలు, ఉద్యోగ భద్రతల ద్వారా మానసిక వ్యాధులను, ఆత్మహత్యలను నివారించవచ్చు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంవల్ల శ్వాసకోశ వ్యాధులను అరికట్టవచ్చు. గర్భిణీ స్త్రీల పరిరక్షణవల్ల మాతా శిశు సంరక్షణ గావిస్తూ, పుట్టే పిల్లలకు బంగారు బాటలు వేయవచ్చు. ప్రతి ఆడపిల్లను అన్ని దశల్లో కాపాడుకుంటూ, స్త్రీల వ్యాధులను నివారించవచ్చు.

ఇలాంటి అవగాహన కల్పించడం కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన ఫ్యామిలీ ఫిజీషియన్లు ఉమ్మడిగా తమ మొదటి మహాసభలను జూన్ 24, 25 తేదీల్లో హైదరాబాద్ గ్రీన్ పార్క్ హోటల్లో జరుపుకుంటున్నారు. అనేక నివారణ అంశాలపై కూలంకషమైన చర్చ జరపడం కోసం, 'వైద్యంలో వ్యాధి నిరోధక సేవలు – ఫ్యామిలీ డాక్టర్ల పాత్ర' అనే మూలాంశంపై అనేక పత్రాలు సమర్పించి, చర్చ జరపబోతున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి చర్చలు ఎంతో అవసరం.


– డాక్టర్ టి. నళిని, డాక్టర్ వి. శ్రీనివాస్
ఫ్యామిలీ మెడిసిన్ నిపుణులు


DMart®
Daily Discounts Daily Savings
మీ కాలేజ్
చదువును స్టైల్‌గా
ప్రారంభించండి
కనీసం 6% డిస్కౌంట్
కాలేజ్ మర్చండైస్
ఎంఆర్‌పిపై 20%-30% తగ్గింపు బ్రాండెడ్ నోట్‌బుక్‌లు
ఎంఆర్‌పిపై కనీసం 20% తగ్గింపు పెన్నులు
₹299# నుంచి కాలేజ్ బ్యాగులు
₹399# నుంచి లాప్ టాప్ బ్యాగులు
₹149# నుంచి లంచ్ బాక్స్ + వాటర్ బాటిల్ కాంబో
₹359# నుంచి ట్రిమ్మర్
₹399# నుంచి హెయిర్ డ్రైయర్
₹349# మాత్రమే ఫుట్ బాల్ ఎంఆర్‌పి ₹470
₹199# నుంచి స్టీల్ బాటిల్
₹449# నుంచి జీల్ రెయిన్ సూట్
₹229# నుంచి అంబ్రెల్లా
SUN Umbrellas
John's
₹229* నుంచి మెన్స్ క్లాగ్ 1 జత
డైలీ ఎసెన్షియల్స్
₹85* మాత్రమే సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్ జీడిపప్పు మరియు బాదం 584 గ్రాములు ఎంఆర్‌పి ₹130
₹395* మాత్రమే బ్రూక్ బాండ్ తాజ్ మహల్ టీ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹435
₹350* మాత్రమే కెల్లాగ్స్ ముయెస్లీ ఫ్రూట్ అండ్ నట్ 750 గ్రాములు ఎంఆర్‌పి ₹480
₹220* మాత్రమే బూస్ట్ ప్యాక్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹249
₹225* మాత్రమే కాంటినెంటల్ ఎక్స్‌ట్రా కాఫీ జార్ 200 గ్రాములు ఎంఆర్‌పి ₹360
₹92* మాత్రమే మ్యాగీ మసాలా నూడుల్స్ 560 గ్రాములు ఎంఆర్‌పి ₹112
₹159* మాత్రమే లోట్టే చోకో పై బిస్కెట్ 504 గ్రాములు ఎంఆర్‌పి ₹220
కొనండి 1 పొందండి 1 ఉచితంగా పార్క్ అవెన్యూ వాయేజ్ పెర్ఫ్యూమ్ స్ప్రే 220 మి.లీ ఎంఆర్‌పి ₹390
కొనండి 1 పొందండి 1 ఉచితంగా మీరా స్ట్రాంగ్ అండ్ హెల్తీ షాంపూ 650 మి.లీ ఎంఆర్‌పి ₹699
₹207* మాత్రమే మామ ఎర్త్ ఉబ్టాన్ టెర్మెరిక్ మరియు సాఫ్రాన్ ఫేస్ వాష్ 100 మి.లీ ఎంఆర్‌పి ₹259
₹150* మాత్రమే ఫాగ్ మార్కో 1000 స్ప్రే 150 మి.లీ ఎంఆర్‌పి ₹275
₹199* మాత్రమే స్టేఫ్రీ సెక్యూర్ ఎక్స్‌ట్రా లార్జ్ 40 ప్యాడ్‌లు ఎంఆర్‌పి ₹260
గ్రోసరీ
₹49* మాత్రమే లూస్ సోనా మసూరి కర్నూల్ రైస్ 1 కిలో
₹29* మాత్రమే లూస్ గోధుమ పిండి 1 కిలో
₹39* మాత్రమే లూస్ చిన్న చక్కెర 1 కిలో
₹115* మాత్రమే లూస్ మిరియాలు 1 కిలో
₹62* మాత్రమే లూస్ చనా దళ్ 1 కిలో
₹92* మాత్రమే లూస్ బిర్యానీ రైస్ 1 కిలో
అప్పారెల్స్
₹199# నుంచి లేడీస్ ఎథినిక్ షార్ట్ /లాంగ్ కుర్తా
₹99# నుంచి లేడీస్ దుపట్టా/స్టోల్
₹199# నుంచి లేడీస్ అంకిల్ కాటన్ స్ట్రెచ్ లెగ్గింగ్
₹499# నుంచి లేడీస్ డ్రెస్సెస్
₹99# నుంచి లేడీస్ టీ-షర్ట్
₹149# నుంచి లేడీస్ టాప్
₹349# నుంచి లేడీస్ డెనిమ్/జెగ్గింగ్
₹99# నుంచి లేడీస్ కాజ్యువల్ లోయర్
₹199# నుంచి లేడీస్ సాండల్స్
₹299# నుంచి మెన్స్ షూస్
₹99# నుంచి మెన్స్ ఫాన్సీ టీ-షర్ట్
₹199# నుంచి మెన్స్ కాజ్యువల్ ఫార్మల్ షర్ట్
₹349# నుంచి మెన్స్ ఫార్మల్ ట్రౌజర్ /జీన్స్
₹399# నుంచి మెన్స్ కాటన్ చినోస్
₹99# నుంచి బెల్ట్స్
₹149# నుంచి మెన్స్ ఫాషన్ షర్ట్స్
ఎంఆర్‌పిపై కనీసం 25% తగ్గింపు అన్ని బ్రాండెడ్ పురుషుల అండర్ గార్మెంట్స్
ట్రెండింగ్ వార్డ్‌రోబ్ లుక్స్
మెన్స్ క్యారెక్టర్ టీ-షర్ట్ @ ₹199# నుంచి
మెన్స్ కాజ్యువల్ షర్ట్స్ @ ₹499# నుంచి
మెన్స్ ఫాషన్ జీన్స్ @ ₹699# నుంచి
లేడీస్ ఫాషన్ టీ-షర్ట్ అండ్ టాప్స్ @ ₹199# నుంచి
లేడీస్ కాజ్యువల్ బాటమ్ వేర్ @ ₹299# నుంచి
లేడీస్ డ్రెస్సెస్ @ ₹499# నుంచి
లేడీస్ ఫాషన్ జీన్స్@ ₹499# నుంచి
• రామంతపూర్: 040-33457200 • ఉప్పల్ భాగ్: 9154846426 • మేడిపల్లి: 7337325489 • ఉప్పల్ రంగారెడ్డి : 040-29331007 • బండ్లగూడ: 040-29556703 • సనత్‌నగర్: 040-33235100 • బాలానగర్: 040-23075362 మూసాపేట్: 040-23866770 • కొంపల్లి: 0841-8332100
• అంబర్‌పేట: 040-30853500 • హైదర్‌గూడ(హిమాయత్ ఎన్‌జిఆర్): 040-23298560 • కాచిగూడ: 040-29550956 • మదీనాగూడ (మియాపూర్): 040-23047281 • ఆర్‌సి పురం: 08455-297917 నల్లగండ్ల: 040-29568265 • హఫీజ్‌పేట: 040-48540013
• కూకట్‌పల్లి (ఎన్‌ఎస్‌ఎల్): 040-39911700 / 29568182 • షేక్‌పేట (టోలి చౌకి): 040-30102100/ 7207851378 • కావేరి హిల్స్: 040- 23119921 • ఉప్పర్‌పల్లి (అత్తాపూర్): 040-29705890 • బోవెన్‌పల్లి: 040-46014924 ఎస్.డి. రోడ్ (సికింద్రాబాద్): 040 27718045 • కుషాయిగూడ: 040-29707831
• సఫీల్‌గూడ: 040-27130120 • వనస్థలిపురం: 040-29882486 • చంపాపేట్: 040-39911800 • మలక్ పేట: 040-33503900 • ఎల్ బి నగర్: 040-33203801 • ఘట్కేసర్: 7382054232 • గుల్బర్గా కర్ణాటక: 08472-200016 • సూర్యాపేట: 8684293301 • వరంగల్: 0870-3025200
• కడిపికొండ (కాజీపేట): 0870-4055954 • లక్ష్మీపురం వరంగల్- 2: 0870-2959001 • కరీంనగర్: 0878-2228100 • కర్నూలు: 08518-256670 అనంతపూర్: 08554-249981 • మంచిర్యాల ఆదిలాబాద్: 08736-295800
1N
Impulse/06/23

భారత్ అభివృద్ధే ప్రపంచాభివృద్ధి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ

- త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
- ఇండో–పసిఫిక్‌పై బలప్రయోగం, ఘర్షణ నీలినీడలు ప్రసరిస్తున్నాయి
- అమెరికా కాంగ్రెస్‌లో ప్రధాని మోదీ ప్రసంగం


కాంగ్రెస్‌లో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ, వెనుక కమలా హ్యారిస్, హౌస్ స్పీకర్ కెవిన్ మెక్‌కార్తీ

వాషింగ్టన్: మానవాళికి ముప్పుగా పరిణమించిన ఉగ్రవాదాన్ని కఠినంగా అణచివేయడంలో 'అయితే, కానీ'లకు ఎంతమాత్రం తావులేదని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తేల్చి చెప్పారు. కొన్ని దేశాల్లో ప్రభుత్వాలే ఉగ్రవాదాన్ని నిస్సిగ్గుగా ప్రోత్సహిస్తున్నాయని పరోక్షంగా పాకిస్తాన్‌పై మండిపడ్డారు. ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు. ప్రధాని మోదీ గురువారం వాషింగ్టన్ డీసీలో అమెరికా కాంగ్రెస్ (పార్లమెంట్) ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. దాదాపు 60 నిమిషాలపాటు మోదీ ప్రసంగం కొనసాగింది. పార్లమెంట్ సభ్యులు, సెనేటర్లతోపాటు సందర్శకుల గ్యాలరీల నుంచి వందలాది మంది భారతీయ–అమెరికన్లు మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. అమెరికాలో 9/11 దాడులు జరిగి రెండు దశాబ్దాలు, భారత్‌లో 26/11 దాడులు జరిగి దశాబ్దం పూర్తయినా ఉగ్రవాదం, తీవ్రవాదం ప్రపంచానికి ఇప్పటికీ సవాలు విసురుతూనే ఉన్నాయని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. మతి తప్పిన సిద్ధాంతాలు కొత్తరూపును, కొత్త గుర్తింపును సంతరించుకుంటున్నాయని, అయినప్పటికీ వాటి ఉద్దేశాలు మాత్రం మారడం లేదని ఆక్షేపించారు. ఉగ్రవాదం ప్రపంచ మానవాళికి ముమ్మాటికీ శత్రువేనని స్పష్టం చేశారు. ముష్కర మూకలను అణచివేయడంలో ఎవరూ రాజీ పడొద్దని సూచించారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తూ పొరుగు దేశాలను ఎగుమతి చేస్తున్న దుష్ట దేశాలకు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ ఏం మాట్లాడారంటే..

భారీగానే కాదు.. వేగంగానూ అభివృద్ధి

''గత దశాబ్ద కాలంలో వంద మందికిపైగా అమెరికా పార్లమెంట్ సభ్యులు భారత్‌లో పర్యటించారు. భారతదేశ అభివృద్ధిని తెలుసుకోవాలని, అక్కడి ప్రజాస్వామ్యాన్ని, వైవిధ్యాన్ని అర్థం చేసుకోవాలని అందరూ కోరుకుంటున్నారు. భారత్ ఇప్పుడేం చేస్తోంది? ఎలా చేస్తోంది? అన్నదానిపై అందరికీ ఆసక్తి ఉంది. ప్రధానమంత్రి హోదాలో అమెరికాలో నేను మొదటిసారి పర్యటించినప్పుడు భారత్ ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేది. ఇప్పుడు ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతోంది. మేము భారీగానే కాదు, వేగంగానూ అభివృద్ధి సాధిస్తున్నాం. భారత్ ప్రగతి సాధిస్తే మొత్తం ప్రపంచం ప్రగతి సాధిస్తుంది. అన్నింటికంటే ముఖ్యమైన విషయం .. భూగోళంపై ఆరింట ఒక వంతు జనాభా భారత్‌లోనే ఉంది.

ఇండో–పసిఫిక్‌లో స్థిరత్వాన్ని కోరుకుంటున్నాం..

వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని ఐక్యరాజ్యసమితి చార్టర్ సూచిస్తోంది. ప్రపంచ క్రమాన్ని(గ్లోబల్ ఆర్డర్) అన్ని దేశాలూ అనుసరించాలి. చార్టర్‌ను గౌరవించాలి. కానీ, ఇండో–పసిఫిక్‌పై బలప్రయోగం, ముఖాముఖీ ఘర్షణ అనే నీలినీడలు ప్రసరిస్తున్నాయి. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వాన్ని కోరుకుంటున్నాం. భారత్–అమెరికా భాగస్వామ్యానికి ఇది కూడా ఒక ప్రాధాన్యతాంశమే. స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్ ఆవశ్యకతపై అమెరికాతో మా అభిప్రాయాలు పంచుకున్నాం. ఈ ప్రాంతంలో శాంతి, సౌభాగ్యం పరిఢవిల్లాలన్నదే మా ఆకాంక్ష. ఇందుకోసం ప్రాంతీయ, అంతర్జాతీయ సంస్థలతో, భాగస్వాములతో కలిసి పనిచేస్తున్నాం. 'క్వాడ్' వంటి కూటములు ఈ ప్రయత్నంలో ఒక భాగమే. ఇండో–పసిఫిక్ బాగు కోసం క్వాడ్ కృషి చేస్తోంది. ఉక్రెయిన్ సంఘర్షణ ఆసియా ప్రాంతంలో సమస్యలు సృష్టించిన మాట వాస్తవమే. ఇది యుద్ధాల శకం కాదని, చర్చలు, దౌత్యమార్గాల్లో వివాదాలను పరిష్కరించుకోవాలని సూటిగా చెప్పా.

ఇదొక గొప్ప గౌరవం

140 కోట్ల మందికి ప్రాతినిధ్యం వహిస్తూ అమెరికా పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. రెండుసార్లు ఈ అవకాశం దక్కడం గర్వకారణం. మనం ఒక ముఖ్యమైన కూడలిలో ఉన్నాం. గత కొన్నేళ్లుగా కృత్రిమ మేధ(ఏఐ)లో ఎన్నో ఆవిష్కరణలు వెలుగులోకి వస్తున్నాయి. అదేసమయంలో మరో ఏఐ(అమెరికా, ఇండియా)లో మరిన్ని ముఖ్యమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ శతాబ్దం ఆరంభంలో రక్షణ సహకారం విషయంలో మనం(భారత్, అమెరికా) అపరిచితులమే. పెద్దగా రక్షణ సహకారం లేదు. కానీ, ఇప్పుడు భారత్‌కు అమెరికా అత్యంత కీలకమైన రక్షణ భాగస్వామిగా మారింది.

75 ఏళ్ల స్వాతంత్య్ర ప్రయాణం

ప్రజాస్వామ్య వ్యవస్థకు భారత్ తల్లిలాంటిది. భారత్, అమెరికా అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలుగా వర్ధిల్లుతున్నాయి. సమానత్వం, ప్రజల గౌరవానికి స్ఫూర్తినిచ్చేదే ప్రజాస్వామ్యం. ఆలోచనకు, వ్యక్తీకరణకు రెక్కలు తొడిగేది ప్రజాస్వామ్యం. ప్రాచీన కాలం నుంచి ప్రజాస్వామ్య విలువలకు భారత్ ఆయువుపట్టుగా నిలుస్తోంది. వెయ్యి సంవత్సరాల పరాయి పాలన తర్వాత భారత్ స్వేచ్ఛావాయువులు పీల్చుకుంది. 75 ఏళ్ల స్వాతంత్య్ర ప్రయాణాన్ని పండుగలా జరుపుకుంది. ఇది కేవలం ప్రజాస్వామ్య ఉత్సవం కాదు, వైవిధ్య వేడుక. సామాజిక సాధికారత, ఐక్యత, సమగ్రత వేడుక.

డిజిటల్ చెల్లింపుల అడ్డా భారత్

యువ జనాభా అధికంగా ఉన్న ప్రాచీన దేశం భారత్. సంప్రదాయాలకు పెట్టింది పేరు భారత్. నేటి యువత భారత్‌ను టెక్నాలజీ హబ్‌గా మారుస్తున్నారు. భారత్‌లో డిజిటల్ చెల్లింపులు వేగంగా వృద్ధి చెందుతున్నాయి. దేశంలో ప్రత్యక్ష నగదు బదిలీల విలువ 320 బిలియన్ డాలర్ల మార్కును దాటింది. ఈ ప్రక్రియలో 25 బిలియన్ డాలర్లు ఆదా చేశాం. భారత్‌లో ఇప్పుడు అందరూ స్మార్ట్‌ఫోన్ల ద్వారానే చెల్లింపులు చేస్తున్నారు. వీధి వ్యాపారులు సైతం యూపీఐ సేవలను వాడుకుంటున్నారు. గత ఏడాది ప్రపంచంలో జరిగిన ప్రతి 100 రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో 46 చెల్లింపులు భారత్‌లోనే జరిగాయి. వేలాది మైళ్ల పొడవైన ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు, చౌక డేటాతో భారత్‌లో సాంకేతిక విప్లవం కొనసాగుతోంది.

సంస్కరణల సమయమిది..

ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు చేపట్టాల్సిన తరుణం వచ్చింది. ప్రపంచం మారుతోంది. అంతర్జాతీయ సంస్థలూ మారాల్సిందే. భారత్–అమెరికా మరింత సన్నిహితమవుతున్నాయి. పరస్పర సంబంధాల విషయంలో నూతన ఉషోదయం కనిపిస్తోంది. భారత్–అమెరికా సంబంధాలు కేవలం ఈ రెండు దేశాలనే కాదు, ప్రపంచ భవితవ్యాన్ని కూడా నిర్ధారిస్తాయి. మహాత్మా గాంధీ, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌తోపాటు స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం కోసం పోరాడినవారిని మేమే స్మరించుకుంటున్నాం. భారత్‌లో 2,500కు పైగా రాజకీయ పార్టీలు ఉన్నాయి. వివిధ రాష్ట్రాలను 20 వేర్వేరు పార్టీలు పరిపాలిస్తున్నాయి. దేశంలో 22 అధికార భాషలున్నాయి. వేలాది యాసలున్నాయి. కానీ, మేమంతా ఒకే స్వరంతో మాట్లాడుతాం. ప్రపంచంలోని అన్ని నమ్మకాలు, విశ్వాసాలకు భారత్‌లో స్థానం ఉంది, వాటిని గౌరవిస్తున్నాం. వైవిధ్యం అనేది భారత్‌లో ఒక సహజ జీవన విధానం. అమెరికా పార్లమెంట్‌లో భారతీయ–అమెరికన్ల సంఖ్య పెరుగుతోంది. ఈ సభలో సమోసా కాకస్ ఫ్లేవర్ ఉంది. ఇది మరింత విస్తరించాలి. భారత్‌లోని భిన్న రుచులు ఇక్కడ ఉండాలని కోరుకుంటున్నా'' అని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

మహిళల సారథ్యంలో అభివృద్ధి

ప్రాచీన కాలం నాటి వేదాలు నేటి మానవాళికి గొప్ప నిధి లాంటివి. మహిళా రుషులు సైతం వేదాల్లో ఎన్నో శ్లోకాలు, పద్యాలు రాశారు. ఆధునిక భారతదేశంలో మహిళలు ఉజ్వలమైన భవిష్యత్తు దిశగా ప్రజలను ముందుకు నడిపిస్తున్నారు. దేశంలో మహిళల సారథ్యంలో అభివృద్ధి జరగాలన్నదే మా ఆకాంక్ష. గిరిజన తెగకు చెందిన ఓ మహిళ దేశానికి రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. దేశవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో 10.5 లక్షల మంది మహిళలు వివిధ పదవులు చేపట్టారు. సైన్యం, నావికాదళం, వైమానిక దళంలోనూ విశేషమైన సేవలు అందిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక శాతం మహిళా పైలట్లు ఉన్న దేశం భారత్. అంగారక గ్రహంపైకి మనుషులను చేర్చేందుకు చేపట్టిన మార్స్ మిషన్‌లో మహిళామణులు పనిచేస్తున్నారు. మహిళలకు సాధికారత కల్పిసే సమూల మార్పులు రావడం ఖాయం. ఆడపిల్లల చదువులు, వారి ఎదుగుదల కోసం పెట్టుబడి పెడితే వారు మొత్తం కుటుంబాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తారు.


విందుకు హాజరైన ముకేశ్ అంబానీ, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ దంపతులు

నాటు నాటుకి అమెరికన్ యువత స్టెప్పులు

- వైట్‌హౌస్ అధికారిక విందులో ప్రధాని మోదీ
- సరదా సంభాషణలతో సాగిన విందు సమావేశం
- ముకేశ్ అంబానీ, సుందర్ పిచాయ్ తదితరులు హాజరు

వాషింగ్టన్: అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గౌరవార్థం అధ్యక్షుడు జో బైడెన్, ఆయన సతీమణి జిల్ బైడెన్ ఏర్పాటు చేసిన అధికారిక విందు సరదా సంభాషణలతో సందడిగా సాగింది. వైట్‌హౌస్ నార్త్ లాన్‌లో గురువారం రాత్రి ఈ విందుకు 400 మందికిపైగా అతిథుల్ని ఆహ్వానించారు. పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, ఆనంద్ మహీంద్ర, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, యాపిల్ సీఈఓ టిమ్ కుక్ తదితరులు ఈ విందుకి హాజరయ్యారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ విందులో అధ్యక్షుడు బైడెన్ ప్రధాని మోదీతో సరదా సంభాషణలతో నవ్వులు పూయించారు. విందులో టోస్ట్ (ఆరోగ్యం కోసం తీసుకునే ఒక పెగ్గు ఆల్కహాల్) సంప్రదాయం గురించి బైడెన్ మాట్లాడుతూ ''మిస్టర్ పీఎం మీరు ఎవరికైనా టోస్ట్ అందించాలనుకుంటే మీ చేతి గ్లాసులో ఆల్కహాల్ లేకపోతే ఎడమ చేత్తో వారికి ఇవ్వాలి. ఈ విషయాన్ని మా తాతయ్య చెప్పేవారు' అని బైడెన్ అంటే మోదీ చిరునవ్వులు చిందించారు. బైడెన్, మోదీ ఇద్దరూ ఆల్కహాల్ తీసుకోరు. దీంతో అందరూ ఫక్కున నవ్వేశారు. బైడెన్ ఆతిథ్యానికి అతిథులందరూ ఫిదా అయిపోయి పాటలు పాడాలని అనుకుంటారని మోదీ అన్నారు. 2014లో అమెరికాకు వచ్చినప్పుడు నవరాత్రుల సందర్భంగా ఉపవాసం ఉండడంతో ఏమీ తినలేదని, అప్పుడు ఉపాధ్యక్షుడిగా ఉన్న బైడెన్ తనని బాగా ఆకలేస్తే ఏదో ఒకటి తినాలని ఆప్యాయంగా అడిగేవారని గుర్తు చేసుకున్నారు. తాను తినాలన్న బైడెన్ కోరిక ఇప్పుడు నెరవేరిందన్నారు. అతిథులందరూ ఆరోగ్యం కోసం ఆల్కహాల్ తీసుకోవాలంటూ మోదీ స్వయంగా టోస్ట్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్, అమెరికా మధ్య బంధాల బలోపేతంలో ప్రవాస భారతీయులు పోషిస్తున్న పాత్రను కొనియాడారు. 'భారతీయులు, అమెరికన్లు ఒకరినొకరు పూర్తిగా తెలుసుకుంటున్నారు. భారత్‌లో పిల్లలు హాలోవిన్ వేడుకల్ని చేసుకుంటూ స్పైడర్ మ్యాన్‌ను చూసి పులకించిపోతూ ఉంటే, అమెరికన్ యువత తెలుగు సినిమా ఆర్‌ఆర్‌ఆర్‌లో ఆస్కార్ అవార్డు దక్కించుకున్న నాటు నాటు పాటకి స్టెప్పులేస్తున్నారు' అని ప్రధాని పేర్కొన్నారు.

అధికారిక విందులో మెనూ..!

ప్రధాని కోసం ప్రత్యేకంగా శాకాహారం, తృణధాన్యాలతో చేసిన వంటలను దగ్గరుండి మరీ జిల్ బైడెన్ వడ్డించారు. మారినేటెడ్ మిల్లెట్స్, గ్రిల్డ్ మొక్కజొన్న సలాడ్, పుచ్చకాయ జ్యూస్, అవకాడో సాస్, స్టఫ్‌డ్ మష్‌రూమ్స్, క్రీమీ రిసొట్టో, లెమన్ డిల్ యోగర్ట్ సాస్ వంటివి ప్రత్యేకంగా వడ్డించారు.

నూతన రంగాల్లోనూ కలిసి పనిచేస్తున్న భారత్, అమెరికా

కమలా హ్యారిస్ ఇచ్చిన విందులో మోదీ



వాషింగ్టన్: నూతన రంగాల్లోనూ భారత్, అమెరికా కలిసి పని చేస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. అమెరికాలో పర్యటనలో ఉన్న మోదీ శుక్రవారం శ్వేతసౌధంలో ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ ఇచ్చిన విందులో పాల్గొన్నారు. నాలుగు రోజుల పర్యటన కోసం వచ్చిన తనకు ఘన స్వాగతం పలికిన అమెరికా నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రక్షణ, వ్యూహాత్మక రంగాల్లో పరస్పర సహకారాన్ని ఇరు దేశాలు పెంపొందించుకుంటున్నాయని తెలిపారు. భారత్–అమెరికా సంబంధాలనే శ్రావ్యమైన గానాన్ని ఇరుదేశాల పౌరులే స్వరపర్చారని కొనియాడారు. రెండు దేశాల మైత్రి బలపడానికి భారతీయ–అమెరికన్ అయిన కమలా హ్యారిస్ ఎంతగానో కృషి చేస్తున్నారని మోదీ కొనియాడారు. ఈ విందులో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ పాల్గొన్నారు.

పగటిపూట 20% తక్కువ రాత్రిపూట 20% ఎక్కువ

2024 ఏప్రిల్ 1 నుంచి 'టైమ్ ఆఫ్ ద డే' విద్యుత్ టారిఫ్

న్యూఢిల్లీ: దేశంలో త్వరలో కొత్త విద్యుత్ టారిఫ్ అమల్లోకి రానుంది. పగటిపూట వినియోగం తక్కువగా ఉండే సమయంలో విద్యుత్ వాడుకుంటే చార్జీలు 20 శాతం వరకు తగ్గుతాయి. రాత్రిపూట వినియోగం అధికంగా ఉండే సమయంలో విద్యుత్ ఉపయోగించుకుంటే చార్జీలను 20 శాతం మేర పెంచుతారు. ఈ మేరకు టైమ్ ఆఫ్ ద డే(టీఓడీ) టారిఫ్ పేరిట కొత్త విద్యుత్ నియమాలను కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. కొత్త టారిఫ్‌ను అమలు చేయడం వల్ల పీక్ సమయాల్లో గ్రిడ్‌పై భారంతోపాటు విద్యుత్ డిమాండ్ తగ్గుతుందని తెలియజేసింది. ఈ నూతన విధానం 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి మొదట వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు అమల్లోకి వస్తుందని ప్రకటించింది. సంవత్సరం తర్వాత.. అంటే 2025 ఏప్రిల్ 1 నుంచి వ్యవసాయ రంగం మినహా మిగతా అన్ని రంగాల విద్యుత్ వినియోగదారులకు ఈ నిబంధనలను వర్తింపజేయనున్నట్లు స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, నూతన టారిఫ్ విధానంతో వినియోగదారులకు లబ్ధి చేకూరుతుందని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కే సింగ్ అభిప్రాయపడ్డారు. లైట్లు, ఫ్యాన్లు, ఏసీల వినియోగం రాత్రిపూటే ఎక్కువ కాబట్టి వినియోగదారులపై భారం పడుతుందని విద్యుత్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

అన్ని శాఖలను ఆదేశించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ విధానంలో ఉద్యోగులందరి హాజరును తప్పనిసరిగా నమోదు చేయాలని కేంద్రం శుక్రవారం అన్ని శాఖలను కోరింది. తమ పరిధిలోని ఉద్యోగులు బయోమెట్రిక్‌లో హాజరు నమోదు చేయనప్పటికీ కొన్ని ప్రభుత్వ శాఖలు అలసత్వంతో వ్యవహరిస్తున్నాయని తేలడంతో సిబ్బంది వ్యవహారాల శాఖ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలు తమ ఉద్యోగుల హాజరును తప్పనిసరిగా నమోదు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని అందులో కోరింది. ఉద్యోగుల సమయపాలనపైనా శ్రద్ధ పెట్టాలని సూచించింది. ఉద్యోగులు తరచూ ఆలస్యంగా విధులకు హాజరు కావడం, ముందుగానే వెళ్లిపోవడం వంటి వాటిని ప్రోత్సహించరాదని, నిబంధనల ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని కోరింది.

కలసికట్టుగా పోరుబాట

- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 17 పార్టీలు ఉమ్మడిగా పోటీ
- పట్నాలో విపక్ష సమావేశంలో ముందడుగు
- వచ్చే నెల సిమ్లాలో జరిగే సమావేశంలో ఉమ్మడి కార్యాచరణ
- బీజేపీని గద్దె దింపడమే లక్ష్యంగా పనిచేస్తామన్న నితీశ్‌కుమార్


భేటీలో పాల్గొన్న రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, నితీశ్, లాలూ యాదవ్

పట్నా: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీ గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలు ఏకం కావడంలో అడుగు ముందుకు పడింది. బిహార్ రాజధాని పట్నాలో శుక్రవారం జరిగిన విపక్షాల మెగా సమావేశం కొంతమేరకు సత్ఫలితాలనిచ్చింది. పార్టీల మధ్యనున్న విభేదాలను పక్కన పెట్టి లోక్‌సభ ఎన్నికల్లో 17 పార్టీలు కలసికట్టుగా పోటీ చేయడానికి అంగీకరించాయి. ఎన్నికల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహాన్ని రచించడానికి వచ్చే నెల సిమ్లాలో మరోసారి సమావేశం కావాలని విపక్ష పార్టీలు నిర్ణయించాయి. జూలై 10 లేదా 12వ తేదీన సిమ్లాలో ఈ సమావేశం ఉండవచ్చని సమాచారం. దాదాపుగా 4 గంటల సేపు సమావేశమైన చర్చించిన ప్రతిపక్ష పార్టీల నాయకులందరూ ఐక్యంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విపక్ష పార్టీల సమావేశానికి ఆతిథ్యమిచ్చిన బిహార్ సీఎం నితీశ్ మాట్లాడుతూ.. ''సమావేశం బాగా జరిగింది. చాలా మంది నేతలు తమ అభిప్రాయాల్ని పంచుకున్నారు. ఎన్నికల్లో కలిసి పని చెయ్యడానికి ఒక అంగీకారానికి వచ్చారు'' అని చెప్పారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమన్నారు. ఎన్నికల వ్యూహం, సీట్ల సర్దుబాటు వంటి అంశాలను త్వరలో నిర్ణయిస్తామని చెప్పారు. మీడియా సమావేశానికి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, తమిళనాడు సీఎం స్టాలిన్ గైర్హాజరయ్యారు. అయితే వారికి ఫ్లైట్ టైమ్ అయిపోవడంతోనే వెళ్లిపోయారని నితీశ్ సమర్థించుకున్నారు.

కాంగ్రెస్ ఆప్ మధ్య ఆర్డినెన్స్ చిచ్చు

ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి లోక్‌సభ ఎన్నికల్ని ఎదుర్కొంటాయని బయటకి చెబుతున్నప్పటికీ సమావేశంలో కాంగ్రెస్, ఆప్ మధ్య మాటల యుద్ధం జరిగిందని తెలుస్తోంది. ఢిల్లీలో అధికారులపై నియంత్రణకు కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తమకు కాంగ్రెస్ మద్దతుగా ఉంటేనే కలిసి ముందుకు నడుస్తామని పట్టుపట్టారు. దీనిపై సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మౌనం వహించడం కేజ్రీవాల్‌కు మింగుడు పడలేదు. విపక్షాల సమావేశానంతరం ఆప్ ఒక ప్రకటనలో కాంగ్రెస్‌తో తాము కలిసి ముందుకు వెళ్లడం కష్టమంటూ బాంబు పేల్చింది. దీనిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. ఆర్డినెన్స్ అంశం పార్లమెంటులో తేలాల్సిందే కాబట్టి తాము అక్కడే తమ వైఖరి చెబుతామని, ఇతర వేదికలపై ఎందుకు వెల్లడించాలని ఆయన ప్రశ్నించారు.

పట్నాలో ప్రతిపక్ష పార్టీ నాయకుల సమావేశం ఒక ఫొటో సెషన్‌కే పరిమితమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఎద్దేవా చేశారు. విపక్షాల మధ్య ఐక్యత అసాధ్యమని అభిప్రాయపడ్డారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాల ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. జమ్మూలో ఒక ర్యాలీలో పాల్గొన్న అమిత్ షా పట్నా సమావేశంతో ఒరిగేదేమీ లేదని బీజేపీ 300పైగా సీట్లతో భారీ విజయం సాధిస్తుందని ధీమాగా చెప్పారు.

వచ్చే ఎన్నికల్లో 300 సీట్లు మావే



ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రపంచ దేశాల నాయకులు ప్రశంసిస్తూ ఉంటే ప్రతిపక్షాలకు అసహనంగా ఉందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరోపించారు. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీ జైల్లో పెట్టిన నాయకులు నితీశ్ కుమార్, లాలూప్రసాద్ యాదవ్‌లు ఆమె మనవడు రాహుల్‌తో చేతులు కలపడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాల సమావేశం ఒక స్వార్థ కూటమిగా కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ అభివర్ణించారు. విపక్షాల కూటమిని తోడేళ్లతో పోల్చారు. ''తోడేళ్లు మూకుమ్మడిగా వేటాడతాయని అంటారు. పట్నాలో రాజకీయ మూక కలిశాయి. వారికి ఎర మన దేశ భవిష్యత్' అని స్మృతి ఇరానీ ధ్వజమెత్తారు.

''జూలైలో సిమ్లాలో సమావేశమై తదుపరి కార్యాచరణపై చర్చిస్తాం. ఆ సమావేశంలో ఉమ్మడి ఎజెండా రూపొందించాలని నిర్ణయించాం. కేంద్రంలో అధికార బీజేపీని గద్దె దించడానికి ప్రతీ రాష్ట్రానికి ప్రత్యేకంగా ఒక ప్రణాళిక రూపొందిస్తాం''
– మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

''వచ్చే ఎన్నికల్లో జరిగేది సిద్ధాంతాల మధ్య యుద్ధం. పార్టీల మధ్య కొన్ని విభేదాలు ఉన్నప్పటికీ కలసికట్టుగా ముందుకు వెళ్లాలని నిర్ణయించాం. మా సిద్ధాంతాలను పరిరక్షించుకుంటూనే ఉమ్మడిగా పని చేస్తాం''
– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకుడు

''బీజేపీని గద్దె దింపడానికి పట్నాలో మొదలైన ఈ కార్యక్రమం ఒక ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటుంది. మేమంతా ఒక్కటిగా ఉన్నాం. బీజేపీపై ఐక్యంగా పోరాడుతాం. ఈ నియంత ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే భవిష్యత్‌లో ఎన్నికలు ఉండవు. బీజేపీ చరిత్ర మార్చాలని అనుకుంటోంది. మేము చరిత్రను కాపాడతాం''
– మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

''మా ఐక్య ఫ్రంట్‌కు ప్రజా దీవెనలు కచ్చితంగా లభిస్తాయి.''
– శరద్ పవార్, ఎన్సీపీ అధినేత

''పట్నా సమావేశం విస్పష్టమైన సందేశాన్నిచ్చింది. మేమంతా ఐక్యంగా పనిచేసి దేశాన్ని కాపాడతాం''
– అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత

''మేమంతా కలసికట్టుగా పోరాడతాం. విపక్షాలన్నీ చేతులు కలపకపోతే ఓట్లు చీలిపోతాయన్న ఆందోళన అందరిలోనూ ఉంది. భజరంగ భళి మాతో ఉన్నారు''
– లాలూప్రసాద్ యాదవ్, ఆర్జేడీ అధినేత

ప్రయాణం.. విషాదాంతం

- సముద్రంలో బద్దలైన టైటాన్ మినీ సబ్‌మెరైన్
- అందులోని అయిదుగురూ మృతి
- అన్వేషణ కొనసాగుతుందన్న అమెరికా కోస్ట్ గార్డ్

బోస్టన్: ఒకరు 'టైటానిక్' నిపుణుడు.. మరొకరు సాహసి..ఇంకొకరు సీఈవో..ఇంకా ప్రముఖ వ్యాపారవేత్త, ఆయన కొడుకు..! వీరంతా 'టైటాన్'అనే మినీ సబ్‌మెరైన్‌లో టైటానిక్ శకలాలను చూసేందుకు వెళ్తూ అట్లాంటిక్ సముద్రంలో గల్లంతయ్యారు. ఈ అయిదుగురూ మృతి చెందినట్లు భావిస్తున్నామని అమెరికా కోస్ట్ గార్డ్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. న్యూఫౌండ్‌ల్యాండ్ రాష్ట్రం సెంట్ జాన్స్‌కు సుమారు700 కిలోమీటర్ల దూరంలో ఆదివారం ఉదయం 'టైటాన్'సముద్రాంతర యాత్రకు బయలుదేరింది. టైటానిక్ వైపుగా నీటి అడుగుకు ప్రయాణం ప్రారంభించిన 1.45 గంటలకే ప్రధాన నౌక పోలార్ ప్రిన్స్‌తో సంబంధాలు తెగిపోయాయి. అందులోని ఆక్సిజన్ నిల్వలు గురువారం ఉదయం 6 గంటల వరకు మాత్రమే సరిపోతాయి. దీంతో, అమెరికా, కెనడా విమానాలు, నౌకలు, రోబోల సాయంతో టైటాన్ జాడ కోసం అన్వేషణ మొదలుపెట్టాయి. చివరికి, టైటాన్ శకలాలను తమ రోబో టైటాన్ శకలాలను గుర్తించినట్లు అమెరికా కోస్ట్‌గార్డ్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో ఉన్న ఓషన్ గేట్ సంస్థ చీఫ్ పైలట్, సీఈవో స్టాక్టన్ రష్, సాహసి హామిష్ హార్డింగ్,, పాక్ జాతీయుడైన వాణిజ్యవేత్త షహజాదా దావూద్, ఆయన కొడుకు సులేమాన్, టైటానిక్ నిపుణుడు నర్గియెలెట్ మృతి చెందారని తెలిపింది. అయితే, అది ఎందుకు? ఎలా? ఎప్పుడు? ప్రమాదం బారిన పడి ఉంటుందనే విషయం తెలుసుకునేందుకు అన్వేషణ కొనసాగిస్తామన్నారు.



2050 నాటికి 130 కోట్ల మందికి మధుమేహం

తాజా సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య రానున్న 30 ఏళ్లలో విపరీతంగా పెరిగిపోనుంది. ప్రస్తుతం 50 కోట్లుగా ఉన్న చక్కెర వ్యాధి బాధితుల సంఖ్య 2050 కల్లా రెట్టింపు కంటే ఎక్కువగా 130 కోట్లకు చేరనుంది ఈ విషయాలను లాన్‌సెట్ పత్రిక వెల్లడించింది. 'డయాబెటిస్ ప్రమాదకర స్థాయిలో పెరుగుతోంది. ప్రపంచ దేశాల ఆరోగ్య వ్యవస్థలన్నిటికీ ఇది సవాలు వంటిదే. ఈ వ్యాధి కారణంగా ముఖ్యంగా గుండెజబ్బుల కూడా పెరుగుతాయి'అని ఈ పరిశోధనలకు సారథ్యం వహించిన యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌లోని స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన లియానె ఒంగ్ అన్నారు.

ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న కేసుల్లో 96 శాతం టైప్ 2 డయాబెటిస్‌వేనని తెలిపారు. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్–2021 సర్వే ఆధారంగా 1990- 2021 సంవత్సరాల మధ్య వయస్సు, లింగం ఆధారంగా 204 దేశాలు, భూభాగాల్లో మధుమేహం విస్తృతి, అనారోగ్యం, మరణాలను బట్టి 2050 వరకు మధుమేహం వ్యాప్తి ఎలా ఉంటోందో వీరు అంచనా వేశారు. వీరి అధ్యయనం ప్రకారం.. మధుమేహం వ్యాప్తి రేటు 6.1%గా ఉంది. మరణాలు, వైకల్యానికి ప్రధాన కారణాలుగా నిలిచే టాప్–10 వ్యాధుల్లో డయాబెటిస్ కూడా ఉండటం గమనార్హం. ఉత్తర ఆఫ్రికా, మధ్యప్రాచ్యంలలో అత్యధికంగా 9.3% మంది ఈ వ్యాధికి గురికాగా 2050 నాటికి ఇది 16.8%కి చేరుకోనుంది. అదే లాటిన్ అమెరికా, కరీబియన్ ప్రాంతాల్లో అప్పటికల్లా దీని విస్తృతి 11.3% గా ఉంటుందని ఈ సర్వే తెలిపింది. అంతేకాకుండా, 65 ఏళ్లు, ఆపైన వారే ఎక్కువగా డయాబెటిస్ బారినపడుతున్నారని, అన్నిదేశాల్లోనూ ఇదే ఒరవడిని గుర్తించామని లియానె ఒంగ్ పేర్కొన్నారు. అత్యధికంగా ఉత్తర ఆఫ్రికా, మధ్యప్రాచ్యం ప్రాంతాల్లో అత్యధికంగా ఈ వయస్సు వారిలో 39.4 శాతం మంది ఈ జబ్బు బారినపడినట్లు గుర్తించామన్నారు. అత్యల్పంగా మధ్య ఆసియా, మధ్య యూరప్, తూర్పు యూరప్ దేశాల్లో 19.8% మందిలోనే ఉంది. టైప్2 డయాబెటిస్‌కు ప్రధానమైన 16 కారణాల్లో బీఎంఐ ప్రాథమిక కారణమని, టైప్ 2 డయాబెటిస్‌తో సంభవించే మరణాలు, వైకల్యాలకు ఇదే కీలకమని సర్వే తెలిపింది. ఆల్కహాల్, పొగాకు వినియోగంతోపాటు, ఆహార, వృత్తిపరమైన, పర్యావరణ సంబంధ సమస్యలతోపాటు తక్కువ శారీరక శ్రమ ఇందుకు ప్రధానమైన అంశాలని పేర్కొంది. తక్కువ, మధ్యస్థ ఆదాయం కలిగిన దేశాల్లో జన్యుసంబంధ, సామాజిక, ఆర్థిక అంశాలు కూడా ఈ వ్యాధి బారినపడేందుకు కారణాలుగా ఉన్నాయి.

'370' అనంతర మార్పుల్ని కశ్మీర్ ఆమోదించింది: అమిత్ షా

శ్రీనగర్: 2019లో ఆర్టికల్ 370 రద్దు అనంతర మార్పులను జమ్మూకశ్మీర్ ప్రజలు ఆమోదించారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఉగ్రవాద చర్యలు, రాళ్లు రువ్వడం వంటి ఘటనలు 70% తగ్గిపోయాయన్నారు. ఇప్పుడు కొత్త జమ్మూకశ్మీర్ రూపుదిద్దుకుంటోందని చెప్పారు. మంత్రి శుక్రవారం శ్రీనగర్‌లో జరిగిన 'వితస్త కల్చరల్ ఫెస్టివల్'కు హాజరయ్యారు. గత 30–40 ఏళ్ల జమ్మూకశ్మీర్ చరిత్ర మాత్రమే తెలిసిన వారు ఇది ఒక సమస్య అని, దీనిని వివాదాస్పద ప్రాంతంగానే భావిస్తారన్నారు. అదే జమ్మూకశ్మీర్ ఇప్పుడు వితస్త ఉత్సవాలు జరుపుకుంటోందని అమిత్ షా పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదంతో బలైన 42 వేల మంది ప్రజల బాధ్యతను ఎవరు తీసుకుంటారని అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ), పీపుల్స్ డెమోక్రాటిక్ ఫ్రంట్(పీడీపీ)లను ఆయన ప్రశ్నించారు. ఆర్టికల్ 370తో ఇక్కడ ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. బీజేపీ కార్యాలయంలో పార్టీ సిద్ధాంతకర్త శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఆయన నివాళులర్పించారు.

మోదీ పర్యటనలో జగిత్యాలవాసి



ప్రధాని మోదీతో జగిత్యాలవాసి ఓంకార్

జగిత్యాల జోన్: ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో అక్కడే స్థిరపడ్డ జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ప్రవాస భారతీయుడు నలమాసు ఓంకార్ కూడా పాల్గొంటున్నారు. పారిశ్రామికవేత్తలతో ఇప్పటివరకు జరిగిన సమావేశాల్లో సాంకేతిక అంశాలపై ప్రధానితో ఆయన చర్చించారు. హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ నుంచి రసాయన శాస్త్రంలో పీజీ, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి ఎంఫిల్ చేసిన ఓంకార్ సుమారు 30 ఏళ్ల క్రితం అమెరికాకు వలస వెళ్లారు. ప్రస్తుతం ఆయన శాన్‌ఫ్రాన్సిస్కోలోని గ్లోబల్ చిప్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.

పేపర్లు పంపినందుకు రూ.16 లక్షలు!

- వాట్సాప్ ద్వారా ఏఈఈ, డీఏఓ ప్రశ్నపత్రాలు షేరింగ్
- మాజీ ఏఈ పూల రమేశ్‌కు సహకరించిన ప్రైవేట్ కాలేజీ చైర్మన్
- గాలించి పట్టుకున్న ప్రత్యేక దర్యాప్తు బృందం



మహబూబ్



ఖాలేద్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీతో పాటు హైటెక్ మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన మాజీ ఏఈ పూల రమేశ్‌కు సహకరించిన ప్రైవేట్ కళాశాల చైర్మన్ సయ్యద్ మహబూబ్ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులకు చిక్కాడు. సయ్యద్ వాట్సాప్ ద్వారా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ), డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) ప్రశ్నపత్రాలను రమేశ్‌కు 'పంపినందుకు' రూ.16 లక్షలు తీసుకున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. రమేశ్ అరెస్టు తర్వాత పరారీలో ఉన్న సయ్యద్ మహబూబ్‌ను బుధవారం పట్టుకున్న అధికారులు.. అతడిని జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించారు. తదుపరి విచారణ కోసం తమ కస్టడీకి అప్పగించాల్సిందిగా కోరుతూ సిట్ అధికారులు శుక్రవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అత్యాధునిక బ్లూటూత్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను వినియోగించి రమేశ్ ఏడుగురితో ఏఈఈ, డీఏఓ పరీక్షలు రాయించాడు. టోలిచౌకిలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీకి మహబూబ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 22, ఫిబ్రవరి 23న జరిగిన ఈ రెండు పరీక్షలకు సంబంధించిన సెంటర్ ఈ కాలేజీలోనే పడింది. ఈ నేపథ్యంలో రమేశ్‌తో రూ.16 లక్షలకు ఒప్పందం చేసుకున్న మహబూబ్.. పరీక్ష ప్రారంభమైన పది నిమిషాల్లోనే ప్రశ్నపత్రాలను తన సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి, రమేశ్‌కు వాట్సాప్ ద్వారా షేర్ చేశాడు. ఆయా పరీక్షలకు గైర్హాజరైన వారి పేపర్లను దీనికి వినియోగించాడు. ఈ ప్రశ్నలకు సమాధానాలను చాట్ జీపీటీ ద్వారా వెతికి, ఏడుగురు అభ్యర్థులకు అత్యాధునిక పరికరాల ద్వారా అందించే టీమ్‌కు రమేశ్ మలక్‌పేటలోని మహ్మద్ ఖాలేద్ ఇంట్లో షెల్టర్ ఏర్పాటు చేశాడు. దీని కోసం ఖాలేద్‌కు రూ.80 వేలు చెల్లించాడు. ఈ రెండు రోజులూ ఈ బృందం అక్కడ నుంచే జవాబులను అభ్యర్థులకు పంపింది. గత నెలలో రమేశ్ అరెస్టు అయిన నాటి నుంచి మహబూబ్‌తోపాటు ఖాలేద్, అభ్యర్థులు, వారికి సహకరించిన వారు పరారీలో ఉన్నారు. ఇప్పటివరకు సిట్ అధికారులు ముగ్గురు అభ్యర్థులతో పాటు ఈ నెల 9న ఖాలేద్‌ను, బుధవారం మహబూబ్‌ను పట్టుకున్నారు. మరో 35 మంది అభ్యర్థుల కోసం సిట్ అధికారులు గాలింపు కొనసాగిస్తున్నారు. ఈ హైటెక్ మాస్ కాపీయింగ్, ఏఈ పేపర్ లీకేజ్ ద్వారా రమేశ్ రూ.10 కోట్లు ఆర్జించాలని భావించినట్లు తెలుస్తోంది. హైటెక్ కాపీయింగ్ ద్వారా లబ్ధిపొందిన ఒక్కో అభ్యర్థి రూ.40 లక్షలు, ఏఈ పేపర్ లీక్ ద్వారా లబ్ధిపొందిన ఒక్కొక్కరు రూ.20 లక్షలు చెల్లించేలా రమేశ్ ఒప్పందాలు చేసుకున్నాడని సమాచారం. అయితే ఇతడికి ఇప్పటివరకు రూ.1.1 కోటి మాత్రమే ముట్టినట్లు తేలింది.

ఓటరు జాబితా పరిశీలన సరిగా జరగలేదు

- గోపిశెట్టి నిరంజన్

సాక్షి, హైదరాబాద్: ఓటరు జాబితా తయారీ కోసం ఎన్నికల కమిషన్ నిర్వహించిన ఇంటింటి పరిశీలన సరిగా జరగలేదని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ ఆరోపించారు. పరిశీలన గడువు శుక్రవారంతో ముగిసినప్పటికీ పోలింగ్ బూత్ స్థాయిలో ఎక్కడా సరిగా జరగలేదని దుయ్యబట్టారు. పరిశీలన సరిగా జరగకపోతే తుది జాబితా తప్పుల తడకగా మారుతుందని, ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్నికల కమిషన్ బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

ఒక్క ఇల్లు ఇవ్వకుండా ఎలా ప్రారంభిస్తారు?

- బీజేపీ మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: పటాన్‌చెరు నియోజకవర్గపరిధిలో డబుల్‌బెడ్రూమ్ ఇళ్లను ఒక్కరికీ కూడా కేటాయించకుండా సీఎం కేసీఆర్ వాటిని ఎలా ప్రారంభోత్సవం చేశారని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ ప్రశ్నించారు. కొల్లూరులో ఎవరికి డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు ఇచ్చారో చెప్పాలన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..కొల్లూరులో 75% స్థానికులకు డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2014లో తాను ఎమ్మెల్యేగా ఉండగా పటానుచెరులో రాజీవ్ గృహకల్ప కింద రూ.2 వేల కోట్ల వ్యయంతో 5వేల ఇళ్లు కట్టిస్తే ఇప్పటిదాకా అలాట్ చేయకుండా వృధాగా వదిలేశారన్నారు. కేసీఆర్ ప్రజలను మోసం చేయడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే భూకబ్జాలు చేస్తున్నారని, అయన చేసిన అక్రమాల్లో మంత్రికి వాటా ఉందని ఆరోపించారు.

అల్లూరి పేరులోనే త్యాగం, సాహసం

- కేంద్ర సాంస్కృతిక శాఖమంత్రి కిషన్‌రెడ్డి

మాదాపూర్ (హైదరాబాద్): అల్లూరి సీతా రామరాజు పేరులోనే త్యాగం, స్ఫూర్తి, సాహసం, చరిత్ర తెలుస్తాయని కేంద్ర సాంస్కృతిక శాఖమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని సీసీఆర్టీలో శుక్రవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో 125వ అల్లూరి సీతారామ రాజు జన్మదినోత్సవాల ముగింపు కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు నడయాడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నారు. కేంద్రప్రభుత్వం, క్షత్రియ సేవా సమితితో కలిసి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏడాది కాలంగా అల్లూరి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించినందుకు అభినందించారు. ఢిల్లీలో కూడా అల్లూరి జయంతి ఉత్సవాలను నిర్వహించాలనుందని తెలిపారు. నటుడు కృష్ణ.. అల్లూరి సీతారామ రాజు సినిమాను తీయకుంటే తనలాంటి వారికి ఆయన గొప్పతనం తెలిసేది కాదని స్పష్టం చేశారు. అల్లూరి సీతారామరాజు సినిమాను చాలాసార్లు చూశానన్నారు. అల్లూరిపై కార్టూన్ చిత్రాన్ని రూపొందించినట్టు కిషన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, నటుడు మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ నుంచి విడిపోయిన బోగీలు

- జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో ఘటన

జడ్చర్ల: కదులుతున్న గూడ్స్ రైలు ఇంజిన్ నుంచి హఠాత్తుగా బోగీలు విడిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. జడ్చర్ల రైల్వేస్టేషన్ మీదుగా ఓ గూడ్స్ రైలు శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్‌లోని డోన్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో జడ్చర్ల రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం-2 మీదుగా వెళ్తుండగా గూడ్స్ నుంచి వెనక బోగీలు అకస్మాత్తుగా విడిపోవడంతో ఇంజిన్ మాత్రమే ముందుకు వెళ్లింది. ఇతర రైళ్ల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు గట్టిగా కేకలు వేయడంతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. లోకో పైలెట్‌కు సూచనలు చేయడంతో గూడ్స్‌ను నిలిపి వేశారు. అప్పటికే రైలు ఇంజిన్ బోగీలను వీడి కొద్ది దూరం వెళ్లింది. ఇంజిన్‌ను వెనక్కి తీసుకొచ్చి బోగీలకు జత చేశాక ముందుకు వెళ్లిందని రైల్వే స్టేషన్ మాస్టర్ శంకర్ తెలిపారు.

పటాన్‌చెరు సభలో కేసీఆర్ పచ్చి అబద్ధాలు

- బీజేపీ అధికార ప్రతినిధి సంగప్ప

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ మాటలకు మోసపోవడానికి సంగారెడ్డి జిల్లా ప్రజలు ఈసారి సిద్ధంగా లేరని బీజేపీ అధికార ప్రతినిధి జె.సంగప్ప పేర్కొన్నారు. పటాన్‌చెరు సభలో కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని. మాయ మాటలు చెప్పడంలో కేసీఆర్ నైజం మరోసారి బయటపడిందన్నారు. తమ పాదయాత్రలో సంగమేశ్వర-బసవేశ్వర ఎత్తిపోతల పనులు ప్రారంభంపై బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ నిలదీసినందుకు గతేడాది ఫిబ్రవరిలో నారాయణఖేడ్‌లో శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. అయితే ఏడాదిన్నర దాటినా తట్ట మట్టి కూడా తీయలేదని ఆరోపించారు. పైగా హరీశ్‌రావు ఈ మధ్యే మరోసారి శంకుస్థాపన పేరుతో మోసం చేసే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. మామ ఒకసారి, అల్లుడు ఇంకోసారి శంకుస్థాపన చేస్తారు కానీ..బడ్జెట్లో మాత్రం ఒక్క పైసా కేటాయించలేదని సంగప్ప విమర్శించారు.

సగానికిపైగా తగ్గిన దరఖాస్తులు

▶ మొదటి పేజీ తరువాయి

దరఖాస్తులు తగ్గిపోయాయి. బాసర ట్రిపుల్‌ఐటీలో చదివించేందుకు విద్యార్థులు అంతగా ఆసక్తి చూపడంలేదు.

వరుస ఘటనలే కారణమా..

రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ దరఖాస్తుల నోటిఫికేషన్ వెలువడిన సమయంలోనే ట్రిపుల్‌ఐటీలో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో తల్లిదండ్రులు ఇక్కడ చదివించేందుకు అంతగా ఆసక్తి కనబరచడంలేదు. ట్రిపుల్‌ఐటీలో చదివించాలన్న తపన ప్రతీ తల్లిదండ్రులకు ఉన్నప్పటికీ ఇక్కడ జరుగుతున్న సంఘటనలు, అధికారుల సమాధానాలు తల్లిదండ్రులకు ఆవేదనను మిగులుస్తున్నాయి. నిబంధనలపేరిట ట్రిపుల్‌ఐటీని రహస్య క్యాంపస్‌గా తయారు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నాలుగేళ్లలో వచ్చిన దరఖాస్తులు

సంవత్సరం	దరఖాస్తుల సంఖ్య
2020-21	20,178
2021-22	20,195
2022-23	32,800
2023-24	13,538

పరిశీలన వేగవంతం



బాసర ట్రిపుల్ ఐటీలో ఆరేళ్ల చదువు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. అడ్మిషన్ల ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. దరఖాస్తుల ప్రక్రియ వేగవంతంచేసేందుకు 60 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారమే అడ్మిషన్స్ ప్రక్రియ పూర్తికానుంది.

-ప్రొఫెసర్ వెంకటరమణ, ఇన్‌చార్జి వీసీ

మావోయిస్టు అగ్రనేత సుదర్శన్ అంత్యక్రియల వీడియో విడుదల

బెల్లంపల్లి: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ అంత్యక్రియల వీడియోను శుక్రవారం ఆ పార్టీ విడుదల చేసింది. సుదర్శన్ మే నెల 31న గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఈ విషయం మావోయిస్టు పార్టీ ప్రకటించే వరకు బాహ్య ప్రపంచానికి, అలాగే ఆనంద్ కుటుంబీకులకు కూడా తెలియలేదు. సుదర్శన్ మృతిచెందినట్లు జూన్ 4న పార్టీ అధికారికంగా ప్రకటించింది. కాగా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దండకారణ్యంలో విప్లవ సంప్రదాయం ప్రకారం మావోయిస్టు పార్టీ సుదర్శన్‌కు దహన సంస్కారాలు నిర్వహించింది. మావోయిస్టు అగ్రనేతలు, దండకారణ్యంలో పనిచేస్తున్న పీఎల్‌జీఏ గెరిల్లా సైనికులు, జనతన సర్కార్ శ్రేణులు, గిరిజనులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సుదర్శన్ పోరాట స్ఫూర్తిని కీర్తిస్తూ కళాకారులు విప్లవ గీతాలు ఆలపించి తుది వీడ్కోలు పలికారు. జనతన సర్కార్‌కు చెందిన కొందరు మహిళలు సుదర్శన్ మృతదేహం వద్ద కన్నీటి పర్యంతమైన దృశ్యాలు వీడియోలో ఉన్నాయి.



సుదర్శన్ భౌతికకాయం వద్ద జోహార్లు అర్పిస్తున్న పీఎల్ జీఏ సైనికులు

ఉద్యమాన్ని వక్రీకరించిన కేసీఆర్

- ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని సీఎం కేసీఆర్ వక్రీకరించారని, ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్టు చెబుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి విమర్శించారు. అమరవీరుల జ్యోతిని ప్రారంభించిన అనంతరం కేసీఆర్ ప్రసంగించిన తీరు చూస్తుంటే ఆయన రాజకీయ ప్రయోజనాల కోసమే ఉద్యమం గురించి మాట్లాడినట్టుందన్నారు. రాష్ట్ర ఏర్పాటును తానే చేసినట్టు గొప్పలకు పోయారని, నేను అనే పదం తప్ప నేటి యువతరానికి స్ఫూర్తినిచ్చే విధంగా ఆయన మాట్లాడలేకపోయారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన సోనియాగాంధీ పేరును ఆయన ప్రస్తావించకపోవడం దురదృష్టకరమని, వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను గద్దె దించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు.

టీచర్లను సర్దుబాటు చేయాలి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల అంగీకారంతో స్కూళ్లలో టీచర్ల సర్దుబాటుకు అనుమతించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర నేతలు యం.చెన్నయ్య, సుంకరి బిక్షం గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యాశాఖ మంత్రి ఇంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రమోషన్లు, బదిలీలు చేపట్టే వరకూ విద్యార్థులు లేని స్కూళ్లలో ఉన్న ఉపాధ్యాయులను విద్యార్థులు ఎక్కువగా ఉన్న స్కూళ్లకు పంపాలని కోరారు.

15న బీసీ కులవృత్తిదారులకు ఆర్థిక సాయం పంపిణీ

- మంత్రి గంగుల కమలాకర్ వెల్లడి
- ఈ ఏడాది కొత్తగా 17 గురుకుల డిగ్రీ కళాశాలలు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల్లోని కులవృత్తిదారులకు వచ్చే నెల 15న రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీ చేయనున్నట్లు మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైంది. ఈనెల 20 వరకు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులను స్వీకరించిన అధికారులు...తాజాగా వాటిని పరిశీలించి అర్హతలను నిర్ధారించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 5,28,862 దరఖాస్తులు వచ్చినట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ వెల్లడించింది. కాగా, దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను త్వరగా పూర్తి చేసి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని అధికారులను మంత్రి గంగుల శుక్రవారం ఓ ప్రకటనలో ఆదేశించారు.

కొత్త బీసీ గురుకుల డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు అనుమతులు

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలో 2023-24 విద్యా సంవత్సరం నుంచి కొత్తగా 17 గురుకుల డిగ్రీ కాలేజీలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం ఆమోదం తెలపగా... తాజాగా బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది కొత్తగా జోగుళాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబుబాబాద్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో బీసీ గురుకుల డిగ్రీ కాలేజీలు ప్రారంభించేందుకు బీసీ గురుకుల సొసైటీ ఏర్పాట్లు చేస్తోంది. అతి త్వరలో ఈ కాలేజీలకు సంబంధించి పోస్టుల మంజూరు ఉత్తర్వులను వెలువరించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. తాజాగా మంజూరు చేసిన బీసీ గురుకుల కాలేజీలతో రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఒక కాలేజీ చొప్పున ఉందని, డిమాండ్‌కు తగినట్లు బీసీ గురుకుల విద్యా సంస్థలను మంజూరు చేస్తున్నట్లు మంత్రి గంగుల చెప్పారు.

దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికీ రూ.లక్ష ఇవ్వాలి

- ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్
- మంత్రి గంగుల కమలాకర్‌తో బీసీ నేతల భేటీ

కాచిగూడ (హైదరాబాద్): బీసీలకు లక్ష పథకం కింద దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికీ రూ.లక్ష ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు బీసీబంధు పథకం ప్రవేశ పెట్టాలని, లేకపోతే వచ్చే ఎన్నికల్లో బీసీల ఆగ్రహానికి గురికావలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, నేతలు నీల వెంకటేష్, నీరడి భూపేష్ సాగర్‌ల బృందంతో శుక్రవారం కృష్ణయ్య మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి బీసీల సమస్యలపై చర్చించారు. అనంతరం మంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ గత 9 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఒక్కరికి కూడా బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వలేదని, ఇప్పుడు ఎన్నికలు రావడంతో ఇవ్వడానికి ముందుకు వచ్చారని అన్నారు. ఇప్పుడైనా దరఖాస్తుదారులందరికీ లక్ష రూపాయలు ఇవ్వకపోతే బీసీల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రూ.లక్ష పథకానికి నెల రోజుల గడువు ఇవ్వాలని కృష్ణయ్య మంత్రిని కోరారు.



మంత్రి గంగుల కమలాకర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

ఆ కులాలను బీసీ జాబితాలో కలపాలి

తెలంగాణలో బీసీ జాబితానుంచి తొలగించిన 26 కులాలను మళ్లీ జాబితాలో కలపాలని ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 26 బీసీ కులాల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 25న ఆత్మగౌరవ సభ జరుగుతుందని పోరాట సమితి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ తెలిపారు. ఈ సమితి ప్రతినిధులు శుక్రవారం కృష్ణయ్యను కలిసి మద్దతు కోరారు.



ఒప్పంద పత్రాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఈటీఎస్ ప్రతినిధులు

సర్కారు బడిలో 'టోఫెల్' ట్రైనింగ్

అంతర్జాతీయ సంస్థ 'ఈటీఎస్'తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు ప్రపంచ స్థాయికి ఎదిగేలా అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నట్లు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. విద్యారంగంలో సీఎం జగన్ విప్లవాత్మక మార్పులను చేపట్టిన నేపథ్యంలో పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను 'టోఫెల్' పరీక్షకు సన్నద్ధం చేస్తూ ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్)తో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఒప్పందం చేసుకుంది. సీఎం జగన్ సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో 'ఈటీఎస్' ఇండియా చీఫ్ రెవెన్యూ ఆఫీసర్ లెజో సామ్ ఊమెన్, సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, మిడ్ డే మీల్స్ డైరెక్టర్ నిధి మీనా, ఎస్సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, ఈటీఎస్ అసెస్‌మెంట్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రుయి ఫెరీరా, డేనియల్, యూఫిఎస్ లెర్నింగ్ సహ వ్యవస్థాపకుడు అమిత్ కపూర్, చీఫ్ గ్రోత్ ఆఫీసర్ కపిల్, వైస్ ప్రెసిడెంట్ డిజిటల్ సేల్స్ ఇండియా కే-12 రాజీవ్ రజ్దాన్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అట్టడుగు వర్గాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులను చేపడుతోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యారంగంలో తమ ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను పరిశీలించాలని ఈటీఎస్ బృందాన్ని ఆహ్వానించారు.

పౌరుషం ఉంటే.. కాకినాడలో తలపడు



- పవన్‌కు తాజా లేఖలో ముద్రగడ సూచన
- పోనీ పిఠాపురంలోనైనా తేల్చుకుందాం..
- సందిగ్ధంలో ఉన్న నన్ను యుద్ధానికి సిద్ధం చేసినందుకు సంతోషం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాపు ఉద్యమాల్లో వేల మంది యువతపై కేసులు నమోదైతే కనీసం పరామర్శించని పవన్ కల్యాణ్ రాజకీయ యాత్రల ద్వారా భావోద్వేగాలను రగిల్చే యత్నం చేస్తున్నారని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం విమర్శించారు. తానెప్పుడూ పవన్‌ను విమర్శిస్తూ ప్రకటనలు చేయకున్నా ఆయన అభిమానులతో బండ బూతులు తిట్టిస్తూ మెసేజ్‌లు ఎందుకు చేయిస్తున్నారని ప్రశ్నించారు. తాను వాటికి భయపడిపోయి లొంగిపోవడం ఈ జన్మకు జరగదని స్పష్టం చేశారు. బంతిని ఎంత గట్టిగా కొడితే అంత ఎత్తుకు లేస్తుందనే సంగతి మరువవద్దని పవన్‌కు సూచించారు. 'ఎన్నికల బరిలోకి దిగడంపై సందిగ్ధంలో ఉన్న సమయంలో మీరు, జనసైనికులు నన్ను దూషిస్తూ ఎక్కడా లేని ఉత్సాహంతో యుద్ధానికి సిద్ధం కావాలనే వాతావరణం కల్పించినందుకు సంతోషం. కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కోరినట్లుగా కాకినాడ నుంచి పోటీ చేయడానికి సిద్ధం కావాలి. లేదా పిఠాపురం నుంచి బరిలోకి దిగి నన్ను పోటీకి రావాలని సవాల్ విసరండి' అని పవన్‌కు సూచించారు. ఈమేరకు ముద్రగడ శుక్రవారం మరో లేఖ రాశారు.

మీ కాళ్లు మొక్కి బాంచన్ అనలేదనా?

'మీకు డబ్బు ఉందని నన్ను తిట్టిస్తారా? తిట్టించి మీరు పెద్ద హీరో అనుకుంటున్నారు. కానీ మీరు సినిమాల్లో మినహా రాజకీయాల్లో హీరో కాదని గ్రహించాలి. నన్ను తిట్టాలనుకుంటే నేను పూర్వం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన ప్రత్తిపాడు నియోజకవర్గంలోని అన్నవరం లేదా కత్తిపూడిలో తిట్టాలి. కానీ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితో కలిపి నన్ను ఎందుకు తిట్టాలనుకున్నారు? మీ రాజకీయ యాత్ర ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి ప్రారంభించినప్పుడు మీ కాళ్లు మొక్కి బాంచన్ అని చెప్పకపోవడంతో నన్ను తిడుతున్నారా?' అని ముద్రగడ తన రెండో లేఖలో పవన్‌ను సూటిగా ప్రశ్నించారు.

గురునానక్ కళాశాల పై చర్యకు డిమాండ్

సాక్షి, హైదరాబాద్: అనుమతి లేకుండా తరగతులు ప్రారంభించి రెండు నెలలుగా విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి చేతులెత్తేసిన రంగారెడ్డి జిల్లాకు చెందిన గురునానక్ కళాశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్ఎస్‌యూఐ) రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి శాంతియుతంగా ధర్నా చేస్తుంటే.. పోలీసులే రెచ్చగొట్టి తమపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రూ.90 కోట్లకు పైగా అక్రమాలకు పాల్పడిన గురునానక్ యాజమాన్యాన్ని వదిలేసి పోలీసులు తమపై కేసులు బనాయించడం దురదృష్టకరమన్నారు. తాము ఈ విద్యాసంస్థపై ఇచ్చిన ఫిర్యాదును విచారించి చర్యలు తీసుకోవాలని వెంకట్ కోరారు.

ఉద్యమంగా 'జగనన్న సురక్ష'

- ఏమైనా సమస్యలున్నాయా అని ప్రతి ఇంటికీ వెళ్లి అడుగుతున్న తొలి ప్రభుత్వం ఇదే
- కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: పేదలకు మేలు చేసేందుకు 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ఉద్యమంగా నిర్వహిస్తున్నామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. దేశ చరిత్రలో ప్రతి ఇంటికీ వెళ్లి.. ఏమైనా సమస్యలున్నాయా అని అడుగుతున్న తొలి ప్రభుత్వం ఇదేనని స్పష్టం చేశారు. పేదల పట్ల ఇంతగా ప్రేమ చూపిస్తున్న ప్రభుత్వం.. ఇంతగా మమకారం చూపిస్తున్న ప్రభుత్వం ఎక్కడా ఉండకపోవచ్చన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ కూడా ఫలానా సేవలు, ఫలానా పథకం లబ్ధి అందలేదని చెప్పే అవకాశం ఉండకూడని విధంగా సమస్యలు పరిష్కరించాలన్నదే ధ్యేయమన్నారు. అందులో భాగంగానే జల్లెడ పట్టి.. అర్హులను గుర్తించి, పథకాలే కాదు వారికి కావలసిన డాక్యుమెంటేషన్లను కూడా ఈ కార్యక్రమంలో ఇస్తారని తెలిపారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తూ ప్రభుత్వం చేపట్టిన మరో ప్రతిష్టాత్మక కార్యక్రమం 'జగనన్న సురక్ష'ను శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నెల రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లు, మండల, గ్రామ, వార్డు సచివాలయాల అధికారులు, సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, గృహ సారథు లు, మనందరి ప్రభుత్వాన్ని అభిమానించే వారందరూ.. నేరుగా పేద లబ్ధిదారుల దగ్గరకు వెళ్లడమే జగనన్న సురక్షా కార్యక్రమం అన్నారు. అర్హత ఉండీ పొరపాటున ఎక్కడైనా మిగి లిపోయిన అర్హుల తలుపు తట్టి, లబ్ధి చేకూర్చే మంచి కార్యక్రమం అని చెప్పారు.

వైఎస్సార్ జిల్లాకు రెండు సాహిత్య అకాడమీ పురస్కారాలు

- తక్కెడశిల జానీకి యువ పురస్కారం
- వివేచని విమర్శకు అవార్డు
- డీకే చదువుల బాబు 'వజ్రాల వాన'కు బాల సాహిత్య పురస్కారం

సాక్షి, న్యూఢిల్లీ/కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లాకు చెందిన ఇద్దరు రచయితలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు లభించాయి. ఏటా ఉత్తమ రచనలకు పురస్కారాలను అందిస్తున్న సాహిత్య అకాడెమీ 2023 సంవత్సరానికి యువ, బాల సాహిత్య పురస్కారాలను శుక్రవారం ప్రకటించింది. ఇందులో తెలుగు భాషకు సంబంధించి వైఎస్ఆర్ జిల్లా పులివెందులకు చెందిన యువ రచయిత, బహుభాషా కవి తక్కెడశిల జానీకి సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. ఆయన రాసిన వివేచని అనే విమర్శకు ఈ పురస్కారం లభించింది. యువ పురస్కారానికి తెలుగు సహా వివిధ భాషల్లో మొత్తం 20 మంది రచయితలను అకాడెమీ ఎంపిక చేసింది. ఇక సాహిత్య అకాడెమీ బాల సాహిత్య పురస్కారం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రచయిత, బాల సాహిత్యవేత్త, ఉపాధ్యాయుడు డీకే చదువుల బాబును వరించింది. ఆయన రాసిన వజ్రాల వాన అనే చిన్న కథల సంపుటికి ఈ అవార్డు లభించింది. ఈ పురస్కారానికి తెలుగు సహా వివిధ భాషల్లో మొత్తం 22 మందిని అకాడమీ ఎంపిక చేసింది.

బహుభాషా రచయిత జానీ



తక్కెడశిల జానీ 1991 జూన్ 8న వైఎస్సార్ జిల్లా పులివెందులలో జన్మించారు. తక్కెడశిల ఆశా, చాంద్‌బాషలు తల్లిదండ్రులు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న జానీ.. తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లో రచనలు చేస్తూ బహుభాషా రచయితగా పేరు గడించారు. హిందీ, ఇంగ్లిష్, కన్నడం, ఒరియా, మలయాళం, తమిళ భాషల్లోకి ఆయన కవిత్వం అనువాదమైంది. 300 పుస్తకాలపై సాహిత్య విమర్శలు, 30 కథలు, 700కు పైగా కవితలు, మూడు నవలలు, మరికొన్ని రచనల అనువాదాలు చేశారు.

'చదువుల'బాబు



డీకే చదువుల బాబు ప్రొద్దుటూరుకు చెందిన సాహితీవేత్త. తెలుగు ఉపాధ్యాయుడైన ఈయన కవి, రచయితగా ముఖ్యంగా బాల సాహితీవేత్తగా సుపరిచితులు. 1967 జూన్ 1న వైఎస్సార్ జిల్లా పెద్దముడియంలోని పెద్ద పసుపుల గ్రామంలో జన్మించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందారు.

కేపీ చౌదరి డ్రగ్స్ కేసులో సెలబ్రిటీలు

▶ మొదటి పేజీ తరువాయి

హాజరుపరిచారు. రిమాండ్ రిపోర్ట్‌లో పలు సంచలన విషయాలను పేర్కొన్నారు.

12 మందికి కొకైన్ విక్రయం

పోలీసుల విచారణలో కేపీ చౌదరి.. సెలబ్రిటీలు, రాజకీయ నేతల కుమారులు, ప్రముఖులు 12 మందికి కొకైన్ విక్రయించినట్లు ఒప్పుకున్నాడు. వివిధ ప్రాంతాలకు చెందిన బెజవాడ భరత్, వందనాల అనురూప, చింతా సాయి ప్రసన్న, చింతా రాకేష్ రోషన్, నల్లా రతన్ రెడ్డి, ఠాగోర్ విజ్ అలియాస్ ఠాగోర్ ప్రసాద్ మోటూరి, తేజ్ చౌదరి అలియాస్ రఘు తేజ, వంటేరు శ్రవణ్ రెడ్డి, సనా మిశ్రా, శ్వేత, సుశాంత్, నితినేష్ వీరిలో ఉన్నారు. ఈ కాంటాక్ట్‌లు, పార్టీ ఫొటోలను కేపీ చౌదరి గూగుల్ డ్రైవ్‌లో భద్రపరుచుకున్నాడు. వాటిని డీకోడ్ చేశారు.

వందలాది ఫోన్ కాల్స్..

ఈ ఏడాది మేలో కేపీ చౌదరి, తన స్నేహితుడు బెజవాడ భరత్‌తో కలిసి బెంగళూరుకు వెళ్లి అక్కడ డ్రగ్స్ పార్టీ నిర్వహించాడు. ఈ సమయంలో సురేష్ రాజు, రతన్ రెడ్డి, గోవాలోని మీరాజ్ క్లబ్ మేనేజింగ్ పార్ట్‌నర్ దీక్షయ్, సినీ ఆర్టిస్టు జ్యోతి, డాక్టర్ సుధీర్‌లతో కేపీ చౌదరి వందలాది ఫోన్ కాల్స్ మాట్లాడినట్లు గుర్తించారు. పెద్దసంఖ్యలో ఫోన్‌కాల్స్ ఎందుకు చేశారని చౌదరిని ప్రశ్నించగా.. సరైన సమాధానం చెప్పలేదని పోలీసులు తెలిపారు.

ఇతర రాష్ట్రాల్లోనూ డ్రగ్స్ కస్టమర్లు..

ఇతర రాష్ట్రాలలో కూడా చౌదరికి డ్రగ్స్ కస్టమర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాలలో 11 అనుమానాస్పద లావాదేవీలు జరిపాడు. వీటిపైనా సరైన వివరణ ఇవ్వలేదు. అమెరికాలో ఉంటున్న దుగ్గిరాల అమర్ రూ.లక్షల్లో, గోవాలో రెస్టారెంట్ నిర్వాహకుడు మనీష్ సాహా రూ.85 వేలు, షేక్ ఖాజా అనే వ్యక్తి రూ.2 లక్షలు, బిహార్‌కు చెందిన కిన్షుక్ అగర్వాల్ రూ.16 వేలు, టి.సుజాత అనే మహిళ రూ.లక్ష నగదును కేపీ చౌదరి బ్యాంకు ఖాతాకు బదిలీ చేసినట్లు వివరించారు.

జీవవైవిధ్య కార్యాచరణలో తెలంగాణ ప్రథమం

'మెయిన్‌స్ట్రీమింగ్ బయోడైవర్సిటీ ఇన్ పబ్లిక్ ఫైనాన్స్' ప్రాజెక్ట్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్ : వనరుల సమీకరణ వ్యూహాలను సమ్మిళితం చేసి రాష్ట్రస్థాయిలో జీవవైవిధ్య కార్యాచరణ ప్రణాళికను రూపొందించడంలో దేశంలోనే తెలంగాణ తొలి రాష్ట్రంగా నిలవనుంది. కున్మింగ్-మాంట్రియల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేంవర్క్ (కేఎం-జీబీఎఫ్) ఆమోదించాక ఈ దిశలో యూఎన్ డీపీ (యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్)-నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ (ఎన్‌బీఏ) సహకారంతో పనిచేస్తున్న మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం అరణ్యభవన్‌లో యూఎన్‌డీపీ- తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు (టీఎస్‌బీబీ) మధ్యలో లెటర్ ఆఫ్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారు. కార్యక్రమంలో టీఎస్‌బీబీ చైర్మన్, స్పెషల్ సీఎస్ డాక్టర్ రజత్‌కుమార్, ఎన్‌బీఏ చైర్‌పర్సన్ సి.అచలేందర్ రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు, యూఎన్‌డీపీ సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ పడాలే పాల్గొన్నారు. దీంతో బయోడైవర్సిటీ ఫైనాన్స్ ఇనీషియేటివ్ ప్రాజెక్ట్ ద్వారా బయోఫిన్ ఫైనాన్స్ పరిష్కారాల నిమిత్తం వ్యవసాయరంగంలో 'మెయిన్‌స్ట్రీమింగ్ బయోడైవర్సిటీ ఇన్ పబ్లిక్ ఫైనాన్స్' ప్రాజెక్ట్ అమలు ప్రారంభమైంది. తొలుత వ్యవసాయరంగంతో మొదలుపెట్టి రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 'యాక్సెస్ అండ్ బెనిఫిట్ షేరింగ్' ఇంకా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ వంటివి అమలు చేయనున్నారు. కొన్నేళ్ల క్రితమే యూఎన్‌డీపీ భాగస్వామ్యంతో కేంద్ర పర్యావరణ, అటవీశాఖ బయోడైవర్సిటీ ఫైనాన్స్ ఇనిషియేటివ్‌పై గ్లోబల్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించడం తెలిసిందే. భారత్‌లో బయోఫిన్ అమల్లో ఎన్‌బీఏ సాంకేతిక సంస్థగా సహకారాన్ని అందిస్తోంది.



యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళా కూలీలు

ముమ్మరంగా 'సాగు' పనులు

మునుగోడు, కొండమల్లేపల్లి: రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచోట్ల రైతులు సాగు పనులు ముమ్మరం చేశారు. నైరుతి రుతుపవనాల రాకతో కురుస్తున్న వర్షాలు రైతుల్లో ఉత్సాహాన్ని నింపాయి. దీంతో విత్తనాలు విత్తే పనిలో రైతులు బిజీ అయ్యారు. మెట్టపంటలు వేసే రైతులు దుక్కి దున్నకం, అచ్చుతోలడం, విత్తనాలు పెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షం కురువని ప్రాంతాలలోని రైతులు పొడిదుక్కిలో సైతం విత్తనాలు పెడుతున్నారు.

వడివడిగా నైరుతి..!

▶ మొదటి పేజీ తరువాయి

7.6 కిలోమీటర్ల ఎత్తువరకు వ్యాపించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పడనున్నాయి. శనివారం కొన్ని ప్రాంతాల్లో, ఆదివారం చాలాచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కావొచ్చని, ఉత్తర తెలంగాణ జిల్లాలతోపాటు నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేట, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రుతుపవనాల ప్రవేశంతో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గిపోయాయి. శుక్రవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత 37.0 డిగ్రీల సెల్సియస్ నల్లగొండలో, కనిష్ట ఉష్ణోగ్రత 22.2 డిగ్రీల సెల్సియస్ మెదక్‌లో నమోదైంది.

రాష్ట్రంలో అధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు.. (సెం.మీ.లలో)

ప్రాంతం	జిల్లా	వర్షపాతం
రాజేంద్రనగర్	రంగారెడ్డి	7.03
మస్త్యాల	సిద్దిపేట్	3.75
రాజాపేట్	భువనగిరి	3.23
తుర్కయాంజాల్	రంగారెడ్డి	3.18
వెర్కట్‌పల్లి	భువనగిరి	3.18

కోర్టుకు హాజరైన అజహరుద్దీన్

సాక్షి, హైదరాబాద్: కోర్టు ధిక్కరణ కేసులో భాగంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు, మాజీ క్రికెటర్ అజహరుద్దీన్ శుక్రవారం హైకోర్టులో విచారణకు హాజరయ్యారు. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహించే లీగ్ మ్యాచ్‌ల్లో పాల్గొనేందుకు నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్‌ను అనుమతించాలని 2021లో హైకోర్టు ఆదేశాలిచ్చింది. అయినా ఆదేశాలను హెచ్‌సీఏ అమలు చేయకపోవడంతో నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఉద్దేశపూర్వకంగానే ఆదేశాలను పాటించడం లేదని పేర్కొంది. ఈ పిటిషన్‌పై ఏప్రిల్‌లో విచారణ చేపట్టిన జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం.. జూన్ 23న హాజరై వివరణ ఇవ్వాలని అజహరుద్దీన్‌ను ఆదేశించగా..ఆయన కోర్టుకు హాజరయ్యారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. విచారణకు రెండు వారాలకు వాయిదా వేశారు. ఆ విచారణకూ అజహరుద్దీన్ హాజరుకావాలని ఆదేశించారు.

'శ్రీవాణి' నిధులపై శ్వేతపత్రం

- నిరాధార ఆరోపణలు నమ్మొద్దు
- సందేహాలుంటే నివృత్తి చేసేందుకు మేం సిద్ధం
- వెంకన్న భక్తులకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి విజ్ఞప్తి



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి

తిరుమల: శ్రీ వేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టు (శ్రీవాణి) నిధులపై టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డితో కలిసి శ్వేతపత్రం విడుదల చేశారు. టీటీడీ బోర్డు తీర్మానం ప్రకారం.. సనాతన హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా పురాతన దేవాలయాల పునరుద్ధరణ, కొత్త ఆలయాలు, చిన్న ఆలయాల (భజన మందిరాలు) నిర్మాణానికి తోడ్పాటు అందించాలన్న ప్రధాన లక్ష్యంతో 2018 ఆగస్టు 28న శ్రీవాణి ట్రస్టు ఏర్పాటైందని చైర్మన్ తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం వారిరువురూ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 'టీటీడీ పరిపాలన పూర్తి పారదర్శకంగా నడుస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే టీటీడీ ఆస్తులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బంగారం డిపాజిట్లపై శ్వేతపత్రం విడుదల చేశాం. శ్రీవాణి నిధుల వినియోగంపై సందేహాలను నివృత్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. నిధులు దుర్వినియోగం అవుతు న్నాయని కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న నిరాధార ఆరోపణలను భక్తులు నమ్మొద్దు. ఈ నిధులను పురాతన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణాలకు వినియోగిస్తున్నాం' అని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు.

నిరాధార ఆరోపణలు చేస్తే చర్యలు : ఈఓ

టీటీడీపై నిరాధారమైన ఆరోపణలు చేసే ముందు లక్షలాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకోవాలని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి హితవు పలికారు. శ్రీవాణి ట్రస్టు నిధుల వ్యవహారంపై కొందరు పీఠాధిపతులు, వీహెచ్‌పీ నేతలు తనను కలిసినప్పుడు అన్ని పత్రాలు, బ్యాంకు ఖాతాలు, బ్యాలెన్స్ మొత్తం వివరాలు చూపానన్నారు. వాటిపై విశ్వహిందూ పరిషత్ సెంట్రల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు రాఘవులు కూడా పూర్తి సంతృప్తి వ్యక్తంచేశారని చెప్పారు. ఎటువంటి ఆధారాల్లేకుండా టీటీడీపై ఆరోపణలు చేసేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అన్ని అలవెన్సులు పెంపు

▶ మొదటి పేజీ తరువాయి

రూ.1,280 వరకు పెంచింది. డ్రైవర్లు, లిఫ్టు ఆపరేటర్ల రోజువారీ గౌరవ వేతనాన్ని రూ.125 నుంచి రూ.150కి పెంచింది. వివిధ ప్రభుత్వ శిక్షణా సంస్థలు, పోలీసు విభాగం, ప్రొటోకాల్ సిబ్బందికి ఇచ్చే పలు రకాల అలవెన్సులు కూడా పెరిగాయి.

విమాన ప్రయాణాల్లో వెసులుబాటు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అధికారిక పనుల నిమిత్తం విమానాల్లో ప్రయాణించడానికి సంబంధించిన నిబంధనలను కొంతమేర సడలిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విమాన ప్రయాణాన్ని ఎకానమీ క్లాస్‌లోనే చేయాల్సి ఉంటుంది. అయితే 15వ స్థాయి, అంతకన్నా ఎక్కువ స్థాయిలో ఉండే ఐఏఎస్ అధికారులకు మాత్రం బిజినెస్ క్లాస్‌లోనూ ప్రయాణించే వెసులుబాటు కల్పించింది. ఇక విమాన ప్రయాణ అనుమతి ఉన్న అధికారులందరికీ ఏసీ ఫస్ట్‌క్లాస్ రైలు ప్రయాణ సౌకర్యం కొనసాగనుంది.

రోజువారీ భత్యం పెంపు

అధికారిక పనులపై వెళ్లిన సందర్భంగా ఇచ్చే ఉద్యోగుల రోజువారీ భత్యాన్ని కూడా ప్రభుత్వం సవరించింది. ఇందుకోసం వేతన శ్లాబుల ఆధారంగా ఉద్యోగులను గ్రేడ్-1, 2, 3లుగా విభజించింది. అంతర్రాష్ట్ర ప్రయాణాల సందర్భంగా ఇచ్చే రోజువారీ భత్యాన్ని గ్రేడ్-1 ఉద్యోగులకు రూ.450 నుంచి రూ.600కు, గ్రేడ్-2 ఉద్యోగులకు రూ.300 నుంచి రూ.400కు, గ్రేడ్-3 ఉద్యోగులకు రూ.225 నుంచి రూ.330కు పెంచింది. అదే రాష్ట్రం బయటకు వెళ్లాల్సి వస్తే ఇవే గ్రేడ్‌ల ఆధారంగా భత్యాన్ని రూ.800, 600, 400కు పెంచారు. అదే విధంగా లాడ్జింగ్ చార్జీలను కూడా సవరించారు.

రాజధానిలో ప్రయాణ భత్యం కూడా

హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లోని ఉద్యోగులు అధికారిక పనుల నిమిత్తం చేసే ప్రయాణాలకు గాను కిలోమీటర్‌కు రూ.3 చొప్పున గరిష్టంగా రూ.60 వరకు క్లెయిమ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. తిరుగు ప్రయాణంలోనూ విడిగా క్లెయిమ్ చేసుకోవచ్చు. హైకోర్టు, ఇతర కోర్టులకు వెళ్లిన సందర్భంగా ప్రతి ఉద్యోగి రూ.75 క్లెయిమ్ చేసుకోవచ్చు. నెలలో గరిష్టంగా రూ.1,500 తీసుకోవచ్చు. కోర్టు సిబ్బంది న్యాయమూర్తుల నివాసాలకు వెళ్లినప్పుడు ప్రతిసారీ రూ.110, నెలకు గరిష్టంగా రూ.4,400 వరకు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ అదనపు భత్యం కార్యాలయాలకు త్వరగా వచ్చి, ఆలస్యంగా వెళ్లినప్పుడు, సెలవు రోజుల్లో విధులకు వచ్చినప్పుడు వర్తించదు.

బదిలీ రవాణా భత్యం సవరణ

ప్రభుత్వ ఉద్యోగులు బదిలీ అయిన సందర్భంలో ఇచ్చే రవాణా భత్యాన్ని కూడా సవరించారు. ఇందుకోసం వేతన స్కేల్ ఆధారంగా జోనల్, ఇతర జోన్లు, ఇతర రాష్ట్రాలకు బదిలీ సందర్భంగా రవాణా చార్జీలను నిర్ధారించారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు ట్రావెల్ గ్రాంట్‌ను కూడా సవరించారు.

అలవెన్స్, అడ్వాన్స్‌ల పెంపుపై టీజీవో హర్షం

సాక్షి, హైదరాబాద్: పీఆర్సీ కమిటీ చెప్పినట్లుగానే ఉద్యోగులకు అలవెన్స్‌లు, అడ్వాన్స్‌లను పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మమత, సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

పింఛన్‌దారులు మరణిస్తే...

రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారులు మరణిస్తే తక్షణ సాయం కింద ఇస్తున్న రూ.20 వేలను రూ.30 వేలకు పెంచుతూ జీవో నం 65 విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం సర్వీసు పింఛన్‌దారులు లేదా ఫ్యామిలీ పింఛన్‌దారులు మరణిస్తే వారి నామినీలకు అదే రోజున ఈ సాయాన్ని అందిస్తారు.

డ్రైవర్లు, లిఫ్ట్ ఆపరేటర్లకు గౌరవ వేతనం పెంపు



రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే డ్రైవర్లు, లిఫ్ట్ ఆపరేటర్ల రోజువారీ గౌరవ వేతనాన్ని రూ.125 నుంచి రూ.150కు పెంచారు. ఈ జీవో ప్రకారం అధికారుల ప్రైవేటు పనులపై ఇతర ప్రదేశాలకు వెళ్లినప్పుడు కూడా డ్రైవర్లకు రూ.150 చెల్లిస్తారు. అయితే తొలిసారి మాత్రమే ప్రభుత్వం భరిస్తుంది. ఆ తర్వాతి నుంచి సదరు అధికారి నుంచి వసూలు చేస్తారు. ఇక షెడ్యూల్డ్ ఏరియాల్లో పనిచేసే ఉద్యోగుల ప్రత్యేక పరిహార భత్యం (స్పెషల్ కాంపన్సేటరీ అలవెన్స్) కూడా పెరిగింది. మండల కేంద్రాల్లో ఈ ప్రత్యేక భత్యాన్ని వేతన శ్లాబుల ఆధారంగా రూ. 650 నుంచి రూ.1,280 వరకు పెంచారు. మండల కేంద్రాలు కాని గ్రామాలు, హామ్లెట్‌లలో రూ.780 నుంచి రూ.1,430 వరకు, కొండ ప్రాంతాల్లోని గ్రామాల్లో రూ.950 నుంచి రూ.1,660 వరకు పెంచారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉపయోగించే కార్లు, మోటారు సైకిళ్లు, సైకిళ్ల నెలవారీ నిర్వహణ ఖర్చులను కూడా సవరించారు. మోటార్ కారు లేదా సైకిల్ నిర్వహణకు నెలకు ఇస్తున్న మొత్తాన్ని రూ.1,050 నుంచి రూ.1,500కు పెంచారు. వికలాంగ ఉద్యోగులకు రవాణా భత్యం బేసిక్ పేపై 10 శాతం, గరిష్టంగా రూ.3 వేలకు పెరిగింది.

వడ్డీపై ఇంటి నిర్మాణ అడ్వాన్సు



కట్టిన ఇళ్ల కొనుగోలు, స్థలం కొని ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులకిచ్చే అడ్వాన్సును ప్రభుత్వం పెంచింది. ఆయా స్కేళ్ల పరిధిలోనికి వచ్చే ఉద్యోగులకు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు అడ్వాన్సు ఇవ్వనుంది. గరిష్టంగా ఈ మొత్తాన్ని లేదంటే బేసిక్ పేపై 72 ఇంతల మొత్తాన్ని ఇవ్వనుంది. ఇందుకోసం గ్రూప్-4 ఉద్యోగుల నుంచి సాలీనా 5 శాతం, ఇతరుల నుంచి 5.50 శాతం వడ్డీ వసూలు చేస్తుంది. ఐఏఎస్ అధికారులకు రూ.35 లక్షల వరకు అడ్వాన్సు ఇవ్వనుంది. వారి నుంచి కూడా 5.5 శాతం వడ్డీ వసూలు చేయనుంది. ఇంటి నిర్మాణ అడ్వాన్సును 300 విడతల్లో, మరమ్మతుల అడ్వాన్సును 90 విడతల్లో, స్థలం కొనుగోలు అడ్వాన్సును 72 విడతల్లో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

కారు కొనుగోలు, పెళ్లి అడ్వాన్సులు..



రూ.54,220 బేసిక్, ఆ పైన వేతనం ఉన్న ఉద్యోగులకు కారు కొనుగోలు కోసం రూ.9 లక్షల అడ్వాన్సు ఇస్తుంది. ఈ మొత్తాన్ని 135 విడతల్లో 5-5.5 శాతం వడ్డీతో తిరిగి వసూలు చేస్తుంది. బేసిక్‌పే రూ.32,810 పైన ఉన్న ఉద్యోగులకు మోటార్‌సైకిల్ కొనుగోలుకు రూ.లక్ష అడ్వాన్సు ఇస్తుంది. ఇక కుమారుల వివాహానికి క్లాస్-4 ఉద్యోగులైతే రూ. 2 లక్షలు, ఇతరులకు రూ.3 లక్షలు, కుమార్తెల వివాహానికి రూ.2.5 లక్షలు, రూ.4 లక్షల చొప్పున ఇస్తుంది. వ్యక్తిగత కంప్యూటర్ అడ్వాన్సు కింద రూ.50 వేలు, పండుగ అడ్వాన్సు కింద క్లాస్-4 ఉద్యోగులకు రూ.6 వేలు, ఇతరులకు రూ.8,500, నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు ఎడ్యుకేషన్ అడ్వాన్సు కింద రూ.15,500 ఇస్తారు.

ప్రొటోకాల్ ఉద్యోగులకు 15% స్పెషల్ పే



ప్రొటోకాల్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు స్పెషల్ పే కింద బేసిక్‌పే మీద 15 శాతాన్ని అదనంగా చెల్లిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల పరిధిలోని శిక్షణా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, శిక్షకులకు స్పెషల్ పే, ప్రోత్సాహకాలను మొదటి వేతన సవరణ కమిషన్ సిఫారసు చేసిన విధంగా వేతనాలను పెంచి చెల్లించనుంది. ఉద్యోగుల ప్రయాణ భత్యాన్ని (టీఏ) కూడా ప్రభుత్వం సవరించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం రూ.26,410-రూ.78,820 వేతన స్కేల్ పరిధిలోనికి వచ్చే ఉద్యోగులు కనీసం నెలలో 15 రోజుల పాటు పర్యటిస్తే మండల కేంద్రాల్లో అయితే రూ. 600, ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలోని మూడు మండలాల పరిధిలో పర్యటిస్తే రూ. 700, రెవెన్యూ డివిజన్ మొత్తానికి రూ. 800 చొప్పున చెల్లిస్తారు. 20 రోజుల పాటు పర్యటిస్తే రూ.800, 900, 1,000 చొప్పున చెల్లిస్తారు. రూ.27,130-80,960 వేతన స్కేల్ పరిధిలోనికి వచ్చే ఉద్యోగులు నెలలో కనీసం 15 రోజులు పర్యటిస్తే రూ.800, 900, 1,000 చొప్పున, 20 రోజులు పర్యటిస్తే రూ.900, 1,000, 1,200 చొప్పున టీఏ చెల్లిస్తారు. పోలీసు కానిస్టేబుళ్లు, ఆక్టోపస్, యాంటీ నక్సల్స్ స్క్వాడ్, కౌంటర్ ఇంటిలిజెన్స్, ఎస్ఐబీ, ఏసీబీ తదితర విభాగాల్లో పని చేస్తున్న పోలీసు సిబ్బందికి స్పెషల్ అలవెన్సులు పెంచారు.

బృందాలుగా భక్తులను పంపేలా..

చిరుత దాడి నేపథ్యంలో ఆ మేరకు ఏర్పాట్లు చేశామన్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల: అలిపిరి కాలినడక మార్గంలో ఏడో మైలు వద్ద బాలుడిపై చిరుత దాడి చేసిన ప్రదేశాన్ని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈవో మీడియాతో మాట్లాడుతూ.. దాడి చేసింది పిల్ల చిరుత కావడంతో బాలుడికి ప్రాణాపాయం తప్పిందన్నారు. దాడి జరిగిన సమయంలో భక్తులు పెద్దగా అరవడం, రిపీటర్ స్టేషన్ నుంచి లైట్లు వేయడంతో చిరుత బాలుడిని వదిలి వెళ్లిపోయిందన్నారు. అటవీశాఖ అధికారులు చిరుత సంచారాన్ని గుర్తించారని, అలిపిరి గాలిగోపురం నుంచి నరసింహస్వామి గుడి వరకు చిరుత సంచరిస్తున్నట్టుగా తెలుస్తోందని చెప్పారు. ఈ కారణంగా రాత్రి 7 గంటల తరువాత అలిపిరి నడక మార్గంలో గాలిగోపురం నుంచి 200 మంది భక్తులను ఒక బృందంగా కలిపి పంపేలా ఏర్పాట్లు చేశామన్నారు. వీరితోపాటు సెక్యూరిటీ గార్డ్ ఉంటారని చెప్పారు. చిన్నపిల్లలను బృందం మధ్యలో ఉంచుకుని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుతను పట్టుకునేందుకు ఏర్పాట్లు చేశామని, ఇందుకోసం కెమెరా ట్రాప్స్ సిద్ధం చేసినట్లు చెప్పారు. శ్రీవారి మెట్టు మార్గంలో సాయంత్రం 6 గంటల వరకు, అలిపిరి మార్గంలో రాత్రి 10 గంటల వరకు భక్తులను అనుమతిస్తారని తెలిపారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఘాట్ రోడ్లలో వెళ్లే ద్విచక్ర వాహనదారుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై ఆలోచిస్తున్నట్లు చెప్పారు.

సాక్షి
కరీంనగర్
శనివారం | 24 | జూన్ | 2023



డిపోను సందర్శించిన ఈడీ

విద్యానగర్: కరీంనగర్ - 2డిపోను ఆర్టీసీ జోన్ ఈడీ వినోద్‌కుమార్ సందర్శించారు. డిపోను మరింత లాభాల్లోకి తేవాలన్నారు. డిప్యూటీ డివిజన్ మేనేజర్ భీమ్‌రెడ్డి, మేనేజర్ మల్లయ్య పాల్గొన్నారు.



పత్తిధర రూ.7,150

జమ్మికుంట: జమ్మికుంటలో పత్తి రూ.7,150 పలికింది. మార్కెట్‌కు 254 క్వింటాళ్ల పత్తిని తెచ్చారు. మోడల్ ధర రూ.7,100, కనిష్ట ధర రూ.6,900 పలికింది.

గరిష్టం/కనిష్టం
34.0/25.0

వాతావరణం

జిల్లాలో నేడు ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. ఎండ తీవ్రత తగ్గుతుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

స్థలం ఒకటి.. పర్మిషన్లు రెండు

- అదే భూమికి హద్దులు మార్చి రిజిస్ట్రేషన్
- టీఎస్ బీపాస్‌ను బురిడీ కొట్టిస్తున్న ఘనులు
- ఇద్దరి ఇళ్ల దరఖాస్తు ఆమోదించిన టౌన్‌ప్లానింగ్
- సైట్ వెరిఫికేషన్‌లో లోపాన్ని వాడుకుని మోసాలు
- భూముల కబ్జాకు 'బుల్డోజర్ గ్యాంగ్' కొత్త ఎత్తుగడ



తీగలగుట్టపల్లిలో ఇల్లు కూల్చిన బుల్డోజర్ (ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: 'తీగలగుట్టపల్లిలో శ్రీనివాస్‌కు తనతండ్రి నుంచి రెండుగుంటల భూమి వారసత్వంగా సంక్రమించింది. ఇటీవల టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఇంటి నిర్మాణానికి పూనుకున్నాడు. అదే సమయంలో ఈస్థలం తమదని, ఇంటి నిర్మాణ అనుమతి పత్రాలు ఉన్నాయని చూపి కొందరు ఆయన్ను అక్కడి నుంచి తరిమేశారు. బాధితుడు టౌన్‌ప్లానింగ్, కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.'' ఇది.. నగరంలో చాలా మందిని వేధిస్తున్న సమస్య.

కరీంనగర్‌లో 'బుల్డోజర్ గ్యాంగ్' స్థలాలనూ కాజేస్తోంది. టీఎస్ బీపాస్‌లోని లోపాన్ని ఆసరా చేసుకుని బలహీనుల జాగా కబ్జాచేస్తోంది. విలీన గ్రామాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది.

ఏంటి సమస్య?

నగరంలో నివసించే ఎవరైనా ఇల్లు నిర్మించాలనుకుంటే టీఎస్ బీపాస్ ద్వారా భూమి రిజిస్ట్రేషన్, లింక్, ఈసీ, మార్కెట్ వాల్యూ తదితర డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలి. ప్లాటు ముందు 30 ఫీట్ల రోడ్డు ఉండాలి. లేకపోతే.. అధికారులు సూచించిన స్థలాన్ని కార్పొరేషన్‌కు రిజిస్ట్రేషన్ చేయాలి. తర్వాత టీఎస్ బీపాస్ దరఖాస్తును మూడుదశల్లో తనిఖీ చేస్తారు. కీలకమైన ఫీల్డ్ వెరిఫికేషన్ బాధ్యతలను డిప్యూటీ తహసీల్దార్‌కు అప్పగిస్తారు. ఆయన ప్లాటు ఉన్న స్థలానికి వెళ్లి సరిహద్దులు తనిఖీ చేసి ఫొటోతీసుకుని ఆమోదించాలి. తర్వాత భూమికి సంబంధించిన అన్నిపత్రాలు సరిగా ఉన్నాయో లేదో టైటిల్ వెరిఫికేషన్ అధికారులు విస్తీర్ణం, ఫీజు మదింపు కార్యక్రమాలను టెక్నికల్ వెరిఫికేషన్ ద్వారా టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్ణయిస్తారు.

హద్దులు మార్చి బురిడీ..

ఒకే ప్లాటుకు హద్దులు, కొలతలుమార్చి డబుల్ రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. దీనికి రిజిస్ట్రేషన్ అధికారులు అభ్యంతరం తెలపడం లేదు. అవే పత్రాలతో ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఫీల్డ్ వెరికేషన్ డ్యూటీలు డిప్యూటీ తహసీల్దార్లకు ర్యాండమ్‌గా కేటాయిస్తున్నారు. అందుబాటులో ఉన్న డిప్యూటీ తహసీల్దార్‌కు అప్పగిస్తున్నారు. ఒకే ప్లాటుకు ఇద్దరు అధికారులు తనిఖీచేసి, ఇంటి నిర్మాణానికి అనుమతి ఇచ్చేస్తున్నారు. ఇక్కడే అసలు సమస్య మొదలవుతుంది. వాస్తవానికి ఈ భూమికి అసలు యజమానికి ఒకరే ఉంటారు. అతని ఇంటి పక్క ప్లాటు సరిహద్దులు ప్లాటు నెంబర్లతో సహా పక్కాగా ఉంటాయి. కానీ.. హద్దులు మార్చి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు కేవలం 'అదర్స్' అన్న పదాలు మాత్రమే దర్శనమిస్తాయి. దీంతో రెండుపార్టీలు ప్లాటు తమదంటే తమదంటూ..గొడవలు పడాలి.

విలీన గ్రామాల్లో ఎక్కువ..

విలీనగ్రామాల్లో ఈ సమస్యలు అధికంగా వస్తున్నాయి. ఇద్దరి వద్దా పేపర్లు ఉండటంతో అధికారులు అనుమతులిచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఇలాంటి చోట 'బుల్డోజర్ గ్యాంగ్' ఎంటరవుతోంది. తర్వాత స్థానిక కార్పొరేటర్ వద్దకు పంచాయితీ చేరుతుంది. '30 ఏళ్ల కింద రూ.10 వేలకు రెండు గుంటలు కొన్నవు.. ఇప్పుడది రూ.50 లక్షలు అయ్యింది. ఎందుకు వాళ్లతో లొల్లి.. రూ.10 లక్షలు ఇస్తరు.. పట్టుకపోరి ' అని సెటిల్ చేస్తున్నారు. బాధితులు బలహీనులైతే ఇచ్చిన కాడికి తీసుకుని అక్కడ నుంచి వెళ్లిపోతున్నారు. కొందరు మాత్రం పోరాడుతున్నారు. గతంలో నగరంలో నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చిన బుల్డోజర్ గ్యాంగ్ ఈ అరాచకాలకు పాల్పడుతుండటం గమనార్హం.

పరిష్కారం ఇలా..

సమస్యకు పరిష్కారం టీఎస్ బీపాస్‌లోనే చేయవచ్చని పలువురు నిపుణులు సూచిస్తున్నారు. ఒకసారి ఇంటి నిర్మాణానికి అనుమతి ఇచ్చిన సమయంలో అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా హద్దులు నిర్ణయించాలి. అదే భూమి హద్దులు కాస్త అటూ ఇటూగా మార్చి దరఖాస్తు చేసుకున్న సమయంలో రెండూ ఏమాత్రం కలిసినా (ఓవర్ ల్యాప్).. అయితే వెంటనే అసలు యజమాని ఎవరో నిగ్గుతేల్చే పనిలో పడాలని స్పష్టంచేస్తున్నారు. ఇది కరీంనగర్ సమస్య మాత్రమే కాదని, రాష్ట్రవ్యాప్తంగా సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

20 మందితో ముఠా..

విలీనగ్రామాల్లో 20 మంది పోకిరీలు 'బుల్డోజర్ గ్యాంగ్'లో కీలకం. పగలంతా ఎక్కడెక్కడ ఖాళీ జాగాలు ఉన్నా యో చూసి యజమాని గురించి ఆరా తీస్తారు. ఓనరు బలహీనులైతే నకిలీ పత్రాలు సృష్టించి, ఇల్లు కడుతుండగా కూల్చేసి సెటిల్‌మెంట్‌కు రావాలని హెచ్చరిస్తున్నారు. అప్పనంగా లక్షలు వస్తుండటంతో అలవాటుపడ్డ కొందరు బరితెగిస్తున్నారు. ముఠాలో ఓ యువకుడు ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగానికి సెలెక్ట్ అయినా..చేరకుండా దందాలో కొనసాగడం విశేషం.

ఉత్సాహంగా ఒలింపిక్‌డే రన్



ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు, తదితరులు

- జెండా ఊపి ప్రారంభించిన మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లో ఒలింపిక్ డే రన్ శుక్రవారం ఉత్సాహంగా సాగింది. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో రన్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మేయర్ వై.సునీల్‌రావు రన్‌ను జెండా ఊపి, ఒలింపిక్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని అన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవలికాలంలో జిల్లా క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో రాణిస్తుండడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలో కరీంనగర్ జిల్లా క్రీడలకు నిలయంగా మారుతోందని అన్నారు. ఒలింపిక్స్‌స్ఫూర్తిని, లక్ష్యాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ఏటా జూన్ 23న రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రన్ స్టేడియం నుంచి ప్రారంభమై భగత్ సింగ్‌చౌరస్తా, ప్రతిమ మల్టీప్లెక్స్, తెలంగాణచౌక్ మీదుగా ఆర్ట్స్ కళాశాలలోని జాతీయజెండా వరకు సాగింది. ఎన్‌సీసీ కేడెట్లు పెద్దఎత్తున హాజరై రన్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, బేస్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా ఒలింపిక్ సంఘం కోశాధికారి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్.రమణాచారి, నిరంజనాచారి, ఏసీపీలు విజయ్‌కుమార్, తుల శ్రీనివాస్‌రావు, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ కలువకుంట్ల రామకృష్ణ, పెటా సంఘాల బాధ్యులు అంతటి శంకరయ్య, శ్రీనివాస్, ఎండీ యూనిష్‌పాషా, ఇన్‌చార్జి డీవైఎస్‌వో కిష్టయ్య పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

- ఎమ్మెల్యే ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

జమ్మికుంట: ప్రతీ బీజేపీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, కొంత మంది పని కట్టుకుని చేసే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఓబీసీ జిల్లా మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ అధ్యక్షతన హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గస్థాయి మోర్చాల సంయుక్త సమావేశం జరిగింది. ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. రాజేందర్ మాట్లాడుతూ.. బీజేపీ పార్టీకి మోర్చాలు పట్టుకొమ్మలని అన్నారు. మోర్చాలు బలంగా ఉంటేనే పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి కేంద్ర పథకాలను వివరించాలని సూచించారు. మోర్చాల సంయుక్త కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి, బింగి కరుణాకర్, పుప్పాల రఘు, చిన్నిమాధవ్, నరసింహరాజు, పొనగంటి శంకరయ్య, సంపెల్లి సంపత్‌రావు, రామిడి ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పక్కాగా మొదటి విడత చెకింగ్



గోడౌన్ వద్ద ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్ నికోలస్

కరీంనగర్‌అర్బన్: వచ్చేఅసెంబ్లీ ఎన్నికలకు ఈవీఎంల మొదటి విడత తనిఖీ పక్కాగా నిర్వహించాలని ఇంచార్జి కలెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశించారు. ఈవీఎం గోడౌన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. ఎఫ్ఎల్‌సీ జరుగుతుండగా సదరు ప్రక్రియను అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి పరిశీలించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్‌ను తెరిచి ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ నిర్వహిస్తున్నామని వివరించారు. ఎఫ్ఎల్‌సీని పరిశీలించడానికి ఈసీఐఎల్ నుంచి 15మంది ఇంజినీర్ల బృందం జిల్లాకు వచ్చారని తెలిపారు. కలెక్టరేట్ ఏవో జగత్ సింగ్, డిప్యూటీ తహసీల్దార్ (ఎలక్షన్స్) తహసీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మోసకారి ప్రభుత్వాన్ని తిప్పికొట్టండి



గడపగడపకూ కార్యక్రమంలో కవ్వంపల్లి

మానకొండూర్: మోసకారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మానకొండూరులో శుక్రవారం గడపగడపకూ కవ్వంపల్లి సత్యనారాయణ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అధికారంలోకి వస్తే భవిష్యత్తులో చేపట్టబోయే పనులను గురించి వివరించారు. ప్రజల సొమ్మును కేసీఆర్ తన కుటుంబానికి దోచిపెడుతున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గ్రామాల అభివృద్ధిని పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, ఎంపీటీసీ చలిగంటి సంపత్, జిల్లా అధికార ప్రతినిధి కే.శంకర్, రామిడి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

జమ్మికుంట: పల్లె దవాఖానా వైద్యులు సమయపాలన పాటించాలని, డిప్యూటీ డీఎంహెచ్‌వో మానిటరింగ్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో చల్లూరు, వీణవంక, ఇల్లందకుంట పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బందిలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని అన్నారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు న్యూట్రిషియన్, కేసీఆర్‌కిట్ ఇవ్వడం జరుగుతుందని, దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, పీహెచ్‌సీ వైద్యులు అరుణ, వరణ, తుల సీదాస్, హెల్త్‌ఆఫీసర్లు సాజిద్, పంజాల ప్రతాప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు వెళ్దాం రండి



మాట్లాడుతున్న డాక్టర్లు

కరీంనగర్‌టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయశాఖ ఆవో గామ్ చలో (రండి.. గ్రామాలకు వెళ్దాం) పేరుతో చేపట్టిన కార్యక్రమాన్ని ఈనెల 25న జిల్లాలో ప్రారంభిస్తున్నట్లు ఐఎంఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాంకిరణ్, డాక్టర్ వెంటక్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఐఎంఏహాల్‌లో మాట్లాడుతూ.. జిల్లాలో 33మంది వైద్యులు గ్రామాల దత్తతకు ముందుకువచ్చారని తెలిపారు. వీరిలో 22మంది 25న వైద్య శిబిరాలు ప్రారంభించనున్నారని వెల్లడించారు. జాతీయస్థాయిలో కరీంనగర్ జిల్లాలో మాత్రమే 22గ్రామాలు దత్తత తీసుకుని రికార్డు సృష్టించామని స్పష్టం చేశారు. ప్రతీనెల వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. వైద్యులు శేష శైలజ, ఆర్.వెంకటేశ్వర్లు, జె.సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

'గూగుల్'లో పంటపొలాలు

- ఏ సర్వే నంబర్ ఎక్కడ ఉందో మ్యాప్ ద్వారా తెలుసుకోవచ్చు
- రాష్ట్రంలోనే పైలట్‌ప్రాజెక్టుగా జిల్లాలో అమలు
- టీమ్‌అప్ సంస్థతో ఎస్ఐసీ కార్యాచరణ

భూ రికార్డుల నవీకరణలో తేలిన గణాంకాలు

సాగు విస్తీర్ణం: 3,40,450 ఎకరాలు
వ్యవసాయేతర భూమి: 33,007 ఎకరాలు
ప్రభుత్వ భూమి: 40,366, వక్ఫ్‌భూములు: 517 ఎకరాలు
అటవీ భూములు: 1,748, ఎకరాలు, ఖాతాల సంఖ్య: 2,00,075
మొత్తం సర్వేనంబర్లు: 3,51,545



కరీంనగర్ అర్బన్: అవును నిజమే. తెలియని చిరునామాను గూగుల్‌మ్యాప్ సాయంతో ఎలా చేరుకుంటున్నామో.. ఇక వ్యవసాయ భూముల సర్వే నంబర్‌ను మ్యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఏ గ్రామంలో ఏ సర్వే నంబర్ ఎక్కడుందో తెలుసుకుని, చేరుకోవడం ఇక సులువు. సదరు ప్రక్రియ తుది దశకు చేరుకోగా రాష్ట్రంలోనే జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్నారు. తొలుత అధికారుల పరిధిలో ఉండనుండగా ప్రజలకు ఈ సదుపాయం త్వరలో అందుబాటులోకి రానుంది. క్రాప్ బుకింగ్‌లో సమస్యలు వస్తుండటంతో పక్కాగా ఉండాలన్న ప్రభుత్వ ఆలోచన క్రమంలో సంబంధిత యాప్‌లో ఫీచర్‌ను రూపొందిస్తున్నారు. దేశంలోనే తొలిసారిగా సదరు ప్రక్రియ సాగుతుందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ఎస్ఐసీ సాయంతో సాంకేతికతను అనుసంధానించిన టీమ్‌అప్ అనే సంస్థ గూగుల్ మ్యాప్‌ను సిద్ధం చేస్తోంది. ఈ నెల 22న గూగుల్ సంస్థ ప్రతినిధులు జిల్లాకు వచ్చారు. సాంకేతిక పనులపై పర్యవేక్షించి, పలు సూచనలు చేశారు. మరోసారి త్వరలోనే జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో కరీంనగర్ అర్బన్ మినహా 15 మండలాలుండగా 313 గ్రామ పంచాయతీలున్నాయి. 3.40లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా వక్ఫ్, దేవాదాయ, ప్రభుత్వ, అటవీ భూమి, వ్యవసాయేతర భూములుండగా అన్నింటికీ సర్వే నంబర్లున్నాయి. ఏ ఏ సర్వే నంబర్ ఎక్కడ ఉందో తెలుసుకోవడం సులువవనుండగా అనేక సమస్యలకు పరిష్కారం లభించనుంది.

కొలతల ద్వారా సర్వే నంబర్ గుర్తింపు

టీమ్ అప్‌కు చెందిన 22మంది నిపుణులు క్రాప్ బుకింగ్ యాప్‌నకు మరింత ఆధునీకత జోడిస్తు న్నారు. కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, గంగాధర, రామడుగు, చొప్పదండి, మానకొండూరు, తిమ్మాపూర్, గన్నేరువరం, శంకరపట్నం, హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, చిగురుమామిడి, సైదాపూర్, వీణవంక మండలాల్లోని సర్వే నంబర్లను అనుసంధానించారు. గతంలో సర్వే ల్యాండ్ రికార్డు శాఖ సర్వే నంబర్లన్నింటినీ ఆన్‌లైన్ చేసిన సంగతి తెలిసిందే. సదరు వివరాలను క్రోడీకరించిన టీమ్ అప్ సంస్థ వేగంగా గూగుల్ యాప్‌కు అనుసంధానం చేస్తోంది. టీమ్ అప్ సీఈవో మస్తి కృష్ణచైతన్య, కో ఫౌండర్ రంజిత్‌రెడ్డి లు ఇప్పటికే ఏఈవోలకు శిక్షణనివ్వగా దాదాపు యాప్ ప్రక్రియ ముగింపు దశకు చేరింది. జూలై లేదా ఆగస్టులో రాష్ట్రమంతా సదరు ప్రక్రియను విస్తరించనున్నట్లు సమాచారం.

భూ సర్వేతోనే మరింత పారదర్శకత

క్రాప్ బుకింగ్ యాప్‌లో ఏర్పాటు చేసిన ఫీచర్‌తో సర్వే నంబర్‌ను చేరుకుంటున్నప్పటికీ ఒకే సర్వే నంబర్‌లో 5నుంచి 10మంది రైతుల వరకు ఉంటుండగా సబ్ డివిజన్ నంబర్లు ఉంటున్నాయి. క్రాప్ బుకింగ్‌లో ఏ సర్వే నంబర్ ఎక్కడ ఉందో, హద్దులు ఏమిటో తెలుస్తుండగా సబ్ డివిజన్ నంబర్లకు సంబంధించి ఉండవు. కేవలం సర్వే నంబర్‌కు సంబంధించి మాత్రమే హద్దులు ఉండనున్నాయి. ఒక సర్వే నంబర్‌లో పది మంది రైతుల వరకు ఉండగా సదరు సర్వే నంబర్‌ను ఉదాహరణకు 1 సర్వే నంబర్ అయితే 1ఎ, 1 బి, 1 సీ, 1డీ ఇలా పట్టాదారు పాసుపుస్తకాల్లో నమోదు చేశారు. ఒకటి సర్వే నంబర్ అయితే దాని పక్కన ఉన్న ఏ, బీ..లు సబ్ డివిజన్ అన్నమాట. సమగ్ర భూ సర్వే చేస్తే సబ్ డివిజన్లు కూడ సర్వే నంబర్లు కానున్నాయి. ప్రతి పట్టాదారు భూమికి సర్వే నంబర్‌ను కేటాయించనుండగా సదరు సర్వే నంబర్లకు హద్దులు ఏర్పడనుండగా గెట్లు జరపడం ఇక అసాధ్యం.

ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు

- జిల్లాలో 433 మందికి అందజేత
- త్వరలో టీచర్లకు శిక్షణ
- స్కూళ్ల సమగ్ర సమాచారం పొందుపర్చడమే లక్ష్యం

కరీంనగర్: పాఠశాలస్థాయిలో కార్పొరేట్ విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు అనుగుణంగా శుక్రవారం జిల్లాలో ఎంపికైన 433 పాఠశాలలకు డీఈవో జనార్దన్‌రావు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. జ్యోతినగర్‌లోని సెయింట్ అల్ఫోన్స్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు మధుసూదనాచారి, శ్రీనివాస్‌రెడ్డి, వేణుకుమార్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, సెక్టోరల్ అధికారులు కె.అశోక్‌రెడ్డి, అబ్దుల్‌బారి, ఆంజనేయులు, కృపారాణి, మహేందర్ పాల్గొన్నారు. సమగ్ర శిక్ష ద్వారా జిల్లాలోని పాఠశాలలకు ట్యాబ్‌లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతగా 435పాఠశాలలను గుర్తించి 443ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఇక నుంచి పాఠశాలల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్ చేసేందుకు ట్యాబ్‌ల ద్వారా సులభతరం కానుంది. పాఠశాలల సమాచారాన్ని మొబైల్, యూడైస్ యాప్ ద్వారా పొందుపర్చడంలో ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం ట్యాబ్‌ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. 10మంది విద్యార్థుల కన్నా ఎక్కువగా ఉన్న ప్రతిపాఠశాలకు ట్యాబ్‌లు అందజేసింది. జిల్లాలోని 367 ప్రాథమిక పాఠశాలలకు, 76 ప్రాథమికోన్నత పాఠశాలలకు 443 ట్యాబ్‌లు పంపిణీ చేశారు. 10మంది విద్యార్థుల కన్నా ఎక్కువ ఉన్న పాఠశాలకు ఒకటి, 165మంది కన్నా ఎక్కువ ఉంటే 2ట్యాబ్‌లు అందించారు. ఒక్కో ట్యాబ్‌కు రూ.14,300 ఖర్చును ప్రభుత్వం భరిస్తోంది.

త్వరలోనే శిక్షణ

ట్యాబ్‌లపై ఉపాధ్యాయులకు త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, పాఠశాల సమాచారం, మధ్యాహ్న భోజన వివరాలు, మన ఊరు-మన బడి సమాచారం, బాల బాలికల వివరాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఐఎస్ఎంఎస్ పోర్టల్, చైల్డ్ ఇన్ ఫో వివరాలను పొందుపరచనున్నారు. రానున్న రోజుల్లో పాఠశాలల పూర్తి సమాచారాన్ని డిజిటలైజేషన్ చేయనున్నారు. విద్యార్థుల ప్రవేశాలు, రోజువారీహాజరు, పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ, ఇతర అంశాలు నమోదుచేయడం ట్యాబ్‌ల ద్వారా సులభతరం కానుంది.



ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

433 ట్యాబ్‌లు అందజేశాం

జిల్లావ్యాప్తంగా 433ట్యాబ్‌లను మొదటిరోజే పంపిణీ చేయడం జరిగింది. మిగతా 10 ట్యాబ్‌లను త్వరలోనే అందిస్తాం. పాఠశాలకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని ట్యాబ్‌ల్లో సమగ్రంగా పొందుపరిచేలా ఉపాధ్యాయులకు త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నాం. దీంతో పాఠశాలల పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుంది.

– సీహెచ్ జనార్దన్‌రావు, డీఈవో

రైతుబంధుకు వచ్చేనెల 3వరకు గడువు

కరీంనగర్ అర్బన్: రైతుబంధు దరఖాస్తులను జూలై 3వరకు స్వీకరిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్ తెలిపారు. ధరణి పోర్టల్‌లో 2,00,075 మంది రైతులుండగా 1,82,885 మంది బ్యాంకు ఖాతాలు సమర్పించారని వివరించారు. ఇప్పటివరకు వివరాలు అందించినవారి లెక్కప్రకారం జిల్లాకు రూ.175.63కోట్లు రానుండగా మరో 17,190 మంది వివరాలు ఇవ్వాల్సి ఉందని వెల్లడించారు. వివరాలివ్వనివారిలో అత్యధికంగా మానకొండూరు మండలంలో 2,210 మంది ఉండగా తదుపరి గంగాధర 1,754, అత్యల్పంగా కరీంనగర్ అర్బన్‌లో ముగ్గురు ఉన్నారని పేర్కొన్నారు. ఈ నెల 18వరకు పట్టాదారుగా నమోదైన వారందరూ రైతుబంధుకు అర్హులని,దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకాన్ని స్థానిక ఏఈవోకు అందజేయాలని, బ్యాంకు వివరాలు మార్చుకోవాలనుకునేవారు, డీబీటీ ఫెయిల్ అని డబ్బులు జమకాని వారూ సంప్రదించాలని కోరారు.

బ్యూటీషియన్ కోర్సు పేరుతో మోసం?

- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారికి ఫిర్యాదు చేసిన ఐఎంఏ

కరీంనగర్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఓ ఎంబీబీఎస్ డాక్టర్ క్లినికల్ కాస్మొటాలజీపై వర్క్‌షాపులు నిర్వహిస్తూ, సర్టిఫికెట్లు జారీ చేస్తామని ప్రచారం చేయడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అసలు ఎలాంటి అర్హత లేనివారికి శిక్షణ పేరుతో సర్టిఫికెట్లు ఇచ్చి మార్కెట్‌లోకి పంపితే పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే బ్యూటీ పార్లర్లు, సెలూన్లు, బరువు తగ్గించే కేంద్రాలు సరైన స్టెరిలైజేషన్ లేకుండా నిర్వహించడం, నైపుణ్యాలు లేకుండా శస్త్రచికిత్సలు చేస్తుండడం భయాందోళన కలిగిస్తోంది. సదరు డాక్టర్ సర్టిఫికెట్ కోర్సులు ప్రవేశపెట్టి స్టెరాయిడ్స్, యాంటీబయాటిక్స్ ఉపయోగించి అందాన్ని మెరుగుపరిచే కాస్మటాలజీ, డెర్మటాలజీ, హెయిర్ అండ్ స్కిన్ స్పెషలిస్టులుగా ప్రమోట్ చేస్తున్నాడు.అక్రమ మార్గంలో బ్యూటీ పార్లర్లు, సెలూన్లు నడుపుతుండగా.. వారి చేతుల్లో అందానికి మెరుగులు దిద్దుకుందామనుకునే వారు బలవుతున్నారు. ఎంబీబీఎస్ డాక్టర్ అర్హత లేని వ్యక్తులకు వర్క్‌షాపులు నిర్వహిస్తూ సర్టిఫికెట్లు జారీ చేసే విషయం వెలుగులోకి రావడంతోనే జిల్లా ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు రాంకిరణ్, వెంకటర్‌రెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

విద్యార్థినికి సంయుక్త కలెక్టర్ అభినందన



అభిజ్ఞను అభినందిస్తున్న సంయుక్త కలెక్టర్ నవీన్ నికోలస్

చొప్పదండి: మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని వలదాస్ అభిజ్ఞ జవహర్ నవోదయలో ఆరోతరగతిలో ప్రవేశానికి ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను సంయుక్త కలెక్టర్ నవీన్ నికోలస్ శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో కడారి రవికుమార్, మొలుమూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొలంగూర్‌వాసికి డాక్టరేట్



చార్లీ

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని మొలంగూర్‌కు చెందిన దామెర చార్లీ డాక్టరేట్ పొందారు. అసోసియేట్ ప్రొఫెసర్ హరీశ్‌కుమార్ వైష్ పర్యవేక్షణలో సినారియో ఆఫ్ వుమెన్ ఎంపవర్‌మెంట్ రిగార్డింగ్ పొలిటికల్ ఆస్పెక్ట్స్ ఆఫ్ జమ్మూ-కశ్మీర్ అనే అంశంపై ఆమె పరిశోధన చేసింది. దీనికి జార్ఖండ్‌కు చెందిన రాధా గోవింద్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించిందని తెలిపారు. తన పరిశోధనకు సహకరించిన అధ్యాపకులకు చార్లీ కృతజ్ఞతలు తెలిపారు.

భూ వివాదం పరిష్కరించాలని టవరెక్కిన వృద్ధుడు



మొండయ్యను తీసుకువస్తున్న పోలీసులు

జమ్మికుంట(హుజూరాబాద్): భూ వివాదం పరిష్కరించాలంటూ ఓ వృద్ధుడు విద్యుత్ టవరెక్కాడు. వివరాల్లోకి వెళ్తే.. జమ్మికుంట మున్సిపల్ పరిధి ధర్మారం గ్రామానికి చెందిన పోలు మొండయ్యకు తన అన్నదమ్ములతో భూ వివాదం ఉంది. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించారు. కానీ తనకు ఎలాంటి న్యాయం జరగడం లేదని మొండయ్య మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం ధర్మారం శివారులోని 33/11 కేవీ విద్యుత్ టవరెక్కాడు. స్థానికుల గమనించి, ముందుగా విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితుడితో మాట్లాడి, భూ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కిందికి దిగాడు. అతన్ని కుటుంబసభ్యులకు అప్పగించి, ఇంటికి పంపించారు.

స్వల్పకాలమే నయం







- వరుణుడి జాప్యంతో ఆందోళన వద్దు
- పంటల సాగుపై ఏఈవోలతో క్షేత్రస్థాయిలో ప్రచారం

కరీంనగర్ అర్బన్: ఇప్పటికే వర్షాలు కురిసి నేలలు మొలకలతో కళకళలాడాల్సి ఉండగా వరుణుడి జాప్యం సాగుకు ప్రతికూలంగా మారింది. ఈ క్రమంలో యాసంగి పంటల సీజన్‌ను ముందుకు జరపాలన్న ప్రభుత్వ ఆశలకు బ్రేక్ పడింది. కాగా స్వల్పకాలిక పంటలను సాగు చేస్తే త్వరలోనే పంట చేతికి రానుండగా సీజన్‌ను ముందుకు జరిపే అవకాశముంది. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు స్వల్పకాలిక రకాలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయశాఖను ఆదేశించింది. దీంతో ఏవో, ఏఈవోలు రైతులను అప్రమత్తం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్ సూచిస్తున్నారు.

అదను దాట లేదు..

రుతుపవనాలు ఆలస్యంగా ఉన్నప్పుడు పంటల ఎంపిక కీలకం. తక్కువ కాలపరిమితి గల రకాలను ఎంపిక చేసుకోవాలి. 10 నుంచి 15శాతం ఎక్కువ విత్తనాలను వేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. నీటి వినియోగం తక్కువగా ఉండే, బెట్ట పరిస్థితులను తట్టుకునే పంటరకాలను వేసుకోవాలి. అంతర లేదా మిశ్రమ పంటలను వేసుకోవాలి. అంతర పంటలలో ధాన్యపు పంటలకు బదులు పప్పుదినుసులు లేదా నూనెగింజలు సాగు చేసుకోవాలి. సోయా చిక్కుడు, పత్తి పంటలను తేలికపాటి నేలల్లో వర్షాధారపు పంటలుగా విత్తుకోకూడదని పేర్కొన్నారు.

వరి: వరిలో దీర్ఘ కాలికరకాలకు (140–150 రోజులు) జూన్ 20వరకు, మధ్యకాలిక రకాలకి (130–135 రోజులు) జూలై 10వరకు, స్వల్పకాలిక రకాలకు (120–125 రోజులు) జూలై చివరి వరకు వరి నార్లు పోసుకోవచ్చు. నేరుగా విత్తు పద్ధతులపై దమ్ముచేసి లేదా దమ్ము చేయకుండా సీడ్ కం ఫెర్టి డ్రిల్‌పై రైతాంగం దృష్టి సారించాలి.

పత్తి: జూలై 20వ తేదీ పత్తి విత్తనాలు వేసుకోవచ్చు. తేలిక నేలల్లో 50–60 మి.మీ, బరువు నేలల్లో 60–75 మి.మీల వర్షపాతం నమోదైన తర్వాతే విత్తనాలు వేసుకోవాలి. లేదా నేల 15 సెంటీమీటర్ల లోతు వరకు తడిసిన తర్వాత మంచి తేమలో పత్తి విత్తుకుంటే భూమిలో వేడి తగ్గి మొలక శాతం బాగుంటుంది. పత్తిలో అంతర పంటగా కంది మంచి లాభాలు ఇస్తుంది. కాబట్టి అంతర పంటల సాగు చేపట్టాలి. కంది పంటను పెసర, మినుము, వేరుశనగ, ప్రత్తి, ఆముదం, ఇతర పంటలతో అంతర పంటగా విత్తుకోవచ్చు. సరైన యాజమాన్య పద్ధతులు చేపట్టడం ద్వారా ఆగస్టు 15 వరకు కందిని విత్తుకోవచ్చని రైతాంగం గుర్తుంచుకోవాలి. జూన్ నెల చివరి వరకు సోయా విత్తుకోవచ్చు. సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టి జూలై మొదటి వారము వరకు కూడా సోయాలో మంచి దిగుబడులు సాధించవచ్చు.

మొక్కజొన్న: జూలై 15 వరకు మొక్కజొన్నను విత్తుకోవచ్చు. నీటి ఎద్దడిని మొక్కజొన్న తట్టుకోలేదు. కాబట్టి బోదె లేదా సాళ్ల పద్ధతి ఆచరించడం ద్వారా పంటకు ఎక్కువకాలం తేమ అందుబాటులో ఉంచవచ్చు. ఇక పెసర, మినుము జూలై 15 వరకు విత్తుకోవచ్చు. సరైన మొక్కల సంఖ్యను పాటించడం ద్వారా ఆశించిన దిగుబడులు పొందవచ్చు. ఇతర ఆరుతడి పంటలైన ఆముదాలు, పొద్దుతిరుగుడు, ఉలువలు జూలై 31 వరకు రైతాంగం సాగు చేసుకోవచ్చు. కాబట్టి ఆందోళన పడవలసిన అవసరం లేదని రైతులకు వివరిస్తున్నారు.

పోరాటయోధుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ



నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: జమ్మూ-కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కలిగించే ఆర్టికల్ 370ని రద్దు చేయాలని అవిశ్రాంతంగా పోరాడిన యోధుడు, జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. శుక్రవారం ముఖర్జీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కరీంనగర్‌ని పార్లమెంట్ కార్యాలయంలో బలిదాన్ దివస్ నిర్వహించారు. బీజేపీ నాయకులు ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. మైనారిటీ సంతుష్టీకరణ విధానాలు, ఓటు బ్యాంకు రాజకీయాలను ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. మన దేశంలో అలాంటి పద్ధతులను అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఏర్పాటు లక్ష్యంగా జనసంఘ్‌ను స్థాపించారని చెప్పారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు, జానపట్ల స్వామి, నరహరి లక్ష్మారెడ్డి, బండ రమణారెడ్డి, రాగి సత్యనారాయణ, ఎడమ సత్యనారాయణ రెడ్డి, కొండా వెంకట రెడ్డి, మాధవ రెడ్డి, ఈరెడ్డి తిరుమల్ రెడ్డి, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రేకుర్తిలో..

కరీంనగర్ పట్టణం 18వ డివిజన్ రేకుర్తిలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. నాయకులు గోదారి నరేష్, పింగిలి ప్రతాపరెడ్డి, నాంపల్లి శంకర్, మజీద్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగలను వెంబడించిన గ్రామస్తులు

- ఇప్పలపల్లిలో విద్యుత్ మోటార్ చోరీకి యత్నం

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని ఇప్పలపల్లిలో విద్యుత్ మోటార్ చోరీకి యత్నించిన గుర్తు తెలియని వ్యక్తులను గ్రామస్తులు వెంబడించారు. కానీ వారు తప్పించుకొని, పారిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. ఇప్పలపల్లిలో రైతులు సాగునీటి కోసం ఎస్సారెస్పీ కెనాల్‌కు విద్యుత్ మోటార్లు బిగించుకున్నారు. గురువారం రాత్రి పొలాల నుంచి తిరిగివస్తున్న రైతుకు కాలువ పక్కన మోటార్ సైకిల్ అనుమానాస్పదంగా కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం అందించాడు. వారు అక్కడికి రావడాన్ని చూసిన దుండగులు తాడికల్ వైపు పారిపోయారు. వెంబడించినా దొరకలేదు. శుక్రవారం దేవరాజీకు చెందిన వ్యవసాయ మోటార్ కనిపించలేదు. సమీపంలోని ఓ రైతుకు ఉప కాలువ పక్కన కనిపించింది. గురువారం రాత్రి గ్రామస్తులు వెంబడించడం వల్ల దొంగలు మోటార్‌ను పడేసి, వెళ్లిపోయినట్లు అనుమానిస్తున్నారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



పరందాములు (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): కేశవపట్నం ఠాణాలో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కూనమల్ల పరందాములు(56) గుండెపోటుతో మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. 1989 బ్యాచ్‌కు చెందిన పరందాములు శుక్రవారం హుజూరాబాద్ సబ్ జైలులో విధులు ముగించుకొని, ఆర్టీసీ బస్సులో కరీంనగర్‌లోని ఇంటికి వెళ్తున్నారు. కేశవపట్నం చేరుకోగానే ఛాతిలో నొప్పి వస్తోందంటూ ఇంటికి ఫోన్ చేసి, చెప్పారు. అక్కడే బస్సు దిగి, ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్ద చూపించుకున్నారు. పరిస్థితి విషమించడంతో ఎస్సై చంద్రశేఖర్ ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు కాపాడేందుకు ఎంత ప్రయత్నించినా ఆయన ప్రాణాలు దక్కలేదు. పరందాములుకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

విండో చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

శంకరపట్నం(మానకొండూర్): తాడికల్ సహకార సంఘం చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు డీసీవో శ్రీమాల తెలిపారు. సంఘం చైర్మన్ కేతిరి మధుకర్‌రెడ్డిపై గత మే 29న అవిశ్వాస నోటీస్‌ను తొమ్మిది మంది డైరెక్టర్లు అందించారన్నారు. ఈ మేరకు తాడికల్ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కానీ తొమ్మిది మంది డైరెక్టర్లు రావాల్సి ఉండగా ఎనిమిది మందే రావడంతో కోరం లేక అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించామని తెలిపారు. ఫలితంగా చైర్మన్‌గా మధుకర్‌రెడ్డి కొనసాగనున్నారు.

తల్లిదండ్రుల చెంతకు బధిర మహిళ

- భర్త వల్ల ఇబ్బందులతో సిద్దిపేట నుంచి కరీంనగర్ రాక

కరీంనగర్ క్రైం: ఆపదలో ఉండి, ఎటు వెళ్లాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్న ఓ బధిర మహిళను కరీంనగర్ సఖీ టీం కాపాడి, తల్లిదండ్రుల చెంతకు చేర్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 16న కొత్తపల్లి మండలంలోని చింతకుంట శ్రీరాములపల్లి ప్రాంతంలో ఓ మహిళ ఒంటరిగా ఉండటం చూసిన అంగన్‌వాడీ టీచర్ సఖీ కేంద్రానికి సమాచారమిచ్చింది. సఖీ టీం అక్కడికి చేరుకొని, మహిళను తమ కేంద్రానికి తీసుకెళ్లారు. సైగలు చేస్తుండటంతో ఆమెను బధిర మహిళగా గుర్తించారు. వాటిని అర్థం చేసుకునే నిపుణులను పిలిపించి, వివరాలు సేకరించారు. ఆ వివరాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసి, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం నుంచి శుక్రవారం ఆమె తల్లిదండ్రులను పిలిపించి, అప్పగించారు. భర్త చిరంజీవి వల్ల ఆమె ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి సీహెచ్.సంధ్యారాణి, సఖీ అడ్మినిస్ట్రేటర్ లక్ష్మిలు న్యాయసహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేకుర్తి షేకాబికాలనీకి చెందిన షేక్ మహమ్మద్(26) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. షేక్ మహమ్మద్ కిరాణ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు నెలలుగా మానసిక స్థితి బాగా లేక భార్య, పిల్లలుండగా మరో పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 17న ఉదయం ఇంటి ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకొని, ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనరగ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు హైదరాబాద్ తీసుకెళ్లాలని చెప్పడంతో ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి తండ్రి అన్వర్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కమాన్‌పూర్(మంథని): మండలంలోని జూలపల్లికి చెందిన బొడిగె సత్యనారాయణ గౌడ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సత్యనారాయణ గౌడ్ ట్రాలీ ఆటో నడపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా వాహనం నడపకపోవడంతోపాటు తాగుడుకు బానిసయ్యాడు. దీనికితోడు అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో గురువారం సాయంత్రం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య నవ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ మస్తాన్ పేర్కొన్నారు.

నేడు 'ట్రినిటీ'లో మెగా జాబ్‌మేళా

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలి పారు. రాష్ట్రంలోని 18 కంపెనీల్లో 1,100కు పైగా ఉన్న పలు ఉద్యోగాలను భర్తీ చేయనున్నారని అన్నారు. అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వదినపై మరిది దాడి

పెద్దపల్లిరూరల్: పెద్దకల్వలలో నర్ల స్వరూపపై దాడి చేసిన ఆమె మరిది మేకల దుర్గయ్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పెద్దకల్వలకు చెందిన దుర్గయ్య కొంతకాలంగా తన భార్య రజితతో తరచూ గొడవ పడుతూ ఆమెను కొడుతున్నాడు. అదే గ్రామానికి చెందిన రజిత సోదరి స్వరూప అడ్డువెళ్లి, దుర్గయ్యను పలుమార్లు నిలదీసింది. శుక్రవారం మళ్లీ రజితను కొడుతుండటంతో స్వరూప అడ్డువెళ్లగా ఆమెపై కర్రతో దాడి చేశాడు. ఈ ఘటనలో స్వరూపకు తీవ్ర గాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు దుర్గయ్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

మానకొండూర్: గన్నేరువరం మండలం మైలారానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై సురేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. డిగ్రీ చదువుతున్న యువతి గురువారం ఇంటి నుంచి వెళ్లి, కనిపించకుండా పోయింది. తమ కూతురు కనిపించడం లేదంటూ బాధితురాలి తల్లిదండ్రులు శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం తప్పదు'



మాట్లాడుతున్న హరిశంకర్

కరీంనగర్: కాంగ్రెస్, బీజేపీలకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని, తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను దశాబ్ది దగా అంటూ కాంగ్రెస్ నిరసన తెలపడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. శుక్రవారం మంకమ్మతోటలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ బండి సంజయ్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌లు బీఆర్ఎస్ పార్టీని, సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్‌లను టార్గెట్ చేస్తూ విమర్శలకు దిగడం మానుకోవాలని సూచించారు. దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనకుండా బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అమరవీరుల త్యాగాలను హేళన చేశారని పేర్కొన్నారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ను కరీంనగర్ ప్రజలు ఎప్పుడో మరిచిపోయారని, ఉనికి కోసమే ఆయన విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బండి సంజయ్ ఎంపీగా కరీంనగర్ జిల్లాకు, పార్లమెంట్ నియోజకవర్గానికి నయా పైసా అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు దిండిగాల మహేశ్, గడ్డం ప్రశాంత్‌రెడ్డి, మీర్ షౌకత్ అలీ, దీకొండ కుల్‌దీప్ వర్మ, వాజిద్, సాయికృష్ణ, ఆరె రవి, వొడ్నాల రాజు, వసంతరావు, సత్తినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ కిడ్స్ ప్లే స్కూల్ ప్రారంభం



పాఠశాలను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని 35వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో మానేరు విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హగ్స్ అండ్ హార్ట్స్ ఇంటర్నేషనల్ కిడ్స్ ప్లే స్కూల్‌ను మేయర్ సునీల్‌రావు శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నారని విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డిని అభినందించారు. విద్యారంగంలో 37 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో కరీంనగర్, జగిత్యాల జిల్లాలో ఏర్పాటు చేసిన 4 బ్రాంచిలు విజయవంతంగా నడుస్తున్నాయని డైరెక్టర్లు కడారి సునీతారెడ్డి, కృష్ణారెడ్డిలు తెలిపారు. అనంతరం మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్ బుచ్చిరెడ్డిలను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాజీ కార్పొరేటర్ తుమ్మల రమేశ్ రెడ్డి, ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, లయన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, పలు పాఠశాలల కరస్పాండెంట్‌లు, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'జిల్లా విద్యాధికారిపై చర్య తీసుకోండి'



సంయుక్త కలెక్టర్ నవీన్ నికోలస్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కరీంనగర్: జిల్లా విద్యాధికారి ప్రైవేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తున్నారని, వెంటనే చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సంయుక్త కలెక్టర్ నవీన్ నికోలస్‌కు వినతిపత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్‌లను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తుంటే జిల్లా విద్యాధికారి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. శ్రీ చైతన్య స్కూల్స్‌ను అనుమతి లేకుండా నడుపుతుంటే అండగా ఉంటూ ప్రైవేట్ ఫీజులు, పుస్తకాల దందాకు సహకరిస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిపై స్పందించడం గానీ పర్యవేక్షణ గానీ చేయడం లేదన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గరల్స్ కన్వీనర్ మక్కపల్లి పూజ, జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, ఉపాధ్యక్షుడు తిప్పారపు రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నం హయాంలోనే కరీంనగర్ అభివృద్ధి

- బీఆర్ఎస్ నాయకులు దోచుకుతింటున్నారు..
- డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న పద్మాకర్ రెడ్డి

విద్యానగర్(కరీంనగర్): కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ హయాంలోనే కరీంనగర్ అభివృద్ధి జరిగిందని, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నాయకులు దోచుకుతింటున్నారని ఆరోపించారు. శుక్రవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ తన స్వప్రయోజనాల కోసం నేషనల్ హైవే 563 అలైన్‌మెంట్ మార్చిన విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు మరిచిపోయి, పొన్నం ప్రభాకర్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. అభివృద్ధిపై ఆయన సవాల్‌ను స్వీకరించి, బీఆర్ఎస్ నాయకులు చర్చకు రావాలన్నారు. పొన్నం ఎంపీగా ఉన్న కాలంలో కరీంనగర్, సిరిసిల్లలో కేంద్రీయ విద్యాలయాలు, కరీంనగర్ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు, 150 పడకలతో మాతా శిశు సంరక్షణ కేంద్రం, ఎలగందుల్ ఖిల్లాలో లైట్ సౌండ్ ప్రారంభించారని తెలిపారు. కరీంనగర్‌లో పాస్‌పోర్టు కార్యాలయం, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి టెంపుల్ టూరిజం కారిడార్, కొండగట్టులో వసతి గృహం ఏర్పాటు చేయించిన ఘనత ఆయనదేనని పేర్కొన్నారు. ఇప్పటికేనా అబద్ధాలు చెప్పి, ప్రజలను మభ్యపెట్టాలని చూడటాన్ని మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్, నాయకులు సలీముద్దీన్, గోపాల్ రెడ్డి, వరహాల చారి, పంద్రాల లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో ఒలింపిక్ డే ఉత్సవ్



ఒలింపిక్ లోగో రూపంలో విద్యార్థులు, జెండాతో నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): స్థానిక అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ మైదానంలో ఒలింపిక్ డే ఉత్సవ్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒలింపిక్ లోగో రూపంలో నిల్చొని, ఆకట్టుకోగా.. విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి జాతీయ జెండాతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఒలింపిక్ క్రీడలు క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తి, దేశభక్తి, మానసికోల్లాసం పెంపొదిస్తాయన్నారు. అలాగే ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని చెప్పారు. ధ్యాన్‌చంద్, మిల్కాసింగ్, అభినవ్ బింద్రా, విజేందర్ సింగ్, మేరీకోమ్, కరణం మల్లీశ్వరి, రాజ్యవర్ధన్ రాథోడ్, పీవీ సింధు, నీరజ్ చోప్రా వంటి క్రీడాకారులు ఒలింపిక్స్‌లో సత్తా చాటి, పతకాలు సాధించారని పేర్కొన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని, రాబోవు తరాల క్రీడాకారులు అద్భుతంగా రాణించాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ముగ్గురి రిమాండ్

ధర్మపురి: పాత కక్షలను మనుసులో పెట్టుకొని కత్తితో దాడిచేసిన సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దత్తాత్రి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణానికి చెందిన ముప్పట్ల నిరంజన్, బత్తిని వినయ్‌కు ఇదే పట్టణానికి చెందిన గుర్రాల గణేశ్, కోట రాజన్న, మేకల గంగాధర్‌కు పాత కక్షలున్నాయి. ఈనెల 10న ముప్పట్ల నిరంజన్, బత్తిని వినయ్ సంతలో చిట్టీ వసూలు చేస్తుండగా గుర్రాల గణేశ్, కోట రాజన్న, మేకల గంగాధర్ కత్తితో దాడిచేశారు. దీంతో నిరంజన్, వినయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై నిరంజన్ సోదరుడు ముప్పట్ల గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అప్పటినుంచి వారు తప్పించుకొని తిరుగుతుండగా శుక్రవారం ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యువ రైతు ఆత్మహత్యాయత్నం

కోనరావుపేట(వేములవాడ): తన భూమిలో వేసిన బోరుపై ఇతరులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని మనస్తాపానికి గురైన ఓ యువ రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలంలోని మర్తనపేట గ్రామానికి చెందిన గుర్రం చిన్న రాజిరెడ్డి కుమారుడు నవీన్ (30) గ్రామ శివారులోని తనకున్న నాలుగెరాల భూమిలో వారం రోజుల క్రితం బోరు వేశాడు. ఇదే గ్రామానికి చెందిన భూ యజమానులు శ్రీనివాసరావు, రఘుపతిరావు తమ బోరుకు దగ్గరగా బోరు వేసి, వాల్టా చట్టాన్ని ఉల్లంఘించారంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం నవీన్ బోర్ మోటార్‌ను దించేందుకు రాగా విచారణకు వచ్చిన ఆర్ఐ మోటార్ వైరును కట్ చేశారు. దీంతో మనస్తాపానికి గురైన నవీన్ అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సాగు పనులు ముమ్మరం

- అన్నదాతల్లో నెలకొన్న సంబురం
- రుతుపవనాల రాకతో వర్షాలు
- నారుమడులకు పొలాలు దున్నుతున్న రైతులు
- ఇప్పటికే వెయ్యి ఎకరాల్లో పత్తి సాగు



కరీంనగర్‌రూరల్: వానాకాలం సీజన్‌లో వ్యవసాయ పనులు జోరందుకుంటున్నాయి. ఇప్పటికే నెలరోజులు గడిచిపోగా గురువారం తెలంగాణలో నైరుతి రుతుపవనాల రాకతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరిసింది. దీంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. గత నెల 25న రోహిణికార్తె ప్రవేశంతో వానాకాలం సీజన్ ప్రారంభమైంది. తొలకరి వర్షాలకు పలువురు రైతులు దుక్కులు దున్ని పత్తి విత్తనాలు వేశారు. మరికొందరు రైతులు వరినార్లు పోసుకున్నారు. కరీంనగర్ మండలంలో వానాకాలంలో సాగుచేసే పంటల ప్రణాళికను వ్యవసాయాధికారులు రూపొందించారు. పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు.

16వేల ఎకరాల్లో పంటల సాగు..

కరీంనగర్‌మండలంలో మొత్తం 16,192 ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నట్లు వ్యవసాయశాఖ పంటల ప్రణాళిక రూపొందించింది. ప్రధాన పంటగా వరి, పత్తిపంటలను సాగుచేస్తున్నారు. వరిపంట సాధారణ సాగు విస్తీర్ణం 10,837 ఎకరాలు కాగా చెరువులు, కుంటలు, బావుల్లో పుష్కలంగా నీళ్లుండడంతో అంచనాలకు మించి సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనావేస్తున్నారు. ఇప్పటికే పలువురు రైతులు వరినార్లు పోసుకున్నారు.

పత్తికి కలిసొచ్చేనా?

వరితో పాటు పత్తిపంట సాగుచేసేందుకు రైతులు ముందుకొస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో 4,300 ఎకరాల్లో సాగుచేస్తున్నట్లు అధికారులు అంచనావేస్తున్నారు. గతేడాది పత్తి పంటకు పలు తెగుళ్ల ఆశించడంతో దిగుబడి తగ్గింది. అంతేకాకుండా మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.10వేల ధర మాత్రమే పలికింది. ధర తగ్గడంతో పలువురు రైతులు పత్తిని విక్రయించకుండా ఇళ్లల్లోనే నిల్వచేసుకుని విడతలవారీగా విక్రయిస్తున్నారు. గతేడాది నష్టాలు మిగిల్చిన పత్తి సాగు ఈ ఏడాది కలిసి వస్తుందనే ఆశతో మళ్లీ సాగుచేసేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే ఈనెల మొదటివారంలో కురిసిన తొలకరి వర్షాలకు 1,050 ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న చిరుజల్లులకు పలువురు రైతులు విత్తనాలు విత్తుతున్నారు.

కరీంనగర్ మండలంలో పంటల సాగు అంచనా(ఎకరాల్లో)..	
వరి	10,837
పత్తి	4300
మొక్కజొన్న	854
పెసర	48
కందులు	72

ఎరువుల ప్రణాళిక (మెట్రిక్‌టన్నులు)	
యూరియా	1104
డీఏపీ	810
పొటాష్	405
కాంప్లెక్స్	1214

నకిలీ విత్తనాల నియంత్రణకు టాస్క్‌ఫోర్స్



నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ, పోలీస్, రెవెన్యూశాఖల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటుచేశాం. పత్తి విత్తనాలను ఎంపిక చేసుకోవడంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. విత్తన డీలర్లతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి నకిలీ విత్తనాలు విక్రయించకుండా చర్యలు చేపట్టాము. నకిలీ విత్తనాలను విక్రయించినట్లు తెలిస్తే అధికారులకు సమాచారమివ్వాలి.

– బి. సత్యం, ఏవో, కరీంనగర్

8 ఎకరాల్లో పత్తి వేశాను



ఈనెల మొదటివారంలో కురిసిన వానకు ఎనిమిది ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశాను. వర్షాలు కురుస్తాయని ఆశపడితే నిరాశే మిగిలింది. 15రోజుల నుంచి వర్షాలు రాక పత్తి మొలకలు ఎండవేడికి వాడిపోతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పత్తిమొక్కలకు జీవం పోసే అవకాశముంది. అధికారుల సూచనలు పాటించి సాగు పనులు చేస్తున్నాం. గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ దిగుబడితో పాటు అధిక ధర పలకాలని ఆశిస్తున్నాం

– అనుముల రాజిరెడ్డి, పత్తిరైతు, చేగుర్తి

క్లుప్తంగా

సీఎం కేసీఆర్, మంత్రి గంగుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న దళిత మహిళలు

కొత్తపల్లి: మండలంలోని బద్దిపల్లిలో 137దళిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. 15ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమకు పట్టాలు మంజూరు చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ రాచమల్ల మధు, ఉపసర్పంచ్ రాచమల్ల మనోజ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఉప్పు రాజశేఖర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు తాండ్ర శ్రీనివాస్, నాయకులు నారాయణ, ప్రభాకర్, అంజయ్య, లక్ష్మయ్య, తిరుపతి, పర్శరాములు, రాజమల్లు, అంజయ్య, నరేశ్, మహేశ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ కార్పొరేటర్లు

కరీంనగర్‌టౌన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలపై బీజేపీ కార్పొరేటర్‌లను ఆహ్వానించనందుకు మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని ట్రైనీ కలెక్టర్ నవీన్ నికోలస్‌కు కార్పొరేటర్లు ఫిర్యాదుచేశారు. మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో సమావేశ మందిరం నిర్మించారని 21వ తేదీన సమావేశ మందిరం ప్రారంభోత్సవానికి బీజేపీ కార్పొరేటర్లను ఆహ్వానించకుండా మున్సిపల్ కమిషనర్ వ్యవహరించడం సరికాదన్నారు. అధికార పార్టీ సభ్యులను మాత్రమే కార్యక్రమానికి ఆహ్వానించి, తమను ఎందుకు విస్మరించారో తెలపాలన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కార్పొరేటర్లు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిల్లపు రమేశ్, కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబ్బాలశ్రీనివాస్, కార్పొరేటర్లురాపర్తి విజయ చొప్పరి జయశ్రీ, కోలగాని శ్రీనివాస్, కచ్చు రవి, కాసర్ల ఆనంద్, పెద్దపల్లి జితేందర్, బండ సుమ రమణారెడ్డి, నాగసముద్రం విజయలక్ష్మి నాగసముద్రం ప్రవీణ్ పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటే ఇదేనా?

కరీంనగర్‌టౌన్: 6 నెలలుగా రిటైర్డ్ ఉద్యోగుల బిల్లులు పెండింగ్ పెట్టడంతో వారు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని, ఇలాగే కాలయాపన చేస్తే ప్రజలు, రిటైర్డ్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని బీజేపీ విశ్రాంత ఉద్యోగుల కన్వీనర్ లాల మురళి, జాయింట్ కన్వీనర్ రాగి సత్యనారాయణ ఆవేదన వ్యక్తంచేశారు. వీటికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించి తక్షణమే రిటైర్డ్ ఉద్యోగుల మెడికల్ బిల్స్ విడుదల చేయాలని, లేకపోతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆఖరి సఫర్ పథకంలో అంత్యక్రియలు

కరీంనగర్‌కార్పొరేషన్: ప్రముఖ న్యాయవాది కన్నయ్య సోదరుడు భాస్కర్ మృతదేహానికి ఆఖరి సఫర్ పథకంలో భాగంగా అంత్యక్రియలు నిర్వహించారు. ప్రమాదంలో మృతిచెందడంతో కరీంనగర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలుచేస్తున్న రూ.1కే అంత్యక్రియలను శుక్రవారం నిర్వహించినట్లు సోహన్‌సింగ్ తెలిపారు. ఈపథకం ఎంతోమంది పేదలకు వరంలా మారిందని 49వ డివిజన్ కార్పొరేటర్ సోహన్ సింగ్‌కమలిజ్‌కౌర్ పేర్కొన్నారు.

మెరిసిన జాతీయ పతాకం.. ఒలింపిక్ టార్చ్ ..



ఒలింపిక్ డే సందర్భంగా జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలింపిక్ డే రన్ ఆర్ట్స్ కళాశాలలోని జాతీయ పతాకం వద్దకు సాగింది. పలువురు ఎన్‌సీసీ కేడెట్స్ ఒలింపిక్ టార్చ్‌తో ఫొటోలు దిగారు. ఇలా పలువురు కేడెట్స్ ఫొటోలు దిగుతున్న సమయంలో అటు జాతీయ పతాకం గాలిలో రెపరెపలాడుతుండగా ఇటు ఒలింపిక్ టార్చ్‌తో సందడి చేసి ఆకట్టుకున్నారు.

– కరీంనగర్‌స్పోర్ట్స్

పోస్టల్ ప్రమాద బీమా చెక్కులు పంపిణీ



చెక్కు అందిస్తున్న చంద్రమోహన్

విద్యానగర్: తపాలా శాఖ ప్రవేశపెట్టిన ప్రమాద బీమా పథకంలో చేరి ఇటీవలన రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు బీమా మొత్తం రూ.10లక్షలు, ప్రమాదాల బారినపడి గాయాలతో చికిత్సపొందిన ఐదుగురికి రూ.40వేల చొప్పున మంజూరు కాగా వారికి చెక్కులను శుక్రవారం కరీంనగర్ నార్త్ సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ పి.చంద్రమోహన్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ నార్త్ సబ్ డివిజన్ పరిధిలో 15,769 మంది ప్రమాద బీమా చేసుకున్నారని, ఈ సందర్భంగా వారిలో ముగ్గురు రోడ్డు ప్రమాదాల్లో మరణించారని, వివిధ ప్రమాదాల్లో ఐదుగురు గాయాలపాలై చికిత్సపొందారన్నారు. మరణించిన వారి కుటుంబాలు దరఖాస్తు చేసిన 10రోజుల్లోనే బీమామొత్తం నామినీ పేరున మంజూరైందని, వివిధ ఘటనల్లో గాయపడి ఆసుపత్రిలో చికిత్సపొందిన ఐదుగురికి రూ.40వేల చొప్పున మంజూరైందన్నారు. పోస్టాఫీసులో అందిస్తున్న ప్రమాద బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అసమర్థపాలనలో అన్ని అవస్థలే



మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ

విద్యానగర్: రాష్ట్రంలో ప్రభుత్వ అసమర్థ పాలనతో విద్యావిధ్వంసమైందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ అన్నారు. శుక్రవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తొమ్మిదేళ్లలో విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాలను రాష్ట్రప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. విద్యా,వైద్యం కార్పొరేట్ పరమైందన్నారు. అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కేజీ టూ పీజీ ఉచిత విద్య ఉత్తమాటేనని రాష్ట్రప్రభుత్వం నేడువిద్యతో వ్యాపారంచేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. మన ఊరు మనబడి పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని, ఇందుకు రూ.7వేల కోట్లు కేటాయిస్తున్నామని ఆర్భాటంచేసిన సీఎం కేసీఆర్ ప్రకటనలకే పరిమితం అయ్యారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి చేతులు దులుపుకుంటే విద్యార్థులకు నాణ్యమైన విద్యఎలా అందుతుందన్నారు. ప్రాథమిక పాఠశాలకు ఉన్నవిలువ శాతవాహన యూనివర్సిటీకి లేకుండా పోయిందన్నారు. వెంటనే ప్రభుత్వం విద్యా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు పూసాల విష్ణు, నందు, నితీశ్, శ్రీవర్ధన్, అనూష, సంహిత్, రాకేశ్, అబ్దుల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రోత్సాహం



విద్యార్థులతో డీఈవో తదితరులు

కరీంనగర్: పదోతరగతిలో పరీక్ష ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను శుక్రవారం డీఈవో జనార్దన్‌రావు సమక్షంలో ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు అందించి అభినందించారు. క్లాస్‌మేట్ క్లబ్, కరీంనగర్ జోన్ చైర్మన్ సంయుక్త ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయంలో డీఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 10 జీపీఏ సాధించడం అభినందనీయమన్నారు. పది ఫలితాల్లో జిల్లావ్యాప్తంగా ఐదుగురు విద్యార్థులు మహమ్మద్ అబ్దుల్ శిజాన్, వర్షిణి, మహేందర్, శ్రావ్య, వైష్ణవి 10 జీపీఏ సాధించారని వారిని ప్రోత్సహించేందుకు అవోపా జిల్లా శాఖ నుంచి ఒక్కో విద్యార్థికి రూ.1000, జ్ఞాపిక అందించారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ జంధ్యం మధుకర్, యాద కిషన్, మంచాల కిషన్, అవోపా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జంధ్యం మాధవి, సెక్టోరియల్ అధికారి కె.అశోక్‌రెడ్డి, కృష్ణగోపాల్, అంజయ్య, సుమలత, మమత పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారం అందిస్తున్న ఉపేందర్ రాజు

విద్యానగర్: రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో 2023 సీనియర్ ఇంటర్ పరీక్ష ఫలితాల్లో 950కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు, సీబీఎస్ఈలో 950కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు మాస్టర్ మైండ్స్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు అందించారు. కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో మాస్టర్‌మైండ్స్ అకౌంట్స్ ఫ్యాకల్టీ కాసు ఉపేందర్ రాజు నగదు ప్రోత్సాహకం అందించి మాట్లాడారు. మాస్టర్‌మైండ్స్ ఇప్పటి వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని 240మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించిందన్నారు. కరీంనగర్‌లో 100 మందికి పురస్కారాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాస్టర్‌మైండ్స్ డైరెక్టర్లు మట్టుపల్లి మోహన్, ప్రకాశ్, హైదరాబాద్ మాస్టర్ మైండ్స్ ప్రిన్సిపాల్ ఎస్‌కె.వలీ, మాస్టర్ మైండ్స్ మార్కెటింగ్ ఇన్‌చార్జి లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

వయసుతో నిమిత్తం లేకుండా అర్హులుగా ప్రకటించాలి



మాట్లాడుతున్న బండారి శేఖర్

విద్యానగర్: వయసుతో సంబంధం లేకుండా ఎస్సై కానిస్టేబుల్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను అర్హులుగా ప్రకటించాలని ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ.. ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి వయస్సు ఎక్కువగా ఉందని వారిని అనర్హులుగా ప్రకటించడం అన్యాయమన్నారు. ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు దరఖాస్తు ఫారాల్లో నమోదుచేసిన వయస్సునే పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈనెల 14 నుంచి 23 వరకు చేపట్టిన సర్టిఫికెట్ల పరిశీలనలో ఈ ఏడాదిని పరిగణలోకి తీసుకుని వయసు ఎక్కువగా ఉందంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అన్నింట్లో అర్హత సాధించి ఉద్యోగం వస్తుందనే సమయంలో వయస్సు ఎక్కువ ఉందని తప్పుడు నిర్ణయాలతో వేలాది మంది నిరుద్యోగులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మానవతా దృక్పథంతో ఆలోచించి అనర్హులను అర్హులుగా గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యారావు, జిల్లాకమిటీ సభ్యులు కురువెల్లి శంకర్, బెక్కంటి రమేశ్, చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెద్దెల్లి శేఖర్, జిల్లా నాయకులు బద్రి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట 'అనాథల అరిగోస' దీక్ష



కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకుల దీక్ష

కరీంనగర్: ప్రభుత్వం అనాథలకు హామీలిచ్చి ఏనిమిదేళ్లు గడుస్తోందని హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ ఆదేశాలతో శుక్రవారం ఎంఎస్‌పీ నియోజకవర్గ కన్వీనర్ దండు అంజయ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట 'అనాథల అరిగోసదీక్ష' చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బెజ్జంకి అనిల్ మాట్లాడుతూ.. అనాథలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నిజంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు చిత్తశుద్ధి ఉంటే హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. అనాథల కోసం భువనగిరిలో రాష్ట్రపతితో గురుకుల పాఠశాల ఏర్పాటుచేస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనాథాశ్రమలను సందర్శిస్తామని, అనాథపిల్లలను ప్రభుత్వమే చూసుకుంటుందని చెప్పారన్నారు. హామీలు అమలు చెయ్యకపోతే భవిష్యత్‌లో మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈదీక్షలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు రాంచందర్, అంజయ్య, ఆంజనేయులు, శంకర్, రాజన్న, రాజయ్య, వెంకటస్వామి, సాగర్, అనిల్, నవీన్, వసంత్, రవీందర్, రాజమల్లు పాల్గొన్నారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

కరీంనగర్‌టౌన్: మహాజన్ సంపర్క్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారంఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలోని విద్యానగర్ 368 పోలింగ్ బూత్‌పరిధిలో, బీజేపీ నగర ఈస్ట్‌జో న్ ఆధ్వర్యంలో అశోక్‌నగర్, కాపువాడ ప్రాంతాల్లో ఈస్ట్‌జోన్ అధ్యక్షుడు ఆవుదుర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టారు. న్యాత ప్రవీణ్, ప్రదీప్, రాకేశ్, అశోక్, శివ, ప్రణయ్, నితీశ్, అనీల్, చింతల కిషన్, ఉమామహేశ్, ముని, మధు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ నూతన పాలసీ ఆవిష్కరణ



పాలసీని ఆవిష్కరిస్తున్న డివిజనల్ మేనేజర్

కరీంనగర్: ఎల్ఐసీ సంస్థ నూతనంగా ప్రవేశపెట్టిన ధనవృద్ధి పాలసీని శుక్రవారం స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రసాద్‌రావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకేసారి డిపాజిట్ చేసి ఇటు బీమా సౌకర్యాన్ని, అటుఅధిక లాభాలను అర్జించడానికి అనువైన పాలసీ అన్నారు. సెప్టెంబర్ 30, 2023 వరకే ఈ పాలసీ అందుబాటులో ఉంటుందని ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని అధిక లాభాలు పొందాలని విజ్ఞప్తిచేశారు. మార్కెటింగ్ మేనేజర్ ఎం.ఆర్‌కె. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎక్కువ శాతం యువత కోరుకునే టర్మ్ అష్యూరెన్స్ పాలసీలాగానే తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా సౌకర్యం, ఆప్షన్ 2తో కట్టిన ప్రీమియంకు 10రెట్ల బీమా పొందవచ్చన్నారు.

ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని శ్రీ విజయ గణపతి సాయిబాబా ఆలయంలో శుక్రవారం చిన్నబాబా వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటలక వరకు గణపతి సాయి సమస్త దేవతల హోమాలు, మంగళస్నాన అభిషేకాలు, అర్చనలు, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సాయిబాబా అన్నదాన సత్రం అధ్యక్షుడు చిట్టుమల్ల కొండయ్య, ధర్మకర్తలు నలువాల ప్రకాశ్, అయిందాల లక్ష్మయ్య, ఈవో మారుతి, సిబ్బంది పిట్టల అంజయ్య ఉన్నారు.

దుర్గాభవానీ ఆలయంలో పూజలు



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న అర్చకుడు పురాణం మహేశ్వర శర్మ



విద్యానగర్: కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో అర్చకుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆషాడమాసం శాఖాంబరీ ఉత్సవాల్లో భాగంగా శ్రీదుర్గాభవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ఓడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ కనకధార స్తోత్ర పారాయణం, సౌందర్యలాహరి పారాయణం నిర్వహించారు. అర్చకుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని మార్కెట్ రోడ్ శ్రీ వేంకటేశ్వరాలయం హుండీలను శుక్రవారం లెక్కించారు. 3 నెలల్లో రూ.3,67,817 ఆదాయం సమకూరినట్లు ఈవో ఉడుతల వెంకన్న తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో లెక్కించగా ఆలయ అర్చకులు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

'హరిత'లక్ష్యాన్ని చేరుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: హరితహారం లక్ష్యాన్ని చేరుకునేందుకు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దశాబ్ది ఉత్సవాల నిర్వహణ కారణంగా గ్రామాల్లో పెండింగ్ సమస్యలను కార్యదర్శులు పరిష్కరించాలన్నారు. హరితహారంలో మొత్తం 1.57లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా ఇప్పటివరకు 73వేల మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించామని, మిగితా స్థలాలను గుర్తించి గుంతలను తవ్వించాలని సూచించారు. ఇంకుడుగుంతలను నిర్మించాలని, స్వచ్ఛగ్రామీణ్ అవార్డుకు పంచాయతీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఉపాధిహామీ ఏపీవో శోభరాణి, కార్యదర్శులు పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు

నగరంలో నేడు

కొత్తపల్లి: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కె.వీ.గోదాంగడ్డ ఫీడర్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీ, సప్తగిరి కాలనీ, గోదాం గడ్డ, భగత్‌నగర్ ప్రాంతాలతో పాటు 11 కె.వీ.సంతోష్‌నగర్ ఫీడర్ పరిధిలోని సంతోష్‌నగర్, విద్యానగర్, సెయింట్ జాన్స్ స్కూల్, శివ థియేటర్, కొత్త లేబర్ అడ్డ, బాలాజీ సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 2 ఏడిఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు.



క్లుప్తంగా...

'పోడు' పంపిణీ వాయిదా?

తొలుత ఈ నెల 24 నుంచే ఇస్తామన్న ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పోడు పట్టాల పంపిణీలో జాప్యం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 24 నుంచే జిల్లాల్లో సభలు నిర్వ హించి లబ్ధిదారులకు అందజేయాలని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఆ దిశగా జిల్లాల్లో ఎ లాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ఈ కార్యక్రమం వాయిదా పడినట్లు కనిపిస్తోంది. షెడ్యూల్ ప్రకారం శనివారం సీఎం కేసీఆర్ కుమురంభీం జిల్లాలో పర్యటించి కొత్త కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను ప్రారంభించాల్సి ఉంది. అక్కడే బహిరంగ సభలో పోడు పట్టాలను పంపిణీ చేయాలి. ఇదే సమయంలో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కావలసి ఉంది. జిల్లాల్లో అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణపై సమావేశాలు ఉండడంతో అటు పోలీసు ఉన్నతాధికారులు, కలెక్టర్లు హైదరాబాద్‌లోనే ఉన్నారు. దీంతో పోడు పట్టాల పంపిణీ ముందుగా ప్రకటించినట్లు కాకుండా.. మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షన్నర మంది గిరిజన లబ్ధిదారులకు 4 లక్షల ఎకరాల(ఆర్వోఎఫ్ఆర్) అటవీ భూములపై హక్కులు కల్పించి, ఈ సీ జన్ నుంచే రైతుబంధు వర్తింపజేయాలని ప్రణాళిక రూపొందించారు. పట్టాలు ఇవ్వడంలోనే ఆలస్యం అవుతుండడంతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల సేకరణ, రైతుబంధు జమ ఈ సీజన్‌లోనే జరుగుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ నెల 26 నుంచే రైతుబంధు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది.

శేజల్‌తో బీఆర్ఎస్ నేతల చర్చలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య లైంగికంగా వేధించి, తమపై కేసులు పెట్టించారని గత రెండు నెలలు నుంచి పలు రకాలుగా ఆందోళన చేస్తున్న ఆరిజన్ నిర్వాహకురాలు శేజల్‌తో బీఆర్ఎస్ ఎంపీలు శుక్రవారం చర్చలు జరిపారు. బీఆర్ఎస్ ఎంపీలు రంజిత్‌రెడ్డి, వెంకటేశ్ నేత, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్‌లు శేజల్, ఆదినారాయణలతో సుదీర్ఘంగా మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ చర్చల్లో ప్రభుత్వ భూమి కొనుగోలు చేసిన డబ్బులు వాపస్, తమపై ఉన్న కేసుల ఎత్తివేత, ఎమ్మెల్యే చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. ఇందుకు తప్పు చేసిన వారిపై పార్టీలో క్రమశిక్షణ చర్యలుంటాయని, అలాగే ఆమెకు న్యాయం చేస్తామని నాయకులు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

త్వరలో 'వైద్య' ఫీజుల పెంపు!

- కాలేజీలవారీగా ఫీజుల సవరణకు కసరత్తు చేసిన టీఏఎఫ్ఆర్సీ
- ధరలు పెరిగినందున ఫీజులు పెంచాలని యాజమాన్యాల విన్నపం
- ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పెంపునకు రంగం సిద్ధం

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడికల్ తదితర వైద్య కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఫీజుల పెంపునకు రంగం సిద్ధమైంది. ఈ అంశానికి సంబంధించి తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) కసరత్తు పూర్తి చేసింది. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఫీజులను సవరించనుంది. ఎంబీబీఎస్, పీజీ మెడికల్ సహా ఇతర కోర్సుల ఫీజులను మూడేళ్లకోసారి సవరించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. గతంలో ఏడాదికోసారి 5 శాతం చొప్పున సవరించాలన్న నిర్ణయాన్ని మార్చుచేశారు. ఆ ప్రకారం ఈసారి తప్పనిసరిగా ఫీజుల సవరణ జరుగుతుందని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే ప్రైవేటు కాలేజీల్లో మెడికల్ కోర్సుల ఫీజులు రూ. లక్షల్లో ఉండగా త్వరలో అంతకు మించి పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఒక్కో మెడికల్ కాలేజీకి ఒక్కో ఫీజు...

ఇప్పటివరకు రాష్ట్రంలో మెడికల్ కోర్సుల ఫీజులు ఒకే రీతిన ఉన్నాయి. ఇకపై ఒక్కో కాలేజీలో ఒక్కో రకమైన ఫీజు ఉండనుంది. ఆ ప్రకారమే ఎంబీబీఎస్, పీజీ మెడికల్ సహా ఇతర వైద్య కోర్సుల ఫీజులుంటాయి. అందుకు అనుగుణంగానే కాలేజీలవారీగా ఆడిట్ రిపోర్టులను టీఏఎఫ్ఆర్సీ తీసుకుంది. వాటి ఆధారంగానే ఫీజుల సవరణ చేయనుంది. ఇందులో కాలేజీల నిర్వహణ ఖర్చులు మొదలు, బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు, ల్యాబ్‌ల నిర్వహణ తదితర పూర్తిస్థాయి సమాచారం సేకరించారు. ఈ ఖర్చులు గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో ఒక రకంగా ఉంటే పట్టణ ప్రాంతాల్లోని కాలేజీల్లో మరో రకంగా ఉంటాయి. ఈ దిశగా కాలేజీవారీగా ఆడిట్ నివేదికలు పరిశీలించిన టీఏఎఫ్ఆర్సీ ఫీజుల సవరణపై ఒక అంచనాకు వచ్చింది. కాలేజీలవారీగా ఫీజుల పెంపు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిసింది. దీంతో ఫీజుల పెంపు వ్యవహారంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. ధరలు పెరిగినందున ఆ మేరకు ఫీజులు పెంచాలని యాజమాన్యాలు ఇప్పటికే విజ్ఞప్తి చేశాయి.

కొన్ని కాలేజీల్లో 20 శాతం వరకు పెరిగే అవకాశం...

ప్రస్తుతమున్న ఫీజులను కొన్ని కాలేజీలు 20 శాతం వరకు పెంచాలని కోరగా మరికొన్ని 10 శాతం, కొన్ని 5 శాతం, ఇంకొన్ని యథాతథంగా ఉంచాలని కోరినట్లు సమాచారం. ప్రైవేటు కాలేజీల్లో ప్రస్తుతం ఎంబీబీఎస్ సీట్లకు సంబంధించి ఏ-కేటగిరీ (కన్వీనర్) ఫీజు రూ. 60 వేలు ఉండగా బీ-కేటగిరీ ఫీజు రూ. 11.55 లక్షలుగా ఉంది. ఇక సీ-కేటగిరీ (ఎన్ఆర్ఐ) అడ్మిషన్ ఫీజు బీ-కేటగిరీకి రెట్టింపు అంటే రూ. 23.10 లక్షల వరకు వసూలు చేసుకొనే వీలుంది. ఇక పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏ-కేటగిరీ ఫీజు రూ. 7.5 లక్షలు, బీ-కేటగిరీ రూ. 28 లక్షల నుంచి రూ. 30 లక్షల చొప్పున ఉన్నాయి. బీడీఎస్ కోర్సులకు సంబంధించి ఏ-కేటగిరీ ఫీజు రూ. 45 వేలు ఉండగా బీ-కేటగిరీ ఫీజు రూ. 4.2 లక్షలు, ఇక సీ-కేటగిరీ ఫీజు బీ-కేటగిరీ కంటే రెట్టింపు వసూలు చేసుకోవచ్చు. వాటితోపాటు బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, హోమియోపతి, పారామెడికల్ కోర్సులకు సంబంధించిన ఫీజులు కూడా కాలేజీల వారీగా భిన్నంగా ఉన్నాయి.

కాళేశ్వరం బ్యారేజీలకు మరమ్మతులేవి?

గత ఏడాది వరదలకు కొట్టుకుపోయిన గేట్ల ముందు కాంక్రీటు దిమ్మెలు

- మరమ్మతులు చేయడంలో ఇరిగేషన్ శాఖ జాప్యంపై విమర్శలు
- ఈ సీజన్‌లో మళ్లీ భారీ వర్షాలు వస్తే కోతకు గురయ్యే అవకాశం
- గేట్లకు ప్రమాదం ఉందంటున్న నిపుణులు



అన్నారంలోని సరస్వతి బ్యారేజీ వద్ద కొట్టుకుపోయిన కాంక్రీటు దిమ్మెలు

కాళేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని లింకు-1 బ్యారేజీల వద్ద గత ఏడాది వచ్చిన భారీ వరదలతో కాంక్రీటు దెబ్బతింది. అయితే మళ్లీ వానాకాలం వచ్చినప్పటికీ దెబ్బతిన్న చోట్ల ఇప్పటికీ మరమ్మతులు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ, అన్నారంలోని (సరస్వతి) బ్యారేజీల వద్ద వరద తాకిడికి గేట్ల ముందు భాగంలోని కాంక్రీటు దిమ్మెలు కొట్టుకుపోయాయి. గత సీజన్‌లో ఇది జరిగితే ఇప్పటికీ ఇరిగేషన్ శాఖ అధికారులు మరమ్మతుల విషయంలో ఆలోచన చేయడం లేదని, ఖరీఫ్ సీజన్ ఆరంభం అవుతున్నా పనుల్లో జాప్యం చేస్తున్నారని నీటిపారుదల రంగ నిపుణులు ఆక్షేపిస్తున్నారు.

గతేడాది ఉధృతంగా వరద

గత ఏడాది కురిసిన భారీవర్షాలకు బ్యారేజీలు కొంతమేర దెబ్బతిన్నాయి. ఎగువ గోదావరి నుంచి సరస్వతీ బ్యారేజీ వద్ద 17.50 లక్షల క్యూసెక్కుల వరద జూలై 14–15 తేదీల్లో ఉధృతంగా ప్రవహించింది. దీంతో బ్యారేజీలోని మొత్తం 66 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. వరద ఉధృతికి గేట్ల కింది భాగాన ఉన్న కాంక్రీట్ దిమ్మెలు లేచిపోయాయి. అలాగే గోదావరి వరదకు, ప్రాణహిత వరద తోడై మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీ వద్ద 29 లక్షల క్యూసెక్కులకుపైగా వరద రావడంతో దిమ్మెలు చెల్లాచెదురుగా కొట్టుకుపోయాయి.

కాంక్రీటు దిమ్మెలు ఇలా..

బ్యారేజీల్లో గేట్లు ఎత్తినప్పుడు వరద తాకిడికి నేల కోతకు గురికాకుండా ముందు భాగంలో ఇంజనీరింగ్ శాఖ అధికారులు అత్యాధునిక టెక్నాలజీతో కాంక్రీటు దిమ్మెలను అమర్చారు. 3 అడుగుల వెడల్పు, పొడవుతో దిమ్మెలను బ్యారేజీ పొడవునా గేట్ల కింద ముందు భాగంలో కాంక్రీటు చేశారు. వరద తాకిడికి నేల కోతకు గురికాకుండా ఈ దిమ్మెలు అడ్డుకుంటాయి. కానీ గత ఏడాది వచ్చిన భారీ వరద తాకిడికి ఈ దిమ్మెలు విరిగి ఎక్కడికక్కడ చెల్లాచెదురుగా పడి కొట్టుకుపోయాయి. అప్పటి నుంచీ అక్కడ మరమ్మతులు చేయలేదని చెబుతున్నారు.

డిజైన్స్ రాలేదని..

మేడిగడ్డ (లక్ష్మీ), అన్నారం (సరస్వతి) బ్యారేజీల వద్ద అమర్చిన దిమ్మెలు కొట్టుకుపోయి ఏడాది కావస్తున్నా.. డిజైన్స్ తయారు చేయలేదని ఇంజనీరింగ్ శాఖ పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో మరమ్మతులు చేయకుండానే మళ్లీ వర్షాకాలం ఆరంభమైంది. వర్షాలు ఏకధాటిగా కురిస్తే మరోసారి భారీ వరదలు వచ్చే అవకాశం ఉంది. బ్యారేజీల గేట్లు ఎత్తితే మరింత కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. గత ఏడాది కురిసిన వర్షాలకు ఇప్పటికే గేట్ల ముందుభాగంలో కోతకు గురై, భారీగా ఇసుక మేటలు వేశాయి. దీంతో గేట్లకు కూడా ప్రమాదం పొంచి ఉందని నిపుణులు అంటున్నారు.

మోడల్ స్టడీ చేయాలి

గేట్ల ముందు భాగంలో కాంక్రీటు దిమ్మెలు లేచింది వాస్తవమే. కానీ డిజైన్స్ తయారు చేయాలి. దీనిపై ప్రొఫెసర్లు అధ్యయనం చేయాల్సి ఉంది. వారు మోడల్ స్టడీ చేయాలి. తరువాతనే మరమ్మతులు చేస్తారు. పలుమార్లు ఇరిగేషన్ శాఖ తరఫున ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. డిజైన్స్ తయారీకి కొంత సమయం పడుతుంది.

– యాదగిరి, ఈఈ, అన్నారం బ్యారేజీ

ఇన్విజిలేటర్ కొట్టాడని విద్యార్థి బలవన్మరణం

- మృతదేహంతో కళాశాల ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా
- కొట్టలేదన్న కాలేజీ యాజమాన్యం



మృతదేహంతో కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

నర్సంపేట రూరల్: పరీక్షల్లో మాస్ కాపీయింగ్ చేస్తుండగా ఇన్విజిలేటర్ మందలించి, చేయి చేసుకోవడంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ జిల్లాలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రాగంపేటకు చెందిన భూక్యా ఈర్య–పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు భూక్య సాయికుమార్ (23) నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బ్యాక్‌లాగ్‌లు ఉండడంతో అదే పట్టణంలోని బాలాజీ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల సెంటర్‌లో సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నాడు. గురువారం పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడటంతో గమనించిన ఇన్విజిలేటర్.. సాయికుమార్‌ను మందలించి కొట్టాడు. దీంతో మనోవేదనకు గురై, రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సాయికుమార్ మృతికి ఇన్విజిలేటర్, యాజమాన్యం కారణమంటూ కుటుంబ సభ్యులు.. మృతదేహంతో కాలేజీ ఎదుట శుక్రవారం మధ్యాహ్నం ధర్నా చేపట్టారు. ఉద్రిక్తత నెలకొనడంతో కళాశాల యాజమాన్యం, కుటుంబ సభ్యులతో మాట్లాడిన నర్సంపేట సీఐ పులి రమేష్‌గౌడ్.. మృతదేహాన్ని గ్రామానికి పంపించారు. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌రాజ్‌ను వివరణ కోరగా... సాయి కుమార్ అనే విద్యార్థి పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌తోపాటు బుక్‌లెట్‌ను దొంగతనం చేయడానికి ప్రయత్నించాడని, గుర్తించిన ఇన్విజిలేటర్ మందలించి, తమ వద్దకు తీసుకొచ్చారని తెలిపారు. విద్యార్థి రిక్వెస్ట్‌తో పరీక్ష రాసేందుకు అనుమతించామే తప్ప.. ఎవరూ కొట్టలేదన్నారు.

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదా

అక్టోబర్ 1 తర్వాత నిర్వహించుకోవచ్చని హైకోర్టు సూచన

గోదావరిఖని (రామగుండం): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎన్నికల నిర్వహణకు నాలుగు నెలల గడువు కావాలని సింగరేణి గనులు విస్తరించి ఉన్న జిల్లాల కలెక్టర్లు కోర డంతో హైకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. శుక్రవా రం సింగరేణి ఎన్నికలపై హైకోర్టులో విచారణ జరి గింది. వాదనలు విన్న తర్వాత హైకోర్టు అక్టోబర్ 1 తర్వాత ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సూచిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో శనివారం హైదరా బాద్‌లో జరగనున్న ఆర్ఎల్‌సీ సమావేశం వాయిదాపడింది. సింగరేణిలో గుర్తింపు సంఘం కాలప రిమితి నాలుగేళ్లు ఉండాలని కోరుతూ టీబీజీకేఎస్ కూడా హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ క్రమంలో హైకోర్టు సింగరేణి యాజమాన్యానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అంతేకాకుండా జాతీయ ఎన్నికల కమిషన్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించిన నేపథ్యంలో సింగరేణి ఎన్నికలకు ఏర్పాట్లు చేయలేమని ప్రభుత్వ యంత్రాంగం కూడా చేతులెత్తేసినట్లు తెలుస్తోంది.

మరో ఏడాది వాయిదా పడే అవకాశం

అక్టోబర్ తర్వాత ఎన్నికలు నిర్వహించుకోవచ్చని కోర్టు సూచించిన నేపథ్యంలో ఎన్నికలు మరో ఏడాది వాయిదా పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. అక్టోబర్‌లో సాధారణ ఎన్నికల బిజీలో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ఉండే అవకాశముంది. ఈ నేపథ్యంలో జనవరి వరకు సింగరేణి ఎన్నికలు నిర్వహించే వీలుండదని కొందరు చెబుతున్నారు.

ధాన్యానికి రికార్డుస్థాయి ధర రూ. 2,911

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యానికి రికార్డు స్థాయిలో ధర రూ.2,911 పలికింది. మార్కెట్‌లో ధాన్యం సీజన్ మొదలైనప్పటి నుంచి ఇంత ధర రావడంఇదే మొదటిసారి. గూడూరు మండలం అప్పరాజుపల్లికి చెందిన మనోజ్‌కుమార్ అనే రైతు మార్కెట్‌కు 6 బస్తాల ధాన్యం (ఆర్ఎన్ఆర్ పాతరకం) అమ్మకానికి తీసుకురాగా, క్వింటాకు రూ.2,911 చెల్లించారు. మద్దతు ధర రూ.2,060 ఉండగా, మద్దతుకు మించే ధర రావడం విశేషం. శుక్రవారం మార్కెట్‌కు 1,182 బస్తాల ధాన్యం అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ట ధర రూ.2,911 పలకగా, కనిష్ట ధర రూ.1,809 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలి



సభలో మాట్లాడుతున్న బస్సు యాత్ర కన్వీనర్ ఎస్.వీరయ్య

- ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం ఉధృతం
- ప్రజాపోరాట వేదిక బస్సు యాత్ర కన్వీనర్ ఎస్.వీరయ్య

చెన్నూర్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న ప్రతీ పేదబిడ్డకు బేషరతుగా పట్టాలిచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ప్రజా పోరాట వేదిక బస్సు యాత్ర కన్వీనర్ ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18న మహబూబాబాద్‌లో ప్రారంభించిన బస్సుయాత్ర శుక్రవారం మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చేరుకుంది. యాత్రకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. స్థానిక సంతోషిమాత ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు దాటి పదేళ్లు అవుతోందని, పేదల ఇంటి నిర్మాణానికి జానెడు జాగా ఇవ్వలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన పథకం ద్వారా దేశంలోని పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని మోసం చేసిందని ఆరోపించారు. ఒకపక్క ప్రభుత్వ భూములను విక్రయిస్తుంటే మరో పక్క రియల్ మాఫియా పేదల భూములను కబ్జా చేసి వ్యాపారం చేస్తోందని అన్నారు. ప్రభుత్వానికి ఎన్నికలు వస్తేనే నిరుపేదలు గుర్తుకు వస్తారన్నారు. సొంత స్థలం ఉన్న వారికి ప్రభుత్వం రూ.పది లక్షలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు పట్టాలు ఇవ్వాలని పోరాటాలు చేస్తున్నామని, లక్షల మంది గుడిసెలు వేసుకున్నారని పేర్కొన్నారు. గుడిసెలు వేసుకున్న నిరుపేదలపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న రంగారెడ్డి జిల్లాలో బస్సుయాత్ర ముగుస్తుందన్నారు. యాత్ర ముగింపు నాటికి ప్రభుత్వం సానుకూల ప్రకటన చేయాలని, లేనిపక్షంలో భూపోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బస్సు యాత్ర బృందం సభ్యురాలు, మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, వృత్తి సంఘాల రాష్ట్ర కన్వీనర్ పైల్ ఆశయ్య, కేవీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు, వ్యవసాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొప్పని పద్మ, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు వేముల ఆనంద్, సంకె రవి, నాయకులు అవేజ్, చందు, ప్రేమ్‌కుమార్, మోహన్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముఖరా(కే) ఆదర్శనీయం



పుస్తకాలు అందజేస్తున్న పాండు రంగారావు

ఇచ్చోడ: అభివృద్ధిలో ముఖరా(కే) పంచాయతీ రాష్ట్రంలోనే ఆదర్శనీయంగా నిలుస్తోందని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పాండు రంగారావు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ముఖరా(కే) పంచాయతీలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ పథకాలను వందశాతం అమలు చేస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ఇప్పటికే ఈ గ్రామం అనేక అవార్డులు కైవసం చేసుకుందన్నారు. డిజిటల్ లైబ్రరీని సందర్శించి యువతకు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజినీర్ శైలేందర్, సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

బాసరలో మహాగణపతి మూలమంత్ర జపానుష్టానం



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

భైంసా: నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆటంకాలు తొలగి త్వరగా పూర్తి కావాలని మహాగణపతి మూలమంత్ర జపానుష్టానం ప్రారంభించారు. శృంగేరి ఉభయ జగద్గురువులు భారతీ తీర్థస్వామి, విదురోఖర భారతిస్వామి ఆదేశాల మేరకు దేవస్థానం స్థానాచార్యులు శుక్రవారం పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. జప హోమ కార్యక్రమాలు ఐదురోజులు కొనసాగి, 28న మహాగణపతి హోమ పూర్ణాహుతి ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక వంశీయులు శరత్‌పాఠక్, ఈవో, అర్చకులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

చండీహోమం ఆర్జితసేవ రద్దు

బాసర దేవస్థానంలో మహాగణపతి హోమం నేపథ్యంలో ఈ నెల 28న చండీహోమం ఆర్జిత సేవ రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో విజయరామారావు ఒక ప్రకటనలో తెలిపారు. గురుపౌర్ణమి ఉత్సవాల సందర్భంగా జూలై 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే చండీహోమం ఆర్జితసేవ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

'గుర్తింపు'పై యాజమాన్యానిదే పైచేయి

గోదావరిఖని(రామగుండం): ఎన్నికల గడువు కోరుతూ సింగరేణి యాజమాన్యం, ఎన్నికలు మరికొంత కాలం పాటు వాయిదా వేయాలని గుర్తింపు యూనియన్ హైకోర్టు కోర్టు మెట్లెక్కాయి. శుక్రవారం వాదోపవాదాల తర్వాత అక్టోబర్ వరకు ఎన్నికలకు గడువిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వాస్తవానికి ఈనెల 24న జరిగే ఆర్ఎల్‌సీ సమావేశంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలుబడాల్సి ఉంది. కానీ కోర్టు ఆదేశాలతో ఎన్నికల పక్రియ నిలిచిపోయినట్లయ్యింది. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగే సమావేశం అర్ధంతరంగా వాయిదా పడింది.

- నేటి ఆర్ఎల్‌సీ సమావేశం రద్దు
- ఎన్నికలకు అక్టోబర్ వరకు గడువిచ్చిన హైకోర్టు
- అన్ని సంఘాలను గుర్తించాలని కార్మిక సంఘాల పట్టు



కార్మిక సంఘాలతో చర్చలు జరుపుతున్న ఆర్ఎల్‌సీ అధికారులు

నాలుగేళ్ల గడువుతో గుర్తింపు ఎన్నికలకు యాజమాన్యం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే దీనికి సంబంధించిన ఆదేశాలు రాకపోవడం, ఎన్నికలకు వ్యతిరేకంగా కొన్ని జిల్లాల కలెక్టర్లు లేఖ రాయడంతో హైకోర్టు ఎన్నికల పక్రియను అక్టోబర్ వరకు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. గుర్తింపు గడువు దాటిపోయినా ఎన్నికల నిర్వహణలో జాప్యం జరుగుతోందని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని జాతీయ కార్మిక సంఘాలు పట్టుబడుతున్నాయి. వర్షాకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే తమకేలాంటి అభ్యంతరం లేదని తెలిపిన యాజమాన్యం తిరిగి కోర్టుకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల పక్రియ ప్రారంభం కోసం కేంద్ర కార్మికశాఖ ఇప్పటికే రిటర్నింగ్ అధికారిని నియమించింది. ప్రస్తుతం ఉన్న డిప్యూటీ సీఎల్‌సీ శ్రీనివాస్‌కు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా బాధ్యతలు అప్పగించారు. ఈక్రమంలో మూడుసార్లు యాజమాన్యం, కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించింది. చివరగా ఈనెల 13న డిప్యూటీ ఆర్ఎల్‌సీ సమక్షంలో కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యంతో భేటీ అయ్యారు. అయితే గతంలో ఉన్న రెండేళ్ల గడువుకు యాజమాన్యం ఒప్పుకోలేదు. నాలుగేళ్ల గడువుగా ఎన్నికలకు తాము ఒకే అని యాజమాన్యం పేర్కొంది. దీంతో కార్మిక సంఘాలు, యాజమాన్యం కలిసి నాలుగేళ్ల గడువుతో ఎన్నికలు నిర్వహిస్తే తమకేమి అభ్యంతరం లేదని కేంద్ర కార్మిక శాఖకు లేఖ రాశారు. అయితే దీనిపై స్పష్టత ఇంకా రానట్లు తెలుస్తోంది.

ఎన్నికలు ప్రతిష్టాత్మకం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగరేణి గుర్తింపు ఎన్నికలు ప్రస్తుతం అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకం కానున్నాయి. సంస్థ విస్తరించి ఉన్న ఉమ్మడి నాలుగు జిల్లాల్లో గుర్తింపు ఎన్నికలు రాజకీయంగా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభావం చూపుతాయి. సంస్థ వ్యాప్తంగా 11ఏరియాల్లో సుమారు 39వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రధానంగా ఆరు కార్మిక సంఘాలు పోటీకి అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. 1998లో సింగరేణిలో గుర్తింపు ఎన్నికల ప్రక్రియ మొదట రెండేళ్ల కాలపరిమితితో ప్రారంభమైంది. తర్వాత నాలుగేళ్లకోసారి నిర్వహిస్తూ వస్తోంది. ఈక్రమంలో కోవిడ్ కారణంగా గుర్తింపు ఎన్నికలు సుమారు నాలుగేళ్లు ఆలస్యం అయ్యాయి. కోవిడ్ సెకండ్‌వేవ్ తగ్గిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని జాతీయ కార్మిక సంఘాలు కోరినా కరోనా కారణంతో యాజమాన్యం ఆసక్తి చూపలేదు.

అక్టోబర్ వరకు వద్దు..

ప్రస్తుత పరిస్థితిలో ఈఏడాది చివరి వరకు గుర్తింపు ఎన్నికలు నిర్వహించలేమని పేర్కొంటూ సింగరేణి యాజమాన్యం కోర్టును ఆశ్రయించింది. అలాగే ఎన్నికలు వాయిదా వేయాలని కోరుతూ టీబీజీకేఎస్ కోర్టులో కేసు వేసింది. దీనిపై శుక్రవారం వాదోపవాదాలు పూర్తయ్యాయి. కలెక్టర్ల అభ్యంతరం, నాలుగేళ్ల కాలపరిమితిపై హైకోర్టు యాజమాన్యానికి అనుకూలంగా తీర్పునిచ్చింది.

అన్ని యూనియన్లకు సమాన ప్రాతినిధ్యం

ఎన్నికల వాయిదాకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో సంస్థలో జరిగే చర్చలకు అన్ని సంఘాలను పిలవాలని కార్మిక సంఘాల నాయకులు హైకోర్టుకు వెళ్లే అవకాశాలున్నాయి. ఈమేరకు న్యాయ నిపుణులతో సంఘాల నాయకులు చర్చిస్తున్నారు. ఎన్నికలు నిర్వహించే వరకు అన్ని సంఘాలకు సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్ చేయనున్నారు.

సింగరేణిలో ఎన్నికలు..

ఏడాది	గెలిచిన యూనియన్	గడువు
09-09-1998	ఏఐటీయూసీ	రెండేళ్లు
19-02-2001	ఏఐటీయూసీ	రెండేళ్లు
14-05-2003	ఐఎన్‌టీయూసీ	రెండేళ్లు
09-08-2007	ఏఐటీయూసీ	నాలుగేళ్లు
28-06-2012	టీబీజీకేఎస్	నాలుగేళ్లు
05-10-2017	టీబీజీకేఎస్	నాలుగేళ్లు

అల్కహాల్, స్మోకింగ్, డ్రగ్స్‌లాంటి దురలవాట్లకు బానిసలై చీకటి నింపుకుంటున్న కుటుంబాలు ఎన్నో. వీటినుంచి బయట పడాలంటే ఏం చేయాలి?! ఈ వ్యసనం కుటుంబాలలో రేపుతున్న చిచ్చును ఆర్పేదెలా?! పరువు పోతుందనే భయంతో సమాజంలో దాక్కుంటున్న మనుషుల్లో ధైర్యం నింపేదెలా?! సమస్యను దాచిపెడితే పెంచి పోషించినట్టే. అందుకే, మనం మాట్లాడుకోవాల్సిందే వ్యసనంపై పోరాడటానికి.

వ్యసనం వ్యక్తిని, ఇంటిని, సమాజాన్ని పతనం వైపు నడిపిస్తుంది. పరువు అని భయపడకుండా సరైన మార్గాన్ని వెతుకుదాం. అందుకు తగిన సమాచారాన్ని ప్రతివారం మీ ముందుకు తీసుకువస్తున్నాం. ఈవారం మద్యపానంపై...



ప్రతీకాత్మక చిత్రం

* మనం మాట్లాడుకోవాల్సిందే!

వ్యసనంపై పోరాటం

సమస్యను ఎదుర్కొంటున్న ఒక కుటుంబ కథనం,,,

'బాబూ.. ఏమీ అనుకోకుండా ఈ బ్రాండ్ లిక్కర్ తెచ్చిపెట్టగలవా?!' అపార్ట్‌మెంట్ పైఫ్లోర్ నుంచి దిగుతున్న ఓ అపరిచిత అబ్బాయిని పిలిచి అడిగింది శారద (పేరుమార్చడమైనది). ఆ అబ్బాయి ఆమెను ఎగాదిగా చూశాడు. పక్కపోర్షన్ వాళ్లు చూస్తే ఏమనుకుంటారో అనే భయంతో.. 'మా వారికి డ్రింక్ చేసే అలవాటుంది. ఎంతకీ మార్చుకోవడం లేదు. ఆయన్ని బయటకు వెళ్లనివ్వడం లేదు. నేనుగా ఆ వైన్ షాప్‌కి వెళ్లలేను. అందుకే అడుగుతున్నాను' అంది బతిమాలుతున్నట్టుగా.

'ఓ.. అలాగే తెచ్చిస్తాను' అని డబ్బులు తీసుకొని వెళ్లిపోయాడు.

అతను తెచ్చిన బాటిల్‌ను ఎవరూ గమనించట్లేదని నిర్ధారించుకుని, థాంక్స్ చెప్పి లోపలికి తీసుకెళ్లింది.

కొన్నాళ్లుగా ఈ సమస్య కారణంగా నరకం చూస్తోంది శారద.

• • •

శారద ఓ ప్రైవేట్ స్కూల్ టీచర్. భర్తది కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం. ఇద్దరు పిల్లలు. చుట్టుపక్కల వారిలో గౌరవ మర్యాదలకు లోటు లేని కుటుంబం. 'వాళ్లకేం.. ఇద్దరూ సంపాదిస్తున్నారు. చిన్న కుటుంబం చింతల్లేవు' అంటుంటారు. నలుగురిలో ఎంతో గొప్పగా ఉండే తమ కుటుంబం నేడు దిగజారిపోయిన పరిస్థితి చూస్తూ కొన్నాళ్లుగా కంటిమీద కునుకు లేకుండా గడిపేస్తోంది.

మొదట్లో పార్టీలకు వెళ్లినప్పుడు కొద్దికొద్దిగా డ్రింక్ చేసేవాడు శారద భర్త.

వద్దని వారిస్తే 'డ్రింక్ అనేది ఒక పార్టీ కల్చర్, నలుగురిలో కలుపుగోలుగా ఉండాలంటే ఇలాంటివి పట్టించుకోవద్ద'ని చెప్పేవాడు.

'నిజమే, కదా! దాదాపుగా చుట్టూ అందరూ అలాగే ఉన్నారు' అనుకుంది శారద.

పిల్లల చిన్నప్పుడు తక్కువగానే ఉన్న ఈ డ్రింక్ అలవాటు, ఇప్పుడు వారికీ అన్నీ తెలిసే వయసు వచ్చేసరికి పెరిగింది.

పార్టీల నుంచి అలవాటు రోజూ రాత్రిపూట తీసుకోవడం, ఆ తర్వాత పగటికి కూడా మారింది. అదేమంటే, ఆరోగ్యంగా ఉండాలంటే ఆ మాత్రం తప్పదని కొన్నాళ్లు, బాధగా ఉందని, ఆనందంగా ఉందని, ఈ మాత్రమైనా ఉంటున్నాను కదా!' అంటూ ఏదో ఒక వంకన తాగడం పెరిగింది.

పగటిపూట తాగి కాలేజీకి వెళితే, యాజమాన్యం డిస్మిస్ చేసింది. దీంతో జాబ్ పోయిందనే ఆలోచన, డిప్రెషన్‌తో ఇంకా తాగడం పెరిగింది.

తాగి బయటకు వెళ్లినా, ఆ మత్తులో ఎవరితోనైనా గొడవ పెట్టుకున్నా నలుగురిలో పరువు పోతుందని, తనే మందుబాటిళ్లు ఇంటికి తెచ్చిస్తాను, ఎక్కడకూ వెళ్లద్దు అని బతిమాలడం మొదలుపెట్టింది.

• • •

ఇద్దరిలో ఒకరి సంపాదన ఎలాగూ పోయింది. తన ఒక్కదాని సంపాదనతో ఇల్లు, పిల్లల ఫీజులు నెట్టుకొస్తోంది. దానికితోడు మందుకు కూడా డబ్బులు ఖర్చు పెట్టాలంటే కష్టంగా ఉంటుంది. కానీ, తప్పడం లేదు. పైగా, రోజు రోజూ భర్త ఆరోగ్య పరిస్థితి ఏమౌతుందో అని ఆందోళన పెరుగుతోంది.

• • •

కొన్నాళ్లుగా బంధుమిత్రుల వేడుకలు, పార్టీలకు వెళ్లడం బాగా తగ్గించేసింది. అదేమని అడిగితే ముఖ్యమైన పని ఉందని తప్పించుకుని తిరుగుతుంది. ఒక విధంగా స్వీయ సామాజిక బహిష్కరణకు గురైంది.

• • •

పార్టీ ఉందని చెప్పి వెళ్లిన పెద్దబ్బాయి ఇంకా ఇంటికి రాకపోవడంతో ఆందోళన పడిపోయింది శారద. వచ్చాక వాడిని గమనిస్తే మందు వాసన వస్తోంది. అదేమని నిలదీస్తే.. 'డాడీని ఏమీ అనవు. పైగా నువ్వే మందు తెప్పించి ఇస్తావు. నన్ను మాత్రం ఎందుకు తిడుతున్నావు!' అని ఎదురు తిరిగాడు. ఆ మాటలతో తల తిరిగిపోయింది శారదకు. ఇంట్లో అందరివైపు బిక్కుబిక్కుమని చిన్నకొడుకు చూసే చూపులు ఆమెను పూర్తి అగాధంలోకి తోసేసినట్టుగా అనిపించాయి.

ఇలాంటి బయటికి చెప్పుకోలేని గాథలు మన చుట్టూ ఉన్నవారిలో ఎన్నో ఉన్నాయి.

– నిర్మలారెడ్డి

ఇది ఒక జబ్బు అని గుర్తించాలి

నియంత్రణ కోల్పోవడం వ్యసనం ప్రధాన లక్షణం. నూటికి నూరుపాళ్లు నయం అవడం ఉండదు కానీ, నియంత్రణ కోల్పోకుండా చికిత్స చేయవచ్చు. మన మెదడు గుర్తించడం, గుర్తుపెట్టుకోవడం, గుర్తుచేయడం అనే మూడు విధాలుగా పనిచేస్తుంది. బ్రెయిన్‌లో డోపమైన్ కెమికల్ ఉంటుంది. మిగతా సమయాల్లో కంటే తాగినప్పుడు డోపమైన్ రసాయనాలు ఎక్కువ రిలీజ్ అవడంతో ఆనందం అధికంగా ఉంటుంది అనుకుంటారు. మత్తు దిగాక మళ్లీ మామూలే అవుతుంది. అందుకే, ఆ మందు మళ్లీ మళ్లీ తీసుకోవాలని, మోతాదు ఇంకా పెంచమనే బ్రెయిన్ సూచనల ప్రకారం మనిషి నడుచుకుంటాడు. అందుకే, మొదట్లో తక్కువ తాగే వారు కొన్నాళ్లకు డోసు పెంచుతూ ఉంటారు. తాగడానికి ఏవో కారణాలు చెబుతున్నారంటే సమస్య ఉందని అర్థం చేసుకోవాలి. నిపుణుల సూచనలు తీసుకోవాలి.



– డాక్టర్ గిడియన్, డి-అడిక్షన్ థెరపిస్ట్, లివింగ్ సోబర్, హైదరాబాద్

ఆశలు పెంచుతోంది..

చదువు ఉండి, నలుగురిలో ఎలా మెలగాలో తెలిసిన మేమే ఇలాంటి సమస్యతో బాధపడుతుంటే దీని తీవ్రత సమాజంలో ఎంత ఉందో అర్థమవుతుంది. ఒక తల్లిగా నా పిల్లలకు చెప్పలేక, టీచర్‌గా స్కూల్లో పిల్లలకు ఏ మంచీ బోధించలేక జీవితం శూన్యంగా అనిపించేది. ఓ రోజు నా ఫ్రెండ్‌తో చెప్పాక సమస్యకు పరిష్కారం దొరికింది. థెరపిస్ట్‌లను కలిసి, అడిక్షన్ నుంచి నా కుటుంబాన్ని కాపాడుకోవాలని కృషి చేస్తున్నాను. ఇప్పుడు నా కుటుంబంలో వచ్చిన మార్పు భవిష్యత్తుపైన ఆశలు పెంచుతోంది.

- శారద, బాధితురాలు

డి-అడిక్షన్ సెంటర్‌లో...

ఏ కారణం చేత తాగుతున్నారో వారి ట్రిగ్గర్ పాయింట్స్ గుర్తించి సమస్యను తగ్గించే ప్రయత్నం చేస్తారు. దీనితోపాటు మోటివేషనల్ థెరపీ, బిహేవియరల్ థెరపీ, పర్సనాలటీ డెవలప్‌మెంట్‌కి ఏవి అవసరమో అందుకు తగిన కౌన్సెలింగ్ చేస్తారు. మద్యం తాగాలనే క్రేవింగ్ కలగనివ్వకుండా ప్రయత్నిస్తారు. నమ్మకాలు, ఆలోచనా విధానాలు సవ్యంగా సాగేందుకు ప్రయత్నిస్తారు.

కుటుంబమంతా కలిసి...

బయట మద్యం అందుబాటులో ఉంటుంది కాబట్టి, వీళ్లు తాగుతున్నారు అని చాలామంది కంప్లైంట్ చేస్తుంటారు. ఉదయం లేచిన దగ్గర నుంచి మన చుట్టూ మంచీ-చెడు అంశాలు ప్రతి దానిలోనూ చూస్తుంటాం. దేనిని మనం ఏ విధంగా తీసుకోవాలో మన మెదడు చేసే పనితీరును బట్టి ఉంటుంది. లోపం ఎక్కడ ఉందో గుర్తించి, దానికి విరుగుడు ఏంటా.. అని ఆలోచించడం మన ముందున్న అసలు కర్తవ్యం.



- కుటుంబం అంతా వ్యసనంపై పోరాటానికి సిద్ధం అన్నట్టుగా ఉండాలి.
- చుట్టుపక్కల వాళ్లు ఏమనుకుంటారో, బంధుమిత్రుల్లో పరువు పోతుందేమో అనే ఆలోచనకు తావివ్వకుండా ఈ సమస్య గురించి నలుగురితో చర్చించాలి.
- అపార్ట్‌మెంట్, కాలనీ, సొసైటీ మీటింగ్స్ సమయాల్లో 'మద్యం అలవాటు' తప్పనిసరి టాపిక్ అయి ఉండాలి. సమస్య పరిష్కారానికి ఏం చేయాలి అనే ఆలోచనలు పంచుకోవాలి.
- మద్యం తాగినప్పుడు బాగుంటుందనే ఆలోచన రావడమే సరైనది కాదు. ఇలాంటప్పుడు తమ ఆలోచనల్లోనే తేడాలు వస్తున్నట్టు గుర్తించి, ఇంట్లో వారికి చెప్పి, నిపుణుల సలహా తీసుకోవడం, కంట్రోలింగ్ పవర్‌ని పెంచుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి.
- 'కుటుంబంలో ఉన్న అందరూ (పిల్లలు – పెద్దలు) క్రమశిక్షణ పాటించాలి..' అనే కఠిన నిర్ణయాన్ని అమలు చేయాల్సిందే.
- ఇంట్లో ఎవరైనా మద్యం తాగుతున్నారు అంటే మొదట్లోనే అలెర్ట్ చేయాలి. కొన్నిసార్లు మాత్రమే కదా, వాళ్లే మారుతారులే అనే ఆలోచనా ధోరణిని దరి చేరనీయకూడదు. సమస్య పెరిగాక తగ్గిద్దామనుకుంటే 'అలవాటు' కుటుంబంలోని మిగతా వ్యక్తులపై దాడి చేయడానికి వెనకాడనీయదు. మద్యం తెచ్చుకోవడానికి డబ్బు లేకపోతే ఇంట్లో దొంగతనాలు చేయడం, వస్తువులను అమ్మడం, చావడం, చంపడం .. వంటి నేరాలకు దారులు తెరుస్తుంది. అందుకే, సమస్యను పెంచనీయకూడదు.
- సమస్య గుర్తించిన వెంటనే ఫ్యామిలీ కౌన్సెలింగ్ తీసుకోవడం, నిపుణుల సలహాలు పాటించడం అత్యవసరం.

బ్యూటిప్స్ / హెయిర్ కేర్

ఇలా కడగండి.. అలా పెరుగుతుంది

కప్పునీళ్లల్లో టేబుల్ స్పూను టీ పొడి, టేబుల్ స్పూను మెంతులు వేసి ఐదు నిమిషాలు మరిగించాలి. మరిగిన నీటిని వడగట్టి పిప్పి తీసేయాలి. మిగిలిన నీటిలో రోజూ వాడే షాంపుని వేసి కలపాలి. ఈ మిశ్రమంతో తలస్నానం చేస్తే జుట్టు ఒత్తుగా పెరగడంతోపాటు సిల్కీగా మెరిసిపోతుంది.



కిచెన్ టిప్స్



మార్కెట్లో దొరికే డిష్‌వాష్ బార్‌లు, లిక్విడ్‌లు మన చేతులకు హాని చేస్తాయి. రసాయనాలతో తయారయ్యే ఈ వాష్ బార్లు మన చర్మంలోని తేమని హరించి వేసి వివిధరకాల చర్మ సమస్యలకు దారి తీస్తాయి. అందువల్ల వీటికి ప్రత్యామ్నాయంగా గంజినీళ్లు, బేకింగ్ సోడా, నిమ్మరసాన్ని గిన్నెలు తోమడానికి వాడుకోవచ్చు. అవేంటో చూద్దాం...

- వెనిగర్‌లో పదినిమిషాలు గిన్నెలను నానబెట్టి తరువాత కొబ్బరిపీచుతో బేకింగ్ సోడాని అద్దుకుని తోమితే చక్కగా శుభ్రపడతాయి.
- గంజినీళ్లలో బేకింగ్ సోడా వేసి పదినిమిషాలు ఉంచాలి. తరువాత ఈ నీటితో గిన్నెలను తోమితే మురికితోపాటు, జిడ్డు కూడా పూర్తిగా పోతుంది.
- బేకింగ్ సోడాలో నిమ్మరసం కలిపి గిన్నెలు తోమితే జిడ్డు, వాసన వదిలి చక్కగా శుభ్రపడతాయి.

మ్యాంగో మ్యాన్

ఒకే మామిడి చెట్టుకు 300 కాయలు కాస్తాయి. అయితే ఆ కాయలు ఒక్కోటి ఒక్కో రకం. ఒక కొమ్మకు రసాలైతే ఒక కొమ్మకు తోతాపురి.. ఇలా ప్రపంచంలో ఏ చెట్టూ కాయదు. దీనిని సాధ్యం చేసి 'మ్యాంగో మేన్ ఆఫ్ ఇండియా'గా పేరు పొందాడు లక్నోకు చెందిన కలీముల్లా ఖాన్. జీవితం మొత్తాన్ని మామిడి సాగుకు అంకితం చేసిన కలీముల్లా మామిడి తోట ఒక దర్శనీయ స్థలం.



కలీముల్లా ఖాన్

'ప్రపంచంలో మామిడి పండు అంత అందమైన పండు మరొకటి లేదు' అంటారు కలీముల్లా ఖాన్. ఆయనికిప్పుడు 80 దాటాయి. లక్నో నుంచి ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉండే మలిహామాద్‌లో ఆయన మామిడి ఉద్యానవనం ఉంది. 'ఇది ప్రపంచ మామిడి చెట్లకు కాలేజీ లాంటిది. ఎవరైనా మామిడి పండ్ల గురించి ఇక్కడ చదవాల్సిందే' అంటాడాయన.

మలిహాబాద్ ఉత్తరప్రదేశ్‌లో మామిడితోటలకు ప్రసిద్ధి. కలీముల్లా కుటుంబం కూడా మామిడి తోటల పెంపకంలో తాత తండ్రుల కాలం నుంచి ఉంది. 'నేను సెవెన్త్ ఫెయిల్ అయ్యాను. మా ఊళ్లో పిల్లల్ని ఇళ్ల నుంచి కూడా బయటకు రానీయరు తల్లిదండ్రులు. అలా పెరిగాను. కొన్నాళ్లు ఆ పనీ ఈ పనీ చేసి మామిడి నర్సరీలో పని చేయడం మొదలుపెట్టాను. నాకు 18 ఏళ్ల వయసులో అంటు కట్టి మొదటి మామిడి మొక్కను నాటాను. కాని ఆ రోజు నుంచి భారీ వర్షం. దేవునికి ఇష్టం లేదనుకున్నాను. ఆ మొక్క బతకలేదు. కాని అంటు కట్టే విధానంతో కొత్త కొత్త మామిడి రకాలు సృష్టించాలన్న నా పిచ్చి పోలేదు. 1970లో నా పెళ్లయ్యింది. అప్పుడే ఈ మామిడి తోటలో ప్రయోగాలు మొదలెట్టాను' అంటాడాయన.



ఒకేచెట్టుకు 315 రకాలు

ఒకేచెట్టు కొమ్మలకు రకరకాల పండ్ల అంటు కడుతూ చెట్టును విస్తరించడమే కాదు, దాని ప్రతికొమ్మకూ కొత్తరకం కాయలను సృష్టించాడు కలీముల్లా. 'ఇన్ని రకాల కాయలు ఒకే చెట్టుకు కాసినప్పుడు మనుషులందరూ ఒకే రీతిన ఎందుకు కలిసి ఉండకూడదు' అని ప్రశ్నిస్తాడాయన. 'నేను సృష్టించిన ఒకరకం కాలాపహాడ్ పండును జుర్రుకుంటే మూడు రకాల రుచులు వస్తుంది' అంటాడాయన. కొన్ని రకాల అంటు మామిళ్లకు కలీముల్లా 'అమితాబ్, 'సచిన్', 'నమో' అనే పేర్లు పెట్టాడు. కరోనాలో సేవచేసి మరణించిన డాక్టర్లకు నివాళిగా ఒక మామిడి రకాన్ని సృష్టించి 'డాక్టర్'వెరైటీ అని నామకరణం చేశాడు.

కలీముల్లాకు 2008లో పద్మశ్రీ వచ్చింది. ఇప్పటికి ప్రపంచ వ్యాప్తంగా నాకు 400 అవార్డులు ఉద్యానవన విభాగంలో వచ్చాయి. చాలా వాటిని మా పిల్లలు వెళ్లి తీసుకొస్తుంటారు అంటాడాయన. 'నాకు మన దేశం అంటే ప్రేమ. అమెరికా నుంచి చాలామంది వచ్చి నా విధానాలు తెలుసుకుని వెళ్లారు. మన దేశం వాళ్లే నా వల్ల ఎక్కువ ప్రయోజనం పొందడం లేదని అనిపిస్తోంది. నా జ్ఞానాన్ని నా వాళ్లకు పంచాలనే నా తపన అని భావోద్వేగంతో అంటాడు కలీముల్లా.

'మా తోటకు రండి. మామిడి తినిపోండి' అని సదా ఆహ్వానిస్తుంటాడాయన.

వేదిక

ఆత్మవిశ్వాసం-ఆనందం-అందం

అందాల పోటీల గురించి ఉండే సంప్రదాయ ఆలోచనలను బ్రేక్ చేసింది మిసెస్ ఇండియా ఎంప్రెస్ ఆఫ్ ది నేషన్. పుణెలో జరిగిన ఈ అందాల పోటీలలో డెబ్బై సంవత్సరాల బామ్మలు కూడా పాల్గొన్నారు. ఎంతో ఆత్మవిశ్వాసాన్ని బహుమానంగా గెలుచుకున్నారు....



అభిలాష చహలియ



ఎలిట్ కేటగిరీ (50 సంవత్సరాల పైన): ఫస్ట్ రన్నరప్: సీమా సిన్హా, విన్నర్: సుజాతా శర్మ, సెకండ్ రన్నరప్: కకోలి ఘోష్



గోల్డ్ కేటగిరీ (39-49 సంవత్సరాల మధ్య): సెకండ్ రన్నరప్: రక్షా కర్వ, విన్నర్: అపేక్షా దబ్రాల్, ఫస్ట్ రన్నరప్: డా. మృణాళిని భరద్వాజ్



సిల్వర్ కేటగిరీ (21-38 సంవత్సరాల మధ్య): ఫస్ట్ రన్నరప్: అభిలాష చహలియ, విన్నర్: ప్రియాంక గడియ, సెకండ్ రన్నరప్: డా. నేహా సల్గావ్‌కర్

'ఏజ్ ఈజ్ జస్ట్ ఏ నంబర్' అనేది 'మిసెస్ ఇండియా ఎంప్రెస్ ఆఫ్ ది నేషన్–2023 (సీజన్4) నినాదం. సిల్వర్, గోల్డ్, ఎలిట్ విభాగాలలో 21 నుంచి 70 ఏళ్ల వయసు ఉన్న మహిళలు పాల్గొన్నారు. ర్యాంప్‌పై నడిచి ప్రేక్షకులను హుషారెత్తించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు సినీ నటులు, గత పోటీల విజేతలు కూడా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ప్రతి విభాగంలో 'టాప్ 3'ని ఎంపిక చేశారు.

సిల్వర్ కేటగిరి (21 నుంచి 38 సంవత్సరాలు)లో పుణెకు చెందిన ప్రియాంక గడియ, ఆ తరువాత స్థానంలో ఢిల్లీకి చెందిన అభిలాష చహలియ, గోవాకు చెందిన డా. నేహా ప్రభు సల్గావ్‌కర్ నిలిచారు. గోల్డ్ కేటగిరి (39 నుంచి 49 సంవత్సరాలు)లో భోపాల్‌కు చెందిన అపేక్ష దబ్రాల్, ఆ తరువాత స్థానంలో పుణెకు చెందిన డా. మృణాళిని భరద్వాజ్, ముంబైకి చెందిన రక్షా కర్వ నిలిచారు. ఎలిట్ కేటగిరీ (50 సంవత్సరాల పైన) బెంగళూరుకు చెందిన సుజాత శర్మ, ఆ తరువాత స్థానంలో ఢిల్లీకి చెందిన సీమా సిన్హా, కోల్‌కత్తాకు చెందిన కకోలి ఘోష్ నిలిచారు.

సిల్వర్ కేటగిరీ విజేతలలో ఒకరైన అభిలాష చహలియ వృత్తిరీత్యా న్యాయవాది.

'వివాహం తరువాత మనలోని కలలను పక్కన పెట్టడం సరికాదు' అంటుంది.

అభిలాషకు చిన్నప్పటి నుంచి లైట్లు, కెమెరాలతో కూడిన గ్లామర్ ఇండస్ట్రీ అంటే ఇష్టం. అయితే చదువు, కెరీర్, పెళ్లి వల్ల తనకు ఇష్టమైన రంగానికి దూరం కావాల్సి వచ్చింది. గ్లామర్ ఇండస్ట్రీపై తన ఇష్టం, కలలు మాత్రం చెక్కుచెదరలేదు. 37 సంవత్సరాల వయసులో 'మిసెస్ ఇండియా ఎంప్రెస్ ఆఫ్ ది నేషన్'లో పాల్గొనడం, ర్యాంప్ వాక్ చేయడం తనకు చెప్పలేనంత సంతోషాన్ని ఇచ్చింది.

'ఆలస్యం అయితేనేం! చిన్నప్పటి కలను నెరవేర్చుకున్నాను' అనే సంతోషం అభిలాష మాటల్లో కనిపిస్తుంది.

ఇద్దరు పిల్లలకు తల్లి అయిన అభిలాష...

'చిన్నప్పటి కల నెరవేరడం కంటే గొప్ప సంతోషం ఏముంటుంది. కన్న కలను గుండెలో సజీవంగా ఉంచుకోగలిగితే అది నెరవేరడం అసాధ్యం కాదు. కుటుంబసభ్యులు నాకు ప్రోత్సాహం ఇచ్చి ముందుకు నడిపించారు. ఏమనుకుంటారో అనే సందేహం వదిలేయండి. మనసులో ఉన్న మాట నిస్సంకోచంగా బయటపెట్టండి చాలు. కుటుంబసభ్యుల ప్రోత్సాహం మనలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది' అంటుంది అభిలాష.

'పదిమందిలో గుర్తింపు అనేది ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. ఆత్మవిశ్వాసం ఆనందాన్ని ఇస్తుంది. ఆనందం అందాన్నిస్తుంది' అంటుంది ఎలిట్ కేటగిరి విజేతలలో ఒకరైన కోల్‌కత్తాకు చెందిన కకోలీ ఘోష్.

'మనకు ఉండే బరువు బాధ్యతల వల్ల మనసులోని కలలను సాకారం చేసుకోవడం అసాధ్యమేమో అనిపిస్తుంది. కానీ ఇది నిజం కాదు. సాధించాలి అని గట్టిగా అనుకుంటే అసాధ్యమైనది లేదు. నా కలను సాకారం చేసుకున్నాను అనే సంతోషాన్ని మాటల్లో చెప్పలేం' అంటుంది గోల్డ్ కేటగిరిలో విజేత అయిన భోపాల్‌కు చెందిన అపేక్ష దబ్రాల్.

'విజేతల కళ్లలో కనిపించిన సంతోషం, ఆత్మవిశ్వాసం వారికి మాత్రమే పరిమితం కావు. ఎంతోమందికి స్ఫూర్తి ఇచ్చి తమ కలను సాకారం చేసుకోవడానికి ముందుకు నడిపిస్తాయి' అంటుంది ఈ కార్యక్రమ అతిథుల్లో ఒకరైన నటి నీలమ్ కొఠారి.



ఫుల్లుగా తిన్నారా... ఆందోళన వద్దు

కొందరికి జిహ్వాచాపల్యం ఎక్కువ. ఏదైనా విందులు, వినోదాలు ఉంటే చాలు ఫుల్లుగా లాగించేస్తుంటారు. అయితే అలా అప్పుడప్పుడు అతిగా తినడం వల్ల శరీరంపై ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు కానీ, తరచు అతిగా తింటూ ఉంటే మాత్రం, అది మీరు బరువు పెరగటానికి, కొలెస్ట్రాల్ పెరగటానికి దారితీస్తుంది, ఫలితంగా జీర్ణక్రియ సమస్యలు మొదలుకొని రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగిపోవడం, గుండె సంబంధ సమస్యలతో బాధపడవలసి వస్తుంది. అయితే మీరు ఎప్పుడైనా ఎక్కువగా తినేసి కడుపులో అసౌకర్యంగా భావించినపుడు ఈ చిట్కాలు పాటించండి చాలు... తక్షణ ఉపశమనం లభిస్తుంది.







అమ్మమ్మల కాలం నుంచి నేటి వరకు అన్ని రకాల కడుపు సమస్యలకు ఏకైక పరిష్కారం ఏదైనా ఉంటే, అది వాము అని చెప్పవచ్చు. వాము నమలడం వల్ల కడుపులో అసౌకర్యం లేదా నొప్పి, గ్యాస్, వాంతులు, అజీర్ణం , ఆమ్లత్వం వంటి ఇతర సమస్యలను పరిష్కరించవచ్చు. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది అలాగే మంచి విరేచన కారి కావడం వల్ల అజీర్ణంతో ఇబ్బంది పడుతున్నవారు.. కొద్దిగా వాము, నల్ల ఉప్పు, అల్లం కలిపి చూర్ణం చేసి, భోజనం తర్వాత చప్పరించి గోరువెచ్చటి నీళ్ల తాగితే సరి!

పుదీనా టీ

జీర్ణ సంబంధ సమస్యలను దూరం చేయడంలో పుదీనా టీ బాగా సహాయపడుతుంది, మిరియాలు, పుదీనా కలగలిసిన టీ మీ జీర్ణవ్యవస్థకు చాలా మేలు చేస్తుంది. ఇది కడుపు కండరాలను సడలించే అనేక యాంటీ బాక్టీరియల్, క్రిమినాశక లక్షణాలను అందిస్తుంది. అంతేకాకుండా అతిగా తినడం వల్ల కలిగే మలబద్ధకం, విరేచనాలు ఇతర కడుపు సంబంధిత సమస్యలను నయం చేస్తుంది.

పెరుగు తినండి

మీరు కడుపులో పట్టనంతగా నిండుగా తిన్నప్పటికీ, ఆపైన కొంచెం పెరుగు తినడం ద్వారా మేలు కలుగుతుంది. పెరుగు అనేది ప్రోబయోటిక్స్ కు మూలం కాబట్టి, ఎప్పుడైనా ఆహారం పెద్ద మొత్తంలో తిన్న తర్వాత పెరుగు తప్పకుండా తీసుకోండి. ఇది కడుపు ఉబ్బరం సహా ఇతర కడుపు బాధలను తగ్గించగలదు. తాజా సాదా పెరుగు ఎంచుకోండి.

చల్లని పాలు తాగాలి

చల్లటి పాలు తాగడం అసిడిటీని ఎదుర్కోవడానికి సులభమైన ఇంటి నివారణలలో ఒకటి. పాలలోని కాల్షియం, కడుపులోని హైడ్రోక్లోరిక్ ఆమ్లాల అదనపు స్రావాన్ని నియంత్రిస్తుంది, తద్వారా కడుపులోని ఆమ్లాలను శోషిస్తుంది. చల్లని పాలు అసిడిటీకి సరైన విరుగుడు, ఇది కడుపులో మంట నుండి తక్షణ ఉపశమనాన్ని అందిస్తుంది.

తిన్న వెంటనే నిద్ర వద్దు

బాగా తిన్న తర్వాత నేరుగా వెళ్లి హాయిగా నిద్రపోతారు కొందరు. అయితే ఇది అసలు మంచిది కాదు. దీని వల్ల యాసిడ్ రిఫ్లక్స్ జరిగి, జీర్ణక్రియ ఆటంకాలకు కారణమవుతుంది. దాంతోబాటు మనం తిన్న ఆహారం మూలంగా వచ్చి చేరే కేలరీలు కరిగే అవకాశం ఉండక బరువు పెరుగటానికి దారితీస్తుంది.

అరకిలోమీటరైనా నడవండి

నడక మీ జీర్ణక్రియను ఉత్తేజపరిచేందుకు, మీ రక్తంలో చక్కెర స్థాయులను సమం చేయడానికి సహాయపడుతుంది. కాబట్టి కడుపు నిండా భోజనం చేసిన తర్వాత మంచం మీద పడుకునే బదులు, కాస్త నడవండి, తేలికగా అనిపిస్తుంది. కేవలం 15 నిమిషాలు చిన్న నడకకు వెళ్లి వచ్చినా చాలు మంచి అనుభూతి చెందుతారు. అయితే పరుగు, జాగింగ్ లేదా వ్యాయామాలు వద్దు. తక్కువలో తక్కువగా రెండు వందలనుంచి ఐదువందల అడుగుల దూరం నడిస్తే చాలు. .

కాబట్టి, అతిగా తిన్నప్పుడు మీ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడానికి పై చిట్కాలను ప్రయత్నించండి.

పచ్చిగా తినకండి

మనకు ఆహార పదార్థాలలో కొన్ని వండకుండా నేరుగా తినేయవచ్చు, మరికొన్నింటిని తప్పకుండా వండుకొనే తినాలి. మనలో చాలా మంది కొన్ని కూరగాయలను పచ్చిగా తినడమే ఆరోగ్యకరం అని నమ్ముతారు. అయితే అన్ని సందర్భాలలో.. అన్ని కూరగాయల విషయంలో అది మంచిది కాదంటున్నారు నిపుణులు. అలా పచ్చిగా తినకూడని కూరగాయలేమిటో తెలుసుకుందాం.

కొన్ని కూరగాయలలో సహజమైన విషపూరిత సమ్మేళనాలు, జీర్ణం కావడానికి కష్టతరమైన చక్కెరలు ఉంటాయి. ఇవి ఫుడ్ పాయిజన్, జీర్ణ సమస్యలు కలిగించడంతో పాటు గ్యాస్ట్రోనామికల్ వ్యాధులకు దారితీయవచ్చు. అంతేకాదు, కూరగాయలను పండించటానికి ఎరువులు, పురుగుమందులు ఎక్కువగా వాడుతున్నారు. మనం వాటిని ఎంత శుభ్రం చేసినా, వాటి లోపలి భాగంలో ఉండే హానికర సమ్మేళనాలు, బ్యాక్టీరియా వంటివి అలాగే ఉంటాయి. బాగా ఉడికించినపుడు మాత్రమే అవి క్రిమిసంహారం అవుతాయి, అప్పుడే అవి తినడానికి అనువైనవిగా ఉంటాయి.

అయితే పచ్చిగా అస్సలు తినకూడని ఆహార పదార్థాలు ఏమిటో కొన్నింటిని ఇక్కడ తెలుసుకుందాం.



చిలగడదుంప/గెణుసు గడ్డ/రత్నపురి గడ్డ

వీటిని నేరుగా తిన్నా, రుచిగానే ఉంటుంది. అయితే ఇలా తినడం జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. వీటిలో ఉండే పిండి పదార్థం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్‌సమస్యలు ఏర్పడతాయి. ఇలాంటి సమస్యలను నివారించడానికి వీటిని కాల్చడం లేదా ఉడికించడం మంచిది.



బీన్స్

పచ్చిగా తినకూడని మరో వెజిటెబుల్ బీన్స్. కొన్ని రకాల బీన్స్ పచ్చిగా తింటే ప్రమాదకరం కూడా. బీన్స్‌లోని కొన్ని రకాలు హానికరమైన అమైనో ఆమ్లాలను కలిగి ఉంటాయి. అందువల్ల వాటిలోని హానికరమైన టాక్సిన్‌ను తొలగించడానికి ముందు బీన్స్‌ను క్లీనర్ నీటిలో నానబెట్టండి. ఆపైన వండుకొని తినాలి.



రెడ్ కిడ్నీ బీన్స్

ఉడికించని లేదా సరిగ్గా ఉడకని కిడ్నీ బీన్స్ (రాజ్మా) లో పెద్ద మొత్తంలో టాక్సిన్, గ్లైకో ప్రొటీన్ లెక్టిన్ ఉంటుంది. వీటిని తిన్న కొన్ని గంటల్లోనే వికారం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలకు దారితీస్తుంది. లక్షణాల తీవ్రత కూడా మీరు తిన్నపరిమాణంపై ఉంటుంది. ఎక్కువగా తినేస్తే ఎక్కువ మొత్తంలో టాక్సిన్స్ మీ శరీరంలోకి చేరతాయి. కాబట్టి కిడ్నీబీన్స్‌ని ఎప్పుడయినా ఉడకబెట్టి తినాలి.



ఆకు కూరలు

ఆకుకూరల్లో కొన్నింటిని పచ్చిగా తినకూడదు. క్యాబేజీ కుటుంబానికి చెందిన కాలీఫ్లవర్, బ్రస్సెల్స్, బ్రోకలీ, అలాగే మొలకలను పచ్చిగా తినడం వల్ల అనేక గ్యాస్ట్రోనమికల్ సమస్యలు వస్తాయి.



పుట్టగొడుగులు

పుట్టగొడుగులను పచ్చిగా తినవచ్చు, అయితే ఎక్కువ పోషకాలను పొందడానికి ఉడికించిన వాటిని తీసుకోవడం మంచిది. కాల్చిన, వేయించిన లేదా ఉడికించిన పుట్టగొడుగుల్లో ఎక్కువ పొటాషియం ఉంటుంది. అంతే కాకుండా వాటి రుచి కూడా పెరుగుతుంది. కాబట్టి వండుకొని తినండి.



శాకాహారాలు కాకుండా ఏ రకమైన మాంసాహారాన్ని అయినా పచ్చిగా తినడం చాలా ప్రమాదకరం. పచ్చి మాంసంపై రకరకాల హానికర బ్యాక్టీరియాలు ఆవాసం ఏర్పర్చుకుంటాయి. కాబట్టి మాంసాన్ని బాగా ఉడికించుకొని తినాలి. అలాగే కోడిగుడ్లను కూడా పచ్చిగా తినడం హానికరమే!

బరువును జ్యూస్ చేసేయండి

బరువు తగ్గడానికి కొందరు రకరకాల ప్రయత్నాలు చేసి విసిగి పోతుంటారు. అయితే కొన్ని రకాల జ్యూస్‌లు తాగడం వల్ల కూడా సులువుగా బరువు తగ్గవచ్చు. అవేమిటో, ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం...

గోధుమ గడ్డి జ్యూస్ ను పొద్దున్నే కాఫీ టీ బదులుగా తాగటం వల్ల తొందరగా సన్నబడతారు. దీనికి కావాల్సిన గోధుమగడ్డిని ఇంట్లోనే ఈజీగా పెంచుకోవచ్చు. ఇందులో ఐరన్, కాల్షియం, మెగ్నిషియం, ఫైటో న్యూట్రియెంట్లు,అమైనోయాసిడ్లు, విటమిన్‌లు ఎ, సి, ఇ, కె, బి కాంప్లెక్స్, క్లోరోఫిల్, ప్రోటీన్లు వంటి పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. గోధుమగడ్డి జ్యూస్‌ను తరచూ తీసుకోవడం వల్ల, శరీరంలోని విషపదార్థాలు బయటకు వెళ్లిపోయి, ఈజీగా అధిక బరువు తగ్గిస్తుంది



➡ **బీట్రూట్, క్యారెట్ జ్యూస్**

రోజు ఉదయాన్నే టిఫిన్ సమయంలో ఒక బీట్రూట్, రెండు క్యారెట్లు కలిపి జ్యూస్‌లా తయారు చేసుకోవాలి. ఇందులోని విటమిన్ ఏ, సి, ఫైబర్ పుష్కలంగా లభించి,అధిక బరువును తొందరగా తగ్గించడానికి ఉపయోగపడతాయి.

➡ **కరివేపాకు జ్యూస్**

దీనికోసం గుప్పెడు కరివేపాకు తీసుకొని, గ్లాసు నీళ్లలో వేసి మరిగించుకోవాలి. ఇందులో స్పూన్ తేనె, స్పూన్ నిమ్మరసం కలిపి తాగడం వల్ల తొందరగా అధిక బరువును తగ్గించుకోవచ్చు. కరివేపాకులో ఫోలిక్ యాసిడ్, ఐరన్ లభిస్తాయి. ఇందులోని లిపిడ్లు, అమైనో ఆమ్లాలు పొట్ట కొవ్వును తగ్గించడంలో బాగా సహాయపడతాయి.

➡ **బొప్పాయి జ్యూస్...**

టిఫిన్‌కి బదులుగా బొప్పాయి జ్యూస్ తీసుకోవడం వల్ల ఇందులోని ఫైబర్ పొట్టలోని కొవ్వును కరిగించడంలో సహాయ పడుతుంది. అంతే కాక ఇందులోని విటమిన్ ఏ కంటి ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది.

➡ **పుచ్చకాయ జ్యూస్...**

పుచ్చకాయ జ్యూస్‌ని తరచూ తీసుకోవడం మంచిది. ఎందుకంటే ఇందులో నీటిశాతం ఎక్కువగా ఉండటం వల్ల తొందరగా పొట్ట నిండిన భావన కలుగుతుంది. దీనితో తినాలనే కోరిక తగ్గి, తొందరగా బరువు తగ్గవచ్చు.

➡ **నిమ్మ జూస్**

నిమ్మరసం తేనె కలిపి తాగుతూ వుంటే తొందరగా పొట్ట నిండిన భావన కలిగిస్తుంది. దీనితో తినాలనే కోరిక తగ్గి, తొందరగా బరువు తగ్గవచ్చు.


సినిమా



● అల్లు అర్జున్

ఇప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో 'యాస'ల ట్రెండ్ నడుస్తోంది. పాత్రలకు తగ్గట్టు స్టార్స్ ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల యాసలు పలకడానికి 'యస్' చెబుతున్నారు. ఏ యాసకి ఆ యాస ఆడియన్స్‌ని థియేటర్స్‌కి రప్పించడానికి ఉపయోగపడుతోంది. అందుకే 'యాసలందు అన్ని యాసలూ లెస్స' అని చెప్పాలి. ప్రస్తుతం 'పుష్ప 2, హరోం హర'తో పాటు విశ్వక్ సేన్ చిత్రం, అనన్య నాగళ్ల మూవీ వంటి పలు సినిమాలు ఆయా ప్రాంత యాసల నేపథ్యంలో రూపొందుతున్నాయి.. వాటిపై ఓ లుక్కేద్దాం.

యాసలందు అన్ని యాసలూ లెస్స



● విశ్వక్ సేన్



● సుధీర్‌బాబు

పుష్పగాడి రూలు

'పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా.. ఫైరు'... 'తగ్గేదే లే' అంటూ 'పుష్ప' తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లో హీరో అల్లు అర్జున్ చెప్పిన డైలాగ్ ఎంత పాపులర్ అయిందో చెప్పక్కర్లేదు. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో హిట్ అయింది. ఈ చిత్రంలో హీరో, హీరోయిన్ సహా దాదాపు అన్ని పాత్రలు రాయలసీమలోని చిత్తూరు యాసలో మాట్లాడతాయి. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప 2: ది రూల్' కూడా చిత్తూరు యాసలో రూపొందుతోంది. అల్లు అర్జున్, రష్మికా మందన్న జంటగా సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇక 'అడవిలో జంతువులు రెండడుగులు ఎనక్కి ఏసినాయంటే పులి వచ్చిందాదని అర్థం.. అదే పులి రెండడుగులు ఎనక్కి ఏసినాదంటే పుష్ప వచ్చిండాడని అర్థం', 'పుష్పగాడి రూలు' వంటి డైలాగులు 'పుష్ప 2: ది రూల్' గ్లింప్స్‌లో ఉన్నాయి.

ఇంగ సెప్పేదేం లేదు.. సేసేదే

సుధీర్‌బాబు హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'హరోం హర'. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి. నాయుడు నిర్మిస్తున్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగిన 1989 నాటి కథతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమా టీజర్‌లో 'సుబ్రహ్మణ్యం అన్న.. జనాలు నీ కోసం సూస్తా ఉండారు.. అట్లా కదలకుండా ఉంటే ఎట్లా.. ఏందోకటి సెప్పు', 'ఇంగ సెప్పేదేం లేదు.. సేసేదే' వంటి చిత్తూరు యాస డైలాగులు వినిపించాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా డిసెంబర్ 22న విడుదల కానుంది



● అనన్య నాగళ్ల



● అక్షా ఖాన్

బ్లాక్.. వైట్ ఉండదు..

'సామాజిక నిబంధనలను ధిక్కరించే ప్రపంచంలో బ్లాక్ ఉండదు, వైట్ ఉండదు, గ్రే మాత్రమే ఉంటుంది' అంటూ 'వీఎస్ 11' (వర్కింగ్ టైటిల్) చిత్రం వీడియో రిలీజ్ అయింది. విశ్వక్ సేన్ హీరోగా కృష్ణ చైతన్య దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని చీకటి సామ్రాజ్యం నేపథ్యంలో పీరియాడిక్ చిత్రంగా ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో విశ్వక్ సేన్ గోదావరి యాసలో మాట్లాడతారు.

శ్రీకాకుళం యాసతో...

అనన్య నాగళ్ల, రవి మహాదాస్యం జంటగా 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలో రాజా రామ్మోహన్ చల్లా దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. బేబీ లాస్య రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణారెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కథాంశం శ్రీకాకుళం యాస నేపథ్యంలో సాగుతుంది.

నెల్లూరి నెరజాణ

డైరెక్టర్ నాగ్ అశ్విన్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన చిగురుపాటి సుబ్రమణ్యం స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'నెల్లూరి నెరజాణ'. ఎంఎస్ చంద్ర, హరి హీరోలుగా, అక్షా ఖాన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం పక్కా నెల్లూరు యాసలో రూపొంది నట్లు చిగురుపాటి సుబ్రమణ్యం తెలిపారు. **ఇవే కాదు.. మరికొన్ని చిత్రాల్లో కూడా ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ యాస వినిపించనుంది.**

ఇది మరచిపోలేని అనుభూతి - రామ్‌చరణ్



● రామ్‌చరణ్, ఉపాసన

''ఫస్ట్ టైమ్ పాపను ఎత్తుకున్నప్పుడు ఏ తండ్రికైనా ఎంత ఆనందంగా ఉంటుందో నాకూ అలానే అనిపించింది. ఇది మరచిపోలేని అనుభూతి. ఉపాసన, పాప క్షేమంగా ఉన్నారు'' అని రామ్‌చరణ్ అన్నారు. రామ్‌చరణ్ భార్య ఉపాసన హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో ఈ నెల 20న ఒక పాపకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉపాసన డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా ఉపాసన, పాపతో కలిసి రామ్‌చరణ్ మీడియా ముందుకు వచ్చారు. పాప ఎవరి పోలిక అని విలేకరులు అడగ్గా.. 'కచ్చితంగా నాన్నలాగా ఉంటుంది' అన్నారు రామ్‌చరణ్. తాను, ఉపాసన పాప కోసం మంచి పేరును ఎంచుకున్నామనీ, సంప్రదాయం ప్రకారం 21వ రోజున పేరు ప్రకటిస్తామనీ చరణ్ అన్నారు.

క్వాలిటీ ఫిల్మ్‌లా అనిపిస్తోంది - మారుతి



● చైతన్యా రావ్, మారుతి

చైతన్యా రావ్, లావణ్య జంటగా చెందు ముద్దు దర్శకత్వంలో యష్ రంగినేని నిర్మించిన చిత్రం 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. ఈ సినిమా జూలై 21న రిలీజ్ కానున్న సందర్భంగా శుక్రవారం టీజర్‌ను రిలీజ్ చేసిన దర్శకుడు మారుతి మాట్లాడుతూ– ''1980, 1990 బ్యాక్‌డ్రాప్‌లో ఆ నేటివిటీ ఎక్కడా మిస్ కాకుండా ఈ సినిమాను తెరకెక్కించారు. టీజర్ చూస్తుంటే క్వాలిటీ ఫిల్మ్‌లా అనిపిస్తోంది'' అన్నారు. ''ఇప్పుడొస్తున్న చిత్రాలతో పోలిస్తే మా చిత్రం భిన్నంగా ఉంటుంది'' అన్నారు చెందు ముద్దు.

మహేశ్‌కు జోడీగా...?



● మీనాక్షీ చౌదరి

'**గుం**టూరు కారం' సినిమాలో హీరోయిన్ మీనాక్షీ చౌదరి నటించనున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. కథ రీత్యా ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్స్‌కు చాన్స్ ఉంది. పూజా హెగ్డే, శ్రీలీలను ఎంపిక చేశారు. అయితే డేట్స్ సర్దుబాటు చేయలేక ఈ సినిమా నుంచి తప్పుకున్నారు పూజా హెగ్డే. దీంతో పూజా ప్లేస్‌లోకి మరో హీరోయిన్‌ను ఎంపిక చేసే పనిలో పడింది టీమ్. ఈ నేపథ్యంలో తాజాగా మీనాక్షీ చౌదరి పేరు వినిపిస్తోంది. రవితేజ 'ఖిలాడి', అడివి శేష్ 'హిట్ 2' వంటి సినిమాలతో మీనాక్షీ చౌదరి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. ప్రస్తుతం విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న ఓ చిత్రంలో ఈ బ్యూటీ నటిస్తున్నారు. మరి.. 'గుంటూరు కారం'లో మహేశ్‌కు జోడీగా నటించే బంపర్ ఆఫర్‌ని మీనాక్షీ కొట్టేస్తారా? చూడాలి.

పిల్లి బొమ్మ వస్తుంది!



● సుధాకర్

'నెక్ట్స్ టెన్ డేస్‌లో చాలా పెద్ద డీల్ ఉంది. దుబాయ్ నుంచి ముంబైకి ఒక పిల్లి బొమ్మ వస్తుంది. దాన్ని చాలా సేఫ్‌గా మన దగ్గరకు చేర్చాలి' అనే డైలాగ్‌తో 'నారాయణ అండ్ కో' సినిమా ట్రైలర్ విడుదలైంది. సుధాకర్ కోమాకుల హీరోగా చిన్నా పాపిశెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'నారాయణ అండ్ కో'. పాపిశెట్టి ఫిల్మ్ ప్రొడక్షన్స్, సుఖ మీడియా బ్యానర్‌లపై పాపిశెట్టి బ్రదర్స్‌తో కలిసి సుధాకర్ కోమాకుల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను హీరో విశ్వక్ సేన్ రిలీజ్ చేశారు ''చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'నారాయణ అండ్ కో' రూపొందింది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

కాస్త ముందుగానే..



● రామ్

రామ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో శ్రీ లీల నాయిక. జీ స్టూడియోస్, పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని అక్టోబరు 20న రిలీజ్ చేయాలనుకున్నారు. తాజాగా సెప్టెంబరు 15న రిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇలా అనుకున్న టైమ్‌కంటే ముందుగానే ఈ సినిమా థియేటర్స్‌లోకి రానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది.

రైతుల నేపథ్యంలో...



● మోహనకృష్ణ, సుమన్

మోహన కృష్ణ, సౌజన్య, హరిణి రెడ్డి హీరో హీరోయిన్లుగా, ఓ ప్రధాన పాత్రలో సుమన్ నటించిన చిత్రం 'మోహన్‌కృష్ణ గ్యాంగ్ లీడర్'. శ్రీ లక్ష్మణ్ దర్శకత్వంలో సింగులూరి మోహన్‌రావు నిర్మించిన ఈ చిత్రం జూలై 7న రిలీజ్ కానుంది. ఈ చిత్రం విలేకర్ల సమావేశంలో సుమన్ మాట్లాడుతూ– ''రైతులను ఇబ్బంది పెడుతున్న ఓ బర్నింగ్ ఇష్యూపై నా పాత్ర ఉంటుంది'' అన్నారు. ''రైతులు, స్నేహం, రాజకీయం.. అంశాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు మోహన కృష్ణ. ''రైతు గురించి మంచి కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశాం'' అన్నారు శ్రీ లక్ష్మణ్.

త్వరలో ఎస్కేప్



● శ్రుతీ పులారి

ఒకే ఒక్క పాత్రతో బాణాల క్రియేటీవ్ వర్క్స్ బ్యానర్ పై శ్రీధర్ బాణాల దర్శకత్వం వహించిన చిత్రం 'ఎస్కేప్'. శ్రుతీ పులారి హీరోయిన్‌గా నటించారు. ''ఈ చిత్రానికి ఉత్తమ కథ, నటి, చిత్రం, సంగీతదర్శకుడు, దర్శకుడు, ఛాయాగ్రాహకుడు, గాయని, కాస్ట్యూమ్ డిజైనర్.. ఇలా దాదాపు 30 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు దక్కాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ''హీరోయిన్‌గా తొలి చిత్రంలోనే సింగిల్ క్యారెక్టర్ చేయడం హ్యాపీ'' అన్నారు శ్రుతి. ''త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం'' అన్నారు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గౌతం కుమార్ పీపీ.

శత్రువులెవరో...



● రిచా, సాయి రోనక్

ఓ ఫొటోగ్రాఫర్ తన జీవితంలో శత్రువులెవరో, మిత్రులెవరో తెలియని సందిగ్ధంలో ఉంటాడు. అప్పుడు అతనేం చేశాడు? అనేది 'సర్కిల్' చిత్రం ప్రధాన ఇతివృత్తం. సాయి రోనక్, బాబా భాస్కర్ ప్రధాన పాత్రల్లో అర్షిణ్ మెహతా, రిచా పనై, నైనా, పార్థవ సత్య కీలక పాత్రలు చేశారు. ఫొటోగ్రాఫర్‌గా సాయి రోనక్ చేశారు. నీలకంఠ దర్శకత్వంలో ఎమ్వీ శరత్ చంద్ర, టి. సుమలత, అన్విత్ రెడ్డి, వేణుబాబు అడ్డగడ నిర్మించిన ఈ చిత్రం జూలై 7 రిలీజ్ కానుంది.

సాక్షి బిజినెస్

శనివారం
24-6-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		విదేశీ సూచీలు (తొలి సెంటు రాత్రి 11.00 గంటలకు)			బులియన్ రూ.లలో ముంబై	
సెన్సెక్స్ ▽ 260 62,979	నిఫ్టీ ▽ 106 18,666	నాస్‌డాక్	13,558	▽ 73	బంగారం (99.9 స్వచ్ఛత)	58,395 ▽ 259
		డోజోన్స్	33,816	▽ 130	బంగారం (99.5 స్వచ్ఛత)	58,161 ▽ 358
		ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,462	▽ 40	వెండి (కిలో)	68,304 ▽ 705
		డాక్స్	15,830	▽ 158		
		షాంఘై (బుధవారం ముగింపు)	3,198	▽ 42		
		నికాయ్	32,781	▽ 483		

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

ఎల్‌ఐసీ నుంచి 'ధన వృద్ధి'

సింగిల్ ప్రీమియం ప్లాన్ ఆవిష్కరణ

ముంబై: బీమా దిగ్గజం ఎల్‌ఐసీ కొత్తగా 'ధన వృద్ధి' పేరుతో క్లోజ్ ఎండెడ్ ప్లాన్‌ను ఆవిష్కరించింది. జూన్ 23 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఈ ప్లాన్‌ను విక్రయించనున్నట్టు ప్రకటించింది. ఇది నాన్ లింక్డ్ (ఈక్విటీతో సంబంధం లేని), నాన్ పార్టిసిపేటింగ్ ప్లాన్. పొదుపుతో కూడిన సింగిల్ ప్రీమియం ప్లాన్. జీవిత బీమా రక్షణతోపాటు పొదుపును ఆఫర్ చేస్తుంది. పాలసీదారు దురదృష్టవశాత్తూ మరణానికి గురైతే కుటుంబానికి పరిహారం అందిస్తుంది. గడువు ముగిసే వరకు జీవించి ఉంటే మెచ్యూరిటీ మొత్తం తిరిగి వస్తుంది. ఈ ప్లాన్‌లో రెండు రకాల బీమా ఆప్షన్లు ఉన్నాయి. మరణ పరిహారం చెల్లించే ప్రీమియానికి 1.25 రెట్లు లేదంటే పది రెట్లలో ఒకదాన్ని ఎంపిక చేసుకోవచ్చు. 10, 15, 18 ఏళ్ల కాల వ్యవధిపై తీసుకోవచ్చు. కనీసం రూ.1,25,000 బీమా నుంచి ఎంత మొత్తమైనా ఎంపిక చేసుకోవచ్చు. ప్రతి పాలసీ సంవత్సరం ముగిసిన తర్వాత గ్యారంటీడ్ అడిషన్స్ జమ అవుతాయి. ఈ గ్యారంటీడ్ అడిషన్ అనేది మొదటి ఆప్షన్‌లో ప్రతి రూ.1,000 సమ్ అష్యూర్డ్‌పై రూ.60–75 మధ్య, రెండో ఆప్షన్‌లో రూ.25–40 మధ్య ఉంటుంది. ఈ ప్లాన్‌లో మెచ్యూరిటీ లేదా మరణ పరిహారాన్ని కావాలంటే వాయిదాల పద్ధతిలోనూ తీసుకోవచ్చు. పాలసీపై రుణ సదుపాయం కూడా ఉంటుంది.

ఎంపీపీతో హైదరాబాద్ కంపెనీల ఒప్పందం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రక్త కణ క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే జనరిక్ ఔషధం తయారీకై హైదరాబాద్‌కు చెందిన మూడు కంపెనీలు మెడిసిన్స్ పేటెంట్ పూల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. వీటిలో అరబిందో ఫార్మా అనుబంధ కంపెనీ అయిన యూగియా ఫార్మా స్పెషాలిటీస్ తోపాటు డాక్టర్ రెడ్డీస్, హెటిరో ఉన్నాయి.



నిలోటినిబ్ జనరిక్ క్యాప్సూల్స్ అభివృద్ధి, విక్రయం కోసం మెడిసిన్స్ పేటెంట్ పూల్ (ఎంపీపీ) నుంచి ఈ కంపెనీలు సబ్-లైసెన్స్ పొందాయి. 44 తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లో ఔషధాన్ని విక్రయిస్తారు. నిలోటినిబ్ డ్రగ్‌ను నోవార్టిస్ అభివృద్ధి చేసింది. జనరిక్ ఆంకాలజీ మెడిసిన్స్ విభాగంలో కంపెనీ స్థానాన్ని ఈ ఔషధం మరింత బలోపేతం చేస్తుందని అరబిందో ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ కె.నిత్యానంద రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

చెల్లింపుల సేవలపై యాపిల్ కన్ను

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో కలసి యాపిల్ కార్డ్
- యాపిల్ పే ఆవిష్కరణ పట్ల ఆసక్తి



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ దిగ్గజ సంస్థ యాపిల్ భారత్‌లో కొత్త వ్యాపార అవకాశాలను పరిశీలిస్తోంది. ఫిన్‌టెక్ పరిశ్రమలోకి అడుగు పెట్టాలని చూస్తోంది. ఇందులో భాగంగా హెడీఎఫ్‌సీ బ్యాంక్‌తో కలసి యాపిల్ కార్డ్‌ను తీసుకువచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నట్టు సమాచారం. యాపిల్ సీఈవో టిమ్‌కిక్ ఈ ఏడాది ఏప్రిల్‌లో భారత్‌లో పర్యటించిన సందర్భంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఈవో, ఎండీ శశిధర్ జగదీశన్‌తో భాగస్వామ్యంపై చర్చలు నిర్వహించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అంతేకాదు 'యాపిల్ పే' (యూపీఐ)ను కూడా తీసుకువచ్చేందుకు ఆసక్తిగా ఉన్నట్టు సమాచారం. దీనిపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)ను సైతం సంప్రదించింది. అయితే, క్రెడిట్ కార్డ్‌ను రూపే నెట్‌వర్క్‌పై తీసుకురానుందా? అన్నది ఇంకా స్పష్టం కాలేదు. యూపీఐ కార్డ్ అయితే యూపీఐ నెట్‌వర్క్‌తో అనుసంధానించుకునే వెసులుబాటు ఉండడం తెలిసిందే. మొబైల్ ఫోన్ ద్వారా చెల్లింపులు మన దేశంలో గణనీయంగా పెరిగిన నేపథ్యంలో యాపిల్ ఈ విభాగం పట్ల ఆసక్తి చూపిస్తుండడం గమనార్హం. ఇప్పటికే గూగుల్, అమెజాన్ యూపీఐ సేవల్లో ఉన్నాయి. అమెజాన్ ఐసీఐసీఐ బ్యాంక్‌తో కలసి కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డు వ్యాపారాన్ని కూడా నిర్వహిస్తోంది. శామ్‌సంగ్ కూడా ఈ విభాగం పట్ల ఎప్పటి నుంచో ఆసక్తి చూపిస్తున్నప్పటికీ బలమైన అడుగులు ముందుకు పడలేదు. తీవ్ర పోటీ ఉన్న ఈ విభాగంలో నిలబడడం అంత సులువు కాదన్నది వాస్తవం. అధిక జనాభా ఉండడం, ఎక్కువ మంది ప్రజలు డిజిటల్ చెల్లింపులకే మొగ్గు చూపిస్తుండడంతో దిగ్గజ కంపెనీలన్నీ ఈ విభాగం పట్ల ఆకర్షితులవుతున్నాయి.

ఆర్‌బీఐతోనూ సంప్రదింపులు

క్రెడిట్ కార్డు విషయంలో ఆర్‌బీఐని సైతం యాపిల్ సంప్రదించినట్టు సమాచారం. ప్రస్తుత విధానంలో కంటే కొత్త నమూనాలో కోబ్రాండెడ్ క్రెడిట్ కార్డు తేవడం పట్ల ఆసక్తి చూపించగా.. కోబ్రాండెడ్ క్రెడిట్ కార్డు విషయంలో భారత్‌లో ఉన్న చట్టబద్ధమైన ప్రక్రియలను అనుసరించాలని ఆర్‌బీఐ సూచించిట్టు తెలిసింది. క్రెడిట్ కార్డు ఆవిష్కరణ పట్ల ఆసక్తిగా ఉన్నప్పటికీ చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నట్టు ఈ వ్యవహారం తెలిసిన వర్గాలు వెల్లడించాయి. యాపిల్ అమెరికాలో ప్రీమియం క్రెడిట్ కార్డు సేవల్లో ఉంది. గోల్డ్‌మ్యాన్ శాక్స్, మాస్టర్‌కార్డ్ భాగస్వామ్యంతో ఈ వ్యాపారం నిర్వహిస్తోంది. అదే మాదిరి భారత్‌లోనూ క్రెడిట్ కార్డు, యూపీఐ సేవల్లోకి అడుగు పెట్టాలని చూస్తోంది. యాపిల్ ఫోన్లకు భారత్ పెద్ద మార్కెట్ అని తెలిసిందే. 2022–23లో రూ.50,000 కోట్ల విలువైన యాపిల్ ఉత్పత్తులను భారత్‌లో విక్రయించింది. అంతకుముందు ఏడాది ఆదాయంతో పోలిస్తే 50 శాతం పెరిగింది. దీంతో ఇక్కడ తన సేవలను మరింత విస్తరించడం పట్ల యాపిల్ ఆసక్తి చూపిస్తున్నట్టు తెలుస్తోంది.

2024 చివరికి మేడిన్ ఇండియా ఈ-చిప్

- నాలుగైదు సెమీకండక్టర్ ప్లాంట్లు ఏడాదిలో ఏర్పాటు అవుతాయి
- కేంద్ర మంత్రి అశ్వని వైష్ణవ్



న్యూఢిల్లీ: భారత్‌లో తయారైన (మేడ్ ఇన్ ఇండియా) తొలి ఈ–చిప్‌లు 2024 డిసెంబర్ నాటికి మార్కెట్లోకి వస్తాయని కేంద్ర మంత్రి అశ్వని వైష్ణవ్ ప్రకటించారు. ఏడాదిలోపు నాలుగు నుంచి ఐదు వరకు సెమీకండక్టర్ ప్లాంట్‌లు దేశంలో ఏర్పాటు కావొచ్చని చెప్పారు. అమెరికాకు చెందిన కంప్యూటర్ మెమొరీ చిప్ తయారీ సంస్థ మైక్రాన్ టెక్నాలజీస్ 2.75 బిలియన్ డాలర్ల వ్యయంతో గుజరాత్‌లో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్టు చేసిన ప్రకటనను మంత్రి గుర్తు చేశారు. ఈ ప్లాంట్‌కు అనుసంధానంగా 200 చిన్న యూనిట్లు కూడా ఏర్పాటు అవుతాయని మంత్రి చెప్పారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్, భారత ప్రధాని మోదీ సంయుక్త ప్రకటన అనంతరం అశ్వని వైష్ణవ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. మైక్రాన్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి పన్ను నిబంధనలు, ఫ్యాక్టరీ డిజైన్, భూ కేటాయింపులపై ఒప్పందం కూడా పూర్తయినట్టు తెలిపారు. మైక్రాన్ టెక్నాలజీస్ నుంచి మొదటి చిప్ ఆరు త్రైమాసికాల తర్వాత మార్కెట్లోకి వస్తుందన్నారు. మైక్రాన్ ఏర్పాటు చేసే 2.75 బిలియన్ డాలర్ల ప్రాజెక్టుకు సంబంధించి సంస్థ సొంతంగా రూ.825 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుండగా, మిగిలిన మొత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చనుండడం గమనార్హం. ఈ ప్లాంట్‌తో మొత్తం 20వేల ఉద్యోగాలు రానున్నాయి. ఈ ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం విలువ బిలియన్ డాలర్ల మేర ఉంటుందని అశ్వని వైష్ణవ్ తెలిపారు.

సెమీకండక్టర్ పథకం సవరణ

సెమీకండక్టర్ పథకాన్ని సవరించామని, కనుక గతంలో దరఖాస్తు చేసిన సంస్థలను మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కోరినట్టు మంత్రి అశ్వని వైష్ణవ్ తెలిపారు. లేదా దరఖాస్తులు సవరించుకోవాలని సూచించినట్టు చెప్పారు. సవరించిన పథకం కింద సెమీకండక్టర్ ప్లాంట్ వ్యయంలో 50 శాతాన్ని కేంద్రమే ద్రవ్య ప్రోత్సాహకం కింద సమకూరుస్తోంది. గతంలో ఇది 30 శాతంగానే ఉండేది.

'పిల్లో' మూత



న్యూఢిల్లీ: అస్సెల్ మద్దతు కలిగిన క్రిప్టో ఇన్వెస్ట్‌మెంట్ స్టార్టప్ 'పిల్లో' తన కార్యకలాపాలను మూసివేస్తున్నట్టు ప్రకటించింది. జూలై 31 నుంచి ఈ సంస్థ కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి. నియంత్రణల పరంగా అనిశ్చితి, కఠిన వ్యాపార పరిస్థితులను ఇందుకు కారణాలుగా పేర్కొంది. సిరీస్ ఏ రౌండ్‌లో 18 మిలియన్ డాలర్లు (రూ.147 కోట్లు) సమీకరించిన ఎనిమిది నెలలకే ఈ సంస్థ చేతులెత్తేయడం గమనార్హం. ''పిల్లో యాప్ ద్వారా ఇక మీదట సేవలు అందించకూడదనే నిర్ణయం తీసుకున్నామని తెలియజేస్తున్నందుకు విచారిస్తున్నాం''అని సంస్థ తన యూజర్లకు సమాచారం ఇచ్చింది. యూజర్ల నిధులపై వడ్డీ రాబడి ఇక్కడి నుంచి ఉండదని, రివార్డుల విభాగాన్ని యాక్సెస్ చేసుకోలేరని తెలిపింది. జూలై 31 వరకు క్రిప్టో విత్‌డ్రాయల్, జూలై 7 వరకు బ్యాంక్ విత్‌డ్రాయల్ అందుబాటులో ఉంటుందని పేర్కొంది.

క్రోమా 'బ్యాక్ టు క్యాంపస్ సేల్'

హైదరాబాద్: కొత్త విద్యా సంవత్సరం(2023–24) ప్రారంభం సందర్భంగా ఎలక్ట్రానిక్స్ రిటైలర్ క్రోమా.. 'బ్యాక్ టు క్యాంపస్ సేల్' పేరుతో గ్యాడ్జెట్లపై అద్భుతమైన ఆఫర్లు ప్రకటించింది. విద్యార్థులు, ఔత్సాహికుల భిన్న అవసరాలను తీర్చేందుకు హెడ్‌ఫోన్లు, ఇయర్‌ఫోన్లు, ల్యాప్ ట్యాప్‌లు, ట్యాబ్లెట్లు, స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్‌వాచీలపై భారీ డిస్కౌంట్లు ఇస్తుంది. ఈ ఆఫర్లు పొందేందుకు సమీప క్రోమా స్టోర్లు లేదా ఆన్‌లైన్‌లో www.croma.com వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.



సూచీలకు వడ్డీరేట్ల పెంపు భయాలు

- 63 వేల దిగువకు సెన్సెక్స్
- 18,700 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ
- రెండోరోజూ కొనసాగిన నష్టాలు



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన సంకేతాల ప్రభావంతో స్టాక్ సూచీలు రెండోరోజూ నష్టాలను చవిచూశాయి. ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లు నష్టాలను చవిచూశాయి. ముఖ్యంగా ఐటీ, ఇంధన, ఫైనాన్స్ షేర్లలో భారీ ఎత్తున లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. సెన్సెక్స్ ఉదయం 115 పాయింట్లు నష్టపోయి 63,124 వద్ద, నిఫ్టీ 29 పాయింట్లు కోల్పోయి 18,742 వద్ద మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ ఇన్వెస్టర్లు అమ్మకాలకే మొగ్గుచూపడంతో సూచీలు రోజంతా నష్టాల్లో కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 365 పాయింట్లు నష్టపోయి 62,874 వద్ద, నిఫ్టీ 124 పాయింట్లు క్షీణించి 18,647 ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. ఆఖరికి సెన్సెక్స్ 260 పాయింట్లు నష్టపోయి 63 వేల దిగువన 62,979 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 106 పాయింట్లు పతనమై 18,666 వద్ద నిలిచింది. అన్ని రంగాల షేర్లలోనూ అమ్మకాలు చోటు చేసుకున్నాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు వరుసగా 1.24%, 1.17 శాతం నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.345 కోట్ల షేర్లను, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.684 కోట్ల షేర్లను విక్రయించారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 405 పాయింట్లు, నిఫ్టీ 160 పాయింట్లు నష్టపోయాయి. పలు దేశాలు వడ్డీరేట్ల పెంపు ఆందోళనలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. 'కేంద్ర బ్యాంకులు ద్రవ్యోల్బణంపై కట్టడి అంశంపై పునరుద్ఘాటన చేస్తున్నాయి. అంచనాలకు మించి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, స్విట్జర్లాండ్, నార్వే కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచాయి. అలాగే టెస్టిమోనీ ప్రసంగం సందర్భంగా ఫెడ్ చైర్మన్ పావెల్ కఠిన ద్రవ్య విధాన వైఖరి వ్యాఖ్యలు చేశారు. ఈ పరిణామంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లతో పాటు భారత్‌లో బేరిష్ ట్రెండ్ నెలకొంది' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ దీపక్ జెసానీ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు..

- ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. పర్సిస్టెంట్ 2%, ఇన్ఫోసిస్, ఎంఫసిస్, కోఫోర్జ్ టీసీఎస్, విప్రో షేర్లు 1% చొప్పున నష్టపోయాయి. ఆర్థిక అనిశ్చితి కారణంగా ఐటీ సర్వీసులకు డిమాండ్ అంతంతగానే ఉండొచ్చనే అంచనాలతో యాక్సెంచర్ భారత కంపెనీల ఆదాయం అంచనాలు భారీ తగ్గించడం ఇందుకు కారణం.
- ఎక్స్ఛేంజీ కొత్త ట్రేడింగ్ ప్లాట్‌ఫాంపై మాక్ ట్రేడింగ్ సెషన్‌ను రద్దు చేయడంతో ఎంసీఎక్స్ షేరు 3% నష్టపోయి రూ.1,570 వద్ద స్థిరపడింది. ఒక దశలో 6% పైగా పతనమై రూ.1,518 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ జోడీ ఓటమి

సించ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ ఏటీపీ–500 టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ కథ ముగిసింది. లండన్‌లో జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 3–6, 6–7 (5/7)తో వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)–నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) జోడీ చేతిలో ఓడిపోయింది. బోపన్న జోడీకి 18,190 యూరోల (రూ. 16 లక్షల 24 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ప్రణయ్ పరాజయం

భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ తైపీ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి నిష్క్రమించాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 19–21, 8–21తో ఎన్జీ కా లాంగ్ అంగుస్ (హాంకాంగ్) చేతిలో ఓడిపోయాడు.



పుజారాపై వేటు... యశస్వికి చోటు

వెస్టిండీస్‌తో సిరీస్‌కు భారత టెస్టు జట్టు ప్రకటన • వన్డేల్లోకి సామ్సన్ పునరాగమనం


యశస్వి

రంజీల్లో సత్తా చాటి...

ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన యశస్వి ఫస్ట్ క్లాస్ రికార్డు కూడా ఘనంగా ఉండటం అతనికి టెస్టు టీమ్‌లో అవకాశం కల్పించింది. 26 ఇన్నింగ్స్‌లలోనే అతను 80.21 సగటుతో 1845 పరుగులు సాధించాడు. ఇందులో 9 సెంచరీలు ఉన్నాయి. ఇటీవల జరిగిన ఇరానీ కప్ మ్యాచ్‌లో అతను రెండు ఇన్నింగ్స్‌లలో 213, 144 పరుగులు చేశాడు. డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం కూడా రిజర్వ్‌గా అతను ఇటీవల జట్టుతో పాటు లండన్ వెళ్లాడు. ఫస్ట్‌క్లాస్‌లో 42.19 సగటు ఉన్న రుతురాజ్ రికార్డు గొప్పగా లేకపోయినా, అతని టెక్నిక్ టెస్టు ఫార్మాట్‌కు పనికొస్తుందని భావించి సెలక్టర్లు గత కొంతకాలంగా అతడిపై దృష్టి పెట్టారు. గత మూడు రంజీ సీజన్‌లలో బెంగాల్ రెండు సార్లు ఫైనల్ వెళ్లడంలో పేసర్ ముకేశ్ కుమార్ కీలక పాత్ర పోషించాడు. ఇండియా 'ఎ' తరపున కూడా రాణించిన అతను 39 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 21.55 సగటుతో 149 వికెట్లు తీశాడు. ఈ ముగ్గురిలో రుతురాజ్ ఇప్పటికే భారత్ తరఫున ఒక వన్డే, 9 టి20లు ఆడగా మిగతా ఇద్దరు ఇంకా అరంగేట్రం చేయలేదు.

న్యూఢిల్లీ: భారత టెస్టు క్రికెట్‌లో కీలక పరిణామం ... సుదీర్ఘ కాలంగా జట్టులో కీలక సభ్యుడిగా, పలు చిరస్మరణీయ విజయాల్లో ముందుండి నడిపించిన చతేశ్వర్ పుజారాపై సెలక్టర్లు విశ్వాసం కోల్పోయారు. వచ్చే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను (డబ్ల్యూటీసీ 2023–2025) దృష్టిలో ఉంచుకొని బీసీసీఐ చేయబోతున్న మార్పుల్లో భాగంగా అందరికంటే ముందుగా పుజారాపై వేటు పడింది. వెస్టిండీస్‌తో జరిగే టెస్టు సిరీస్ కోసం శుక్రవారం ప్రకటించిన భారత జట్టులో పుజారాకు చోటు దక్కలేదు. అతనితో పాటు ఇటీవల జరిగిన డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆడిన పేసర్ ఉమేశ్ యాదవ్‌ను కూడా జట్టు నుంచి తప్పించారు. వీరి స్థానాల్లో యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, పేసర్ ముకేశ్ కుమార్‌లను ఎంపిక చేశారు. 16 మంది సభ్యుల ఈ టీమ్‌లోకి మరో పేస్ బౌలర్ నవదీప్ సైనీ కూడా ఎంపికయ్యాడు. డబ్ల్యూటీసీ ఫైనల్లో రాణించిన అజింక్య రహానే తన స్థానం నిలబెట్టుకోవడంతో పాటు వైస్ కెప్టెన్‌గా కూడా ఎంపిక కావడం విశేషం. భిన్న వర్గాల నుంచి విమర్శలు వచ్చినా ఆంధ్ర వికెట్ కీపర్ కోన శ్రీకర్ (కేఎస్) భరత్ తన స్థానం నిలబెట్టుకోగా... గాయాల నుంచి ఇంకా కోలుకోక పోవడంతో బుమ్రా, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్ పేర్లను పరిశీలించలేదు.

టెస్టు జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), రహానే (వైస్ కెప్టెన్), శుబ్‌మన్ గిల్, కోహ్లి, రుతురాజ్ గైక్వాడ్, యశస్వి జైస్వాల్, కేఎస్ భరత్, అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, శార్దుల్ ఠాకూర్, సిరాజ్, ముకేశ్ కుమార్, జైదేవ్ ఉనాద్కట్, ఇషాన్ కిషన్, నవదీప్ సైనీ.

వన్డే జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), శుబ్‌మన్ గిల్, రుతురాజ్ గైక్వాడ్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, సంజూ సామ్సన్, ఇషాన్ కిషన్, శార్దుల్ ఠాకూర్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, చహల్, కుల్దీప్, జైదేవ్ ఉనాద్కట్, సిరాజ్, ఉమ్రాన్ మాలిక్, ముకేశ్.

మొహమ్మద్ షమీకి విశ్రాంతినివ్వగా, జనవరి 2021 తర్వాత మళ్లీ టెస్టు ఆడని సైనీకి మరో చాన్స్ దక్కింది. భారత్, విండీస్ మధ్య జూలై 12–16, జూలై 20–24 మధ్య డొమినికా, పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లలో రెండు టెస్టు మ్యాచ్‌లు జరుగుతాయి.

అనూహ్య ఎంపికలేమీ లేకుండా...

వెస్టిండీస్‌తో జరిగే 3 వన్డేల సిరీస్ కోసం ప్రకటించిన జట్టులో మాత్రం ఎలాంటి ఆశ్చర్యకర ఎంపికలు లేవు. భారత్ ఆడిన గత 4 వన్డే సిరీస్‌లకు దూరంగా ఉన్న వికెట్ కీపర్ సంజు సామ్సన్ తిరిగి జట్టులోకి ఎంపిక కావడమే చెప్పుకోదగ్గ విశేషం. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లలో తొలి బంతికే వెనుదిరిగి చెత్త రికార్డు నమోదు చేసినా... సూర్యకుమార్ యాదవ్‌కు మళ్లీ అవకాశం దక్కింది. స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌పై వేటు పడింది. ఎంపిక చేసిన 17 మందితో పాటు గాయాల నుంచి కోలుకొని బుమ్రా, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ అందుబాటులోకి వస్తే 20 మందితో వచ్చే వన్డే వరల్డ్ కప్‌ను దృష్టిలో పెట్టుకొని ఎంపిక సాగినట్లు అర్థమవుతోంది. భారత్, విండీస్ మధ్య జూలై 27, 29, ఆగస్టు 1 తేదీల్లో 3 వన్డేలు జరుగుతాయి.


పుజారా

కెరీర్ ముగిసినట్లే!

పుజారాను భారత జట్టు నుంచి తప్పించడం కొత్త కాదు. కొన్నాళ్ల క్రితమే స్వదేశంలో శ్రీలంకతో సిరీస్‌కు అతడిని ఎంపిక చేయలేదు. అయితే కౌంటీల్లో భారీ స్కోర్లు సాధించి మళ్లీ జట్టులోకి వచ్చిన అతను ఇంగ్లండ్‌తో ఏకైక టెస్టు ఆడటంతో పాటు కెరీర్‌లో 100 టెస్టుల మైలురాయిని కూడా అందుకున్నాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై విఫలమైనా, అతని అనుభవాన్ని నమ్మి డబ్ల్యూటీసీ ఫైనల్లో మరో అవకాశం ఇచ్చారు. రెండు ఇన్నింగ్స్‌లలో అతను 14, 27 పరుగులే చేశాడు. గత మూడేళ్లుగా అతను పేలవ ఫామ్‌లో ఉన్నా సీనియర్‌గా, ఎన్నో మ్యాచ్‌లు గెలిపించిన గౌరవంతో పుజారాను కొనసాగించారు. బంగ్లాదేశ్‌పై ఆడిన రెండు కీలక ఇన్నింగ్స్ (90, 102)లను పక్కన పెడితే మూడేళ్లలో అతని సగటు 26 మాత్రమే. ఇప్పుడు భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్న సెలక్టర్లు మళ్లీ వెనక్కి వెళ్లి పుజారాను ఎంపిక చేసే అవకాశాలు కనిపించడం లేదు. 103 టెస్టుల్లో 43.60 సగటు, 19 సెంచరీలతో పుజారా 7195 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా గడ్డపై వరుసగా రెండు సార్లు టెస్టు సిరీస్ విజయాల్లో ప్రధాన పాత్ర పోషించడం అతని కెరీర్‌లో అత్యుత్తమ క్షణాలు.

గ్యాంజస్ గ్రాండ్‌మాస్టర్స్ గెలుపు


కార్ల్‌సన్, ఆనంద్

దుబాయ్: గ్లోబల్ చెస్ లీగ్‌లో గ్యాంజస్ గ్రాండ్‌మాస్టర్స్ జట్టు రెండో విజయం నమోదు చేసింది. ఆల్పైన్ వారియర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో గ్యాంజస్ గ్రాండ్‌మాస్టర్స్ జట్టు 11–6తో గెలిచింది. ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (ఆల్పైన్ వారియర్స్)తో జరిగిన గేమ్‌లో గ్యాంజస్ జట్టు ప్లేయర్, భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌తో 44 ఎత్తుల్లో ఓడిపోయినా... రాపోర్ట్, బెలా గ్యాంజస్ జట్టు తరఫున నెగ్గడంతో ఆ జట్టుకు విజయం దక్కింది. ఇతర మ్యాచ్‌ల్లో బాలన్ అలస్కాన్ నైట్స్ 14–5తో అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్ జట్టుపై, త్రివేని కాంటినెంటల్ కింగ్స్ 8–7తో చింగారి గల్ఫ్ టైటాన్స్‌పై, ఆల్పైన్ వారియర్స్ 9–7తో బాలన్ అలస్కాన్ నైట్స్‌పై గెలిచాయి.

బయట పోరాడితే... ఎంపికలో మినహాయింపా?

అడ్‌హక్ కమిటీపై రెజ్లర్ యోగేశ్వర్ దత్ విసుర్లు





న్యూఢిల్లీ: లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత యోగేశ్వర్ దత్ ఆరుగురు స్టార్ రెజ్లర్లకు ట్రయల్స్‌లో ఇచ్చిన మినహాయింపును తప్పుబట్టాడు. ఆసియా క్రీడలు, ప్రపంచ చాంపియన్‌షిప్‌ల కోసం నిర్వహించే సెలక్షన్ ట్రయల్స్‌లో వినేశ్, సంగీత, సాక్షి మలిక్, సత్యవర్త్, బజరంగ్, జితేందర్‌లకు కేవలం ఒక్క బౌట్ పోటీ పెట్టారు. భారత ఒలింపిక్ సంఘం అడ్‌హక్ కమిటీ తీసుకున్న ఈ నిర్ణయం అనుచితమని బీజేపీ నేత కూడా అయిన యోగేశ్వర్ దత్ అన్నాడు. 'దేని ఆధారంగా ఇలాంటి మినహాయింపు నిర్ణయం తీసుకున్నారో నాకైతే అర్థం కావడం లేదు. కమిటీ నిర్ణయం ఏమాత్రం సరికాదు. నా సలహా ఏంటంటే జూనియర్ రెజ్లర్లంతా నిరసన చేపట్టో, ప్రధానికి లేఖ రాసో దీనిపై పోరాడాలి' అని యోగేశ్వర్ ట్వీట్ చేశాడు. రెజ్లింగ్ సమాఖ్య మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులపై నియమించిన కమిటీలో యోగేశ్వర్ సభ్యుడిగా ఉన్నాడు.

బ్రిజ్‌భూషణ్ కీలుబొమ్మ దత్..

తమ విన్నపాన్ని మన్నించి అడ్‌హక్ కమిటీ ఇచ్చిన మినహాయింపును తప్పుబట్టిన యోగేశ్వర్ దత్‌పై స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. అతనో వెన్నెముక లేని మనిషని, బ్రిజ్‌భూషణ్ చేతిలో కీలుబొమ్మని విమర్శించింది. 'బ్రిజ్‌భూషణ్ ఎంగిలి మెతుకులు తినే బతుకు యోగేశ్వర్‌ది. అతని అడుగులకు మడుగులొత్తే తొత్తు యోగేశ్వర్. ఇతని చరిత్ర రెజ్లింగ్ లోకానికి బాగా తెలుసు' అని ట్విట్టర్‌లో వినేశ్ మండిపడింది. విచారణ కమిటీలో ఉంటూ ఎవరెవరు బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా మాట్లాడారో వారి పేర్లను అతనికి చేరవేశాడని దుయ్యబట్టింది. లైంగిక వేధింపులకు పాల్పడినట్లు స్టేట్‌మెంట్ ఇచ్చిన రెజ్లర్లతో రాజీకొచ్చేలా ప్రవర్తించాడని ఆరోపించింది.

మిక్స్‌డ్ డబుల్స్ సెమీస్‌లో సత్యన్-మనిక జోడీ



ట్యూనిస్: వరల్డ్ టేబుల్ టెన్నిస్ కంటెండర్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సత్యన్ జ్ఞానశేఖరన్–మనిక బత్రా (భారత్) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. క్వార్టర్ ఫైనల్లో సత్యన్–మనిక ద్వయం 11–8, 11–3, 11–8తో సెడ్రిక్ మెస్నర్–యువాన్ వాన్ (జర్మనీ) జంటను ఓడించింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో ఆకుల శ్రీజ–దియా చిటాలె (భారత్) ద్వయం 7–11, 9–11, 8–11తో వాంగ్ జియోటాంగ్–లి యెక్ (చైనా) జోడీ చేతిలో ఓడిపోయింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో మనిక 13–11, 8–11, 3–11, 11–9, 8–11తో లియు జున్ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలైంది.

శ్రీలంక, స్కాట్లాండ్ ఘనవిజయం


హసరంగ


బెరింగ్టన్

బులవాయో: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో శ్రీలంక, స్కాట్లాండ్ జట్లు వరుసగా రెండో విజయం నమోదు చేశాయి. గ్రూప్ 'బి'లో భాగంగా ఒమన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 10 వికెట్ల తేడాతో గెలుపొందగా... స్కాట్లాండ్ 111 పరుగుల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టును ఓడించింది. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఒమన్ జట్టు 30.2 ఓవర్లలో కేవలం 98 పరుగులకే కుప్పకూలింది. లెగ్ స్పిన్నర్ హసరంగ 13 పరుగులిచ్చి 5 వికెట్లు... పేసర్ లాహిరు కుమార 22 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి ఒమన్‌ను దెబ్బ తీశారు. అనంతరం శ్రీలంక 15 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 100 పరుగులు చేసి గెలిచింది. దిముత్ కరుణరత్నే (51 బంతుల్లో 61 నాటౌట్; 8 ఫోర్లు), నిసాంక (39 బంతుల్లో 37 నాటౌట్; 5 ఫోర్లు) రాణించారు.

బెరింగ్టన్ సెంచరీ

యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 282 పరుగులు చేసింది. కెప్టెన్ రిచీ బెరింగ్టన్ (136 బంతుల్లో 127; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. మైకేల్ లీస్క్ (41; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), మార్క్ వాట్ (31 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. 282 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ 35.3 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. స్కాట్లాండ్ బౌలర్లలో షరీఫ్ (4/20), క్రిస్ సోల్ (3/37) ఆకట్టుకున్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



శుక్రవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ జ్యోతిర్మయి దర్శించుకున్నారు.

అత్యవసరమొస్తే డబ్బుకు కటకటే!

ఎమర్జెన్సీ ఫండ్ ప్లానింగ్‌లో 75% మంది భారతీయులు డల్

- ఉన్నట్టుండి ఉద్యోగం పోవడం, తీవ్ర అనారోగ్యం వంటి వాటికి సిద్ధంగా ఉన్నది 25 శాతం మందే
- ఫినోలాజీ 'ఇండియన్ మనీ హాబిట్స్' అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పిల్లల చదువులు... వారి పెళ్లిళ్లు, రిటైర్మెంట్ వంటి దీర్ఘకాలిక ఆర్థిక అవసరాలకు అనుగుణంగా జీవిత బీమా, పోస్టాఫీస్ సేవింగ్స్, ఎఫ్‌డీ, ఆర్‌డీ తదితర మార్గాల్లో పొదుపు చేయడంలో దిట్టలైన భారతీయులు అత్యవసర పరిస్థితులు ఎదురైతే మాత్రం చేతులెత్తేస్తారట! కోవిడ్ తరహాలో ఏదైనా అత్యవసరాలకు 75 శాతం భారతీయుల వద్ద నిధులు అందుబాటులో ఉండటం లేదని ఓ అధ్యయనం పేర్కొంది. అనూహ్యంగా ఉద్యోగాలు ఊడినా, ఉన్నపళంగా తీవ్ర అనారోగ్యం పాలైనా ఎదుర్కొనేందుకు కేవలం 25 శాతం మందే సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఆర్థికంగా సిద్ధమయ్యేలా వ్యవహరిస్తున్నా 'ఎమర్జెన్సీ ఫండ్ ప్లానింగ్'పై మాత్రం అంతగా ముందుచూపుతో వ్యవహరించడం లేదని వివరించింది. ప్రముఖ పర్సనల్ ఫైనాన్స్ ప్లాట్‌ఫామ్ ఫినోలాజీ సంస్థ 'ఇండియన్ మనీ హాబిట్స్'పై జరిపిన పరిశీలనలో ఈ ఆసక్తికరమైన అంశం వెలుగులోకి వచ్చింది.



అత్యవసర నిధి ఉంచుకోవాలి..

ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ఎమర్జెన్సీ ఫండ్ అందుబాటులో ఉంచుకోవడంతోపాటు కుటుంబం మొత్తం కవరయ్యేలా నాణ్యమైన మెడికల్ కవర్ ఉండేలా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే భవిష్యత్ అవసరాల కోసం కష్టపడి ఆదా చేసిన మొత్తంలో సింహభాగం ఆసుపత్రి ఖర్చులకే వ్యయంచేయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని చెబుతున్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా మరేది అందుబాటులో లేకపోతేనే ఈ ఫండ్‌ను ఉపయోగించాలని సలహా ఇస్తున్నారు. లిక్విడ్ ఫ్యూచర్ ఫండ్స్ అనేవి మరో ఆప్షన్‌గా నిలుస్తాయని, సేవింగ్స్ ఖాతా కంటే వాటిలోనే ఎక్కువ రిటర్న్స్ రావడంతోపాటు కేవలం ఒక రోజులోనే ఈ ఫండ్స్‌ను విత్‌డ్రా చేసుకోవచ్చని సూచిస్తున్నారు. నెలకు ఎంత మొత్తం ఆదా చేస్తున్నారనే సంబంధం లేకుండా కనీసం నెలకు రూ. వెయ్యి నుంచి రూ.5 వేల వరకు తక్కువ మొత్తాల్లోనైనా క్రమం తప్పకుండా ఆదా చేయడం అలవాటు చేసుకొవాలని చెబుతున్నారు.

అధ్యయనంలోని ముఖ్యాంశాలు..

- తమ తల్లిదండ్రులు, మిత్రులు, శ్రేయోభిలాషులను 'అత్యవసర నిధి' కింద భారతీయులు పరిగణిస్తారు.
- ఉద్యోగం కోల్పోవడం లేదా ఏదైనా అకస్మాత్తుగా ఎదురయ్యే సమస్యను ఎదుర్కోవడంలో భాగంగా వివిధ అవసరాల కోసం తీసుకున్న రుణాల ఈఎంఐ కట్టలేకపోతున్నారు.
- ప్రతి ముగ్గురిలో ఒకరికి హెల్త్ ఇన్సూరెన్స్ కవర్ లేదా ఎమర్జెన్సీ ఫండ్ అనేది అందుబాటులో లేదు.
- తమ శాలరీ మొత్తం 15 రోజుల్లోనే ఖర్చయిపోతోందంటున్న 29 శాతం మంది.

ఎమర్జెన్సీ ఫండ్

అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకునేందుకు విడిగా పెట్టే మొత్తమే ఎమర్జెన్సీ ఫండ్. ఉద్యోగం నుంచి ఉద్వాసన, అనారోగ్యం, ఏదైనా పెద్ద సమస్య ఎదురైనప్పుడు ఉపయోగపడేదే ఈ నిధి. ఇది అందుబాటులో లేనిపక్షంలో ఇతర ఆర్థిక అవసరాల కోసం విడిగా ఉంచిన మొత్తాన్ని ఖర్చు చేయాల్సి రావడం, అధిక వడ్డీకి అప్పులు చేయాల్సి వస్తోంది — పైసా బజార్ సీఈవో నవీన్ కుక్రేజా

ప్రతి పేదకూ న్యాయం అందాలి

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్

- ఎల్‌ఏడీసీఎస్ కేంద్రాలను ప్రారంభించిన సీజే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదకూ న్యాయం పొందే హక్కు ఉందని, దీనికి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్ (ఎల్‌ఏడీసీఎస్) తోడ్పడుతుందని తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్యాట్రన్ ఇన్ చీఫ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పేర్కొన్నారు. ఈ కేంద్రాల ఏర్పాటుతో న్యాయం మరింత చేరువవుతుందని అభిప్రాయపడ్డారు. శుక్రవారం హైకోర్టులో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, జస్టిస్ నవీన్‌రావుతో కలసి ఆయన 17 జిల్లాల్లోని ఎల్‌ఏడీసీఎస్ కేంద్రాలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మాట్లాడుతూ.. న్యాయవాదులను ఏర్పాటు చేసుకునే శక్తి లేక చాలా మంది విచారణ ఖైదీలు జైళ్లలో మగ్గుతున్నారన్నారు. వీరికి న్యాయం అందించే లక్ష్యంతో ఎల్‌ఏడీసీఎస్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నాలుగు నెలల్లో 104 కేసులు పరిష్కారం..



ఎల్‌ఏడీసీఎస్ కేంద్రాలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ నవీన్‌రావు

ఫిబ్రవరిలో ఏర్పాటు చేసిన న్యాయ సహాయ కేంద్రాల్లో నాలుగు నెలల కాలంలో 824 కేసులకు 104 కేసులు పరిష్కారమయ్యాయని జస్టిస్ నవీన్‌రావు చెప్పారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెళ్లను, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెళ్లను, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెళ్లను ఆ కేంద్రాల్లో నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ సభ్యకార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్‌ఏడీసీఎస్ ఏం చేస్తాయి..

- ఎల్‌ఏడీసీఎస్ కార్యాలయాన్ని ఆశ్రయించే వ్యక్తులందరికీ న్యాయ సలహా, సహాయం.
- కార్యనిర్వాహక న్యాయస్థానాలతో సహా అన్ని సెషన్లు, ప్రత్యేక, మెజిస్ట్రేట్ కోర్టుల్లో విచారణ, అప్పీళ్ల నిర్వహణ.
- రిమాండ్, బెయిల్ కేసుల స్వీకరణ.
- ముందస్తు అరెస్టు దశలో చట్టపరమైన సాయం అందించడం.
- జిల్లా కోర్టులకు సంబంధించిన లేదా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కేటాయించిన కేసుల్లో న్యాయ సహాయం చేయడం.
- జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి మార్గదర్శకాల మేరకు జిల్లాలోని జైళ్లను సందర్శించడం.

రెండు తెలుగు రాష్ట్రాల్లో కేన్సర్ ఉచిత స్క్రీనింగ్

- నానక్‌రాంగూడ స్టార్ ఆస్పత్రితో కలిసి నిర్వహించనున్న చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్
- జూలై 9న చిరంజీవి బ్లడ్‌బ్యాంక్‌లో స్క్రీనింగ్ క్యాంప్

బంజారాహిల్స్/రాయదుర్గం: రెండు తెలుగు రాష్ట్రాల్లో సినీ కార్మికులు, మెగా అభిమానుల కోసం కేన్సర్ ఉచిత స్క్రీనింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు సినీనటుడు చిరంజీవి ప్రకటించారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని స్టార్ ఆస్పత్రి కేన్సర్ సెంటర్ సహకారంతో చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని బ్లడ్ బ్యాంకులో, నానక్‌రాంగూడ స్టార్ ఆస్పత్రి కేన్సర్ సెంటర్ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వేర్వేరు సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రాణాంతకమైన కేన్సర్ నుంచి కాపాడుకోవడానికి ఏకైక మార్గం ఆ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడటమేనని, అందుకే ఈ స్క్రీనింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నామని చెప్పారు. జూలై 9న జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి బ్లడ్‌బ్యాంక్‌లో స్క్రీనింగ్ ఉంటుందని, రోజూ వెయ్యి మందికి కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. రెండుమూడు రోజుల్లో సినీ కార్మిక సంఘాల నాయకులతో సమావేశమై, స్క్రీనింగ్ కోసం ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేస్తామన్నారు.

16న వైజాగ్‌లో, 23న కరీంనగర్‌లో..

మెగా అభిమానులకోసం జూలై 9న హైదరాబాద్‌లో, 16న వైజాగ్‌లో, 23న కరీంనగర్‌లో కేన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎంపిక చేసిన కొన్ని కేంద్రాల్లో ఈ స్క్రీనింగ్ నెలకు ఒకసారి చేపడతామని, క్రమక్రమంగా ఈ సేవలను మరింతగా విస్తరించాలని నిర్ణయించామని వెల్లడించారు. స్క్రీనింగ్ క్యాంపులను నిర్వహించడానికి ముందుకొచ్చిన స్టార్ ఆస్పత్రి యాజమాన్యాన్ని చిరంజీవి అభినందించారు. స్టార్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మన్నెం గోపీచంద్ మాట్లాడుతూ.. వరుసగా నాలుగు నెలలపాటు ఈ స్క్రీనింగ్ చేపడతామన్నారు. పొగ తాగేవారు, పాన్ మసాలా నమిలేవాళ్లను ముందుగా గుర్తించి స్క్రీనింగ్ చేస్తామని, మహిళలు కూడా స్వయంగా తమకు తామే గుర్తుపట్టే విధంగా శిక్షణ ఇస్తామని చెప్పారు. కేన్సర్‌ను ఎంత త్వరగా గుర్తిస్తే అంత తొందరగా నియంత్రించవచ్చన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సినీ నటుడు చిరంజీవి. చిత్రంలో స్టార్ ఆస్పత్రి ప్రతినిధులు

రెండు నెలలు గడువిస్తున్నాం

- ఎస్‌ఎస్‌సీ, పీసీఏల్లో సిబ్బందిని నియమించండి
- ఇతర వసతులూ కల్పించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర భద్రతా కమిషన్(ఎస్ఎస్‌సీ), పోలీసు ఫిర్యాదు అథారిటీ(పీసీఏ)లకు సిబ్బందిని రెండు నెలల్లో నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కార్యాలయాలు, వాహనాలు సహా ఇతర మౌలిక వసతులను కల్పించాలని స్పష్టం చేసింది. సిబ్బంది లేకపోవడంతో పోలీసులకు సంబంధించిన ఫిర్యాదులూ కోర్టుకు వస్తున్నాయని, దీంతో మరింత భారం పెరుగుతోందని వ్యాఖ్యానించింది. వీటిని ఎస్ఎస్‌సీ, పీసీఏ స్థాయిలోనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఫిర్యాదుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించింది. ఎస్ఎస్‌సీ, పీసీఏలకు ప్రభుత్వం సిబ్బందిని నియమించకపోవడం, వసతులను కల్పించకపోవడాన్ని సవాల్ చేస్తూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి, న్యాయవాది వేణుమాధవ్ వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు(పిల్) దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ ఏ.సంతోష్ కుమార్ వాదనలు వినిపించారు. డీజీపీ పంపిన ప్రతిపాదనలు 2023, జూన్ 21న ప్రభుత్వానికి అందాయని చెప్పారు. పూర్తి వివరాలు అందజేసేందుకు 3 నెలలు సమయం ఇవ్వాలని ధర్మాసనాన్ని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం..రెండు నెలల్లో నియామకాలు, వసతుల కల్పన పూర్తి చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఆగస్టు 24కు వాయిదా వేసింది.

'డబుల్' మోసంపై ఇంటెలిజెన్స్ ఆరా

సాక్షి ఎఫెక్ట్

ఇల్లెందురూరల్: డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని పేదలను నమ్మించి స్వచ్ఛంద సంస్థ పేరుతో అందినకాడికి దండుకొని ఉడాయించిన వ్యవహారంపై ఇంటెలిజెన్స్ అధికారులు రెండు రోజులుగా విచారిస్తున్నారు. స్వచ్ఛంద పేరుతో మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, వరంగల్ జిల్లాల్లో పలువురి నుంచి డబ్బులు వసూలు చేసి ముఖం చాటేసిన వైనంపై 'సాక్షి' ప్రధాన సంచికలో గురువారం 'డబుల్ పేరిట డబ్బులు దండుకుని' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్ అధికారులు గురు, శుక్రవారాల్లో బాధితుల వివరాలు కోసం మండల, పంచాయతీ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులను సంప్రదించారు. వారు బాధితులతో మాట్లాడి సమగ్ర సమాచారాన్ని అధికారులు సేకరిస్తున్నారు.

వివిధ మార్గాల్లో 36 రైళ్లు రద్దు

సాక్షి, హైదరాబాద్: మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణ పనుల దృష్ట్యా వివిధ మార్గాల్లో నడిచే 36 రైళ్లను రద్దు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈ నెల 26 నుంచి జూలై 2 వరకు రైళ్లు రద్దు కానున్నాయి. సికింద్రాబాద్- మేడ్చల్, సికింద్రాబాద్-గుంటూరు, కాచిగూడ-కర్నూలు, కాజీపేట-విజయవాడ, కాచిగూడ-వికారాబాద్ తదితర మార్గాల్లో నడిచే 36 రైళ్లు రద్దు కానున్నాయి.

గ్రూప్-4 పరీక్ష హాల్‌టికెట్లు సిద్ధం

జూలై 1న నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-4 ఉద్యోగాల భర్తీ అర్హత పరీక్షను జూలై 1వ తేదీన నిర్వహించేందుకు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాట్లు చేసింది. అభ్యర్థుల హాల్‌టికెట్లను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈనెల 24వ తేదీ నుంచి అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. పరీక్ష ప్రారంభానికి ముందు 45 నిమిషాల వరకు హాల్‌టికెట్లు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వీలున్నా.. ముందుగా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించుకోవాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది. జూలై 1వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్షలు జరగనున్నట్లు కమిషన్ వెల్లడించింది.

ఐక్యంగా పోరాడితే మనదే గెలుపు!

అసంతృప్తి, అభిప్రాయ భేదాలు పక్కన పెట్టండి

- ఈటల, రాజ్‌గోపాల్‌రెడ్డిలను బుజ్జగించనున్న బీజేపీ నాయకత్వం
- వారికి ఢిల్లీ పిలుపుపై రాష్ట్ర పార్టీలో చర్చ

సాక్షి, హైదరాబాద్ : ఢిల్లీకి రావాల్సిందిగా తమ పార్టీ నేతలు ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డిలను బీజేపీ జాతీయ నాయకత్వం కోరడం రాష్ట్ర బీజేపీలో చర్చనీయాంశమైంది. వీరిద్దరూ శనివారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీ కానున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. కాగా అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమయ్యేలా రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేయాలని భావిస్తున్న జాతీయ నాయకత్వం నేతల్లో అసంతృప్తి, సమన్వయ లోపం, పార్టీ శ్రేణుల్లో అయోమయంపై దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీపై అసంతృప్తితో ఉన్న పార్టీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలకు ఢిల్లీ నుంచి పిలుపొచ్చిందనే ప్రచారం జరుగుతోంది. ఆదివారం జేపీ నడ్డా నాగర్‌కర్నూల్ సభ నేపథ్యంలో శనివారం ఢిల్లీలో జరిగే భేటీకి ప్రాధాన్యత ఏర్పడిందని అంటున్నారు. బీఆర్‌ఎస్ సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నందున బీజేపీ నాయకులంతా ఐక్యంగా పోరాడితే గెలుపు తథ్యమని, అందుకోసం అభిప్రాయభేదాలు, అసంతృప్తులను పక్కన పెట్టాలని నాయకత్వం వారిని కోరే అవకాశం ఉందని చెబుతున్నారు. పార్టీ అంతర్గత సమస్యలు పరిష్కరించాకే తెలంగాణలో తదుపరి పర్యటనలు చేపట్టాలని అగ్రనేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

సంజయ్ సమక్షంలో చర్చ

నాగర్‌కర్నూల్‌లో నడ్డా బహిరంగ సభ ఏర్పాట్లపై పార్టీ నేతలు ఏపీ జితేందర్ రెడ్డి, విజయశాంతి, వివేక్ వెంకటస్వామి, గరికపాటి మోహన్‌రావు, బూర నర్సయ్య గౌడ్ తదితరులు శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో పార్టీ కార్యాలయంలో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఈటల, రాజ్‌గోపాల్‌రెడ్డిల ఢిల్లీ పర్యటన చర్చకు వచ్చినట్టు పార్టీవర్గాల సమాచారం. పలువురు సీనియర్లు ఈ విషయంలో అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కొందరు నేతలతో సంజయ్ విడివిడిగా సమావేశమైనట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

పార్టీని వీడాలనుకుంటే ఆపొద్దు..!

పార్టీలో చోటుచేసుకుంటున్న వివిధ పరిణామాలు చర్చకు వచ్చినపుడు ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కాం విషయంలో కఠినంగా వ్యవహరించకపోతే పార్టీకి నష్టం జరుగుతుందని సంజయ్‌కు కొందరు స్పష్టం చేసినట్టు తెలిసింది. పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులకు కాకుండా.. లీకులిస్తున్న నాయకులకే అగ్రనేతలు అపాయింట్‌మెంట్లు ఇస్తున్నారంటూ ఓనేత అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. పార్టీని వీడాలనుకునే నాయకులను ఆపవద్దని సంజయ్‌కు సీనియర్లు చెప్పినట్లు సమాచారం. కాగా అధికార బీఆర్‌ఎస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, బీఆర్‌ఎస్‌కు బీజేపీయే నిజమైన ప్రత్యామ్నాయమనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు.

స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు

- తప్పులు పునరావృతం కారాదు
- సత్వరం ఎన్నికల కేసుల దర్యాప్తు
- కలెక్టర్లు, ఎస్పీలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం



మాట్లాడుతున్న వికాస్ రాజ్. చిత్రంలో నితీశ్ కుమార్ వ్యాస్, ధర్మేంద్ర శర్మ

సాక్షి, హైదరాబాద్: గత శాసనసభ ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న తప్పిదాలు, పొరపాట్లు.. త్వరలో జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పునరావృతం కారాదని కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ధర్మేంద్ర శర్మ స్పష్టం చేశారు. ప్రధానంగా మునుగోడు ఉప ఎన్నికల ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న సంఘటనలు, వివాదాలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఆరోపణలు విమర్శలకు తావు లేకుండా ఎన్నికలను నిష్పక్షపాతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించాలని ధర్మేంద్ర శర్మ కోరినట్టు సమాచారం. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సన్నద్ధతను పరిశీలించేందుకు ధర్మేంద్ర శర్మ నేతృత్వంలో రాష్ట్రానికి వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం బృందం శుక్రవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో కలెక్టర్లు ఎస్పీలతో సమీక్ష నిర్వహించింది. గత శాసనసభ ఎన్నికలతో పాటు ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న అవాంఛనీయ సంఘటనలు, నమోదైన కేసులు, విచారణలో పురోగతి, శిక్షలు తదితర వివరాలను జిల్లాల వారీగా ఆరా తీసింది. 80 ఏళ్లు నిండిన ఓటర్లకు ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించే సదుపాయాన్ని కల్పించాలని కోరింది. సమావేశంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్, కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ కుమార్ వ్యాస్, డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ఆర్కే గుప్తా తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.